సల్‌చాక్ తోకా

గొడ్లకాపరి గాథ

విషయసూచిక

మొదటి భాగం. మా బిర్చిబెరడు చూమ్

మేర్గన్ 7
తాన్—బష్తిగ్ 10
మేము ఒంటరిగాళ్లం అయిపోయాం 19
మా వేటగాళ్లు 30
ఇక యిప్పుడేమి జరుగబోతుంది? 36
మందలవాళ్లతో 44
ఘుర్లీ చలికాలం 55
షోగై 65
ఓర్లిక్ పేన్ 74

రెండవ భాగం. సౌఖ్యం యెక్కడుందిం

కొయ్యదుంగల చూమ్‌లో నేను ఖైదీని 85
ఏటి వొడ్డున 92
మాకు కొత్తవాళ్లతో పరిచయం 101
ఎక్కడకు వెళ్లడం? 114

గోతిలో ఇల్లు 132
బండివాడనయాను 142
కొదూర్-ఓలు బిచె-కీనుల కథ 153

మూడవ భాగం. పోరాటం మొదలు

వేర 175
అతిథులు 184
ప్రపంచంలో యేం జరుగుతోంది? 190
గెరిల్లాలు 200
ఎంత బాగుంది! 204
మకాంలో వెగళ్లు 210
గెరిల్లాల నిష్క్రమణ 223
రాజుగారి ప్రాసాదంలో 228
అమ్మా! సెలవు! 236
ధ్యేయానికి పురోగమనం 241
ఉషఃకాలం 251

మొదటి ప్రకరణం

మేర్గెన్

పాఠకుడా నమస్తే! బ్రహ్మాండమైన మన దేశంలో నువ్వు యే ప్రాంతంలో నివసిస్తున్నావో నీది యే వృత్తో నాకు తెలియకపోయినా మా గ్రామం దగ్గర ప్రవహిస్తున్న సెలయేరు మేర్గెన్‌తో పరిచయం చేసుకోవడానికి నీకేమీ అభ్యంతరం వుండదనుకుంటాను.

అదిగో, నురుగులాగు తెల్లగా కన్పించుతున్న గీతే సెలయేరు! నిట్రంగా వున్న కొండ అంచుమీదనుంచి క్రిందిరాళ్లమీదకి గంతులేస్తూ, గర్జిస్తూ పరుగెత్తుతూంది! తోజాపర్వతపు త్రైగాలో పుట్టి కా-ఖెమ్ నదిలో కలసిపోయేవరకూ దారిపొడుగునా సుడిగుండాలూ జలపాతాలే.

మా అమ్మ నన్ను చూమ్* దాటించిన ఉత్తరక్షణంలోనే మా మేర్గెన్ నా కళ్లపడింది. మెరిసిపోతూ పాముమెలికల్లాగు సాగిపోతూన్న

---

* కొయ్యలను పంజరంలాగు గోడుగా పేర్చికట్టి, దానిపైన తోళ్లను పరచి కప్పిన గుడిసె. ఈగోడుగా కట్టిన గుడిసెను ఎక్కడికి పడితే అక్కడికి తీసుకుపోవచ్చును.

ఆ యేటి ప్రవాహపు దృశ్యం యీ నాటికి కూడా నాకు స్పష్టంగా గుర్తుంది.

వర్షాలుపడిన తరువాత యీ పిల్లనది తైగాలోవున్న దేవదారు వృక్షాలనీ సగ్గుచెట్లనీ వేళ్లతోసహా పీకిపారేసి యీ జలపాతాన్నుంచి ఆ జలపాతానికి విసరివేస్తూ అడ్డంవచ్చిన శిలలనీ బండలనీ దొర్లించేస్తూ పట్టపగ్గాలు లేకుండా పరవళ్లు తొక్కుతూ పరుగెత్తుతూంటుంది. అలాంటిది మండువేసవిలో యెంత సన్నగిలిపోతుందంటే, అసలది నదీముఖాన్ని చేరుకోగలుగుతుందా అని ఆశ్చర్యం కలుగుతుంది. లోతులేని చోట్ల కూడా చిందులు తొక్కుకుంటూ నురుగలు కక్కుతూ పరుగెత్తుతూంటుంది. ఎటొచ్చీ శబ్దంమాత్రం సన్నగిలిపోయి మర్మరధ్వనిగా మారిపోతుంది.

చలికాలంలో మేర్గెన్ దట్టమైన కంబళి పరచినట్టుగావున్న మంచుగడ్డ కింద దాక్కొంటుంది. ఏటికి ఇరువైపులా ఒత్తుగా పెరిగిన దేవదారు వృక్షాలపై మంచుపడి, మృదువైన తిన్నెలలాగ ఎత్తుగా అగుపిస్తూంటాయి. అంతటి చలికాలంలోనైనా మేర్గెన్ పడుకుని నిద్రపోతూందని మీరు అనుకుంటారేమో! ఆ మంచు ముసుగును చించివేసి పైకివచ్చి నల్లని నీటిబుడగలను మంచుపై వెదజల్లుతూ వుంటుంది.

అచంచలంగా నిలబడిన కీకారణ్యాలు మేర్గెన్ జన్మస్థలాన్ని మంచుతుపానుల బారినుండి రక్షించుతూంటాయి. మండువేసవిలో కూడా కరిగిపోకుండా తళతళమని మెరుస్తూ సూదుల్లావున్న మంచుశిఖరాలు మేర్గెన్ పొద్దును కాపాడుతూంటాయి. అందుచేతనే మేర్గెన్‌లోయ గట్టి జీవంతో సమృద్ధిగా వర్ధిల్లుతూన్న వృక్షకోటితో ప్రకాశిస్తూంటుంది. చుట్టుపక్కల వుండే స్టెప్‌మైదానపు ప్రాంతాలు యెండలకి యెర్రబడి

పోతాయి. మాడిపోయిన తురాయిగడ్డి వాసన, తిక్తగంధి చేదువాసన గాలిలో అలుముకుంటుంది. కాని తాను పుట్టిన చోటవున్న మంచుకొండలమీదనుండి చల్లని మలయమారుతాన్ని మేర్గెన్ జలపాతాలు యీ లోయలోపలికి తీసుకొస్తాంటాయి. కరకట్టలు సింగారించుకున్న పైరుగడ్డి రక్తగన్నేరులూ వాడిపోకుండా యెప్పటిలాగే నవ్వుతూంటాయి. కనుచూపుమేరవరకూ కనబడుతూన్న కొండఅభిని పువ్వులు పిల్లగాలుల్లో నాట్యంచేస్తూంటాయి.

ఉత్తపుణ్యానికే మా యేటికి మేర్గెన్ అని పేరుపెట్టలేదు. 'మేర్గెన్' అంటే 'బుటేదారీ అల్లిక అల్లే స్త్రీ' అన్నమాట. నిజంగా మేర్గెన్ మైదానాలనూ కొండలోయలనూ నీలిరంగుదారంతో లతలుతీగెలూ అల్లి అలంకరించూతూంటుంది.

చిట్టచివరి కొండకనుమలనుంచి మధురవాసనలు పరిమళించే సరిసెప్ ప్రాంతపు మైదానాలలోకి విజృంభించిన తరువాత, పచ్చనిదుస్తులతోనూ రంగురంగుల పువ్వులతోనూ ముస్తాబు అవుతూ నిరాటంకంగా ధారాళంగా సాగిపోతూంటుంది. అక్కడక్కడా జలపాతంవద్ద గర్జిస్తూ క్రిందకు దూకి నురుగలుగ్రక్కి బుసలు కొట్టినప్పుడు మాత్రం తన ప్రశాంతతను మర్చిపోయి కా-ఖెమ్ ముఖంగా అలాగు ప్రవహించుకుపోతూంటుంది.

కా-ఖెమ్‌ని కలుసుకునేముందు దుండుకుల నన్నింటినీ మానుకుని అతిబుద్ధిగా వుంటుంది. ఇప్పుడు తనను యిటూ అటూ నొక్కివేయడానికి కొండలేవీ యిక్కడలేవు. తన దారికి అడ్డుగా వచ్చే ఆటంకాలు యేవీలేవు. అలసిపోయివున్నప్పటికీ అమితానందంతో నిశ్శబ్దంగా నిరాడంబరంగా తల్లిని సమీపిస్తుంది.

ఎన్నాళ్లో యెడబాటుపడిన తరువాత మళ్లీ తనకంటబడ్డ ముద్దు కూతురిని ఆహ్వానించి దగ్గరకుతీసుకుని, గంభీరమైన కా-ఖెమ్‌నదీమ తల్లి కౌగలించుకుని ముద్దాడుతుంది: తన శ్యామల జలతరంగాలలో వుయ్యాల నూపుతూ సుడిగుండాలని జలపాతాలని దాటించి విశాలమైన పచ్చిక బయళ్లదగ్గరకీ పొలాలదగ్గరకీ తీసుకువెళ్లుతుంది: ఈలోగా తను దిగివచ్చిన మహోన్నతములైన పర్వతపంక్తులలో చెలరేగే తుపానులనీఝుంఝా మారుతాలనీ వర్ణించిచెప్పింది.

రెండవ ప్రకరణం

తాస్ - బష్తిగ్

మేమందరం ఐదుగురు పిల్లలం: మా పెద్దక్క అల్బన్‌చీ, మా చిన్నక్క కంగీయ్, మా పెద్దన్న షొముక్తై, మా చిన్నన్న పెజెన్‌దేయ్. అందరికంటె చిన్నవాడిని నేను. మా నాన్న నాకు జ్ఞాపకమే లేదు.

మా అమ్మకి అసలు పేరేలేదు. మా అర్బన్* వాళ్లందరూ మా అమ్మని తాస్-బష్తిగ్ అనిపిలిచేవారు. అంటే బోడి అన్నమాట. మా అమ్మ తలని ఒక్క తలవెంట్రుకేనా వుండేది కాదు. అందుకని అలా పిలిచే వారు అందరున్నూ. చిన్నతనంలో యే అధికారి మాటనో ధిక్కరించినం

---

* పది కుటుంబాలున్న జనసంఘం.

దుకు శిక్షగానో లేక మరేదేనా పెద్ద జబ్బుచేయడంవల్లనో అలాగైపోయి వుంటుంది మా అమ్మ తల. మా అమ్మ మాతో అసలావూసే యెన్నడూ యెత్తలేదు, మేమూ అడగలేదు. ఆమె బ్రతికున్నన్నాళ్ళూ ఆమెనందరూ ఆ పేరుతోనే పిలిచేవారు.

తన స్వవిషయం యెప్పుడేనా చెపితే ఒకమాట చెప్పేది. అదేనా యెప్పుడో:

“మీ తాత ఒక బీద అరాత్.* దోర-ఖెమ్ యేటి వొడ్డున నివసించేవాడు. ఆయనకున్నవల్లా కొలదిలేళ్ళు మాత్రమే. వాటిని పెట్టుకుని యేలాగో సంసారం చేసుకుంటూ బతికేవాడు. మీ తాతకీ మీ అవ్వకీ జబ్బులుచేసి వాళ్లిద్దరూ చచ్చిపోయారు. వాళ్లిద్దరికీ మందు యిచ్చే లామా** మా గుడిసెలో ఒక్కనాడేనా కాలుపెట్టిలోపలకు రాకుండానే వారికి చికిత్స చేశాడు. వాళ్లిద్దరూ చనిపోయినతరువాత వాళ్లకి వైద్యం చేసినందుకు అతనికి యివ్వవలసిన డబ్బుకింద మాకున్న నాలుగు లేళ్లనీ పట్టుకుపోయాడు. పట్టుకుపోతూ పట్టుకుపోతూ మామీద మండి పడుతూ: “నేను పడిన శ్రమ కంతటికీ ఇదీ ప్రతిఫలం! ఏమూలకొస్తుంది యిది? ఏమూలకొస్తుందంటా?” అని ఒకటే సణుగుడు. షాముక్తై మరొక ఆధరవు లేక బత్రాక్*** పనికి పోయేవాడు. అప్పుడు మీరందరూ మరీ పసిపిల్లలు. నేను పనికోసమని

* గొడ్లకాపరి.

** బడుగు ప్రజల్లో మతగురువు. ఈ గురువులు ధనికులు. వైద్యం కూడా చేసేవారు.

*** వ్యవసాయకూలీ.

మొదటి భాగం

మా బిర్చిబెరడు చూమ్

ప్రయత్నించేదానిని. ఇంతమంది పిల్లల సంసారంతో నాకెవరు పని యిస్తారు?" అని చెప్పింది.

మా అమ్మ యేమంత అందమైనదీ కాదు. కురూపీ కాదు. సామాన్యంగా వుండేది. పొట్టిమనిషి. నడుం వొంగిపోయింది. కట్టుకున్న గుడ్డలు గుడ్డలనిపించుకోవు. ఆమె తొడుక్కున్న కోటు ఒకానొకప్పుడు మంచి గొర్రె ఉన్ని కోటే. సంవత్సరాల తరబడి చలికాలం అనక యెండాకాలం అనక ఆ కోటు ఆవిడెవంటినే అంటి పెట్టుకుని వుండడంచేత యిప్పుడు మాత్రం మచ్చుకైనా ఉన్ని కనపడకుండా రాలిపోయి, తోలు అంతా చిరుగులూ చింకులూ మయం. ఆమెవొళ్ళు సగంపైకే అగుపించేది ఆ కోటు వొంటి మీద వుందనమాటే కాని.

మా అమ్మ మాత్రం మంచి తెలివితేటలైన మనిషి. కష్టపడి పని చేసేది. ఆ కష్టపరంపరల నన్నింటినీ యేదో ఒక మార్గం కనిపెట్టి యెలాగో ఒకలాగు తప్పించుకుని బెటపడేది. ఎన్ని బాధలు పడినా మాకు మాత్రం యేకష్టం కలగకుండా కాపాడుకొచ్చేది.

ఒక రోజున మమ్మల్నందరినీ పిలిచి మరొక కొత్తచోటకి మనం వలస వెళ్లిపోవాలని చెప్పింది.

మా సంసారం అంతా యేమి వుందిగనక! ఏదో మరి, ఆవున్న నాలుగు వస్తువులనే భుజానవేసుకుని మేర్గెన్‌వొద్దనే మరొక కొత్తజాగాకి కాళ్లీడ్చుకుంటూ బయలుదేరాం. మేర్గెన్‌వొద్దనే కొండగుట్టల లోతట్టు అంచునా ఆ చుట్టు పక్కల వున్న స్థలాలలోనూ మంచి యింపైన జాగాని యెంచుకుంది. చెట్లనికొట్టుతూన్న మనిషి ఒకతను అక్కడ కనబడితే అతనిదగ్గరనుంచి గొడ్డలిని అడిగి పుచ్చుకుని బిర్చిచెట్ల బెరళ్లని నరికి వాటితో

చిన్న చూమ్‌ని కట్టింది అమ్మ. సరుగుడుచెట్ల కొమ్మలతోనూ యెండు గడ్డితోనూ మంచాలనీ పరుపులనీ చేసింది. ఎండిపోయిన పేడని తీసుకొచ్చి పరుపులమీద చల్లేసరికి పరుపులు మెత్తగాను వెచ్చగాను వుండేవి.

మా చూమ్‌ను కట్టడానికి గుదిగుంజల కొసలనన్నింటినీ నడికొప్పున కలిపికట్టి బిర్చిబెరడును పైన కప్పుమీద వేసికప్పాం. వర్షం కురిస్తే కప్పులోంచి వర్షపు నీరు గుడిసెలోకి కారుతూండేది. శీతకాలంలో గాలీమంచూ లోపలి కొచ్చేసేవి. మొత్తంమీద మేము అడవిజంతువులలాగు జీవించేవాళ్లము.

మాకు మూడు మేకలుండేవి. ఒక కుక్క కూడా వుండేది. ఆ కుక్క మాదగ్గరకెలా వచ్చిందో యెక్కడనుంచి వచ్చిందో గాని మరి మాదగ్గరే వుండిపోయింది. దానికి మేము చెర్లిక్‌పేన్ అని పేరుపెట్టాం. చెర్లిక్‌పేన్ అంటే అడవిమనిషి అన్నమాట. అన్ని కుక్కల మధ్యనూ అది నిలబడితే రాక్షసిలాగుండేది అది.

మా యిరుగుపొరుగున కొంతమంది ఉండేవారు. కాని మాలాగే వాళ్లందరూ కూడా అతిపేదవారు. మా పూరిగుడిసెలాంటి పూరిగుడిసెల్లోనే వాళ్ళూ కాపురాలుండేవారు. గొప్పవాళ్లకి లేళ్లమందలు యెన్నో వుండటం చేత వాళ్లు మమ్మలిని అంటీ ముట్టకుండా మా యిళ్లకి యెంతో దూరాన నివసించేవారు. ఆ చుట్టు పక్కల వుండే గొప్పవాళ్లు కాని ఉద్యోగస్థులు కాని యెప్పుడేనా మా గుడిసెలకాడకి వస్తే: "ఏయ్ చూడూ! ఈ తోలు బాగుచేసి తీసుకురా!" అనో లేకపోతే: "దీన్ని కోటుకింద కుట్టి తయారు చెయ్యాలి!" అనో లేక:"ఒరేయ్! ఈ ఇదికీలు* అరిగిపోయాయి. వీటికి

---

* కాలివేళ్లదగ్గిర సన్నంగా వుండి తోకలాగు పైకి చుట్టుకున్న చడావు బూడ్సులు.

అట్లు కుట్టు !" అని అంటూ వచ్చేవారు. మేము తయారుచేసిన వస్తువులను తీసుకొనడానికి మాదగ్గరకి వచ్చినప్పుడు వస్తువులని తీసుకొని:"నువ్వు సరిగ్గా చెయ్యలేదు. నేను చెప్పిన రోజుకి తయారుచేసి యివ్వక యింత ఆలస్యంగానా యివ్వడం? మేము నీకు డబ్బు యిచ్చేది లేదు. ఫో!" అని మమ్మలిని తిట్టడమూ కొట్టడమూ.

చలికాలం అంతా యెలాగో చచ్చిచెడి బైటపడ్డాక మా అవస్థ యెంత ఘోరంగా వుండేదంటే ఒకరికంట ఒకరు పడడానికి మాలోమాకే భయంవేసి ఒకరినొకరు చూసుకోకుండా తప్పించుకుని తిరిగేవాళ్లం అన్నమాట. ఒక మాటు నేను మా అన్న పెజెన్‌దేయ్ వేపు చూశానుగదా ముఖంలో బుగ్గలు లోపలికిపోయి దవడయెముకలు ముందుకి యెత్తుగా తోసుకొచ్చి డొక్కల్లో బొమికెలు అన్నీ స్పష్టంగా కనిపించాయి.

మాకేగనక యేమాత్రపు బనాతు యుర్త* వుండినా రోజంతటికీ ఒక పూటైనాసరే సరిగ్గా తినడానికి వుండినా చలికాలం అంటే భయం వుండడం పోయి మీదుమిక్కిలి యెప్పుడు చలికాలం వస్తుందా అనుకొంటూ ఆత్రంగా యెదురు చూసేవాళ్ల మన్నమాట! మా చూమ్ చుట్టూ కొండలే. పాదాలకి చెక్కలని కట్టుకుని ఆ కొండలమీదనుంచి మంచులో కిందకి జారుతూంటే యెంత గమ్మత్తుగా వుండేది! లేకపోతే స్లెయ్** మీద కూచుని

---

* కొయ్యతో చట్రంచేసి, చట్రంపైన బనాతునునేసి కట్టిన గుడిసె. కొయ్యచట్రాని ఎక్కడికక్కడికి విడదీసి, మరొక స్థలంలో గుడిసెను కట్టుకోవడానికి వీలుంటుంది.

** చక్రాలులేని కొయ్యబండి; దీనిని మంచుమీద ఈడుస్తు ఉపయోగిస్తారు.

కొండమీదనుంచి సరిగ్గా సరాసరి మేర్గెన్ వొడ్డుకి జంయ్‌మని జారుతేనో చెప్పేదేముంది ఆతమాషా! పోతే చలి కాస్త తగ్గినాక మంచుతో కోటలనీ మనిషి బొమ్మలనీ మేకల బొమ్మలనీ చెయ్యడం, లేకపోతే మేర్గెన్ ఆవలి వొడ్డుకి వెళ్లి అక్కడ కుందేళ్లనీ కౌజుపిట్టలనీ వలలువేసి పట్టుకోవడం — ఇవన్నీ చేస్తూంటే యెంత సరదాగా వుంటుందో కదా! మావూళ్లోకల్లా గొప్పవాడు తాష్-చలాన్ అతని పిల్లలు కడుపునిండా భోజనంచేసి వెచ్చటి దుస్తులు వేసుకుని శీతకాలపు రోజులనన్నీ యీలాగు హాయిగా ఆడుతూపాడుతూ గడపేవారు. మేమా? శీతకాలందగ్గిర పడుతూందంటే భయంతో హడలిపోయేవాళ్లం.

మా పెద్దక్క అల్బాన్‌చీ యెప్పుడూ మాదగ్గరే వుండేది. మా అమ్మతో సహా మా సంరక్షణ చేస్తూ మాకు బువ్వపెడుతూ మాకు బుద్ధులు చెబుతూ అన్ని విధాలా మమ్మలిని ఆదుకుంటూ వుండేది. అల్బాన్‌చీ అంటే మా అమ్మ తరువాత మళ్లీ అమ్మ అన్నమాట! అయినా అమ్మకీ అల్బాన్ చీకీ యెంత తేడా అంటే అంత తేడా: అల్బాన్‌చీ మంచిపొడగైన జవాను. గుబురైన తలకట్టు. నల్లగా దట్టమైన కనుబొమ్మలు. అగాధాల్లాగ లోతుగా చేరడేసి కళ్లు. వేసంగి మెరుపుల్లాగ తళుకు తళుకుమని మెరసిపోతూ చలించే చూపులు. మా యిరుగుపొరుగు కుర్రాళ్ల కళ్లు అన్నీ యెంతకాలంగానో ఆమెమీదే వుండేవి. కొందరు పెళ్లి మాటలకి వచ్చారు కూడా. మా అల్బాన్‌చీ మాత్రం మమ్మల్ని విడిచి ఉండడానికి యిష్టపడలేదు.

మేము ఇల్లు మార్చి తెర్‌జీగ్‌నది ముఖద్వారందగ్గిర స్థిరపడిన తరువాత మమ్మలిని చూడడానికి వచ్చిన వాళ్లలో దనీల పొతీలిత్సిన్ మొట్టమొదటి వాడు. అతనికి నడివయస్సు దాటుతుంది. బ్రహ్మచారి. నడుము కాస్తవొంగింది. రష్యను దేశస్థుడు. రష్యనురైతులు కొందరు కా-ఖెమ్ నది

వొడ్డున కాపురాలుంటున్నారు. ఇతను కూడా వాళ్లతో కా-ఖెమ్ తీరాన్నే వుంటువ్నాడు. ఇతన్ని చూసి మొదట్లో మేము భయపడేవాళ్లము. అమ్మా అల్బన్‌చీ ఇద్దరూ లేనప్పుడు మా యింటికి వచ్చినట్టాయెనా మేము అతన్ని చూసి భయపడిపోయి అడవిలోకి పారిపోయేవారం. రోజులు గడచిన కొద్దీ దనీల తరుచుగానే మమ్మలిని చూడడానికి మా యింటికి వచ్చేవాడు. వచ్చినప్పుడల్లా మాకోసం పటికపంచదారో నానురొట్టో యేదోవకటి తప్పకుండా తాయం తెచ్చి మాకిస్తూండేవాడు. ఇలాగు ఒక సంవత్సరం గడచింది. ఆలోపుగానే మాకు అతనిదగ్గర చనవు కుదిరిపోయి మాతో ఆటలాడుకుందుకు రమ్మనమని మేమూ అతనూ కలిసి కౌజుపిట్టలని వలవేసిపట్టడం యివన్నీ చేస్తూ వుండేవాళ్లము. కొన్నాళ్లకి దనీల అల్బన్‌చీ యిద్దరూ పెళ్లిచేసుకున్నారు. కాని పాపం ఇద్దరు అట్టే రోజులు కలిసి కాపురం చెయ్యలేదు. ఒక నాడు అతను కొంతమంది ఖనిజపు అన్వేషకులతో కలసి తైగా అరణ్యాల్లో తవ్వకం పని చేస్తుండగా చచ్చిపోయాడు.

అల్బన్‌చీకి ఒక కూతురు పుట్టింది. పిల్లకి స్యర్యున్యా అని పేరు పెట్టాం. చంటిపిల్లకోసం అల్బన్‌చీ చక్కటి బుచ్చివుయ్యాల ఒక దానిని చేసింది. రెండు బిర్చి పిలకలని నరికి తెచ్చి భూమిలో పాతి వాటికొనలని రెండు పీపాబద్దలులాగు వొంచికట్టి ఒక వలని తీసుకొచ్చి ఆ గుంజలకి కాస్త అడుగున ఆ వలని కట్టింది. దగ్గరలో పాడుపడిన నివేశనం ఒకటి వుంటే అందులో బనాతు ముక్క ఒకటి మాకు దొరికింది. ఆ బనాతు ముక్కనివల అడుగున పరచాము. ఎండిపోయిన పేడగుండని అల్బన్‌చీ తీసుకొచ్చి వుయ్యాలలో బనాతు గుడ్డమీద వేసింది. అల్బన్‌చీ ఇలాగు వుయ్యాలలో పేడగుండని పరచడం చూసి:

"స్యర్యన్నా మేకపిల్లా యేమిటి? దానికోసం పేడగుండ వుయ్యాల్లో పరుస్తున్నా వెందుకు?" అని నేను ఆమెను అడిగేను.

"మేకపిల్లకీ వేడీ పొడీ వుండాలి. పిల్లవుయ్యాలలో పరచడానికి మన దగ్గర చింకిగుడ్డలేనా వున్నాయి కనకనా! ఎండుపేడ మంచిపొడిగా వుంటుంది. పిల్లతడి చేయడం మూలాన్న చెమ్మగిలితే ఆతడి పేడగుండని తీసిపారేసి మళ్లీ యింత పొడిగుండని పరిస్తే తీరిపోయె!" అంది అల్బన్‌చీ కొంచెం చిరాకు పడుతూ.

ఒకనాడు రాత్రి నాకు నిద్దట్లో మెలకువ వచ్చింది. స్యర్యన్నా యేదో బాధతో యేడుస్తూంది. నేను చప్పున పక్కమీదనుంచి లేచి చూచేసరికి అమ్మా అల్బన్‌చీ యిద్దరూ దిగాలుపడిన ముఖాలతో గబగబా నిప్పును రాజేస్తున్నారు. వెంటనే నేను నా బట్టలు — బట్టలేమిటి అవే ఆ చింకి పాతలే — వేసుకుని అమ్మదగ్గరకి వెళ్లాను.

"ఎందుకు లేచావురా పక్కమీదనుంచి యీ అర్ధరాత్రప్పుడూ? పోయిపడుకో ఫో!" అని అమ్మ నన్ను కసిరింది.

అసలు యేమిటి జరుగుతూందో నాకు అర్థంకాలేదు. పక్కమీదకి వెళ్లిపోయి పడుకుని జీర్ణించిపోయిన కంబళితో ముఖంమీద ముసుగు పెట్టేసుకుని కంబళీ చిరుగుల్లోనుంచి అమ్మ అక్క యేమి చేస్తున్నారో చూశాను. మేము తాగివేసేయగా మిగిలి అప్పుడే దానిమీద మంచు తెరకలు పేరుకుంటూన్న టీనీళ్లని యినుపమూకిటిలోనుంచి చిన్నకర్రచిప్పలోకి పోసిమూకిట్లో స్యర్యన్నా చేతులని కడుగుతూండడం కనిపించింది.

తెల్లారేక అమ్మ చాలా సేపు విసుగుకుంటూ:

"నా చేతులతో నేను దాని చేతులని రెండింటినీ వుయ్యాలలో కట్టే

శాను కదా, మరి చేతులని అది యెలా విడిపించుకుందో నాకేమీ బోధ పడడంలేదు..?" అంటూ గొణుగుకుంటూంది. నన్ను చూసి నాతో: "రాత్రి స్వర్యన్మాకి చేతులు రెండూ మొండి చేతులు అయిపోవలిసిందే. ఏంచేసిందో తెలుసా? చేతులు రెండింటినీ పక్క బట్టలలోనుంచి బైటకి తీసేసుకోకుండా వుయ్యాలకి నేను కట్టివేస్తే యెలా విడిపించేసుకుందో మరి — చేతులని బైటపెట్టుకుని రాత్రి అంతా అలాగు పడుకుంది. మేము పెందలకడనే లేచి చూశాం. లేకపోతేనా చలికి చేతులు గడ్డకట్టుకుపోయి వేళ్లని తెగగొట్టవలసి వచ్చేది. మీతో యింతా అంతా బాధకాదురా నాయనా! స్వర్యన్మా కంటె కాస్త నువ్వు పెద్దవాడివి అయివుండగా అప్పుడు ఒక మాటు నువ్వు చేతులని అగ్గి బుగ్గికింద కాల్చేసుకున్నావు తెలుసా? బిచ్చం అడుక్కుని బువ్వకేదేనా తెచ్చుకుందాం అనుకుని నేను వీధిలోకి వెళ్లబోతు న్నాను. అప్పటికే మిగతా పిల్లలందరూ వెళ్లిపోయారు. మరి నిన్నొక్కడినే యింటిలో వదిలేయవలసి వచ్చింది. నీ మొలచుట్టూతాడుకట్టి తాడుకి జారు ముడివేసి గుడిసె నిట్రాటికి నిన్ను కట్టేశాను పొయ్యిలో మండుతూన్న నిప్పుల దగ్గిరకి నువ్వు వెళ్లకుండాను — మేకపిల్లని గుంజకి కట్టేసినట్టు. తీరా నేను యింటికి వచ్చి చూదును మొర్రోమని కేకలూ బొబ్బలూ పెడుతున్నావు నువ్వు. ఏమిటి చెప్మా అని పరుగెత్తుకుని దగ్గరకొచ్చి చూదునుగదా — యేముంది? నేను యింట్లో లేనప్పుడు నువ్వు గట్టిగా తాడుతో గుంజుకున్న ట్టున్నావు — అసలే ఆ తాడు పాతది యేనాటిదో — ఆ తాడు తెగిపోయింది. నువ్వు చప్పున వెళ్లి మండుతూన్న నిప్పుల్లో చెయ్యి పెట్టావు. చేతులన్నీ కాలిపోయాయి. మనలాంటి గర్భదరిద్రులకి వెచ్చగా వుండడానికి పొయ్యిలో నిప్పు వుండడమే ఒక దురదృష్టం" అంది అమ్మ.

చలి ఉధృతం తగ్గిపోయిన తరువాత దేవదారువృక్షాల మొదళ్లంట చేరిన మంచుకుప్పలు కరగడం మొదలుపెట్టి చదును అయ్యాయి. ఏటిలో నల్లటి నీళ్లు గట్లదాకా వచ్చేశాయి. మంచు అడుగునుంచి నీళ్లు నిరంతరం అంతకంతకు హెచ్చుస్థాయిని అందుకుంటూ గడగడమని రణగణధ్వని చేశాయి. మా చూమ్‌లోనుంచి మేము ఆరబైటకొచ్చేసి యేటిగట్టున ఎలుగుబంటి పిల్లల్లాగు గెంతుతూండేవాళ్లము.

వేసవి ప్రారంభించగానే మా గుడిసె చుట్టూ పచ్చని గడ్డిచెట్లు మొలకలెత్తాయి. వెట్టతగలడంతోనే కడుపులో ఆకలి కొరికేస్తున్నా మా హృదయాల్లో నవ్వులు పువ్వులు పూస్తున్నాయి. పిల్లగాళ్లందరూ చలికాలపు చింకి పాతలని కొంపల్లో విప్పి పారేస్తూంటే ముసలాళ్లు మీదుమిక్కిలి ఆ చింకిపాతలనే తమ జీర్ణించి పోయిన వస్త్రాల చిరుగులను కప్పేటందుకు మీద వేసుకునేవారు. ఎండాకాలంరాగానే చాలామంది మేర్గెన్‌వొద్దుకి వచ్చి చేరుకునేవారు.

మూడవ ప్రకరణం

మేము ఒంటరిగాళ్లం అయిపోయాం

అమ్మ ఎల్లప్పుడూ పనికోసం వెతకులాడేది: మాకు తిండి గుడ్డా యివ్వ గలిగేటంతైనా సంపాదించాలని తాపత్రయపడేది.

"ఈ పల్లె కాకపోతే పోనీ మరో పల్లెకి వెళ్లదాము. అక్కడ మనుషు లెలాంటి వాళ్లో అదీ చూదాం" అంది అమ్మ ఒక నాడు.

"నీతో నేనూ వస్తానులే. కాని యేమైనాసరే నేను మాత్రం బిచ్చ మెత్త దల్చుకోలేదు సుమా. దయాదాక్షిణ్యాలు లేనివాళ్లను దేబరించేకంటె అంతకంటె రేయింబవళ్లు రెక్కలువిరుచుకు పనిచేయడం మంచిది" అంది అల్బన్‌చీ.

"అవును నిజమే మరి. కాని మనం యెక్కడికి పోగలం? మనకి పని యెచట దొరుకుతుంది? మనకి పని యిచ్చేదాత యేడీ?" అని అంటూ అమ్మ తన సంచీని తీసుకుని అల్బన్‌చీతో: "ఈ మాటు మన ఆశ ఫలించుతుంది చూస్తూండు" అని మామూలుగానే చకచకా చూమ్‌నుంచి బైటకి వెళ్లి పోయింది.

అల్బన్‌చీ కూడా అమ్మ వెంటవెళ్లుతూ మావేపు తిరిగి:

"మేము లేమని బెంగ పడకండి మీరు!" అని అంటూ వెళ్లిపోయింది.

వాళ్లు యెక్కడికి వెళ్లుతున్నారో చూదామని నేను కాసింత దూరం వాళ్లవెనకనే వెళ్లాను. వాళ్లనడకలో చకచక లేదు సరికదా అమ్మ తన పొట్టి చొక్కాచేతుల అంచుల్లో అరచేతులను దూర్చుకుని మరకాళ్లలాగు మోకాళ్లని వంచకుండా యిదివరకు యెన్నడూలేనంతటి గూనితో అదోమోస్తరుగా నడుస్తోంది. అక్క కూడా తూలిపోతూ నడుస్తూంది. ఇద్దరూ కాళ్లీడ్చుకుంటూ యేటిముఖంగా వెళ్లిపోయారు. మరికాస్సేపటికి చెట్లపొదలు అడ్డంగా వచ్చాయి. మరి వాళ్లు నాకగపడలేదు.

నేను మళ్లీ చూమ్ చేరుకుని మా చిన్నక్క కంగియ్‌వి పిల్చి:

"అదేమిటే అక్కా! అమ్మ అల్బన్‌చీ యిద్దరూ ఆరక* తాగినట్టు

---

* పులియబెట్టిన పాలలోనుంచి తయారుచేసిన సారాయి.

తూలిపోతూ నడవలేక నడవలేక — తాష్-చలాన్ నల్ల ఆరక తాగినప్పుడల్లా మంచి హుషారుగా వుండి కాళ్లీడ్చుకుంటూ నడుస్తాడే — అలా నడుస్తున్నారేమిటే?" అని అడిగాను.

"నీకు మతిపోయిందా యేమిటి? మనకి ఆరక యెక్కడనుంచి వస్తుంది? అది తయారుచెయ్యాలంటే బోలెడు హోయ్‌త్‌పాక్* కావాలి — ఒక పీపాడు కావాలి! పాలు కాని హోయ్‌త్‌పాక్ కాని టీనీళ్లు కాని చాలా కాలంగా వాళ్లకి తాగడానికి లేకపోబట్టే అమ్మ అల్బన్‌చీ అలాగు తూలిపోతూ నడుస్తున్నారు. ఒకరోజల్లా నువ్వు యేమీ తినకుండా వస్తున్నాక నడువు. అప్పుడు నువ్వెలా నడుస్తావో నేనూ చూస్తాను!" అంది కంగీయ్ నామీద కోపం పడుతూ.

అమ్మా అల్బన్‌చీ యింటినుంచి బయలుదేరేముందు ఇదిగో యిప్పుడే వచ్చేస్తాం అని చెప్పి వెళ్లారు. ఒక రోజైంది. రెండు రోజులైయాయి. ఇంకా రాలేదు వాళ్లు. ఆ సంవత్సరం శరత్తు మరీముందుగా ప్రవేశించింది. స్తెప్‌మైదానాలమీద పడిన తుషారం తెల్లగా దట్టంగా పేరుకుంది. అప్పుడే చలి కూడా ప్రారంభించింది. కంగీయ్ పెజెన్‌దేయ్ నేనూ మేము ముగ్గురం పొయ్యిదగ్గర కూచుని బూడిదలో ఆరి పోతూన్న బొగ్గులని రాజబెట్టాలని కొరడుబారిన పెదిమెలతో నిప్పుని వూదేము. ఒక పగలు ఒక రాత్రి గడచి పోయాయి. మరు నాడు పగలూ రాత్రి కూడా గడచిపోయాయి. అమ్మా అల్బన్‌చీకోసం మేము అలా కనిపెట్టుకుని కూచున్నాము.

కంగీయ్ పెజెన్‌దేయ్ నావేపు కోపంగా వుండివుండి చూస్తూ:

---

* పులిసిన పాలు.

“నీ వంతు కట్టెపుల్లలేవీ? నువ్వెప్పుడూ ఏపనీ చెయ్యకుండా అలా కూచుంటున్నావు” అని నన్ను కసిరారు.

నేను వెంటనే బైటకి పరుగెత్తివెళ్లి ఆ పగలంతా యేరికుప్ప పెట్టిన చిదుగులని తీసుకొచ్చి పొయ్యిలో వేసి మళ్లీ చలి కాచుకోవడానికి కూచున్నాను. ఆకలి బాధతో మా కడుపు కాలిపోతూంది. మా యినుపమూకిట్నీ పొయ్యి మీద పెట్టాం. మా యినుపమూకుడు పాతది. పాత అంటే యింతా అంతా పాత కాదు. దానికాడ ఇక్ష్వాకులనాడే విరిగిపోయింది. అసలు దానికొక బీటవుంది. మసిపారి అడుగు అంతా నల్లగా పెచ్చుతేరిపోయింది. మూకిట్లో యిన్ని నీళ్లు కాచుకుని చచ్చు టీ కణిక ముక్కలని కొరుక్కుని ఆ నీళ్లు నోట్లో పోసుకుని ఆబతో చప్పరిస్తూనే అలా చాలాసేపు కూచున్నాం.

పెజెన్‌దేయ్ ఆ నీళ్లని ఈల వేసినట్టు జుర్రుతూ పెదిమెలని చప్పరిస్తూ గట్టిగా లొట్టలేస్తూ తాగాడు. ఆ తాగడంలోనూ మేర్గెన్‌నది రాళ్లమీద దొర్లుతూ గలగలమని చప్పుడు చేస్తుందే అచ్చు అలాగే చప్పుడు చేస్తూ తాగేడు.

“ఇంత మజా అయిన భోజనాన్ని నా జన్మంలో యింతవరకూ యెన్నడూ ఆరగించ లేదన్నమాట!” అని హాస్యంచేశాడు.

ఆ భోజనం చేసిన తరువాత ఆకలి మరింత మండిపోతూంది. ఇక వుండబట్టక స్టెప్‌మైదానంమీదకి వెళ్లి అడవిసీకాయ కొమ్మలని విరుచుకుని రెమ్మలనీ ఆకులనీ పీకేసి బెరడు వొలిచేసి ఆ పచ్చవాగు ముక్కలనే విషగంధి వేళ్లలాగు చెడ్డచేదుగా వున్నా అవి మెత్తని మాంసపుతునకలే అని నటిస్తూ నమిలాము.

ఆ చేదుని మరి భరించలేక చూమ్‌లోనుంచి బైటకి పరుగెత్తుకుంటూ వెళ్లి యిరుగుపొరుగునవున్న యూరలలో వాళ్లందరూ యేమి

చేస్తున్నారో చూదాం అని ఆ యార్తల్లోకి తొంగిచూడ్డం మొదలెట్టాం. మొదట తొంబష్త్యోయ్‌గారి ఇంట్లోకి తొంగిచూశాం. అతను బోయవాడు. వేటకి వెళ్లి అడవిజంతువులని వేటాడి తీసుకొస్తూంటాడు. దానివల్లే అతనికి జరుగుబాటు. తొంబష్త్యోయ్ వేటకి వెళ్లి యింటికి వచ్చేసి వుంటాడు అన్న ఆశతో అతని గుడిసెలోకి దూరేం. మేర్గెన్ యెగువవొడ్డునవున్న అడవిలోకి వేటకి వెళ్లి యెప్పుడు దుప్పిని చంపి తీసుకొచ్చినా లేక చేపలవేటకి వెళ్లి పెద్ద చేపలని పట్టినాసరే లేక తెర్‌జీగ్‌వొడ్డున తన పెద్దధనస్సును ఎక్కుపెట్టి గురితప్పక కణతిని కొట్టి తీసుకొచ్చినప్పడేనాసరే మమ్మలిని తప్పకుండా తన యార్తలోకి రమ్మనమని పిలిచేవాడు. అతను వేటనుంచి వస్తూ అంత దూరంలోనే మాకు కనిపిస్తే మా ఆనందాన్ని మరి చెప్పనే అక్కరలేదు!

అతని రాక కనిపెట్టడానికి కంగీయ్ మాకంటె కాస్త దూరం ముందే వెళ్లి ఆ గుట్టమీద కెక్కి అతను యింటికి వచ్చే దారివేపు చూస్తూ ఒక్క కేకవేసింది:

"రండర్రా! తొంబష్‌మామ యేదో తెస్తూన్నట్టుంది!"

సుడిగాలిలాగు ర్రైంమని మేం పరుగెత్తి ఆ వస్తూన్న వేటకానిని కలుసుకునే వాళ్లము. ఏ కొండగొర్రె కళేబరాన్నో తన జీనుసంచులకి కట్టుకుని గుర్రంమీద సవారీచేసుకుంటూ కాస్త అటూ యిటూ వూగుతూ అతను యెదుర యేవాడు. మమ్మలిని చూసి నోరు మెదిపేవాడు కాదు. ఐనా ముఖం అంతా నవ్వుతూనే వుండేది. పొరుగు యార్తలనుంచి పిల్లలందరూ తోవలో పోగయేవారు. పోగవడమేమిటి? ఒకరినొకరు తోసుకుంటూ కేకలేసుకుంటూ కోరిందపాదమీదవాలి పండ్లను యెగరేసుకు పోవడానికి

యెగిరివచ్చిన కొండకోళ్లమందలాగు తొంబష్త్రాయ్ కూచున్న జీనుకు యిటూ అటూ చేరేవారు. ఈ హడావడి చూసి పెద్దవాళ్ళూ అక్కడకి వచ్చేవారు. ఆబాలగోపాలమూ ఆ బోయికి స్వాగతం చెబుతూ అతన్ని అభినందించేవారు. మూరెడు పొడుగున్న తన పొగగొట్టాన్ని పీలుస్తూ తొంబష్త్రాయ్ యిరుగు పొరుగు వాళ్లందరూ చకచకమంటూ ఆ కొండగొర్రె కళేబరాన్ని జీనుమీద నుండి దించి చర్మాన్ని వొలిచి వేస్తూండడం చూస్తూ గుర్రంమీదే వుండేవాడు. నేలమీద కూచుని ముగ్గురు మనుషులు ఆ గొర్రె చర్మాన్ని వొలుస్తూంటే చూస్తూండడం మా పని. తొంబష్మామవేపు మెల్లిగా తలెత్తి అతని వంక చూసేవాళ్లం. శరవేగంతో పరుగెత్తే అతని కాళ్లు యెంత పొడుగ్గా వున్నాయి! దుప్పులనీ జింకలనీ వేటాడ్డంనుండే కాబోలు అతని కాళ్లు అంత పొడుగయాయి! నున్నగా గొరిగించుకుని నిగనిగమని మెరుస్తూన్న అతని శిరస్సు మా చూపులకి అందకుండా ఆకాశాన్నే అందుకుంటూంది. సన్నంగా చిలకముక్కు లాగ వుంది అతని ముక్కు. అతని ముఖంమీద పొట్టిగాను వుంగరాలలాగ చుట్టుకుంటూన్న యెర్రవాగు గడ్డం. ఆ గోధుమరంగు కళ్ళూ చంచలమైన చూపులూ ప్రశాంతమైన నవ్వుముఖమూ వుండబట్టి కాని లేకపోతే కండలు తిరిగిన ఆకాయ శరీరాన్ని చూస్తే అది ఏ కంచుపోతపోసిన విగ్రహమో అని అనుకోవలసిందే!

వేటనుంచి తెచ్చిన మాంసాన్ని అందరకీ పంచిపెట్టడం ఆచారం. అది పెదవాళ్ల పని. మాకు కూడా యేమైనాదక్కుతుందో దక్కదో అని నేను అనుకుండే లోపునే కంగీయ్‌ని మా వంతు భాగాన్ని తీసుకోమనేవారు. తనకి అందిచ్చిన దుప్పికాలునీ నాలుగు డొక్కబొమికెలనీ చప్పున అందుకుని తనకు దొరికిన వాటిని మళ్లీ తనదగ్గరనుండి యెవరైనా తీసుకుంటా

రేమోనని ఆ పెన్నిధిని తన వక్షస్థలానికి హత్తుకుని ఆమె భయపడడం — నిజంగా కంగీయ్ కళ్లని అప్పుడు చూడాల్సిందే!

మాంసాన్ని అందరికీ పంచడం అయిపోయినాక అందరిలోనూ వృద్ధుడైన ఆ వూరి పాతకాపు మిగిలిన మాంసాన్ని తన చేతుల్లో పెట్టుకుని చేతులని చాచి తొంబష్‌మామవద్దకు తీసుకెళ్లి:

"ఈవేళ వేటకివెళ్లి మాంసాన్ని తీసుకురావడం నీ వంతు అయింది. మాంసాన్ని అందరకీ పంపకాలు చెయ్యడం మా వంతు అయింది. రేపు వేటకి వెళ్లడం నా వంతు. వేటని పంపకం చెయ్యడం నీ వంతు" అంటాడు.

అప్పుడు తొంబష్త్రాయ్ ముసలిపెద్దకి వంగి నమస్కారం చేసి ముసలి పెద్ద చేతులమీదుగా మాంసాన్ని అందుకుని ముసలతనిని ఉద్దేశించి:

"నీ మాటలు నాకెంతో తృప్తి కలిగించాయి. రేపు నువ్వు వేటనుంచి తీసుకొచ్చేది కూడా నన్ను తృప్తి పరుస్తుంది. తైగా వేటలో నీ కొడుకులకి జయంకలగాలనీ నీ మనుమలకి అంతకంటే గొప్ప జయంకలగాలనీ నా కోరిక" అంటాడు.

అందరూ యెవరి యిళ్లకి వాళ్లు వెళ్లిపోతారు. తొంబష్‌మామ అప్పుడు మమ్మలిని తన గుడిసెలోకి రమ్మని పిలిచి వేటనుండి తెచ్చిన మాంసాన్ని వండి మమ్మలిని తనతో కూడా తినమని తింటూన్నంత సేపూ తన వేటసంగతులనీ విశేషాలనీ చెబుతూ వుంటాడు. ఆ వేటఖబుర్లని వింటూనే మేము అక్కడే నిద్రపోతాము.

పొద్దున్న లేచినాక నాకూ పెజెన్‌దేయ్‌కీ మరొక పెద్ద మాంసపు ముక్కని యిచ్చి మమ్మలిని మా యింటికి పంపించేసేవాడు.

తొంబష్‌మామ వేటకి వెళ్లిపోయే వుంటే మేము యిరుగుపొరుగు యిళ్లకి వెళ్లేవారము. వాళ్లూ పాపము మాలాంటి వాళ్లే. సంవత్సరం పొడుగునా తినడానికి సమృద్ధిగా వుండడం అన్నది ఒక్క ఆ తెల్ల యూర్తలలో వున్న వాళ్లకే చెల్లింది.

ఎప్పుడైనా ఒకసారి ధైర్యంచేసి ఆ తెల్ల యూర్తలలోకి వెళ్లేవారం. మా చెర్లిక్‌పేన్‌న్ని గుడిసెకి కాపలాపెట్టి కాస్త అలా షికారు తిరిగి రావాలని బయలుదేరి వెళ్లుతూవుంటే యెక్కడైనా తెల్ల యూర్తనుంచి పొగవస్తూన్నట్టు కనబడినట్లాయెనా చెట్లూపట్లూలు వేసుకుని ధైర్యం చేసి అక్కడకు వెళ్లేవారము.

మా ఆల్* లోకల్లా గొప్పమోతుబరైన తాష్-చలాన్ యూర్తకి దగ్గరగా వెళ్లడం తటస్థించి నట్లా యెనా ఆ యింట్లో యేమేమి వంటకాలు వండుతున్నదీ పోల్చుకుందుకు ప్రయత్నం చేసేవాళ్లం. గొప్ప ధనికుడి ఇల్లు. అందుచేత ఆ యూర్త పెద్దది. లోపల మంచి విశాలంగా వుంటుంది. దాని చుట్టూ చిన్నచిన్న నల్ల యూర్తలుండి నల్లపుట్టకొక్కుల మధ్య గడ్డిమేటులాగా కానొచ్చేది అది మాకు. అతని యింటోకి పెంకెతనంగా జొరబడుతున్నామని అతడు యెక్కడ అనిపోతాడో అని భయపడుతూనే మెల్లగా జాగ్రత్తగా నాలుగువైపులా చూసుకుంటూ ఆ యూర్తలోకి వెళ్లేవారం.

తివాచీమీద బాసికపట్లువేసి కూచుని తాష్-చలాన్ చిక్కటి టీని తాగుతూ బిగ్గరగా ఊపిరి తీస్తూంటాడు. ఆయన వేసుకున్న అంగీ మెడ

---

* గ్రామం.

లోంచి వేడిపొగర్లు పైకివస్తూ గిసినకందగడ్డలాంటి ముఖంమీదనుంచి చెమట ధారలు కారుతూ వుంటుంది. సాయంకాలంపూట ఫలహారానికి అందరిలాగ టీనీళ్లు తాగడం అతనికేం ఖర్మం? ఏకంగా మేకపోతు కాలునే రెండు చేతులతోనూ పట్టుకుని మాంసాన్ని కొరుక్కుని తింటూ తింటూన్నంత సేపూ విధివిరామంలేకుండా అదే లొట్టలు వేసుకుంటూ ఒక్క పిసరైనా మిగిలిపోకుండా మాంసాన్నంతటినీ పళ్లతో పీక్కుని తినేసి జిడ్డుచేతులని తన అంగీ అంచులతోనే తుడిచేసుకుంటాడు.

మమ్మలిని చూసి వీళ్లకి కూడా తినాలని వుంటుందే అని ఆయనకి ఒక్కసారైనా తోచలేదు!

మీదుమిక్కిలి యించుమించు ప్రతీ సారి కూడా యెంతో కష్టంతో యిస్సు అస్సుమని మూలుగుతూనే లేచి మమ్మలిని ఒక్కొక్కరినే తన యూర్తలోనుంచి మెడపట్టుకుని గెంటేసేవాడు.

ఐతే ఈయనా కడమ ధనికులూ కూడా మామీద యెంతో దయదాక్షిణ్యాలు సహనం తమకివున్నట్టు మేము నమ్మేలాగు ప్రవర్తించేవారు. అందుకని మమ్మలిని తమ యెడమ చేతివైపున పొయ్యిగూడుదగ్గర ఖాళీగా వున్న చోట అర్ధచంద్రాకారంగా కూచుండనిచ్చేవారు. మాకు కూడా తినడానికేదైనా రుచిగా వున్న యెముకనో చిన్న మాంసపు ముక్కనో యిస్తారన్న ఆశతోనూ సంతోషంతోనూ వాళ్లు రెండు చేతులతోనూ ఆబగా తింటూండము చూస్తూ కూచునేవాళ్లం. వాళ్లు మాత్రం లొట్టలేసుకుంటూ నములుతూండడమూ ఒక ముక్క తరువాత మరొకముక్క తింటూండడమూ యీలాగు భోజనం అంతా కానిచ్చేవారు. వాళ్ల భోజనం పూర్తి అవుతూందనగా మేము మెల్లిగా వొంటి కాలుమీదలేచి బైటకి వెళ్లిపోతూన్నట్టు నటిస్తూ

మాలో యెవరిమీద వాళ్ల కళ్లు ముందుగా పడితే వాళ్లకేదైనా యిస్తారేమో అన్న గంపెడాశతో వారి ముందునుండే అడుగుల్లో అడుగులు వేసుకుంటూ నడిచేవాళ్లం. ఎన్ని చేసినా యేమీలాభం లేకపోయేది. సుతరామూ మా వైపైనా చూసేవారు కారు ఆ ధనికులు.

మాలోకల్లా పెద్దది కంగీయ్ ధైర్యం తెచ్చుకుని శ్రావ్యమైన గొంతుకతో:

"తమరందరూ భోజనాలు చెయ్యడం అయిపోయినాక మా తమ్ముళ్లకీ మా బుచ్చి స్యర్యన్మాకీ యేదైనా కాసింత పెట్టండి. పాపం వాళ్లకి చాలా ఆకలవుతూంది" అని బతిమాలుకునేది.

తాష్-చలాన్ మాత్రం కంగీయ్ వైపు చిరాకుగా చూస్తూ యేమీ మాట్లాడకుండానే జిడ్డుకారుతూన్న తనవేళ్లని దులుపుకుంటూ అలా కూచుండి పోయేవాడు. అతని కడుపులో వున్న ఆబ అంతా అతనికి వూపిరి సలపకుండా పీకనొక్కేస్తూందేమో అన్నట్టు గట్టిగా రొజుకుంటూ కూచునేవాడు.

రొజుకుంటూనే ఒక్క మాటుగా హఠాత్తుగా లేచి:

"ఇదిగో దీన్ని తీసుకుని అవతలికి పొండి! ఛండాలపు సంత! ఎవరి యిళ్లల్లో వాళ్లని హాయిగా తిండైనా తిననివ్వరు కదా!" అని కసరుకొంటూ ఒక చిన్న పిసరంత మాంసపు ముక్కని — యే వూపిరితిత్తి ముక్కనో యే కార్జపు ముక్కనో — మావైపు విసరేసేవాడు.

ఆ విసరేయడం చూసి పెజెన్‌దేయ్ నేనూ ఆ మాంసపు ముక్కని ఒకరికి అందకుండా మరొకరు అంకించుకోవాలని వురికి ఒకరితో ఒకరం తల పడి కాట్లాడుకునేవాళ్లం. ఇలా మేము ఒకరితో ఒకరం కలియపడుతూంటే

యీ లోపున తాష్-చలాన్‌గారి కుక్క వచ్చి ఆ మాంసపుముక్కని పట్టుకుని పారిపోయేది. చివరికి మాకు మిగిలినది సున్నకి సున్న హళ్లికిహళ్లి. ఇదంతా చూసి తాష్-చలాన్ పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వేవాడు.

"హా – హా – హా!" అని ఆయన గొంతుక బొంగురు పోయినట్టు గర్జిస్తూంటే లామా బూరావూదుతున్నాడేమో అనిపించేది.

ఆ నవ్వుతో ముఖం మరింత యెఱ్ఱ బడిపోయి దాంతో మరి గట్టిగా నవ్వలేక నవ్వుపైకి రాకదగుతో వొళ్లంతా కుదిపేసినట్టు వొణకిపోతూ లోలోపలే నవ్వుకునేవాడు ఆయన. కాస్సేపు అయాక నవ్వు ఆపుచేసుకుని మమ్మలిని బెదరిస్తూ:

"పెంకెవెధవలు! పైవాళ్ల యార్తలో కొచ్చి బుద్ధిగా కూచోడం పోయి కేకలు పెట్టడం పోట్లాడుకోవడమున్నూ! మీకంటే ఊర కుక్కలే నయం అనిపిస్తూంటే. పొండి యిక్కడనుంచి! పొండి!" అని కేకలేస్తూ లేచి మమ్మలిని మెడపట్టుకుని చీకటిరాత్రి అంధకారంలోకి తగిలేసేవాడు.

అదృష్టవశాత్తూ తాష్-చలాన్ గిరవాటు వేసిన మాంసపుముక్కని కంగీయ్ చేజిక్కించుకున్నట్టాయెనా మేము నిశ్శబ్దంగా బైటకు వెళ్లిపోయేవారం. అప్పుడు కంగీయ్ తన పళ్లతో ఆ మాంసపుముక్కని మాకందరకూ సరిగ్గా సరి సమానమైన ముక్కలకింద కొరికి పంచిపెట్టేది. ఆ పిసరు ముక్కనే నోట్లో పెట్టుకుని చప్పరిస్తూ నములుతూ నాకుతూ యెంతసేపూ ఆనందించడానికి వీలుంటుందో అంతసేపూ హాయిగా ఆనందించేవాళ్లం. ఐతే అంతపాటి అదృష్టం యెప్పుడో కాని మాకు పట్టేదికాదు. కడమప్పుడల్లా పైవాళ్లందరూ తింటూంటే మేము చూస్తూ కూచునేవాళ్లం.

నాలుగవ ప్రకరణం

మా వేటగాళ్ళు

మా కుక్క చెర్నిక్‌పేన్ పెద్దదీ మంచి బలమైనదీ. నల్లగా మసి బొగ్గే. దాని తోకమీద వెంట్రుకలు జడలుకట్టి తోకచివర జడగంటలు కట్టేరేమో అన్నట్టుంటుంది. పెద్ద బొంగురు గొంతుకతో అరుస్తుంది. చెర్నిక్‌పేన్ అని దానికి పేరుపెట్టిన ఉత్తరక్షణంనుంచి దానిమీద మాకు మోజు కుదిరిపోయింది. మామీద దానికి కూడా యెంతో విశ్వాసం.

మునుపు చెర్నిక్‌పేన్ మాదగ్గరకి రాకముందు మా అమ్మ తైగాకి వెళ్లినా మేర్గెన్‌లోతట్టు ప్రాంతాలకి వెళ్లినా ఆమె కాస్సేపటికల్లా రాకపోయేటప్పటికల్లా మాకు యేమీ తోచక బెంగగా వుంటూండేది. ఇప్పుడు మరి మాకేమీ భయం వేసేదికాదు.

మొట్టమొదటి సారిగా చెర్నిక్‌పేన్ తనంతటతను వేటాడిన జంతువను యింటికి పట్టితెచ్చినప్పుడు మరి మాకుకలిగిన సంబరం యింతా అంతాకాదు. సాయంకాలమైంది. ఆవేళ బాగా చలిగా మంచి వెలుతురుగా ఉంది. వంటపొయ్యిలో నిప్పులు ఆరిపోతూ నుసిమాత్రమే వుంది. మా చూమ్‌లో యెంత చలిగా వుందంటే మేము కప్పుకున్న కంబళీలోనుంచి ముక్కుమొన యేమాత్రంపైకి వచ్చినా వేళ్ల చివరలు యేమాత్రంపైకి వచ్చినా జివ్వుమని వొళ్లంతా చలికి కొరడుబారిపోయేది. ఆ చలితో మరి నిద్ర పట్టేది కాదు.

హఠాత్తుగా చెర్లిక్‌పేన్ సంతోషంతో కీచుకీచుమని మొరుగుతూండడం వినిపించింది మాకు. మరో నిమిషానికల్లా దర్జాగా అడుగులు వేసుకుంటూ లోపలి కొచ్చి మాముందు ఆగి తన నోటితో కరచిపట్టుకున్న వస్తువను అక్కడ వుంచింది. పెద్ద తెల్లటి కుందేలు!

ఆ కుందేటికోసం చెర్లిక్‌పేన్ మంచుకుప్పవెనక కాచుకొని కూచుని వుండాలన్న మాట. మాకెంత ఆకలి వేస్తూండెనో మా వేటకాడికి కూడా అంత ఆకలి వేస్తూనే వుండాలి. కాని తన ఆకలిని బైటపెట్టకుండా యింట్లోకి యెంత దర్జాగా వచ్చిందో అంత దర్జాగానే వంటపొయ్యి ముందు సాగిలబడింది.

వెంటనే మేము ఆ కుందేటిని చర్మంవొలిచేసి మెత్తటి మాంసాన్ని వండుకుని పొద్దుటివరకూ తింటూ విందు ఆరగించాము. కుందేటి బుర్రని మా వేటగానికి బహుమతి చేశాం.

ఇది జరిగిన తరువాత మా అమ్మ యెప్పుడు వేటకి వెళ్లినా తప్పకుండా చెర్లిక్‌పేన్‌ని కూడా తీసుకువెళ్లేది. మా అదృష్టం మాత్రం కలసి రాకపోవడంచేత యెప్పుడో నూటికీ కోటికీ ఒక మారు తప్ప యెప్పుడూ వుత్త చేతులతోనే అమ్మ యింటికి వచ్చేది.

నాకిప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఒక మాటు అమ్మ యింట్లోలేనప్పుడు మాకేమీ తోచక వేళంబనకని ఎల్మచెట్లు చిగుళ్లని కోసుకొచ్చి వాటి బెరడునమిలి అదీ అయిపోయాక వ్యాసుపోవడానికని యిన్ని నీళ్లని మరిగించుకుని యింకా తోచక ఆరబైటకి వెళ్లి కట్టెపుల్లలని యేరుకొచ్చాం. అప్పటికీ అమ్మ రాలేదు.

ఇక విసుగుపుట్టి ఆ చలిలోనే ఆ గుట్టమీదనుంచి యీ గుట్టమీదకి పరుగెడుతూ దూరాన మంచుమీద నల్లని వస్తువ కనబడినప్పుడల్లా అమ్మ

వస్తూందేమో అని ఆశతో తిరిగేం. నీలిరంగు ఆకాశాన సూర్యుడు ప్రకాశిస్తూ తీక్షణమైన కిరణాలని భూమిమీద ప్రసరిస్తున్నాడు. కాని మా చింకి పాతల్లోనుంచి చలి మరింత జోరుగా మమ్మలిని పీడిస్తూంది.

"అమ్మ యింకా యెప్పుడొస్తుంది?" అంటూ పెజెన్‌దేయ్ యేడుపు మొదలెట్టాడు.

"ఇప్పుడే వస్తుంది. ఏడుస్తావేమిటి? ఊరుకో!" అని కంగీయ్ కోంబడింది.

కంగీయ్ మాట నమ్మక పెజెన్‌దేయ్ అలాగు యేడుస్తూనే చూచున్నాడు. ఏడుస్తూన్నవాడల్లా ఒక్కమాటుగా చెంగుమనిలేచి సంతోషంతో చప్పట్లుకొట్టడం మొదలెట్టాడు.

దూరాన్న నల్లని చుక్కలు రెండు కనిపిస్తే వాటిని మాకు చూపించాడు పెజెన్‌దేయ్. నిమిషం నిమిషానికీ ఆ చుక్కలు పెద్దవై కాస్సేపటికల్లా అవేమిటో మేము గుర్తుపట్టగలిగాము. మంచుమీద వున్న బాటలో ఒకమాటూ మనిషి అడుగైనా అంతవరకూపడని మంచు మీదను నడుచుకుంటూ అమ్మ అల్బన్‌చీ మాకు ఎదురుగా మెల్లగా వస్తున్నారు.

వాళ్లని కలుసుకోవడానికి మాసత్తువకొద్దీ పరుగెత్తాం. వాళ్ల భుజాల మీద సంచులున్నట్టూ ఆ సంచుల్లో యేదో వున్నట్టూ కుడా మాకు అగుపడి వాటిలో యేమిటి వున్నాయో అని మేము ఆశ్చర్యపడ్డాము. లోతుగా మంచులోనే మెత్తటి గడ్డిమీద పరుగెత్తుతూన్నట్టు పందేలు వేసుకుని పరుగెత్తుతూ అమ్మ దగ్గిరకెళ్లి మరేమైనాసరే యికముందునుంచీ మేము

ఆమెను వదిలిపెట్టి వుండమని గట్టిగా వొట్టుపెట్టి అమ్మ పావడ అంచు పట్టుకుని నడిచేము.

"ఎక్కడికెళ్లారు? ఆ సంచుల్లో యేం పట్టుకొచ్చారు? విప్పిచూపించండి" అంటూ అమ్మని వేధించుకుతిన్నాం.

అమ్మ వెంటనే జబాబు చెప్పకపోయినా వాళ్లు వుత్తచేతులతో రాలేదనీ సంచుల్లో యేదో తీసుకు వచ్చారనీ మాకు సంచులని చూడగానే తెలిసిపోయింది.

మేము సంతోషాన్ని ఆపుకోలేక కేకలేసుకుంటూ అమ్మ కొంగుపట్టుకుని యిక యేడవడం మొదలెట్టాము. అమ్మ మావైపు ఆప్యాయంగా చూస్తూ మమ్మలిని కౌగలించుకుని ముద్దుపెట్టుకుని:

"అయ్యో! పసికూనలు! ఆకలవుతూందా? చలివేస్తూందా?" అని మమ్మలిని బుజ్జగించింది.

మేము ఒకరి మాటకొకరు అడ్డం పడుతూ ఆమె లేనప్పుడు జరిగిన విశేషాలనన్నింటినీ చెప్పడం మొదలెట్టాము. మరొకరి మాట చొరనీయకుండా అందరికంటేముందు పెజెన్‌దేయ్ చెప్పడం మొదలెడుతూ:

"చెర్లిక్‌పేన్ తెల్ల కౌజుపిట్టని మంచులో పట్టుకుందే అమ్మా!" అని చెప్పాడు.

నాకంటె ముందే అన్ని సంగతులూ చెప్పేస్తున్నాడని నేను ముందుకు పరుగెత్తుకునివెళ్లి గంతులేస్తూ: "పిట్టరెక్కలని మేము తినకుండా నీకోసం అట్టేపెట్టామే అమ్మ!" అన్నాను.

"మరి వుండబట్టక తరువాత తినేశాము" అని చెప్పేశాడు పెజెన్‌దేయ్.

"మరునాడులే" అని నేను అందుకున్నాను.

"తాష్-చలాన్ మమ్మల్ని ఆయన యింటినుంచి మళ్లీ గెంటేశాడే" అని అందరికంటే ఆఖరున కంగీయ్ చెప్పింది.

మా చూమ్‌లో అడుగుపెట్టగానే అమ్మ అక్క తెచ్చిన సంచులమీద పడ్డాం. అల్బున్‌చీ సంచులని విప్పింది. మొదటి దానిలో యేముందో చూశాం. సంచీలో యింత గోధుమనూక గోధుమగింజలూ వీటిలోనే యివి అన్నీ అంటుకుని మాంసపు పిసరైనా లేకుండా చివరకంటూ గీరేసినటువంటి మేకపోతు మెడకాయ ఒకటీ కొన్ని తల్గాన్* పెచ్చులూ వాడుక చేసేసిన తరువాత గడ్డ కట్టుకుపోయి మట్టి బెడ్డల్లా వున్నటీ కణికెలూ చిన్న గుడ్డ పీలికలో మూట కట్టిన టీఆకులూ ఆ సంచీలో వున్నాయి.

"మేము తీసుకొచ్చిన మహాభాగ్యం అంతా యింతే! భాగ్యవంతుల యూర్తకి వెళ్లితే తన్ని తగిలేస్తారు. పేదవాళ్ల వూరిళ్లకెళితే వాళ్లకున్న ఆ కొద్దిలోనే పాలుపంచుకోమని యిస్తారు" అంది అమ్మ.

సంచీల్లో చేతులుపెట్టి యెవరి మట్టుకు వాళ్లము అన్నీ లాగేయ ప్రయత్నించాము.

అమ్మ మమ్మల్ని ఆపింది: "ఎవరికి దొరికినది వాళ్లు కాజేయడం తప్పుకాదూ? ఉండండి. మీకందరకీ నేనే పంచుతాను" అని మందలించింది.

మేము కాస్త వెనక్కి తగ్గేము కాని సంచులచుట్టూ మూగి వాట్లో

* వరిగపిండి రొట్టె.

వున్న వస్తువులు బైటపడేవరకూ ఆ సంచులమీదే వుంది మా దృష్టి అంతాను. వాటిని రుచిచూడకుండానే మా నోరూరుతూ నాలిక చప్పరిం చేస్తూన్నాము.

సంచుల్లో వున్న వాటినన్నింటినీ అందరకీ అమ్మ పంపిణీచేసింది. పెద్దక్క తనకొచ్చిన వంతులో ఒక చిట్టెడు కొత్త టీఆకులు తీసి వాటితో యిన్ని చితకకొట్టిన సరుగుడు వేళ్లని కలిపి టీ కాచి రుచికి కాసిన్ని మేక పాలు కలిపి మాకందరకీ యిచ్చింది.

తల్లిపక్షి తన పిట్టలని సాకినప్పుడు వాట్లని వెయ్యి కళ్లతో రక్షి స్తుంది. తన గూటినుంచి అవి రెక్కలొచ్చి యెగిరి పోయేవరకూ ఆ తల్లి పక్షికి ఒక్క నిమిషం తీరిక వుండదు. పెద్ద కళ్లున్న ఆ చిన్న పిట్ట లన్నీ కావుకావుమని తల్లినిబతిమాలుకుంటూ ఆహారం పెట్టమని నోళ్లు తెరిచిపెట్టు కుంటూన్నంతవరకూ తల్లిపక్షి యింతపిసరు గింజనికాని చిన్న పురుగునుకాని తినదు.

మా అమ్మకూడా సరిగ్గా అలాగే. ఆ స్టెప్‌మైదానాలమీద కొండ లోతట్టున విసిరేసినట్టున్న యుార్తలన్నీ తిరిగితిరిగి పోగుచేసిన సామగ్రినంతా మేము తినేసీతినేయడంతోనే మళ్లీ వెంటనే చాంద్రాయణం బయలుదేరేది. మళ్లీ తను తీసుకువచ్చిన బువ్వని మేము తినేసి ఆ టీనంతా తాగేసే లోపల మళ్లీ బిచ్చంకోసం ప్రయాణానికి సిద్ధం అయేది. ఆమెవంతు తీసుకు రావ డం మావంతు తినడం.

ఐదవ ప్రకరణం

ఇక యిప్పుడేమి జరుగబోతుంది?

మాకు తెలియకుండానే మళ్లీ అమ్మ రోడ్డమ్మట ప్రయాణానికి తయారవుతూంది. ఈసారి కూడా నన్ను వదిలిపెట్టి వెళ్లిపోతారు కాబోలు అని నేను అనుకున్నాను. కంగీయ్ పెజెన్‌దేయ్ చెర్లిక్‌పేన్న్ని తీసుకొని రోజూ అడవికి వెళ్లిపోయేవారు. నేను కూడా వస్తానంటే నువ్వు చంటివాడివి నడవలేవు అని నన్ను వుంచేసి వాళ్లమటుకు వాళ్లు వెళ్లిపోయేవారు. నేనొక్కడనీ వంటరిగా యింట్లో వుండి పోయేవాడిని.

అమ్మతోనూ అల్బాన్‌చీతోనూ కలసి యీమాటు నేను కూడా వెళ్లదామని అతి ఉబలాటపడుతూ ఆతొందరలో వుండబట్టక అమ్మతో:

"ఈమాటు నువ్వు వెళ్లిపోతే నేనేమైనాసరే యింట్లో వుండిపోదలచుకోలేదు. 'ఇదిగో వచ్చేస్తాను అదిగో వచ్చేస్తాను' అని నువ్వు అంటావు కాని అన్నీ అబద్ధాలే" అన్నాను.

"ఏమిటూ పిచ్చివాగుడు? ఈ చలిలో కట్టుకుందుకు తిన్నగా గుడ్డముక్క లేనాలేవు కదా యెక్కడకి వస్తానంటావురా?" అని అమ్మ కసిరింది.

"నన్ను నీతో తీసుకెళ్లు" అని నేను మారాంపెట్టాను.

"నూరుచెప్పు లక్షచెప్పు నువ్వెన్ని చెప్పినా లాభం లేదు. నిన్ను తీసుకువెళ్లను గాక తీసుకువెళ్లను" అనేసింది అమ్మ.

"నేనుండలేను..." అని మళ్లీ మొదలుపెట్టాను.

అమ్మ నన్ను తన మోకాళ్ల మధ్యను నొక్కిపట్టుకుని వీపుమీద అర చేతితో నాలుగు చరిచింది. నాకేమీ నొప్పివెయ్యేలేదు. అయినా నేలమీద బోర్లాపడి ఘోరుమని యెంతగట్టిగా యేడవగలనో అంతగట్టిగా యేడవడం మొదలెట్టాను.

"దొంగయేడుపులూ నువ్వూను. నీ చిత్తంవచ్చినంత సేపు ఇక్కడపడి యేడువు!" అంది అమ్మ. అప్పుడు నేను ముఖాన్ని నేలకి అంటిపెట్టుకుని దొంగనిద్ర నటించాను.

అమ్మ అల్బన్‌చీ మెల్లగా చడిచప్పుడు చేయకుండా గుడిసెలోంచి అవతలికి వెళ్లిపోయారు.

నేను వెంటనే లేచి యిన్ని చింకిగుడ్డలని కాళ్లకి చుట్లపెట్టుకుని వాళ్లవెంట పడ్డాను.

పరుగెత్తుకుని వెళ్లి వాళ్లను కలుసుకుంటినా వాళ్లు మళ్లీ నన్ను యింటికి తరిమేస్తారే, అప్పుడు యేమి చెయ్యడమా అని అనుకుంటూండే లోపునే మరి వాళ్లు నాకు కనపడలేదు. కాని మళ్లీ పరుగెత్తి వాళ్లను కలుసుకున్నాను. అమ్మ నావైపు చూసింది. ఇంట్లో రాగాలు తీసినట్టే మళ్లీ రాగాలు తీయడం ప్రారంభించి అమ్మచేతిని గట్టిగా పట్టేసుకున్నాను.

"అబ్బ నీ పెంకెతనం నువ్వూనూ! నిన్ను భరించలేకుండా వున్నాను రా నాయనా! ఇక నువ్వు బతికున్నంతకాలం మర్చిపోకుండా వుండేటట్టు వొళ్లు చితుకకొట్టేస్తానుండు..." అని అమ్మ నన్ను కొట్టబోతూండగా అల్బంచీ నన్ను తనదగ్గరకి గుంజుకుని:

"వాడిని చావగొట్టడం యెందుకు? కూడా తీసుకు వెళ్లితే సరిపోయె" అంది అమ్మతో.

అందుకు మరేమీ బదులు చెప్పకుండా తన కోటు చేతితో అమ్మ తన కన్నీటిని తుడుచుకుని మరి వెనక్కి తిరగిచూడకుండా ముందుకి నడిచింది. అలాగు కా-ఖెమ్‌నది వొడ్డంటే ఒకరివెంట ఒకరం ఆ సన్ననిగట్టుమీద నడ చుకునివెళ్లాం. మా పాదాలకింద మంచు కరకరమని చప్పుడు అవుతూంటే నడచుకుని వెళ్లేసరికి కొంతసేపటికి చాలా పేటలు కనపడ్డాయి.

అక్కడున్న యుార్తలన్నింటిలోనూ ఒకటి బాగా పెద్దదీ మంచి షోకుగానూ వుంది. ఆ యుార్తదగ్గరసంటూ వెళ్లబోతూంటేనే కుక్కల జట్టు ఒకటి భయానకంగా అరుస్తూ మామీదకొచ్చాయి. ముందున్న కుక్క పెద్దదిగానూ నల్లగానూ మా చెర్లిక్‌పేన్‌లాగే ఉంది. ఆ కుక్క అదృష్టమే మా చెర్లిక్‌పేన్ మాతో లేకపోవడం! ఆ కుక్క ఒకక్షణం దాని యెఱ్ఱనాలికని పారజాపి పైకివేలాడించేది. మరుక్షణం నాలికని నోట్లోకి లాగేసుకుని పళ్లు బిగించేది. దాని కళ్లు చింతనిప్పులే.

అమ్మని రెండు చేతులతోను నేను గట్టిగా పట్టేసుకున్నాను. అమ్మ చేతిలోవున్న కఱ్ఱని అల్బన్‌చీ తీసుకుని ముందుకు నడుస్తూ కేకే సింది:

"కుక్కలని వెనక్కి పిలిచేండయ్యా! లేకపోతే మామీద పడి మమ్మలిని చావకరిచేస్తాయి!"

షోకైన ఆ యుార్తలోనుంచి ఒక మనిషి తొంగిచూశాడు. కుక్క లని వెనక్కిపిలువక పోవడం అటుండగా, మమ్మలని ఆ కుక్కలేంచేస్తాయో చూద్దామని నవ్వుతూ అక్కడే నిలబడ్డాడు. అక్క మాత్రం కఱ్ఱని యిటూ అటూ కుక్కలని తోలెయ్యడానికి విసురుతూ యుార్తదగ్గరకి వెళ్లింది. అక్కవెంట మేము వెళ్లాం. మేము రావడము చూసి ఆ మనిషి యుార్త

తెరని ఆపాళంగా జారవిడిచి లోపలికి వెళ్ళిపోయాడు. వొంగివొంగి దండాలు పెడుతూనే ఒక్కొక్కరమే గుమ్మందాటి ఆ తెల్ల యూర్తలోకి అడుగు పెట్టాం. పొయ్యిగూటికి యెదురుగా అమ్మ మోకాలుమీద మండీ వేసుకుని మోకరించి:

"దొరలకి నూరేళ్లు ఆయుష్షు!" అంటూ దణ్ణంపెట్టింది.

నడివయస్సులో వున్నాడాయన. నున్నగాక్షవరం చేసిన గుండు. సంక టంతోవున్న వొంటెకి మూపురం యెలా వొంగి వుంటుందో అలా వొంగి వున్న ముక్కు. మమ్మలిని చూసి యేమీ మాటాడలేదు. కాళ్లకి చెమ్కీతో అల్లిన ఇదికీ చెడావులు. మేకపిల్ల తోలుతో తయారుచేసిన కోటు వేసుకు న్నాడు. బొచ్చు లోపున ఉండగా కోటుపైన పసుపుపచ్చని పట్టు అంగీ తొడుక్కున్నాడు. పొయ్యికి దగ్గరగా కూచుని చిన్నకుందేటి పిల్లని తన్నుకు పోవడానికి సిద్ధంగా వున్న ముసలిగద్దలాగు, అతడు మమ్మలిని ద్వేషంతో చూశాడు.

గుర్రపు జీనుకి వేలాడుతున్న సంచిలాగ అతని నడుమున ముక్కు పొడుము డబ్బీ ఒకటి వేలాడుతూంది. పొడుండబ్బీ తీసి టక్కుటక్కుమని అడుగున కొట్టి మూతతెరచి ఒక చిటికెడు పొడుమును ఆ ముక్కు చలమలోకి మరొక చిట్టెడు యీ ముక్కు చలమలోకి యెక్కించి నాలుగు తుమ్ములుతుమ్మి అప్పుడు అడిగేడు:

"ఎక్కడకిలా వచ్చారు?"

"ఎక్కడేనా పని దొరుకుతుందేమోనని వచ్చాం" అని అంటూ అమ్మ నావేపు చూపించి: "ఈ పసికందువలు కాస్త బతికి బట్టకట్టాలని ఆశ దొరా!" అంది.

యూర్తలో మూలగా ఒక చోట రంగురంగులతో మెరుస్తూన్న కంచుదేవుళ్ల విగ్రహాలు బంగారపు లతలతో నగిషీచేసివున్న పెట్టెమీద వుండడం చూసి — మరి వాటిమీద నమ్మకం వుండో లేకపోతే ఆ లామా సంతోషించి అతనికి తనమీద దయపుడుతుందనో — అమ్మ వాటికి మొక్కి దణ్ణంపెట్టింది.

"ఓహో! మీరేం పని చేస్తారు?" అని అడిగి, జబాబు చెప్పేలోపునే తన పాదాలదగ్గర కూచుని వున్న ముసలావిడెతో:

"చెయ్యడానికి వల్లమాలినంత పని వుంది. కాని డబ్బులు మాత్రం అడగకూడదు అని కచ్చితంగా యిప్పడే చెప్పేయి" అన్నాడు ఆయన.

"ఈవిడెవల్ల మనకి అన్ని విషయాలూ తెలుస్తాయి" అని నేను అనుకుంటూ ఆవిడెవైపు నోరు తెరుచుకొని చూస్తూ నిలబడ్డాను.

"మీరు యేపని చెయ్యమని సెలవిస్తే ఆ పని చేస్తాం. కూలి డబ్బులు మాత్రం నిర్ణయించండి" అని అమ్మ అంటూ ఆశతో ముఖం తేరుకుని, అక్కడవున్న ఆవిడెదగ్గరకెళ్లి తలవొంచి దణ్ణంపెట్టింది.

"అట్లా తొందర పడతా వెందుకు? ఆ పక్కగా వున్న యూర్తలోకి వెళ్లితే యేమిపని చెయ్యాల్సిందీ అక్కడున్న మనుషులు చెబుతారు మీకు. మీరు చేసే పనికి యిన్ని మజ్జిగ నీళ్ల పోస్తాం. కూలిడబ్బులా — అది మాత్రం అడగకండి. మీకుపెట్టే తిండి తేరగా వస్తుందనీ వెచ్చటి యూర్తలో అప్పనంగా కూచోవచ్చుననీ అనుకుంటున్నారు కాబోలు?" అంది ఆవిడె.

ఆ యింటిఆవిడెవైపు నేను మళ్లీ చూశాను. ఆవిడె కూడా మేకపిల్ల తోలుతో కుట్టిన కోటు వేసుకుంది. పట్టు మాత్రం నీలిరంగు.

నల్లని చైనాపట్టు రిబ్బనుతో తల ముడేసుకుంది. చెవికి వెండిపోగులు. చెక్కిళ్లకి వొత్తుగా యెరుపురంగు పూసుకుంది. చైనావాళ్లు కాల్చే పొగగొట్టం ఒకటి నోట వుంది. ఆవిడె మాట్లాడుతూన్నంత సేపూ ఆమె పళ్లమధ్య నుంచి టక్కుటక్కుమని ఆ గొట్టం చప్పుడవుతూనే వుంది.

"కష్టం చేస్తే కష్టానికి తగ్గట్టూ కూలీ దొరకదా?" అంది అక్క.

అందుమీద ఆవిడె పొగగొట్టాన్ని నోటినుంచి తీసి యెవరితోనో మాట్లాడుతూన్నట్టు ఉదాశీనంగా:

"పని చెయ్యాలని మీకిష్టవుంటే నేను చెప్పిన చోటకి వెళ్లండి. లేక పోతే మీ చిత్తంవచ్చిన చోటకి పొండి" అంది.

ఆ యుార్తలోకి యేలాగు వచ్చామో అలాగే ఒకరి వెంట ఒకరం యుార్తలోనుంచి బైటకివెళ్లి కాస్తదూరంలో నల్లగా పొట్టిగావున్న యుార్తలోకి వెళ్లాం.

దానిలో కొంతమంది మగవాళ్లు ఆడవాళ్లు కూచుని వున్నారు. ఆ మగవాళ్లలో తొస్తాయ్-ఓల్ని మేం యెరుగుదుం. అతను యెప్పుడూ అందరిళ్లలోనూ కూలిపని చేస్తూంటాడు.

చూడడానికి వాళ్లందరూ అచ్చంగా మాలాగే వున్నారు. మాలాగే వాళ్లూ చింకిపాతలే కట్టుకున్నారు. వాళ్ల చుట్టూ గుర్రపుజీనుసామానులు తప్ప మరొక వస్తువంటూలేదు. వీళ్లందరూ బేయ్ ఖామందుదగ్గిర కొలువు చేస్తున్నారే, ఐనా వీళ్లూ మనలాగే దరిద్రులుగానే వున్నారే అన్న విషయాన్ని గమనించి, నాకేమీ అర్థంకాక ఆశ్చర్యపోయాను.

అమ్మ, అక్క వాళ్లని చూసి వాళ్లని పలుకరించారు.

వాళ్లూ 'ఉభయకుశలో పరి' అంటూ, కూచున్నవాళ్లలా అర

చేతులను నేలమీద ఆనుకుని లేచి వాళ్లదగ్గర కూచోడానికి మాకు జాగా చేశారు.

పొయ్యిగూటివెనక అగ్రస్థానంలో జడవేలాడేసుకుని గోధుమవర్ణం బొచ్చుకోటు తొడుగుకుని వయస్సులోవున్న కుర్రాడు ఒకతను కూచున్నాడు. అతని పోషక్కునిపట్టి యీమధ్యనే లామా మతంలో చేరి యింకా ఉపదేశం పొందని స్నాతకుడు అని తెలిసిపోతూంది. అతని ముక్కుమీద కాయ ఒకటి వుంది. ఆ కాయని చూస్తే బిర్చిచెట్టుకున్న నల్లని గడ్డ జ్ఞాపకం వచ్చింది నాకు. గర్వంగా కూచున్నాడు అతడు. మేము గుడిసెలోకి వచ్చినప్పుడు మమ్మల్ని చూసి అందరూ పలుకరించడానికి లేచారుకాని, యితడొక్కడే లేవలేదు.

"పనుల సంగతి తెలుసుకుందాం అనీ వీలునుపట్టి కూలి విషయం కూడా అడుగుదామనీ వచ్చాం. హెలీన్ వెళ్లమంటే వచ్చాం" అంది అమ్మ మెల్లగా.

"పని గురించా?" అని ముక్కుమీద కాయవున్న మనిషి ఆవలించి అడుగుతూ కంటికొలికిలోనుంచి అమ్మని చూసి కఠినంగా పెద్ద గొంతుకతో చీదరించుకుంటూ:

"ఏయ్ బోడీ! తోళ్లని బాగుచెయ్యాలి నువ్వు. కూలిమాట నీకు తెలియదా యేమిటి? ఒక తోలు బాగుచేస్తే ఒక టీ కణికముక్క, జత ఇదికీ చెడావులకి అట్టలు కుడితే సోలెడు నిండా సోలెడు నూకలూ యిస్తాను. బొచ్చుకోటు కుడితే ఒక కట్టకి కట్టా దుంజా* నీ కష్టం వుంచుకోకుండా యిస్తానులే" అన్నాడు.

---

* చవకబారు పొగాకు.

మా అమ్మ ముఖంమీద యీ మాటలనేసి యేదో అక్కడకి అతికష్ట పడి పనిచేసినట్టు, రోజుకుంటూ పొగగొట్టంలో పొగాకు నింపుకుని దాన్ని పీల్చి పొగవదలడం మొదలెట్టాడు.

నాలుగుసార్లు పొగపీల్చి అల్బన్‌చీవైపు తియ్యనిచూపులని విసరుతూ:

"నీకు పని చెబుతానులే, చక్కగా బొద్దుగా వున్నావు. రేపు పొద్దున్నే నేను వంటచెరకు తీసుకురావడానికి వెళ్లుతాను. నాకు సాయంచేయడానికి నువ్వు నాతో రా. మనం యిద్దరం కలిసి అడవికెళ్లి పని చేద్దాం" అన్నాడు. అలా అంటూ తన మోచేత్తో తన పక్కని కూచున్న మనిషిని డొక్కలో పొడిచి ఆ యెర్రని కళ్లకొలికెల్లోనుంచి ఆ మనిషివంక కన్నుగీటుతూ: "వయసులో వుండి బొద్దుగా వున్న అందకత్తె తోడుగావుంటే పని అతి మజాగా జరిగిపోతుంది!" అని ఒక ముక్క పారేశాడు.

కాళ్లు చాపుకుని గోడకి జారబడి కూచున్నాడేమో అలాగ రాగం తీసి నట్టు మాట్లాడుతూంటే పావురం కూత పెట్టినట్టే వుంది.

ఉండివుండి ఒక్కసారి నావైపు తేరిపార చూసి:

"నీ మాటేమిట్రా? చచ్చు పెద్దమ్మా! నీ ముఖం, నీకేం పని చేతవుతుందికనక! సమయం దొరికితే మెల్లిగా యేదేనా తస్కరించడానికి చూస్తున్నావు కాబోలు? ఎందుకొచ్చావు యిక్కడికి? నోరు పెగల్దేమి?" అన్నాడు.

నేను అమ్మని అంటుకుపోయి, అమ్మ చింకిపాతల్లోకి దూరిపోయాను.

నా కర్మంకాలి నేనిక్కడ కెందుకొచ్చాను? అమ్మ మాట యెందుకు విన్నానుకాను? ఇక యిప్పుడేమి జరుగబోతుంది?

ఆరవ ప్రకరణం

మందలవాళ్లతో

తొస్తాయ్ నన్ను వెనకేసుకొచ్చాడు.

"చూశారా! మనవాడు యేకంగా బ్రహ్మరాక్షసినే హడలుగొట్టేస్తున్నాడు! చంటికుర్రాడిమీద విరుచుకు పడక నీతో సమానమైన ఉజ్జీతో తలపడు" అన్నాడు గుమాస్తావైపు తిరిగి.

దానిమీద గుమాస్తాకి కోపం వచ్చి:

"అబ్బోసి! ఇంతోటి సింహమున్నూ మనిషిని చూసి గర్జిస్తూం దండోయ్! నీకు పాఠం చెబుతానుండు కుక్కల కొడకా!" అని తొస్తాయ్‌మీద అరుస్తూ గుర్రాలనికట్టే మోకు ఒకటి దగ్గరగా వుంటే దాన్ని అందుకుని దాంతో, నన్ను వెనకేసుకొనివచ్చిన తొస్తాయ్‌ని వీపుమీద బాదబోయాడు. అది చూసి తక్కిన వాళ్లందరూ ఒక్క మాటుగా లేచి:

"తొస్తాయ్‌మీద చెయ్యి వేస్తివా నిన్ను చితకకొట్టేస్తాం!" అని కేక లేసుకుంటూ గుమాస్తామీద పడబోయారు.

దాంతో అతని ముఖంలో రక్తంపోయి మావైపూ వాళ్లవైపూ వెర్రి చూపులు చూస్తూ యుర్తలోనుంచి బైటకి జారుకున్నాడు.

చీకటి పడింది. పొయ్యిలో ముందుకంటె ఫెళఫెళమంటూ తీక్షణంగా మండుతూంది. కొంతమంది బత్రాక్‌లు నిప్పుచుట్టూ చేరి కాళ్లకి చుట్టుకునే గుడ్డలని ఆరబెట్టుకుంటున్నారు. కొందరు వాళ్ల ఇదికీ చెడావులని మరమత్తు చేసుకుంటున్నారు. మరికొందరు చెడా

వుకుట్ల సందుల్లో పాకురుతూ వున్న నల్లులనీ పేళ్లనీ యేరి గోళ్లతో చిటుకు చిటుకుమని నలిపేస్తున్నారు.

అమ్మ మమ్మలిని పిలిచి:

"పిల్లలూ! చీకట్లో అంతా అంధకారంగానే కనపడుతుంది. పొద్దుపొడిస్తే, ఆశకనబడుతుంది. ఇప్పుడు కాస్త నిద్దరోదాం రండి!" అంది. అక్కడున్న జీను సంచీమీద చేరబడి నా తలని తన మోకాళ్లపై పెట్టుకుని కూచుంది.

కాస్సేపు అలాగ చేరగిలబడి ఆ మందలవాళ్లని ఉద్దేశించి:

"మేము యీవేళ మంచుమీద చాలాదూరం నడచి వచ్చాం... కడుపులో కాస్త వెచ్చగా వుండడానికి యేమేనా వుందా నాయనా మీదగ్గిర?" అని అమ్మ అడిగింది.

తను చేస్తూన్న పనిని ఒక పక్కని పడేసి తొస్తాయ్:

"మేమీవేళ పిండివంటలేమీ చేసుకోలేదు. మీరూ మాలాంటి వాళ్లే గనుక మాదగ్గర వున్నది తినడానికి మీకేమీ అంత పట్టింపు వుండదను కుంటాను!" అన్నాడు.

ఆలా అంటూ యుూర్తద్వారం పక్కని వున్న అలమారా దగ్గరకి వెళ్లాడు. ఆ అలమారా సొరుగులోంచి యేమి బైటపడుతుందా అని నేను ఆత్రంతో చూస్తూన్నాను. చాలా సేపైంది. తొస్తాయ్ యింకా ఆ సొరుగులోనే అవీ యివీ కెలుకుతునే వున్నాడు. ఏలాగైతేనేమి చివరకి చిన్న కర్రచిప్పనీ ఒక చిన్న గోలేన్నీ దాన్లో సోలెడు నూకలతోవున్న గిన్నెనీ వుంచి మాముందు పెట్టాడు. దీన్ని మూడువంతులు చేస్తే ఒక్కొక్కరికి యెంతెంత వస్తుందో మనసులో అమ్మ లెక్కకట్టి, దాన్నంతా నాకిచ్చి: "ఈ బువ్వ నువ్వు తిను

రా బాబూ '' అని ఆ నూకలని గిన్నెలోకి వొంపి కర్రచిప్పకి అంటుకొని వుండి పోయిన మీగడతొరకలని గోకి గిన్నెలో పోసి దాన్ని సంగోరువరకూ పులిసినపాలతో నింపి దాన్నంతా చూపుడు వేలుతో కలిపి తినమని నాకిచ్చింది.

పొయ్యిలోనిప్ప సన్నగిలిపోవడంచేత అక్కడ మాతో కూడా యెవరున్నదీ ఆ గుడ్డివెలుగులో తెలియలేదు.

ఆ పుల్లటి జావ తాగి, యూర్తకున్న పొగగూడులోనుంచి పైకి ఆకాశంవైపు చూశాను. నక్షత్రాలు వొత్తుగా గుత్తులుగుత్తులుగా వున్నాయి. బూడిదవర్ణంగా వున్న ఆకాశంమీద ఆ నక్షత్రాలు మిణుకుమిణుకు మంటూ ఆ చోటనుంచి యీ చోటకి యీ చోటనుంచి ఆ చోటకీ ఒక దాన్ని ఒకటి వెంబడిస్తూ గంతులేస్తూ నావైపు చూసి నన్ను కన్ను గీటుతు న్నాయి.

యూర్తలో చలి జోరుగా వుంది. మందలకాపర్లు అందరూ గాఢమైన నిద్రలో వున్నారు. ఇద్దరు మాత్రం కళ్లు తెరచుకుని మెలకువగా వుండ డానికి నానాయాతనలూ పడుతున్నారు.

ఇంతట్లో, యూర్త తెరముందు దుబ్బుదుబ్బుమని అడుగుల చప్పుడు వినబడింది. మరో నిమిషానికల్లా పొద్దున్న మేంచూసిన ఆయన — లావాటి యెర్రటి మనిషి — లోపలికి చొరబడి యూర్త అంతా ప్రతిధ్వనించేటట్టు బొంయ్‌మని బొంగురు గొంతుకతో:

''పాపిష్ఠి కల్‌గూరీ* లంజకొడుకులు! ఎవ్వడ్రా మిమ్మల్నిక్కడ పడుకుని తొంగుండ మన్నాడు? చీకటి పడ్డాక మందలని వదిలిపెట్టి

---

* తిట్టుమాట.

రాకూడదని తెలియదూ? ఇంకా పడుకుని చూస్తున్నారేమిటి? లెండి!" అని ఒరిచాడు.

మారు మాటాడకుండా మందలవాళ్లందరూ లేచారు. తొందర తొందరగా ఇదికీ చెడావులని తొడుక్కొని జీనులని భుజానవేసుకొని కళ్లే లనీచబుకులనీ పట్టుకుని బైటకి పరుగెత్తారు.

నాకు మళ్లీ కునుకు పట్టింది. ఆ కునుకులోనే ఒక చెవితో మందల కాపర్లు ఒకరి నొకరు కేకవేసుకోవడం, తోడేళ్లు అరుస్తూంటే ఆ అరుపులకి జబాబుగా కుక్కలు మొరగడం వింటూ, అమ్మని కౌగలించుకుని నిద్దరోయాను. నిద్దరపోతూ నిద్దరపోతూ నేనేదో నల్లని భయానకమైన అగాధంలో అమాంతంగా పడిపోతూన్నట్టు అనిపించింది నాకు.

నాకు మెలకువ వచ్చేటప్పటికి బాగా తెల్లవారిపోయి యూర్తలోకి వెల్తురు వచ్చేస్తూంది. యూర్తలో మరెవ్వరూ లేరు. నేను ఒక్కడనే వంటరిగా వున్నాను.

"అమ్మ యెక్కడుంది? అక్కయేదీ? తొస్తాయి-ఓల్ అక్కడ లేడే! ఎక్కడికి వెళ్లిపోయాడు అతను?" అని నా మనస్సులో నేను గాభరా పడిపోతున్నాను.

ఇంటి యజమానురాలు తోజు-హెలీన్ భార్య అప్పుడు యూర్తాలోకి హడావుడిగా వచ్చింది.

ఏదో తటపటాయిస్తున్నట్టు ఒక గడియ సేపు కదలకుండా మెదలకుండా నిలబడి ఆతరవాత తనదగ్గిర నాకు బాగా చనవుకుదిరి పోడానికని ముద్దులు మూటకడుతూ:

"నువ్విక్కడా వున్నావు? ఇంకా నిద్దర పోతున్నావా, అబ్బాయీ?" అంటూ

ఎలకని పట్టుకోవడానికి మెల్లిగా వెళ్లే పిల్లిలాగ నాదగ్గిరకి నిశ్శబ్దంగా వచ్చింది.

నేను పడుకున్న చోటనుంచి నోరాడక తొందరగా అన్నాను:

"ఒక్క నిమిషంలో నేను లేచివస్తున్నాను... అప్పుడే లేస్తున్నానుగా".

నాకంటె త్వరగా నాదగ్గిర కొచ్చి నామీదవొంగి నా చెవి పట్టుకుని నన్ను ఈడ్చింది. కుక్కమీద వేడి నీళ్లుపడితే ఛంగుమని యెలాగు గంతు వేస్తుందో నేను అలాగు ఒక్క గంతువేశాను.

"తెల్లారకుండానే అందరూ పనుల్లోకి వెళ్లారు. మీ అమ్మ యుార్త పెరటిలో తోళ్లు నానబెడుతూంది. నీ అక్క దొన్‌దూక్‌తో కలిసి అడవిలో కర్రలు కొడుతూంది. నువ్వు మాత్రం సోమరిపోతులాగు పడుకుని బద్ధకం తీర్చుకుంటున్నావా కుర్రకుంకా? లేవవేం ఇంకా? వెళ్లి కట్టెపుల్లలు పట్టుకురా! నిప్పు రాజెయ్యి! ఇంకా చూస్తున్నావ్? లేచి పరుగెత్తు!" అని కొండకేకలు వేసుకుంటూ నామీద విరుచుకు పడింది.

యుార్త వెనకతట్టున మామూలుగా కట్టెపుల్లలు కొట్టే చోటకి వెళ్లి అక్కడ నేను పచ్చగా సువాసన వేస్తూన్న కట్టెలని పొయ్యిలో వేసేందుకు చిన్నచిన్న చిదుగులకింద చీరాను.

నిప్పు బాగా రాజుకుని మండుతూన్న తరువాత ఇంటి యజమానురాలు వెళ్లిపోగా, నేను పొయ్యిదగ్గరగా కోటు ముందుకు యెత్తి కూచున్నాను, సెగ బాగా వొంటికి తగలాలని.

స్తెప్‌మైదానంమీదకి వెళ్లి పనిచేస్తూన్న బత్రాక్ కూలీలందరూ ఒక్కొక్కరే మెల్లిమెల్లిగా యుార్తలోకి వచ్చిపోగైయారు. అందరికంటే ముందు తిరిగి వచ్చేసిన మందల వాళ్లందరూ విచారంగా వున్నారు. వరదలో

తెగిపోయిన చెట్లకొమ్మలు ఎలా వేలాడుతూ వుంటాయో అలాగు తలకాయలు వేలేసుకుంటూ వచ్చారు.

ప్రొద్దుపొడుస్తే ఆశ కనబడుతుంది అమ్మ అన్నప్పటికీ, యూర్తలో వున్నవాళ్లకి కాని మాకు కాని అదృష్టం యేమీ కలిసి రాలేదు. రాత్రి పూట తోడేళ్లు సంచారం చేసేటట్టు, పగటిపూట యీ జనం మధ్య దురాశా పరులైన యీ వూరి ఖామందులు అలా తిరిగేవారు. తోడేళ్లు రాత్రి అలాగు అరుస్తూన్నా కిందటి రాత్రి యూర్తలో ఎంతో సుఖంగా ఎంతో ప్రశాంతంగా వుంది న్యాయా మర్మం యెరగని ఆ మందలవాళ్ల మధ్యను! అమ్మ వాళ్లోనూ ఒక మూల పొయ్యిలో మంట ఆరిపోయి నిప్పులు కాలుతూ సన్నని కాంతిని వెదజల్లుతూంటే పొగ కిటికీలోనుంచి నక్షత్రాలు నవ్వుతూ ప్రకాశిస్తూంటేనూ — ఎంత హాయిగా వుంది!

మందలాళ్ల అందరిలోను చిన్నవాడైన ఒక కుర్రాడిని తౌస్తాయ్ ఓదార్చుతూ:

''ఆదికిముందుగానే దిగలుపడ్డం ఎందుకు? ఏరు కనపడకుండానే చెప్పులు విప్పేయడం ఎందుకు? ఏమో యీ పర్యాయానికి హెలీన్ యేమీ అనకుండా వూరుకుంటాడేమోలే'' అన్నాడు.

మా దురదృష్టం కొద్దీ కిందటి రాత్రి మందలోనుంచి నాలుగేళ్ల గుర్రాన్నొకదానిని తోడేళ్లు ఎత్తుకుపోయాయి.

ఈ తప్పిదాన్ని హెలీన్ క్షమించే అవకాశం ఏమీ కనిపించడం లేదు. ఈ జరిగిన సంగతినీ, మందలవాళ్లలో ఎవరి అజాగ్రత్తవల్ల ఇది సంభవించిందో వాళ్ల పేర్లనీ, గుమస్తా అప్పుడే హెలీన్‌కి తెలియపర్చేశాడు.

హెలీన్ నిశ్శబ్దంగా యూర్త లోపలికొచ్చి పొయ్యిదగ్గిర నిలబడి నిప్ప

సెగ తగిలేటట్టు మొదట యీ పాదం యెత్తి తరువాత ఆ పాదం యెత్తి కాస్సేపు చలికాచుకుని ఆతరువాత ఒక్కపెట్టున అరిచాడు:

"చచ్చు వెధవలు! దొంగ పీనుగులు! నా సొత్తు జాగ్రత్తగా చూడడం పోయి ఇంత నిర్లక్ష్యమా! నా డబ్బు తిని వాళ్ళు కొవ్వెక్కింది ఒక్కొక్కడికి!"

అలా కాస్సేపు మండి పడ్డాక కోపాన్ని కొంచెం అణచుకుని ఇక వాళ్ళని బెదరించడం మొదలుపెట్టాడు:

"నా గుర్రం పందెపుగుర్రం అంటే మామూలు పందెపు గుర్రమా? పందెపు గుర్రాలలో ఆట గుర్రం. నా మంద అంతటిలోకి ప్రశస్తమైనది. దాని ఖరీదు యావత్తూ అణా పైసలతో ఈ నిలబడ్డ పాళంగా నాకు ముజరా ఇస్తే సరేసరి. లేకపోయే మాటుంటే అందుకు ప్రత్యామ్నాయంగా మరో చలికాలమంతా మందలు పనిచేసి గుర్రాలని కాసి, గుర్రం ఖరీదు కింద నీ కూలి డబ్బుల్ని నాకు జమకట్టినా సరే!" అని వాళ్లను దాబాయించి అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

హెలిన్ ఈ మాటు ఎవ్వరినీ కొట్టకుండా అంగలార్చుకుంటూ వెళ్లిపోయాడు. వీళ్లవాటం చూసి ఆయనకి భయంవేసి వుంటుంది. ఎవ్వరూ మాట్లాడ లేదు. కొంతసేపు అయాక ముసలి కాపరి ఒకతను విచారంతో:

"ఏ పొదచాటునుంచి తోడేలొచ్చి జొరబడుతుందో, అంతులేని యీ స్తెప్ మైదానంలో యేమూలనుంచి తోడేలు అగుపిస్తుందో, యేచోట అది గుర్రాన్ని చంపేస్తుందో ఎవడు చెప్పగలడు? ఎంత నికృష్టమైన జీవితం మనది? ఈ నిలికళ్ల దయ్యాల* మూలాన్ని, ఖామందుకి నేను ఇంకా ఐదు

---

* తువా దేశంలో తోడేళ్లని 'నల్లకళ్లు' అంటారు.

చలికాలాల పాటు జీతంనాతం లేకుండా వెట్టిచాకిరీ చెయ్యాల్సి వుంది. ఇక ఈ చాకిరీ చెయ్యడం మన శక్యం కాదు. ఏమి? నేనన్న మాట నిజం అంటారా కాదంటారా? చెప్పండి!'' అన్నాడు.

వీళ్లందరికంటే కూడా అమ్మకి అల్బన్‌చీకీ ఆ రోజు మరింతగా హెచ్చు కష్టం కలిగింది. తోజు-హెలీన్ కింద పనిచేస్తూన్న వాళ్లందరిలోనూ వీళ్లిద్దరే కొత్తగా వచ్చినవాళ్లు. నా కళ్లముందే వీళ్లిద్దరిలో ప్రతి ఒక్కరినీ అతడు హింస పెట్టడం నేనొక సారి చూడడం తటస్థించింది. నా కళ్లముందు పడకుండా ఇంకెన్ని సార్లు వీళ్లు శిక్షలు అనుభవించారో పాపం! నేను ఏం చేస్తున్నానో ఎలా వున్నానో చూద్దాం అని పని చేస్తూ పని మధ్యలో నన్ను అమ్మ చూడ్డానికి వచ్చిందనీ, ఖామందు తొడుక్కునే ఇదికీ చెడావులను వాటి మోకాళ్ల చుట్టూవున్న జరీకుచ్చులకి లేసుఅల్లడం పూర్తిచెయ్యకుండానే అమ్మ ఆ జోళ్లని బైట ఆరబెట్టిందనీ అమ్మని నానా హింసపెట్టింది. ఆ జిత్తులమారి గుమాస్తా తన స్లెయ్ మీద తేలికైన ఎండు పుల్లలిని ఎక్కిం చుకుని, బలవంతంగా అక్కచేత అక్కబండీమీద తడిపుల్లలిని ఎక్కించి ఇంట్లో పడేయించాడు. తడిపుల్లలు పట్టుకొచ్చి పడేసిందన్న నేరానికి అక్కని హెలీన్ అన్యాయంగా నానాబాధలూ పెట్టాడు.

అల్బన్‌చీ తైగానుంచి ఆ క్షణమే వచ్చింది. ఎంతో కాలం నన్ను వదలి పెట్టిన తరువాత, మళ్లీ నన్ను చూడడంచేత తన సంతోషాన్ని పట్టలేక నన్ను తనదగ్గిరకి లాగుకుని నా తలని తన వక్షస్థలానికి హత్తుకుని నన్ను యెంతో ప్రేమతో ముద్దులాడింది. ఆ సంతోషంలో తోజు-హెలీన్ రావడం మేము చూడలేదు. అయన అక్కడకు వచ్చి, పొడుగాటి తన కోటుచేతిలో తన చేతిని లోపలికి లాగేసుకుని వుత్తకోటుచేత్తో ఫెళ్లుమని అక్క చేతులమీద

విసిరికొట్టాడు. అక్క చేతులు నా తలని కౌగలించుకుని వున్నాయి. అలా నాలుగు కొట్టి, అక్కని ఆమె గుండెలమీద వున్న కోటు మడతను పట్టుకుని ఆమె ముఖంమీద ముఖంపెట్టి కోపంతో రొజుకుంటూ:

"నాకేం కళ్లు లేవనుకున్నావా? మంచి పేళ్లేవో మొద్దులేవో నాకేం తెలియదనుకున్నావు కాబోలు! బండీమీద మొయ్యరాని బరువు యెక్కించేసి బంగారులాంటి యెద్దును నాశనం చేశావు రాక్షసిలాగ కళ్లా నువ్వూను! ఆ యెద్దు ఖరీదు నీదగ్గిరనుంచి రాబట్టకపోతే నా పేరు కాదనుకో!" అని నానా కేకలూ వేశాడు.

నేను ఎంత గట్టిగా యేడవగలనో అంతగట్టిగా యేడవడం మొదలెట్టాను — నా యేడుపు చూసి హెలీన్ భయపడతాడనీ, నాయేడుపు విని అమ్మా తౌస్తాయీ మా సాయానికి వస్తారనీ ఆశపడి.

హెలీన్ మమ్మలిని అలా తన కోటుచేతితో కొట్టడానికి వచ్చినప్పుడు, ఆ కోటుచేతివైపే చూశాను కాని ఆ చలిగాలిని కత్తిలా కోసుకొస్తూన్న కోటుకివున్న లేసుకుచ్చులని నేనెక్కడ గుర్తించుకున్నాను? ఆ లేసుకుచ్చులు ముఖంమీదని రివ్వురివ్వుమని పడితే, ముఖం అంతా వాతలు పడిపోవలసిందే. ఆ లేసుకుచ్చుల మహిమ నాకూ అక్కకీ అప్పుడు అనుభవ పూర్వకంగా తెలుసుకొచ్చింది.

మళ్లీ అందరూ యుర్తలోకి చేరుకున్న తరువాత తౌస్తాయ్ అమ్మతో:

"నీవు ఇక్కడనుంచి వెళ్లిపోవడమే మంచిదనిపిస్తూంది నాకు. నీకు నీ సొంతయిల్లుంది. నీకు పిల్లలున్నారు. మాసంగతా? మా ఖర్మం వేరు. ఇక్కడనుంచి పోదాం అనుకోడానికి మాకేం ఇల్లావాకిలా? ఎవడికిందో ఒకడి కింద చాకిరీ చేసుకొని బతకాల్సిందే. కాలం యెప్పుడూ ఇలా వంకరగానే

వుంటుందా, యెప్పటికైనా రోజులు కలిసిరావా అని మాత్రం ఆశపడుతూంటాం'' అన్నాడు.

ఆ కాలుస్తూన్న పొగగొట్టాన్ని పూర్తిగా కాల్చేసి, గొట్టాన్ని తన ఇదికీ చెడావుల అంచు చివరకి టక్కు టక్కుని కొట్టి నుసిని రాలగొట్టేసి, యూర్తలోనుంచి బైటకి వెళ్లిపోయింది మా అమ్మ మరేమీ మాట్లాడకుండా.

ముసలి మందలకాపరి నా తల నిమురుతూ యూర్తలో వున్న వాళ్లందరితోనూ:

''అదృష్టదేవత మంచివాళ్లదగ్గిర ఉండడానికి ఒల్లకుండా చెడ్డ వాళ్లదగ్గిరికే పోయి వాళ్లకే అన్ని వరాలూ ఇస్తుందే! ఇదేం చిత్రం అంటా?'' అన్నాడు.

ఆ మాట అందుకుని పొయ్యిసెగదగ్గిర కూచుని కుడిచేత్తో పనిచెయ్యడానికి సుళువుగా వుండేటట్టు ఎడమపైటలాగున చొక్కావేసుకుని* పని చేస్తున్న ఒక పెద్దకాలపు ఆవిడె:

''ఎవడి అదృష్టం వాడిది రా! స్యుదుర్** గ్రంథంలో తనకేం అదృష్టం రాసి వుందో తోజు-హెలీన్ రోజూ చూసుకుంటూ వుంటాడు'' అంది.

తననోట్లోవున్న పొగగొట్టాన్ని చేతితో తీసి చెయ్యి గుండ్రడగా తిప్పి హెలీన్ కాపురంవున్న యూర్త వైపు చూపిస్తూ, తొస్తాయ్:

---

*తువా ప్రాంతపు స్త్రీలు పనులు చేసేటప్పుడు కుడిచేతిపైన చొక్కా చేతిని బుజంవరకూ ఎగువకు ముడిచేస్తారు.

**పవిత్ర గ్రంథం.

"నువ్వు చెప్పేదాల్లో సత్యంలేదమ్మా. మున్మాటికి సత్యం లేదు. అదృష్టదేవత ఎప్పుడూ అట్టాంటి యూర్తలోనే తాండవిస్తూ వుంటుంది. అదేమి పిచ్చిది కాదు, నల్లని మన మసిబొగ్గు యూర్తల చుట్టూ కాళ్లీడ్చుకుని తారట్లాడ్డానికి. మనకెప్పుడూ దాపురించేది దురదృష్టపు దేవతే!" అన్నాడు.

కొత్తగా అప్పుడే కురిసిన మంచులో మేం ఇంటివైపు దారికోసం ఆన వాళ్లని వెతుక్కుంటూ నడుస్తూండగా నిన్నటిరోజున ఒక్కొక్కరూ యేమేమి కష్టాలని అనుభవించారో అమ్మా అల్బిన్‌చీ ఒకరితో ఒకరు చెప్పకోవడం మొదలెట్టారు. నా కథంతా నేను అంతకముందే చెప్పేసి నేనొక క్రిరపుల్ల పుచ్చుకుని క్రిరపుల్లతో తళుకుతళుకుమని మెరుస్తూన్న మంచులో గీతగీసుకుంటూ నేను ముందు పరుగెత్తివెళ్లుతున్నాను. కంగీయ్‌నీ పెజెన్‌దేయ్‌నీ తల్చుకొని నేనులేకుండా వాళ్లిద్దరే యేదో ఆడుకుంటున్నారు కాబోలు, లేక సరిగ్గా యీ క్షణంలోనే స్యుర్యున్కాని స్లెయ్ మీద యెక్కించుకుని కొండమీదనుంచి హాయిగా జారుతున్నారో, లేక స్యుర్యున్కాని పడుకోబెట్టేసి స్లెయ్ మీద చెర్లిక్‌పేన్నుని కట్టి స్లెయ్ మీద కూర్చుని అడవి నుంచి కట్టెలని యీడ్చుకొచ్చినప్పుడు చెర్లిక్‌పేన్ యెంత ఠీవిగా లాగుకొచ్చేదో అంత ఠీవిగానూ ఇప్పుడు చెర్లిక్‌పేన్‌చేత హాయిగా మేర్గెన్ యేటిమీద లాగించుకుంటున్నారు కాబోల్సు, అని అనుకుంటూ వాళ్లమీద కొంత ఈర్ష్యపడ్డాను. చెర్లిక్‌పేన్ మంచి గమ్మత్తు చేసేది. హుందాతనంతో ఠీవిగా పరుగెడుతూన్న దాన్ని తన పేరుపెట్టి పిలిచి ఇంకా త్వరగా పరుగెత్తుమని ఆజ్ఞాపించేటప్పటికల్లా, ఒక్క మొరుగుమొరిగి చట్టుక్కున లాగేది. దాని బలం అంతా ఉపయోగించి లాగేసరికల్లా బండి పక్కతాళ్లు టుప్పని తెగిపోయే

సరికి బండి బోల్తాకొట్టి, బండిలో కూచున్నవాళ్లం ఆ చల్లటి మంచులో చతికిల బడేవారం. ఇంతట్లోకి చెర్లిక్‌పేన్ పరుగెత్తి పారిపోయి మంచు గుట్టల మధ్యనుంచి మాయం అయిపోతూ మరుక్షణంలో గుట్టమీద అగుపిస్తూ, అలాగు పారిపోయేది. అది మమ్మలిని పసికట్టలేకుండా వుండేటట్టు, మళ్లీ మేం యేమంచు కుప్పవెనకాలో దాగుని దానివెంట యీడ్చుకుపోతూన్న కళ్లేన్ని మేము చేజిక్కించుకుని పట్టుకుంటే అప్పుడు సంబాళించుకుని మళ్లీ మాకు లొంగిపోయేది.

ఏడవ ప్రకరణం

మళ్లీ చలికాలం

నేను బతికి వున్నంతకాలం మేం ఆ రోజుల్లో గడిపిన ఒక శరత్తును మర్చిపోలేను. ఆ గుడ్డురోజుల్లాంటి రోజులు యీ ప్రాంతాల్లో యెప్పుడూ కనివిని యెరగరట. మశూచికం వ్యాధి వ్యాపించి కా-ఖెమ్ దాని ఉపనదుల గట్లమ్మట గుడిసెలు కట్టుకుని వున్న బిడారీ వాళ్ల పేటలని తుడిచి పెట్టేసుకు పోయింది. మంచిపదునుగా వున్న కొడవలి గడ్డిని ఎలాగు కోసి పారేస్తుందో అలాగు, పిన్న పెద్ద అందరినీ పొట్ట బెట్టుకుంది. పల్లెల్లోనూ పరగణాల్లోనూ పేద వాళ్లందరూ చచ్చిపోయారు.

దుప్పిమందలను కాసే తోజాప్రజల్లో మశూచి మరీ ఘోరంగా వ్యాపించిందని అమ్మ చెప్పింది. మాలాగే వాళ్లుకుడా బిర్చి పెచ్చులతోనూ దేవదారు

పెచ్చులతోనూ చూమ్‌లు కట్టుకుని వుండేవారుట. కోలా సుమోన్* లోనూ అందులో మరీ విస్తారంగా హొయూక్ అర్బాను** లోనూ యీ దుప్పిమందల కాపరులు, మందలని పెట్టుకుని నివసించేవారుట. ఇప్పుడు అక్కడ సగంసగం నాని పోతూ కుళ్ళిపోతూన్న గుంజలూ నిట్రాళ్ళూ తప్ప మరేమీ కనిపించవు. మందలాళ్ళందరూ చచ్చిపోయారు. దుప్పలన్నీ తైగాలోకి పారిపోయాయి. మేర్గెన్‌లోయలో కూడా మశూచి పొడచూపింది. మశూచి వచ్చిన పాలికాపులను మీ ఖర్మం మీరు చావండ్రా అని, వాళ్ళని ఖామందులు అక్కడే వదలి పెట్టేసి, జబ్బునుండి తేరుకున్న వాళ్ళని తీసుకుని కొత్త ప్రాంతాలకి వలస పోయారు. మేర్గెన్‌వొడ్డునవున్న పేటలన్నీ నిర్మానుష్యం అయిపోయాయి. ఆ చుట్టు పక్కలంతటికీ, శిథిలమైపోతూ శిథిలమైపోతూన్న మా చూమ్ ఒక్కటే నిలబడుంది. దగ్గరలో మేకలు మూడు మేస్తున్నాయి.

మా చెర్లిక్‌పేన్ మొరిగిందంటే ఆ ధ్వని గుట్టలూ అడవిపొదలూ దాటి ప్రతిధ్వనించేదన్నమాట.

మా అమ్మ యేదో ఆలోచిస్తూ తనపని చేసుకుంటూంది. కాస్సేప యాక మమ్మలినందరినీ చేరదీసి, నాతో:

"మనం సరాంకని*** యేరి పోగుచేసుకునే సంచీని నువ్వు పట్టుకో. ఆ కర్రగోలేమును మీరిద్దరూ మొయ్యండి" అంది.

అమ్మ గొంతుక విని మామీద కఠినంగా వున్నట్టూ మమ్మలిని చీవాట్లు

---

* జిల్లా.

** పది యూర్తగుడిసెలు.

*** గడ్డిచెట్టు; ఈ చెట్టువేళ్ళని ఆహారంగా ఉపయోగించుకుంటారు.

పెడుతూన్నట్టూ మాకు అనిపించింది. గబగబ నడిచి బైటకి వెళ్లి పోయింది. మామీద అప్పుడప్పుడు కోపంపడినా, ఆమె పంచప్రాణాలు మా మీదే వున్నాయని మాకు తెలుసు.

అమ్మ యెక్కడికి కెడుతూందో యెందు కెడుతూందో మాకేమాత్రమూ తెలియకపోయినా, అమ్మవెంట మేమూ వెళ్లాం. అమ్మ త్వరత్వరగా నడుస్తూ వెనక్కి తిరిగి చూసి:

"నేను త్వరగా రమ్మన మంటూంటే మళ్లా వెనకపడి పోతున్నారే మిటి? రండి త్వరగా" అని అమ్మ సణిగింది.

ఇన్నాళ్లూ అమ్మ మాకు బువ్వ తీసుకురావాలని వూరూ వాడా తిరిగినా మేంమాత్రం చిక్కిశల్యాలైపోయి మా చూమ్ గుమ్మంలోనే రోజుల తర బడి కూచోబడిపోయే వుండడంచేత, నడక అలవాటు తప్పిపోయి మేం మోస్తూన్న సంచీ గోలెమూ ఖాళీవే అయినా, వాటిని మొయ్యలేక నడవలేక తొట్రుకుంటూ వెనక బడిపోయాం. నడవడం అంటే అమ్మకోలెక్కా, ఎన్ని మైళ్లు నడిచిందో, ఎన్ని ఆమడలు తిరిగిందో! మా అమ్మలాగు అంతజోరుగా నడిచేవాళ్లు మరెవ్వరూ లేరనుకుంటాను నేను.

పొలాలకాడకి వచ్చాం. పొలాల్లో దుబ్బులు మాత్రం వున్నాయి. నిన్నో మొన్నో కోతలు కోసి కట్టలు పట్టుకు పోయినట్టుంది.

అమ్మ మమ్మలిని పిలిచి: "నేలమీద పడున్న కంకులని చూశారా? ఆ కంకులని యేరండి" అంది.

ఆ మాటలంటూనే నేలమీదకి వొంగి కంకులను యేరడం మొదలు పెట్టింది. బిర్చిబెరడుతో చేసిన మా గోలెంలో ఆ కంకులని మేము పడే స్తూంటే అడుగునవున్న చెరడు మీాద పుష్టిగావున్న, ఆ గింజలు పడు

తూంటే తుపాను వర్షంలో మా చూమ్ కప్పుమీద వడగళ్ళు పడితే ఎలా చప్పుడ వుతుందో ఆ చప్పుడే జ్ఞాపకం వచ్చింది నాకు.

కంకులను మొదట మా వొడిలో యేరుకుని ఒడి నిండిపోగానే సంచీలోకి గోలెంలోకి వొంపేసేవాళ్లం. ఏరుతూయేరుతూ కొన్ని వడ్లగింజలని అరచేతులతో నలుపుకుని తినేవాళ్లం. ఎంతో రుచిగా వుండి కడుపు నిండి పోయేది.

కొండగుట్టల మీదనుంచి అడవికొంగలు పొలంలో వున్న దుబ్బుల దగ్గిరకి చేరేయి. వాట్లని కొట్టి తరిమివేయడానికి మా చేతుల్లో యేమీ లేవని అవి గ్రహించి దుబ్బుల మధ్యకేవచ్చి వొళ్ళు తిప్పుకుంటూ నడుస్తూ వచ్చేసి, అటూ ఇటూ పడివున్న కంకులనీ వడ్లగింజలనీ వాట్ల ముక్కులతో యేరుకుని తినేవి. సూర్యుడు ఆకాశంమీదనుండి దిగిపోయాడు. దాంతో అడవి కొంగలు ఎగిరి వెళ్లిపోయాయి. మేము మాత్రం పంట కోసేసిన ఆ పొలంలో కిందపడున్న కంకులనీ వడ్లపరిగల్ని యేరుకుంటూ వుండి పోయాం.

ఇంటికెళ్లాక తీరా కంకులని నూర్చుకొని గింజలను చెరిగినాక చూసుకుంటే మేము అనుకున్నన్ని గింజలు మిగలేలేదు. అమ్మ వడ్లని చెరుగతూంటే మేం చిదుగులని యేరుకొచ్చి పొయ్యి రాజబెట్టి ఇనపమూకిట్ని నిప్పుల మీధ పెట్టాం.

నిప్పులమీద వున్న ఇనుపమూకిట్లో అక్క వడ్లగింజలని కొన్నింటిని పోసి కంగియ్‌తో:

"గింజలను వేయించు. మాడ బెట్టగలవు జాగ్రత్త సుమా" అని చెప్పింది.

కంగీయ్ ఒక కట్టెపుల్ల చివర చిన్న బనాతు ముక్కను కట్టిన కొయ్య గరిటెతో వడ్లగింజలని వేయిస్తూంది. గింజలు వేగుతూ టప్పటప్పని పేలుతూ తుపుకుతుపుకుమని గెంతుతూండేవి.

మా అంతటమేమే ఇంట్లోనే తయారుచేసుకున్న పట్టుకారుతో ఇనుపమూకిట్నీ మరొక్క నిమిషానికల్లా పొయ్యిమీదనుంచి కంగీయ్ దింపేసి గింజలని గోలెంలోకి వొంపేసింది. గింజలమీదనుంచి పొగర్లు వస్తూన్నప్పటికీ అలాగ్గానే ఆ వేడి గింజలినే దోసిళ్లతో తీసుకుని వాటిపైన ఊదుకుంటూ ఆ చేతిలోనుంచి ఈ చేతిలోకి ఈ చేతిలోనుంచి ఆ చేతిలోకి పోసుకుని చల్లార్చు కుంటూ నోటినిండా బొక్కాశాం.

అమ్మ యేమిటో విచారంగా ఆలోచిస్తూ నావైపు ఎంతో జాలిగా చూసింది.

"ఇలారా నాయనా!" అని తనదగ్గిరకి పిలిచింది.

నేను దగ్గిరకి వెళ్లగానే నన్ను చేరదీసి రెండు చేతులతోనూ నా తలని కౌగలించుకొని నన్ను తన గుండెలకి హత్తుకుని నా తలని నిమురుతూ నన్ను ముద్దుపెట్టుకుంది. మళ్లీ యేదో తలపోస్తూ చూసి, తరువాత కన్నాలతో వున్న గుడిసె గోడలకేసి చూసింది.

"తైగాలో చలివణికిం చేస్తుంది. గొప్పవాళ్ల చూపులను చూసినా చలివొణుకొస్తుంది. కాని యేం చెయ్యను? వాళ్లదగ్గిరకే వెళ్లి వాళ్ల మందల్ని కాస్తూ ఆ తోళ్లని నాన బెడుతూ వాళ్లకి ఊడిగం చేస్తాను మరి. నేనెలాగో ఒకలాగు కాలక్షేపం చేస్తాను. కాని మీ మాటేమిటి? ఈ మాటు చలికాలంలో మీరు పస్తుండకుండా మీకు ఇంత బువ్వపెట్టి మిమల్ని దరిజేర్చగలనో లేదో అని దిగులు వుతోంది!" అని అమ్మ యేడుస్తూ

దుఃఖంతో వణకి పోతూంది. అమ్మని చూసి మాకు యేడుపొచ్చింది. ఎంత ఆపుకుందామన్నా పెల్లుబుకుతూ వస్తూన్న ఆ దుఃఖంతో మాకు ఊపిరి సలిపింది కాదు.

దూరాన దారంట పోయే తుజుమేత్లు* మా యేడుపులని విని హేళనగా: "ఆఁ ఆడతోడేలు దాని పిల్లలు ఆకలితో మాడుతూ మొర్రోకుంయో మనిమొరుగుతున్నాయి యెక్కడోనూ!" అని అంటే అనివుండొచ్చు.

అప్పటికి చీకటి పడిపోయింది. మాదగ్గిర వున్న చింకిపాతలన్నీ తెచ్చి కప్పేసుకుని మూడంకె వేసుకుని పడుకున్నాం.

నాకు కాస్సేపటికే మెలకువచ్చేసింది. చూమ్ గోడల బీటల్లోంచీ పొగగూడులోంచీ మంచు లోపలికి కొట్టుకొచ్చి కుప్పలకింద మేటేసింది. ఆ తుపానులో గాలి విసురుతూ మా గుడిసె గోడలని యెలా కొట్టేస్తూంటంటే యే నిమిషంలో గుడిసె కూలి నేలమట్టమై పోతుందో అనిపించింది నాకు. గుడిసె కప్పమీద కప్పివున్న బెరడు పెచ్చులు ఎన్నో గాలికి చిరిగిపోయి యెగిరిపోయాయి. గుంజలుకొన్ని గాలికి లేచిపోయి చిందరవందరగా తిరగబడి పోయాయి.

చలి అంతకంతకి మరింత ఉధృతం అయిపోతూంది. ఆ చింకి గుడ్డల్నీ మరింత గట్టిగా వొంటికి చుట్టేసుకుని ముసుకు పెట్టేసుకున్నాను.

నిద్దరపట్టింది నాకు. ఆ నిద్దరలో కలగన్నాను. మంచిమంచి వస్తువులని — మాంసం, జున్ను, పరిగెలు — తిన్నాను కలలో. పొద్దున్న లేచేటప్పటికల్లా ఎండ బాగా కాస్తూంది. నేను లేచి అన్నతో నా కలగురించి చెప్పాను. పెజెన్‌దేయ్ కళ్లు చేరెడేసి చేసుకుని నావైపు చూస్తూ:

* ఉద్యోగస్థులు.

"ఒరే తమ్ముడూ, నాక్కూడా ఆ కలొచ్చి వుంటే యెంత బాగుండును రా!" అన్నాడు.

నేను అటూ ఇటూ చూశాను. అమ్మ అక్క కనిపించలేదు. వాళ్లేరీ? ఏమై పోయారు?

బైటకి పరుగెత్తుకెళ్లాను. నాలుగు చోట్లకీ పరుగెత్తాను. మేర్గెను గట్టుమీదకి కూడా పరుగెత్తుకునివెళ్లి చూశాను. ఎక్కడా వాళ్లజాడేనా కనపడలేదు.

బైటకి వెళ్లి అమ్మకోసం అటూ ఇటూ పరిగెత్తి చూడ్డం ఇంట్లోకొచ్చి ఇన్ని మంచి నీళ్లని కాచుకుని తాగడం. అలాగ అమ్మ వచ్చేవరకూ నీళ్లు తాగుతునే వున్నాను. మనిషి అన్న వాడు ఆ మాత్రపు కాలంలో ఎన్ని నీళ్లు తాగగలడో నాకు తెలీదు కాని నేను ఆవేళ తాగినన్ని నీళ్లపట్టి చూస్తే మాత్రం అమ్మ నేను బతికున్నంత కాలమే కాకుండా మరోజన్మయెత్తినతరువాత కూడా రాదా అనిపించింది నాకు. అమ్మ మళ్లీ వచ్చేవరకూ అంతసేపయిందన్న మాట.

వచ్చినతరువాత, అమ్మ:

"అల్బన్‌చీ నేనూ యీ మేర్గెన్‌లోయలో వున్న యూర్తలన్నింటికీ వెళ్లాం యెక్కడేనా పని దొరుకుతుందేమోనని. అసలు లోపలికి మమ్మల్ని రానిస్తేకదా — యూర్త తెరెత్తి గుమ్మలంలో కాలుపెట్టి వొంగి దణ్ణం పెట్టే లోపుగానే మమ్మల్ని మెడపట్టుకుని గెంటేస్తూంటే!" అంది.

ఆవేళ ఇక చీకటి పడబోతూండగా యూర్తలో వున్న అల్బన్‌చీని అమ్మ బైటకి పిలిచి:

"మనం సరీగ్-సెప్ వెళ్లాలి" అంది.

నేను వెంటనే వాళ్లవెంటపడ్డాను. పరుగెత్తుకుని వెళ్లి అమ్మ కోటు అంచుని పట్టుకుని మరి వదల్లేదు.

"ఎక్కడికి మళ్లీ వెళ్లిపోతున్నావే? ఏమైనాసరే, ఈ సారి నిన్ను మరి వెళ్లనియ్యను" అన్నాను.

అమ్మ నన్నెత్తుకుని ముద్దుపెట్టుకుంది.

"నన్ను వెళ్లనీ నాయనా! మేం సరీగ్-సెప్ వెళ్తున్నాం. అక్కడ రష్యన్లున్నారు. వాళ్లదగ్గిరకెళ్లి వాళ్లకి వంటచెరుకు నరుకుతాం వాళ్ల ఇళ్ళూవాకిళ్లూ ఊడ్చుతాం కాదు పోదూ అంటే, వాళ్లని బిచ్చం అడుక్కుంటాం. ఎలాగో ఒకలాగ మనకి సరిపడినంత తినడానికి తీసుకొస్తాం" అని అమ్మ నాతో అంది.

అప్పటికప్పుడే సూర్యుడు అస్తమించేస్తున్నాడు. అంత పొద్దుపోయి ఇదివరకెన్నడూ అమ్మ ప్రయాణం కట్టలేదు. అమ్మ అక్క వెళ్లిపోయాక చాలాసేపు కుంపటిలో నిప్పులు రాజేస్తూ పొయ్యిసెగ దగ్గిర కూచున్నాం.

పొద్దున్న లేచి చూసేసరికి రాత్రి బాగా మంచు కురిసి వుంది. అవి నవంబరు మాసం చివర రోజులు. తైగామీదనుంచి అప్పుడే లేచిన బాల సూర్యుడికిరణాల్లో కొత్తగా పడిన మంచు ధగధగ మెరిసి పోతూంది. గాలి యేమాత్రమూ లేకపోవడంవల్లనూ ఎండ కాస్తూండడంవల్లనూ చలి యేమంతగా లేనట్టే అనిపించింది. అమ్మ వెళ్లిన దోవనే నేను పరుగెత్తాను. కాస్తదూరం పరుగెత్తేనో లేదో నా పొరపాటు నాకు తెలుసుకొచ్చింది. మంచి చలిలో పాదాలెలా కొరడుబారిపొతాయో ఇప్పుడు కూడా అలాగే కాళ్లు కొరడుబారిపోసాగేయి.

మడవలు ఊడొచ్చి బాగా అరిగిపోయిన చింకి జోళ్ల జత ఒకటి అక్కలూ

అన్నలూ తొడుక్కొని పారేసినతరువాత వారసత్వపు హక్కువల్ల నాకు దఖలు పడింది. స్త్రెప్‌మైదానాల్లోకి నేనెప్పుడు వెళ్ళినా, చిరిగిపోయిన జోళ్ళపై అట్టలనుంచి, తెగిపోయిన అడుగు అట్టలు పూర్తిగా విడిపోకుండా వుండేందుకని అడుగు అట్టలకింద కొయ్యచెక్కలు ఉంచి కాళ్లకి జోళ్ళు తొడుక్కుని అప్పుడు మూడింటినీ కలిపితాళ్లతో కాళ్లకి బిగించి కట్టుకుని నడిచేవాణ్ణి. ఈ చెక్కల కొనలు మీదకి వొంగివుండడంవల్ల, జోళ్లతో సహా స్కేట్ లాగు ఉపయోగపడేవి. అయితే చింకి జోడుకి కొయ్యిచెక్క కట్టితే మాత్రం వెట్టెక్కడ నించొస్తుంది? చప్పన పాదాలు కొరడుబారి పోయేవి. ప్రతీ చలికాలంలోనూ నా మడవలు చలికి వొరిసిపోయి రెండు మూడుసార్లు చర్మం పేలిపోయేది.

ఇంటికి వచ్చేసి నిప్పుసెగని పాదాలు కాచుకుంటున్నాను. ఇంతట్లో చెర్లిక్ పేన్ బొంగురు గొంతుకతో మొరగడం నాకు వినిపించింది. ఎక్కడో దూరాన్ని మొరుగుతూండడంచేత ఆ అరుపులో సంతోషమే వుందో బహూపరాక్ అనే సూచనే వుందో తెలుసుకో లేకపోయాను.

ఆ నిమిషంలోనే కంగీయ్‌న్నీ పెజెన్‌దేయ్‌నీ గుమ్మంలో కొచ్చి:

"తొకా! తొకా! ఒరేయి! అమ్మ వొచ్చిందిరా! రా రా! త్వరగా రా రా!" అని కేకేశారు.

నా మైమకీ* బూడ్సులని గబగబ తొడుక్కుని పెజెన్‌దేయ్‌న్నీ కంగీయ్‌న్నీ నాకంటె ముందుగా అమ్మని కలుసుకుని అమ్మ యేమిటి తెచ్చిందీ యెక్కడ చూసేసిపోతారో అని నేను పరుగెత్తేను. కాని నా జోళ్లకి కట్టిన చెక్కలు

---

* వేళ్లదగ్గిరపైకి వొంగిన బూడ్సుజోళ్ళు.

బాగా పెద్దవై పోవడంచేత, సవారీ చేసినప్పుడు జీనుకింద కంబళీ కాళ్లకి యెలా తగులు కుంటుందో అలాగు, ఆ చెక్కలు నా కాళ్లకి తగులుకునేవి.

అక్కడ గుట్ట ఒకటి వుంటే ఆ గుట్టమీదకి ఎగబాకేను. ఒక పాదపక్క నుంచే చెర్లిక్‌పేన్ పరుగెత్తూండడం చూశాను. మంచుతో మలామా చేసిన చెట్లవెనకనుంచి అమ్మ అక్క కనిపించారు. వాళ్లు వుత్త చేతులతో రాకుండా యేదో తీసుకొస్తూన్నట్టు కూడా కనిపించింది.

పెజెన్‌దేయ్ కంగీయ్ కూడా వాళ్లతో వస్తున్నారు. అమ్మ ముఖంనుంచి చెమట కారిపోతూంది.

"ఏమిటి తీసుకొస్తున్నావే? ఎక్కడనుంచి తెస్తున్నావే అమ్మా?" అని నేను కేకవేశాను.

అమ్మ నా కేక విని చెయ్యివూపింది.

"అరుస్తావెందుకు నాయనా అలాగు? బువ్వ తీసుకొస్తున్నాను" అంది అమ్మ.

పెజెన్‌దేయ్ సంతోషం పట్టలేక ఆ సంతోషంలో తొట్రుకుంటూ పడిపోతూ అమ్మను చుట్టవేస్తూ నాకంటే బిగ్గరగా:

"ఇంతటి సామాను ఎక్కడనుంచి వొచ్చిందమ్మా?" అని అరిచేడు.

చికాకు పడుతున్నా యెంతో ఆప్యాయంతో:

"ఎక్కడనుంచి ఐతే ఏమి? మీ కోసమే తెచ్చాను. రొట్టెలు చేసి పెడతాను. మీరు తిందురుగాని" అమ్మ అంది.

అమ్మ ఇంటి ముఖంగా వెళ్లుతూంది. మేం అమ్మవెంటే నడుస్తున్నాం. ఇల్లు చేరుకోగానే మంచులో బైటనే అమ్మ చతికిలబడిపోయి ఇంటిగోడకి జారగిలబడి తన మైమకీ జోళ్లలోంచి మోటుగా చేసిన పొగగొట్టాన్ని తీసి

పొగాకుపొడిన్నీ, కొట్టిన కొండబిర్చిచెట్టు బెరడున్నూ కలిపిన గుండని గొట్టంలోకి ఎక్కించి గబగబ అతి ఆత్రంతో పొగపీల్చి దట్టమైన పొగ మేఘాలను వదిలింది.

ఇంతలో అల్బన్‌చీ చూమ్‌లో కెళ్లి గోలేన్ని తీసుకొచ్చి సంచీని విప్పి అందులోంచి గోలేంలోకి కొంచెం గోధుమలని వెలిపింది. గోధుమగింజలు ఎర్రని నిగారింపుతో మెరిశాయి.

ఆవేళ పండుగదినమే.

హాస్యాలు ఆడుకున్నాం. నవ్వుకున్నాం. ఇనుపమూకిట్లో బుస్‌బుస్‌మని చప్పుడవుతోంది. వేయించిన గోధుమగింజలని అందరం కరకరమని పళ్లతో నములుతూ తిన్నాం.

ఎనిమిదవ ప్రకరణం

షాగై*

సాయంకాలం చెర్లిక్‌పేన్ గట్టిగా మొరిగింది. దాంతో మా నవ్వులాటలు ఆఖరై పోయాయి.

“ఎవరో చూసి రా, నాయనా!” అంది అమ్మ.

---

* తోలు ముక్కలు కలిపి కుట్టిన తోలుపట్టా. ఈ పట్టాతో ఉద్యోగస్థులు తప్పుచేసిన వారిని దవుడలమీద కొట్టి శిక్షించేవారు.

నేను గుమ్మందాటి బైటకి వెళ్లేటప్పటికే గుర్రాలమీద సవారీచేస్తూ ముగ్గురు మా యింటి ముందరి కొచ్చి ఆగారు. మొదటి అతను జీనుమీద కూర్చుని ఇటూ అటూ ఊగిసలాడుతూ కళ్లేన్ని యడంగా పట్టుకుని దానిని గుర్రం మెడమీద ఆన్చి అలవాటు కొద్దీ గుర్రాన్ని ముందుకు నడవమని తొందర చేస్తున్నాడు. పట్టు అల్లికతో అలంకరించిన గాఢమైన నీలిరంగు బొచ్చు అంగీని తొడుగుకున్నాడు. రెండో రౌతు గోధుమరంగు కోటు వేసుకున్నాడు. మొదటి అతను గోధుమరంగు కుచ్చుతో కూచిగా నల్లని బొచ్చు కుళ్లాయి పెట్టుకున్నాడు. రెండవ రౌతుకి నీలిరంగుకుచ్చులున్న నల్లని ముఖమల్ టోపీ వుంది. మూడో రౌతుని నేను బాగా చూడలేక పోయాను: అప్పటికే అతను గుర్రం దిగిపోయి నిలబడివుండగా గుర్రం అతన్ని అడ్డేసింది.

"ఆ వచ్చింది ఎవరు?" అని అమ్మ నన్నడిగింది.

"ఎవరో గుర్రంమీదెక్కి వచ్చారు" అన్నాను నేను వాళ్లగురించి అంత పట్టించుకోకుండా.

"మనకేదో కీడు మూడింది రా! అయ్యయ్యో!" అంది అమ్మ నా చెవిలో.

ఈ లోపుగా ఆ గుర్రపు రౌతులు గుర్రాలని చెట్లకి కట్టేసి, మా చూమ్‌వైపు వచ్చి, అందులో ఒకతను రాక్షసిలాగు కళ్లు ఎర్ర జేసి పళ్లు కొరుకుతూ:

"ఒరెయ్ మీ బతుకు బండలుగానూ! ఎవరుంటున్నార్రా యీ బొక్కలో? ఆ కుక్కను ఊరుకోమనవేమి రా వెధవా?" అని అరిచాడు.

చెర్లిక్‌పేన్నుని తీసుకుపోయి యేటిగట్టుమీద చెట్టుకి కట్టేయమని పెద్దక్క చెప్పబట్టి కాని, లేకపోతే రాత్రిళ్లు మా యింటిదగ్గరగా తిరుగు

లాడే తోడేళ్లని పట్టుకుని యెలా చీల్చిపారేసేదో అలా వీళ్లని కూడా పట్టు కుని చీల్చిపారేసేదే.

అమ్మ చూమ్‌లోనుంచి పరుగెత్తుకెళ్లి వాళ్లముందర మోకాళ్లమీద పడి వొంగివొంగి:

"తమరికి నూరేళ్లాయుష్షు! మీ యిల్లు చల్లగా వుండాలె!" అంటూ దణ్ణాలు పెట్టింది.

అమ్మ దణ్ణాలని వాళ్లేమీ వినిపించుకోకుండా అసలు అక్కడ మరెవ్వరూ మనుష్యులే లేనట్టూ, మేమెవ్వరం మనుష్యులమే కానట్టూ, మాట్లాడకుండా అతికోపంగా మా చూమ్‌దగ్గిర కొచ్చారు. వాళ్లు వేసుకున్న బొచ్చుకోట్లు అతివదులుగా వుండి కుచ్చీళ్లలాగు వేలబడుతున్నాయి. వాళ్ల చేతులుకంటె కోటు చేతులు మరీ పొడుగ్గా వుండడంచేత వాళ్లు నడుస్తూ వుంటే అవి వేలాడుతూ ఇటూ అటూ వూగుతున్నాయి. వాటిని చేతిమేజోళ్లలాగూ కొరడాల్లాగూ కూడా ఉపయోగించడానికి వీలుగా వున్నాయి.

పచ్చగడ్డిలో చప్పుడులేకుండా కన్పించకుండా పాములు ఎలా పారాడుతాయో అలాగే మేమున్నూ ఇంటిలోపలికెళ్లి గుంజల మధ్యను గోడకి నక్కి నక్కి నిలబడ్డాం. నూనెతో నిగనిగలాడుతూ రంగువేసిన మైమకీ బూడ్సు జోళ్లను వేసుకున్నారు వాళ్లు. మా గుమ్మాన్ని దాటి ఇంట్లోకి ప్రవేశించి మేం నిలబడిన చోటకి వచ్చారు. వాళ్లు ఆగ్రహంతో మండిపడుతూ ఆ కోపంతో వాళ్ల నోటంట మాటలు కూడా రాక అలా ఒక్క నిమిషం నిలబడి, ఆతరువాత చేతులు విసురుతూ:

"చల్లగా వుందురుగానిలే! మిమ్మల్ని శుద్ధిచేయడానికే వచ్చాం,

కుక్కల్లారా! మేం చెప్పేది జాగ్రత్త వింటున్నారా? చచ్చు పీనుగుల్లారా?" అని తిడుతూ బీభత్సం చెయ్యడం మొదలెట్టారు.

వాళ్లలో ఒకడు ఇనుపమూకిట్లో వున్న గోధుమగింజలవైపు వేలుపెట్టి చూపించి:

"ఎవడి బాబుగాడి సొమ్మురా మీరు తింటూన్నది?" అని అడిగేడు.

మా అమ్మ యేదో చెప్పబోతూంటే అమ్మని మాటాడనివ్వకుండా రెండోవాడు అన్నాడు:

"ఇలాంటి నీచపువెధవలు గోధుమరొట్టెలు చేసుకు తినడం ఎన్నడేనా ఎరుగుదుమా? ఉజూన్-చొదూర్ ఇంట్లో కన్నంవేసి కాజేసినట్టు ప్రత్యక్షంగా కనిపిస్తూనే ఉంది."

దానిమీద మొదటి అతడు అందుకుని:

"ఉజూన్-చొదూర్ ఇంట్లోనుంచి దొంగతనంగా ఎత్తుకొచ్చామని ఒప్పుకోండి రా, వెధవల్లారా!" అన్నాడు.

మేం అతనివైపు మా ముఖాలని యెత్తాం. అతడు మరీ ఆగ్రహపరవశుడైపోయి, పళ్లు ఇగిలించి చొంగకార్చుకుంటూ నానా తిట్లూ తిట్టాడు.

అమ్మ నేలమీద పడి వెయ్యి దణ్ణాలు పెడుతూ:

"అయ్యో మేమా, దొంగతనమా? అయ్యయ్యో! ప్రభువులు ఎంత మాట సెలవిచ్చారు! సరీగ్-సెప్‌లో వాళ్లు మాకీ గింజల నిచ్చారు. వాటిని వేయించుకుని తింటున్నాం బాబూ! ఆ వూరికెళ్లి అక్కడ రష్యన్లదగ్గిర కలప రంపం కోతకోసి పనిచేస్తే వాళ్లీ గింజలని మాకిచ్చి మళ్లీ పనికి రమ న్నారు. ఇవితప్ప మరే గింజలనీ మేం కళ్ల చూడలేదు బాబూ!" అని మళ్లీ అతనిముందు కాళ్లమీదపడి దణ్ణం పెట్టింది.

వాళ్లందరిలోను పెద్ద ఉద్యోగస్థుడు తాష్-చలాన్ అని నేను గుర్తు పట్టేను. అప్పుడు మేము చూసినప్పటిలాగే అతనిముఖం గీసినకందగెడ్డలా ఎర్రగా పొంగి వుంది. చప్పిడి ముక్కు. అందరికంటే ముందుగా అతను పొయ్యిదగ్గిర గుమ్మానికి యెదురుగుండా బాసికపట్టు వేసుకొని బుద్ధ విగ్రహంలా కూచున్నాడు.

ఆ గోధుమలని తాను యేలా సంపాదించినదీ మళ్లీమరోసారి అమ్మ చెప్పింది. అదంతా విని తాష్-చలాన్ బాసికపట్టు వేసుక్కూచుని గోదురు కప్పలాగు ఎగురుతూ అమ్మదగ్గిర కొచ్చి:

"ఏమిటీ? నువ్వు దొంగతనం చెయ్యలేదూ? దొంగపీనుగా! నువ్వు దొంగతనం చెయ్యకపోతే మరెవడు చేశాడే? దొంగ ముండా! చెప్పవేమే?" అని పెద్దగా కేకలు వేస్తూ కోటు చేతికొసలతో అమ్మ ముఖంమీద ఫెడీ మని కొట్టాడు.

అమ్మ ఆ దెబ్బకి కింద పడిపోయింది. నాకు చూడ్డానికి భయం వేసింది. కాని అమ్మ దగ్గిరనుంచి వెళ్లిపోవడానికి నాకు కాళ్లొచ్చాయికావు. అమ్మ ముఖం అంతా రక్తమే.

తాష్-చలాన్ నన్ను చూసి నా చెవి పట్టుకుని:

"నీ అమ్మ ఆ గింజలని యెక్కడనించి రా యెత్తుకొచ్చింది? చెప్పు!" అని గద్దించి అడిగేడు.

నేను బూరెబుగ్గలు చేసుకుని యేమీ మాట్లాడలేదు.

ఆ ఉద్యోగస్థులు ఇల్లంతా గాలించేసి కనిపించిన వస్తువల్లా ధ్వంసం చేసి నానా బీభత్సం చేసేశారు.

"ఇల్లంతా మూలమూలా జాగ్రత్తగా వెతకండి. ఇంట్లో కాకపోతే

మరెక్కడ దాస్తారు? దొరకకపోతే కొరడాతో ఒక్కటి రుచిచూపిస్తేసరి ఆ ముండ నోరు దానంతట అదే పెగుల్తుంది'' అన్నాడు తాష్-చలాన్. ఎంతవెతకినా యింట్లో కనిపించక పోవడం చూసి వాళ్లు బైటకి వెళ్ళారు.

ఇంతట్లోకి ఒక స్లెయ్ మీద ఒక గొప్పవాడు — నల్లగా పెద్ద గడ్డమూ అతనూ — అక్కడికొచ్చాడు. ఉద్యోగస్థులు ఆయనని ఉజూన్-చొదూర్ అని పిలవడంచేత ఆయనే ఉజూన్-చొదూర్ అని తెలిసింది. అతనితో కలిసి ఆ ఉద్యోగస్థులు యింటి చుట్టూవున్న స్థలాంన్నంతా వెతికారు. కాని వాళ్లకి యేమీ దొరకలేదు.

దాంతో వాళ్లు అమ్మ ముంజేతులు రెండింటినీ ఒక దానిమీద ఒకటి వుంచి మణికట్లు రెండింటినీ తాళ్లతో కట్టేసి యింటి గుమ్మంవైపు ముఖం పెట్టి నిలబడమన్నారు. అప్పుడు:

''ఇక మొదలుపెట్టండి'' అన్నాడు తాష్-చలాన్.

ఎరుపు బొచ్చుకోటు వేసుకున్న అతను అమ్మదగ్గిర కొచ్చి అమ్మని మోకాళ్లమీద పడదోసి మెడ నొక్కిపెట్టి తాళ్లతోకట్టివున్న మోచేతుల మీద నిలబడి, అమ్మ తలకాయను ఒక చేతితో తన మోకాలిమీద నొక్కిపెట్టి రెండో చేతితో తన షాగైతో ఆమె దొడమీద కొట్టడం మొదలు పెట్టాడు. మొదట రెండు మూడు దెబ్బలకే అమ్మ ముఖంమీదనుంచి రక్తం వచ్చేస్తూంది.

ఇలాగు ఇద్దరు ఉద్యోగస్థులూ అమ్మని కొడుతూంటే కడమ వాళ్లు ఇంకా చూమ్ చుట్టూ వెతుకుతునే వున్నారు. ఒకతడు అక్కడకు చేరు వగా మంచుకుప్పంత అతిచిన్నపాక వుండడం చూసి, అక్కడికి వెళ్లి,

అక్కడ వెతుకుతూ, కోపంతో బిగ్గరగా ఏదో అరిచేడు. ఆ చిన్న పాకలో మేం మా మేకని కట్టేవాళ్లం. ఆ పాకనే మేం హాస్యానికి మేకల దొడ్డి అనేవాళ్లం. అతడి కేకలు విని మిగతా వాళ్లందరూ ఆ దొడ్డిదగ్గిరకి పరుగెత్తి వచ్చారు. ఆ దొడ్డి కప్పుమీదవున్న మంచుకుప్పలో ఒక సంచీలో గోధుమగింజలు వున్నాయి. ఆ సంచీని చూసిన ఉద్యోగి — సూదిలాగ వున్న అతని ముక్కును చూస్తే నాకు కంసాలిపిట్ట జ్ఞాపకం వొచ్చింది — ఆ పాక కప్పుమీద కెక్కి నేనేకదా దీని ఆ చోకీని బైటకి లాగగలిగే నని సంతోషంతో నవ్వుకొంటూ ఆ సంచీ పక్కని ఇంకా మరేమేనా పెన్నిధులను అక్కడ దాచి వుంచారేమో వాటిని కూడా బైటకి తీద్దాం అనే వుద్దేశంతో, ఒక కఱ్ఱ పుచ్చుకుని ఆ మంచునంతనీ కెలికేడు.

మరేమీ దొరక్క తను బైటకి తీసిన సంచీని తాష్-చలాన్‌కి ఇచ్చాడు. మరేమీ ప్రశ్నలు వేయకుండా తాష్-చలాన్ ఆ సంచీని ఉజూన్-చౌదూర్‌కి అందించాడు.

ఉజూన్-చౌదూర్‌ని వాళ్ళు అతి గౌరవ మర్యాదలు చేస్తూ, అతనికింద గులాములైనట్టుగా అతనిని "దొరా! దొరా!" అని సంబోధిస్తున్నారు.

"ఈ గోధుమలు తమరివే. తమరు తీసుకోండి. వీటిని ఇక్కడ కాక పోతే మరొక చోటనుంచో మరొకరిదగ్గిరనుండో ఎలాగో ఒక లాగు ఆచుకీ కనిపెట్టి తమకిచ్చే వాళ్లమే. ఈ చేతులకి చర్మాలు ఊడిపోయినాసరే మా చేతులతో మేము వెతికి తమరి సరుకు తమరికి వప్పచెప్పకపోతే మరి మేందుకున్నాము? దొరా!" అని ఆ ఉద్యోగులు పదేపదే చెపుతూ వొంగివొంగి దణ్ణాలు పెడుతూ చేతులు కట్టుకొని అతనిదగ్గిర నిలబడ్డారు.

ఉజూన్-చొదూర్ తన గడ్డాన్ని సవరించుకుంటూ తనకి వచ్చీరాని తువా భాషతో:

"సరే! గొప్ప మంచిది. నేను నీవు స్నేహం. నీవు నా యిల్లు రండి టీ తాగండి. మాంసం, ఆరక కూడా యెత్తుకోండి" అన్నాడు.

ఆ గోధుమల మూటని ఉజూన్-చొదూర్ తన స్లెయ్‌లో వేసుకుని కొరడాని ఛెళ్ళుమనిపిస్తూ నేలమీదనుంచి మంచురేణువులు మేఘాలలాగ రేగుతూండగా, యేటి దిగువగా సరీగ్-సెప్ దారిని వెళ్ళిపోయాడు.

మోకాళ్లమీదనే నిలబడివున్న మా అమ్మదగ్గిరకి ఆ ఉద్యోగస్థులు వెళ్ళి, ఆమెను షాగైతో మళ్ళీ బాదడం మొదలెట్టారు. ఆ రాత్రి అమ్మ చెంపల మీద ఆ చెమడా ఫట్‌ఫట్‌మని పడుతూంటే ఆ దెబ్బల ప్రతిధ్వని నిశీధినీ నిశ్శబ్దంలో నలుమూలలా వ్యాపిస్తూంది.

కంసాలిపిట్ట ముక్కు వున్న ఉద్యోగి అక్కదగ్గిర కెళ్ళి అమాంతంగా అక్కని పట్టుకుని ఆమె చేతులు రెండింటినీ తాళ్లతో కట్టేశాడు. ఆ తరువాత అమ్మనీ అల్బన్‌చీనీ వాళ్లతో తీసుకుపోవడానికని గుర్రాలనెక్కారు. తన ముఖంమీద కారుతూన్న రక్తాన్ని అమ్మ తన చొక్కా అంచుతో తుడుచుకుంది, కాని లేచి నిలబడక అలాగే నేలమీదే చతికిలబడి:

"మమ్మలిని చంపేయ దల్చుకుంటే ఇక్కడే నా కొంపదగ్గిరే నా పిల్లల యెదుటే మమ్మలిని చంపేయండి. నేను మాత్రం ససేమిరా ఇక్కడనుంచి కదలను" అని గట్టిగా యేడ్చింది.

ఎరుపురంగు బొచ్చుకోటు వేసుకున్న ఉద్యోగి వెంటనే తన కొరడాతో అమ్మని కొట్టాడు. ఆ కొరడా కుచ్చులు అమ్మ వొంటికి తగిలి విచ్చుకత్తుల్లాగు వొంటిని కోసేశాయి.

మూడో రౌతు తన జీనుసంచీలోనుంచి కొసని జారుముడితో వున్న పెద్ద తాడును తీసి ఆ తాడుని అమ్మ మీదకి విసిరలాగేసరికి ఆ జారుముడి అమ్మ బుజాలమీద పడి బిగుసుకు పోయింది. పాపం అమ్మ మరి ప్రతిఘ టించ లేకపోయింది. అప్పుడు వాళ్లు గుర్రాలనెక్కి అల్బన్‌చీని ముందూ అమ్మని వెనకా నడిపించి తీసుకుపోతూంటే తొట్రుకుంటూ ముందు నడుస్తూ అల్బన్‌చీ వెనక్కి తాష్-చలాన్ వంక తిరిగి మావైపు తలతిప్పి:

"మా పిల్లల గతి ఏమిటి?" అని యేడ్చింది.

అక్క యేడుపు చూసి నవ్వుతూ ముఖంమీద ఎర్రగాను నల్లగాను వున్న మాసంపు కండలు ముడతలు పడుతూ నవ్వు పట్టలేక కడుపు పట్టుకుని:

"నడువు చచ్చు ఘటమా! ఇప్పటికి తెలివొచ్చిందా నీకు! హో—హో—హో! నీ పిల్లలా? చస్తే చావనీ! శనివిరగడవుతుంది! ఇప్పడింత ఉద్ధరించారు ఇక బతికి మీదటికి ఇంకా ఉద్ధరించుతారనా? దొంగ వెధవల కొంప కాకపోతే మరేమిటిది? నీ పిల్లల చావు మాట అలాగుంచి నువ్వుబతికే వున్నావు గనుక నోరుమూసుకు నడువు!" అంటూ అక్కదగ్గిరసంటా గుర్రంమీదే వెళ్లి అమాంతంగా అక్క ముఖంమీద ఒక్క గుద్దుగుద్దేడు.

ఉద్యోగస్థులు గుర్రాలని కొరడాలతో కొడుతూ అమ్మనీ అక్కనీ ముందు పరుగెట్టిస్తూ వెళ్లిపోయారు.

ఒక రాత్రి ఒక పగలు గడిచాయి.

సాయంకాలానికి అమ్మ అక్క ఇంటి కొచ్చారు. ముఖాలూ వొళ్లూ రక్తాలు కారుతూ వాచిపోయివున్నాయి.

"తప్పా ఒప్పా అన్న విచక్షణ చూడకుండామనని కొట్టారే వీళ్లు.

కొట్టడమే కాకుండా మనం కష్టపడి సంపాదించుకున్న గింజలు కూడా కాజేశారే. ఇంత అన్యాయం మండిపోతూంటే మన గతేంగాను? మనం ఎక్కడికి పోగలమే? నా తల్లీ!" అని అమ్మ అక్కతో అంది.

అమ్మ మాటలు విని అక్క తలయెత్తింది. అక్క ముఖం ఎంతో విచారంగా వుంది! ఆ కళ్లనుండి కన్నీరు ప్రవహిస్తూంది. ఆ నీలిమబ్బుల్లో తళుకుతళుకుమని నక్షత్రాల్లా ప్రకాశిస్తూంది.

"స్యర్యున్నా తండ్రి దనీల వాళ్ల వూరికి వెళ్లదాం అమ్మ! యెప్పుడు యేవుపద్రం వొచ్చిమీదపడుతుందో అన్న భయంలేకుండా నిశ్చింతగా మనం అక్కడ కష్టపడి బతకొచ్చు. మన పిల్లలు కూడా హాయిగా వుంటారు" అంది అక్క.

తొమ్మిదవ ప్రకరణం

చెర్లిక్‌పేన్

అమ్మ అల్బన్‌చీన్నీ తాము చేసిన కూలిపనికి ఆయా యజమాన్లనుంచి డబ్బులు వసూలు చేసుకుందుకి చుట్టుపక్కల వూళ్లకి వెళ్లారు.

అర్ధరాత్రి అయింది. అమ్మ అప్పటికీ రాలేదు. అమ్మకోసం మేం అలా కనిపెట్టుకుని పొయ్యిసెగని కాచుకుంటూ కూచున్నాం. గుమ్మంమీద అడ్డంగా కాళ్లు చాచుకుని చెర్లిక్‌పేన్ పడుకుంది. ఉండుండి తలెత్తుతూ

తన పొట్టి చెవులని నిక్కపొడిచి యేదో వింటూ వీపుమీద తన గాయాన్ని నాకుతూంది.

కంగీయ్ చెర్లిక్‌పేన్‌దగ్గిర కెళ్లి దాన్ని తట్టుతూ:

"అయ్యో! నువ్వు ఎంతో అంత విశ్వాసమైన దానివే. నిన్నే కుక్కలే ఇంతిలా కరిచేశాయే? చెప్పమ్మా! తోజు-హెలీన్ కుక్కలా? మరి నువ్వు వాటికంటె బలమైన దానివే కదామరి? ఏమి నా మాట నిజమేనా, చెర్లిక్‌పేన్?" అంది.

"మళ్లీ నీకా వెధవలు కనిపిస్తే మాత్రం వాట్లని ప్రాణాలతో వదలిపెట్టకేం!" అన్నాను నేను చెర్లిక్‌పేన్‌తో.

చెర్లిక్‌పేన్ మామూలు స్తెప్‌మైదానంమీద తిరిగే ఊరకుక్క. అయినా దాని బలం ఇంతా అంతా కాదు. నేను తరుచు దాని వీపుమీద సవారీకూచుంటే నన్ను అవలీలగా ఎగరేసుకుపోయేది. దాని బలం దానికి బాగా తెలుసు. ఏ కుక్కైనాసరే దానితో తలపడిందంటే మాత్రం తగిన శాస్తి చేస్తేకాని విడిచి పెట్టేది కాదు.

కంగీయ్ కొంతసేపు మాట్లాడకుండా కూచుని ప్రత్యేకంగా ఎవ్వరినీ ఉద్దేశించకుండా:

"మెత్తని వాడిని చూస్తే అందరికీ మొత్తబుద్దే" అంది.

లాలిస్తూన్న కంగీయ్ గొంతుక విని తన సంతోషాన్ని తెలియజేయడానికని చెర్లిక్‌పేన్ మొదట తన తలనీ తరువాత తన పాదాలనీ, మళ్లీ తన తలనీ కంగీయ్ చొక్కా అంచుమీద వుంచి తన తోకను గట్టిగా నేలమీద కొట్టింది. హఠాత్తుగా ఒక్కసారి చెంగున నేలమీదనుంచి తలుపుకేసి దుమికి బిగ్గరగా

అరవడం మొదలెట్టింది. నాకు భయంవేసి చుంచుపిల్లలాగు అక్కడ గోడదగ్గిర చింకి గుడ్డలు పోగుంటే దాన్లోకి దూరి దాక్కున్నాను.

"తోడేళ్లు కాబోల్సే. యేం చెయ్యడమే మరిప్పుడు?" అని పెజెన్‌దేయ్ అడిగాడు కంగీయ్‌ని.

"ఏం చెయ్యక్కరలేదు. చెర్లిక్‌పేన్ ఉండగా మనకేం భయం లేదు" అంది కంగీయ్. అలాగంటూనే ధైర్యంగా గుమ్మందగ్గిర కెళ్లి తలుపు తీసింది.

చెర్లిక్‌పేన్ ఒక్క గెంతుతో గుమ్మాన్ని దాటేసి బైటికి పరుగెత్తింది. కంగీయ్ చప్పున తలుపు వేసేసింది.

చెర్లిక్‌పేన్ విధివిరామం లేకుండా దూరాన అలా అరుస్తూనే వుంది. ఆ అరుపు ఒకసారి దగ్గరగానూ ఒకసారి దూరంగానూ, కాస్సేపటికి మళ్ళీ దూరంగానూ, మళ్లీదగ్గరగానూ అలా యెంతోసేపు వినబడుతూనే వుంది. కాస్సేపటికల్లా బొంగురు పోయిన గొంతుకతో దాని అరుపు గుమ్మం దగ్గిరే వినిపించింది. అది తలుపు గోకడం కూడా మాకు వినిపించింది. పెజెన్‌దేయ్ కంగీయ్ చెరొక భారీగుంజనూ పట్టుకుని తలుపు తీసుకుని బైటకి వెళ్లారు. వీళ్లు కూడా వుండడం చూసి చెర్లిక్‌పేన్‌కి ధైర్యస్థైర్యాలు వచ్చాయి. దాంతో మళ్లీ వెళ్లి అది తోడేళ్లమీద పడింది. ఈ అసమానమైన సంఘర్షణ చాలాసేపు జరిగింది. ఒక్కసారిగా అంతా నిశ్శబ్దం అయి పోయింది. చెర్లిక్‌పేన్ తిరిగీ రాలేదు. దాని అరుపూ వినిపించలేదు మాకు.

కొంతసేపు అయాక కంగీయ్ యేడుస్తూ ఇంట్లో కొచ్చింది. ఏడుస్తూనే:

"తోడేళ్లు మన చెర్లిక్‌పేన్నునేదో చేసినట్టుంది" అంది.

"మరి మన గతేంగాను?" అంటూ పెజెన్‌దేయ్ యేడవడం మొదలెట్టాడు.

నాకూ యేడుపొచ్చింది. కాని ఆ క్షణంలోనే తలుపు ఎవరో గోకుతూ న్నట్టు వినిపించి దుఃఖాన్ని ఆపుకుని: "తోడేళ్లేమో సుమా" అన్నాను.

"అవును తోడేళ్లే. మన చెర్లిక్‌పేన్ని తినేసి మనని కూడా తిన డానికి వచ్చాయి" అంది చిన్నక్క.

గోడలో చిన్నకన్నం వుంటే ఆ కన్నంలోంచి బయటికి చూశాడు పెజెన్‌దేయ్.

"ఏమిట్రా అది? ఎవరున్నారు అక్కడ?" అని మేం ఆత్రంగా అడి గేం.

"ఏదో కదుల్తోంది పెద్దది నల్లగా వుంది" అని గబగబ మావైపు తిరిగి మా చెవిలో చెప్పాడు పెజెన్‌దేయ్.

"ఎలుగుగొడ్డేమో సుమా?" అన్నాను నేను.

అని ఆ మాట తల్చుకునేసరికే ఒంటిమీద చురకపడ్డట్టు చూమ్ అవతలి గోడకేసి పరుగెత్తాం అందరమున్నూ.

"ఎలుగుగొడ్డే కనక అవుతే... ఎలుగుగొడ్డు నిప్పుమంట చూసి పారిపో తుందని యెవరో చెప్పగా విన్నాను" అని కంగీయ్ అంటూ మండు తూన్న కొరివి నొకదాన్ని పొయ్యిలోంచి తీసి చేత పుచ్చుకుని బైటకెళ్లింది.

మండుతూన్న కొరకంచు వెల్తురులో కంగీయ్‌కి చెర్లిక్‌పేన్ కనిపిం చింది. అపరిమితమైన సంతోషంతో కంగీయ్ చేతిలోనుంచి కొరకంచుని కింద జారవిడిచేసింది. కాని మరు క్షణంలో అతి దిగులుగా:

"దబ్బున రండి! చెర్లిక్‌పేన్ని తోడేళ్లు చంపేశాయి" అంది కంగీయ్.

చెర్లిక్‌పేన్ పడిపోయివున్న చోటకి అందరం పరుగెత్తాం. పాపం కుక్క కొనవూపిరితో వుంది — ప్రాణం అసలు వుందో పోయిందో కుడాను.

దాన్ని చూమ్‌లోకి తీసుకొచ్చాం. పొయ్యిసెగదగ్గిరకి దాన్ని తీసుకొచ్చి చూసే సరికి వెనకకాళ్లలో చలనమే లేదు. పీకనుంచి రక్తం కారిపోతోంది. పాపం అది ముందుపాదాలతోనే యింటి గుమ్మంవరకూ పాకుతూ వచ్చింది. ప్రమాదస్థితిలోవున్న మా నేస్తం చుట్టూరా చేరి చాలాసేపు అలా చూస్తూ కూచున్నాం. మాకెవ్వరకీ నోట మాట రాలేదు. ఒకరితో ఒకరం యేం చెప్పుకోవాలో తెలిసింది కాదు. ఏంచెయ్యడానికీ తోచలేదు. చెర్లిక్‌పేన్‌కి ఏంవుపచారం చెయ్యాల్సిందీ తెలీక దుఃఖంతో కుంగిపోతూ నిశ్శబ్దంగా పడుకుని నిద్దరపోయాం.

పొద్దున్న లేచీ లేవడంతోనే చెర్లిక్‌పేన్ తోడేళ్లకేమి చేసిందో చూద్దాం అని బయలుదేరేం. ఇంటినుంచి చెర్లిక్‌పేన్ రక్తపు జాడలు చూసు కుంటూ వెళ్లేం. మంచులో అక్కడక్కడ మంటి గడ్డలు. మంటి గడ్డల మీద కరడు కట్టిన రక్తపు చుక్కలు. ఒక్కసారిగా పెజెన్‌దేయ్ హడిలిపోయి పెద్ద కేకపెట్టాడు:

"తోడేలు! అదిగో అక్కడ చూడండి తోడేలు!"

"ఎక్కడ? ఎక్కడ?" అని మేమూ అంతహడిలిపోతూనే కేకవేసి అడిగేం.

నిజంగానే, పెజెన్‌దేయ్ వేలుపెట్టి చూపించిన చోట తోడేలు ఒకటి పడివుంది. కొద్ది క్షణాలవరకూ యేమిటి చెయ్యాలో మాకు తోచలేదు.

"తోడేలు చచ్చిపోయే వుందేమో" అంది చిన్నక్క.

"అబ్బెబ్బే, తోడేళ్లు మహా చెడ్డ జిత్తులమారి గొడ్లు సుమా! అది మనని మోసం చెయ్యడానికే అలా చచ్చినట్టు అది నటిస్తూందేమో?" అన్నాడు పెజెన్‌దేయ్.

"బతికి వున్నదే అవుతే, యీ పాటికి కదిలే వుండును రా!" అని అంటూ చిన్నక్క నాలుగు అడుగులు ముందేసింది.

వూపిరి బిగబట్టుకుని మేం నిలబడ్డాం. తోడేలు కదలలేదు మెదల్లేదు. అది కదలక పోవడం చూసి మేంకొంత ధైర్యం తెచ్చుకుని ఇంకా బాగా చూద్దామని మరి నాలుగు అడుగులు దగ్గరగా వెళ్లాం. తోడేలు గొంతుక పూర్తిగా కొరికేసి తెగిపోయిపడుంది. పీకెనుంచి కారినరక్తం మంచుమీద గడ్డకట్టుకునుంది.

ఇంత అసమానమైన పోరాటంలో కుడా చెర్లిక్‌పేన్నే గెలుపును సాధించిందన్న సంగతి తెలుసుకొని మేము పొందిన సంతోషంలో నిన్న రాత్రి మేం అనుభవించిన భీతావహం పూర్తిగా ఎగిరిపోయింది. తోడేలుని యేమిటి చెయ్యడమా అని మాలో మేం తర్జన భర్జన పడ్డాం.

"మొట్టమొదట మనం దాన్ని చర్మాన్ని వొలిచెయ్యాలి" అంది చిన్నక్క.

"చర్మాన్ని అమ్మేద్దాం" అన్నాడు పెజెన్‌దేయ్.

"బస్తా వరిగలకి" అన్నాను నేను.

ఇదిలా వుండగా విశ్వాస పాత్రుడైన మా నేస్తం చెర్లిక్‌పేన్ స్థితి యే మాత్రం నయం కాలేదు. చెర్లిక్‌పేన్ మరి లేవలేదు. చూపుల్లో ఎంతో విచారాన్ని వ్యక్తపరచేది. అరుపులో ఎంతో బాధని సూచించేది.

ఈలోపుగా అమ్మ ఇంటికి వచ్చేసింది. చిన్న టీ కణిక ముక్కనీ పడికెడు ఉప్పునీ తీసుకొచ్చింది. కాని ఆ నిమిషానికి మా ధ్యానం వాటిమీదకి పోలేదు. ఒకరి మాటలకి ఇంకొకరం అడ్డుపడుతూ జరిగినదంతా అమ్మతో చెప్పాం. కాని మా ఉద్రేకాన్ని అమ్మ యేమీ పట్టించుకున్నట్టు కనపడలేదు.

మరి దేన్ని గురించో ఆమె తీవ్రంగా ఆలోచించుతూన్నట్టుంది. ఆమెను చూసి మేమూ మాటలని కట్టిపెట్టేసి నిశ్శబ్దంగా వుండిపోయాం. యేమీ అనుకుండా అమ్మ చూమ్‌లోకి వెళ్లింది. అమ్మవెంట మేమూ ఇంట్లోకి వెళ్లాం.

ఇంట్లోకి వెళ్లేటప్పటికి చెర్లిక్‌పేన్ ముక్కున మరి వూపిరి లేదు. చెర్లిక్‌పేన్ చచ్చిపోయుంది. భక్తివిశ్వాసాలతో సేవ చేసిన మా అంగరక్షకుడు తన ప్రాణాలను కోల్పోయాడు.

చెర్లిక్‌పేన్ అవసాన యాత్ర చేసుకున్నప్పుడు మేం అందరం తోడుగా వెళ్లాం. మా బిర్చిబెరడు గోలెంలో చెర్లిక్‌పేన్‌ని పడుకోపెట్టి అడవిలోకి మోసుకొని వెళ్లాం. అడవిలో గాలికి పెల్లగింపబడి వున్న మహావృక్షం వేళ్లకింద ఆకళేబరాన్ని పాతి పెట్టేశాము.

"చెర్లిక్‌పేన్ బతికి వున్నప్పుడు మిమ్మలిని దానికి ఒప్పజెప్పేసి నేను పని చూసుకోవడానికి వెళ్లిపోయేదాన్ని. చెర్లిక్‌పేన్ ఇప్పుడు లేదు. మరి మిమ్మలిని ఎవరికి ఒప్పగించి వెళ్లను?" అంది మమ్మలిని తనదగ్గిరకి పిలిచి.

విచారంతో అమ్మ గొంతుక వొణికి పోయింది. చెర్లిక్‌పేన్ సమాధి దగ్గిర అలా కాస్సేపు నిలబడి ఇంటికి వెళ్లిపోయాం.

ఇల్లంతా చిన్న బోయి నిర్మానుష్యం అనిపించింది. చెర్లిక్‌పేన్ మమ్మలిని వదిలేసి వెళ్లిపోయింది. బతికి వున్నంత కాలం దాని అరపును మరి వినడం అంటూ వుండదు ఇక!

కుక్క అలజడి అంటూ లేకపోవడంవల్ల ఆ నిశ్శబ్దాన్ని కొన్నాళ్లవరకూ భరించలేక భయమే వేసింది.

కొన్నాళ్లు అయాక ఒక రోజున అమ్మ:

"నేను తెర్‌జీగ్‌వొడ్డు అంట వెళ్లి నీకూ పెజెన్‌దేయ్‌కీ యేదేనా పని దొరుకుతుందేమో చూసి వస్తాను" అంది.

తెర్‌జీగ్ చిన్న యేరు. అమ్మ యేటికి వొడ్డుకు బయలుదేరింది. కొంత దూరం మేము కుడా అమ్మ వెంటవెళ్లాం. ఆ రోజున చక్కగా ఎండ కాస్తూంది. ఆకాశాన్ని ఒక్క మేఘమేనా లేకుండా ఎవరో ఎంతో కష్టపడి ఆకాశాన్ని అలికేసి ఆకాశానికి నీలిరంగుతో వెల్లవేశారు కాబోలు అని అనిపించింది. మంచుతో భూమి తెల్లగా కళ్లు మిరుమిట్లుగొలుపుతూ మెరిసిపోతూంది. ఈ తెల్లని తెలుపుమీద దూరాన నల్లగా మా అమ్మ విగ్రహం స్పష్టంగా మాకు కనిపిస్తూంది. కనిపించినంతవరకూ అమ్మని చూస్తూ నిలబడ్డాం. అడివి చీకటిలో ఆమె నీడ కలిసిపోయాక ఇంటికి వెళ్లిపోయాం.

ప్రపంచం యెంత నిష్కళంకంగాను యెంత అందంగాను వుందో కదా అని అనుకున్నాను ఆవేళ నేను.

ఇంత ప్రశాంతంగా నవ్వుతూన్న ఆకాశంకింద ఇంత ఏడుస్తూ నీచంగా మా బతుకు ఎందుకుందో, ఇంత బీదగా రోతగా మా బిర్చిబెరడు చూమ్ ఎందుకుందో తెలుసుకుందాం అని ఆ చిన్నతనంలో నాకు తోచలేదు.

6—2661

రెండవ భాగం

సౌఖ్యం యెక్కడుంది ?

మొదటి ప్రకరణం

కొయ్యదుంగల చూమ్‌లో నేను ఖైదీని

నాకు పదేళ్లొచ్చేటప్పటికే మా కుటుంబం అంతా చెదిరిపోతోంది. మా అక్కలు అన్నలూ ఒకరి తరువాత ఒకరు కూలివాళ్లై పోయారు.

ఒక రోజు అమ్మ కంగీయ్‌తో అంది:

“నువ్వు పెద్దదానవైయావు. మన చూమ్‌లోనే పడి వుంటే నీకు కాలం యెలా వెళ్లుతుంది? కిందటిసారి నేను సరీగ్-సెప్ వెళ్లినప్పుడు నీకు కూలినాలి చేసుకునే ఈడు వచ్చిందనీ, తనదగ్గిర కూలిపనికి నిన్ను పంపించమని ప్రొకోపీ చూచాయగా అన్నాడు.”

కంగీయ్‌కి పదహారేళ్లు. పెద్దక్కలాగే యీామె పొడుగ్గా సన్నంగా వుంటుంది. మా అందరివీ కోలనికళ్లు. దానివి మాత్రం, యేదో అందమైన వస్తువును ఆశ్చర్యంగా చూస్తూన్నట్టు గుండ్రంగా చేరెడేసి కళ్లు. దాని ముక్కు కూడా మా పోలిక కాదు. మొంగూన్-త్లైగా ప్రాంతపు ఆడపిల్లల ముక్కులాగు తిన్నగాను అహంకారంగానూ వుంటుంది.

సరిపడిన దుస్తులు వేసుకుంటే మనిషికి అందంవస్తుంది. కంగీయ్‌కి ఈడొచ్చి పనిచేసుకోవడానికి ఇల్లు వదిలేసి వెళ్లిపోతుందన్న రోజుల్లో

అది కంటపడితే కొత్త మనిషిని చూస్తున్నామా అని అనిపించేది మాకు. అప్పుడు కంగీయ్ వేసుకున్న దుస్తులు నిజంగా దానికి అందాన్ని తెచ్చి పేట్టేవి కావేమో అని అనిపించేవి.

ఆ దుస్తులు అసలు మా అమ్మమ్మవి. అంచేత ఇంకా మరొక తరం అవి మన్నడం అసంభవం. ఆ సంగతి మాత్రం నేను గట్టిగా చెప్పగలను. ఇంతకీ ఆ దుస్తులన్నీ యేమిటి? అరిగిపోయిన మేకతోలుతో కుట్టిన కోటు. అదైనా, రోమం లోపునే వుంచి కుట్టడంచేత రోమం రాలిపోయి, జీర్ణించి పోయి, కన్నాలు ధారాళంగా పైకే కనిపించుతున్నాయి. ఇప్పుడు కంగీయ్ వేసుకున్నది ఆ కోటే.

అయినా ఇంతటి వికృతపు దుస్తుల్లో కూడా కంగీయ్ యెంతో అందంగా కనిపిస్తూంది.

"నేనెక్కడకీ వెళ్లదల్చుకోలేదు. నేను నీదగ్గరే మన చూమ్‌లోనే వుంటాను" అని గట్టిగా కంగీయ్ అంది అమ్మవైపు కొంచెం నిష్ఠురంగా చూస్తూ.

ఎలాగైతేనేమి నాలుగు రోజులైయాక అమ్మ కంగీయ్‌ని ఒప్పించి ప్రొకోపీ ఇంట్లో పనిలో పెట్టడానికి సరీగ్-సెప్ వూరికి తనతో కూడా తీసు కెళ్లింది.

ఆవేళ వాతావరణం చాలా హాయిగా వుంది. నిశ్చలంగావున్న ఆ గాలిలో మేర్గెన్ యేటి జలపాతం చప్పుడు మామూలుకంటె మరింత బిగ్గరగా వుందేమో అన్నట్టు అనిపించింది. మా చూమ్‌లో మాత్రం అంతా నిశ్శబ్దంగా వుంది. పెజెన్‌దేయ్ నేనూ కంగీయ్ గురించే తల్చుకుంటూ కూచున్నాం. అమ్మా అల్బన్‌చీ బైటతిరగడానికి వెళ్లిపోతే మేమిద్దరమే ఇంట్లో వుండాలి.

నాకు పదేళ్లు పెజెన్‌దేయ్‌కి పన్నెండు. ఆరోజుల గురించి నాకు యేది జ్ఞప్తికి వచ్చినా పెజెన్‌దేయ్ కుడా జ్ఞప్తికి వస్తాడు. మేమిద్దరం కలిసి పెరిగాం కలిసి ఆడుకునేవాళ్లం మరి.

నేను యెక్కడకి వెళ్లినా పెజెన్‌దేయ్ కూడా తోడుండేవాడు. నాకంటే పొడగరి. సన్నం. మంచి యెముకపుష్టి. నిదానస్థుడిలాగు ఖరాఖండీ మని షిలాగు పైకి కనపడినా నిజానికి మహా తొందరపాటుంది మనిషిలో. మేమి ద్దరం తరుచు ఒకరితో ఒకరం కుస్తీ పట్టేవాళ్లం. ఒక్కొక్కప్పుడు నేను గెల్చేవాడిని. తను వోడిపోయానని అతి రోషం వచ్చేసేది. రోషంలోనూ — ఇంతా అంతా రోషంకాదు! కింద పడిపోయినవాడల్లా గప్పుమని లేచి గంతు లేస్తు ఏడుస్తూ చేతులు తిప్పుకుంటూ కేకలేసేవాడు:

"ఫో! నా దగ్గిరనుంచి ఫో! ఉడుములాగు ఉన్న పొట్టి వెధవ! కుస్తీపడితే పట్టావు గాని మనిషిని ఓడించేస్తావా? ఫో! నా కళ్ల పడకుండా ఫో!"

పెజెన్‌దేయ్ యెప్పుడూ నాకు బుద్ధులు చెబుతూండేవాడు. ఇప్పుడు నేనే వాడికి బుద్ధులు చెప్పే అవకాశం దొరికిందికదా అని నాకు మరింత సరదావేసేది:

"ఇద్దరు కుస్తీపట్టినప్పుడు ఎవడో ఒకడు రెండోవాడిని చిత్తుచేయ్యడా మరి? లేకపోతే ఆటలో ఏం గమ్మత్తుంటుంది రా? రెండోవాడిని చిత్తుచెయ్యే డానికే కుస్తీ... అంతేకాని చిత్తు అవుతే వుడుక్కుంటారా యెక్కడేనా? మరి ఇంతకీ ఓడిపోవడం నీదే తప్పు" అని నేను వాడికి పాఠం ఒప్పజెప్పే వాడిని. వాడిని మరింత ఉసికొలపడానికని, జాతర్లలో కుస్తీ పోటీలు జరిగినప్పుడు గెల్చినవస్తాదు చేతులు ఊపుకుంటూ తల పంకిస్తూంటాడే అలాగ, నేను తలా చేతులూ వూపుతూ వాడి చుట్టూ తిరుగుతూండేవాడిని.

మేమిద్దరం అంత కలసిమెలసి వుండే వాళ్లమూ. అటువంటిది కొద్ది రోజులకే స్యుర్యున్మా తప్ప నేనొక్కడినే వంటరిగాడిని మా చూమ్‌ని కనిపెట్టుకుని వుండవలసి వచ్చింది. హాప్తో సంగమందగ్గర వున్న ఒక కమతంలో కూలిపని చెయ్యడానికని పెజెన్‌దేయ్ కూడా వెళ్లిపోయాడు.

కంగీయ్‌నీ పెజెన్‌దేయ్‌నీ ఒక సారేనా అప్పుడప్పుడు చూడడానికి అవకాశం వుంటుందని వాళ్లు పనులుచేసే చోట్లకి దగ్గిరగా గుడిసె వేసుకుని వుందామని మేం నిశ్చయించుకున్నాం. అమ్మ మనస్సులో మరో కారణం కూడా వుండి వుంటుందేమో అని నాకు తోచింది: ఆ ప్రాంతానికి వచ్చిన రష్యను రైతుకుటుంబాలకీ మా కుటుంబానికీ రోజుకు రోజూ మరింత అవినాభావ సంబంధం యేర్పడుతూండడంవల్ల వాళ్ల మనుగడ పనిపాటల గురించి మరింత బాగా తెలుసుకుందామని అమ్మకి అనిపించి వుంటుంది. మేం కొత్తగా ఇల్లు వేసుకుని స్థిరపడదామనుకున్న స్థలం చాలాదూరంలో వుంది. అక్కడకు బయలుదేరి, దారిలో మేర్గెన్ ముఖద్వారందగ్గిర విశ్రాంతికోసమూ భోజనసామగ్రి జాగ్రత్త చేసుకుని వండుకుని తిందామనీ నాలుగు రోజుల పాటు మజిలీ చేశాం.

కొండ ఒకటి వుంటే ఆ కొండమీద కట్టుకున్నాం ఇల్లు. కొండ లోతట్టుగా వుంది భాగ్యవంతుడు మెకేయ్ కుటుంబ నివేశనం.

కొత్త ఇంట్లో కంగీయ్ లేకపోయిందే అని రోజూ అనుకునేవాళ్లం. పొద్దున్నే గుమ్మందాటి బైటకి కాలుపెట్టేటప్పటికల్లా తెల్లగా మెకేయ్‌గారి ఇంటికప్పు పొగస్తంభం కంటపడేటప్పటి కల్లా కంగీయ్ జ్ఞాపకం వచ్చేది. మెకేయ్‌కి సంబంధించిన ప్రతి వస్తువూ గొప్ప ఖామందుల యూర్తమీదుండే బనాతు గుడ్డలాగు తెల్లగా వుండేది. తెల్లగా పొడుగ్గా నెరసిన జుట్టు. అంతకంటె తెల్లగా

వుంది నెరసిన గడ్డం. అతని కళ్ళు కుడా మా అందరి కళ్లలాగా కాకుండా కొద్దిగా ఆకుపచ్చరంగుగా వున్నాయి. కనుబొమ్మలు కంటిరెప్పలు కూడా తెల్లటి తెలుపే. అతను వేసుకున్నది ఇంట్లో వడకిన తెల్లటి నారగుడ్డ యిజారులాల్చీన్నీ. కంగీయ్ యజమాని ప్రొకోపీ కుడా మెకేయ్‌లాగు తెల్లగానే వుంటాడా? నేను కళ్ళు మూసుకుంటే ముసలి మెకేయ్ నా కళ్లముందర కొచ్చేవాడు. అది మారిపోయి, అమ్మ మాకు దుర్మార్గుడు కారతి-ఖాను గురించి కథలు చెపుతూండేదే — ఆ కారతి-ఖాను కళ్లముందు కొచ్చేవాడు.

ఆ దుర్మార్గుడు కారతి-ఖాను బంగారపు పిల్లని యెత్తుకుపోయి తన కోటలోపెట్టి తాళంవేసేవాడు అని చిన్ననాటి కథ గుర్తుకు తెచ్చుకోగానే మా కంగీయ్ జ్ఞాపకం వచ్చేది. ఒకనాడిలాగ బంగారపు పిల్లనీ కంగీయ్‌ని తల్చుకుంటూ వుంటే నన్నే ఎవరో పట్టుకుని యెత్తుకుపోవడం జరిగింది. పట్టపగలు మెకేయ్ కొడుకులు నన్ను తీసుకుపోయారు. ఈనాటికి కుడా వాళ్ళు నన్నెందుకు యెత్తుకుపోయారో నాకేమీ అర్థం కావడంలేదు.

నేనొక నాడు కొండమీదనుంచి యేటిలోకి గులకరాళ్లని విసురుతూంటే ఒకటి చెయ్యిజారి వాళ్ల యింటికప్పుమీద పడింది. ఒకవేళ అందుకు నాకు బుద్ధిచెబుదామనో లేకపోతే వ్యూరికినే యే తెల్లని అడవి పిల్లితోనో సీమ ఉడుత పిల్లతోనో ఆడుకున్నట్టు, నాతో ఆడుకోడానికనో నన్ను అలా యెత్తుకు పోయి వుంటారనుకుంటాను.

ఇది జరగకముందు అప్పుడప్పుడు మెకేయ్ కొడుకులు — ఒకడు వాలు కళ్ళూనూ వుంగరాల జుట్టూను పెజెన్‌దేయ్ అంత పొడుగుంటాడు, రెండో వాడు నాలాగే పొట్టిగా లావుగా వుంటాడు — మా చూమ్‌కు వచ్చి మాటలతోనూ సంజ్ఞలు చేస్తూనూ గబగబ యేదో చెప్పేవారు. వాళ్ళు

చెప్పేదంతా నాకు పూర్తిగా అర్థంకాకపోయినా వాళ్లు చెప్పాల నుకున్న ముఖ్యంమైన మాటలు మాత్రం నాకు బోధపడ్డాయి:

"నువ్వు — మా యిల్లు రా — కూలిపని చెయ్యి — బువ్వ; పని చెయ్యావా—మికిలాష్* ఇస్తాం" అనే వారు వాళ్లు వచ్చిరాని మా తువాభాషలో.

అది విని నేను వాళ్లదగ్గిరనుంచి పరుగెత్తి పారిపోయేవాడిని. కొసకి నన్ను వాళ్లు యోలాగైతేనేం పట్టుకున్నారు.

నేను మొర్రోమొర్రోమంటూ అమ్మకోసం కేకలు పెట్టాను. కాని యేమీ లాభం లేకపోయింది. నా కేకలని లక్ష్య పెట్టకుండా మొదట నా నోట్లో గుడ్డలు కుక్కడానికి ప్రయత్నించారు. తరువాత నన్ను వాళ్ల యింటి దగ్గిరనున్న దుంగగుడిసెకి తీసుకెళ్లిపోయి ఒక గదిలో పెట్టి తలుపు గడియపెట్టేశారు. ఆ గుడిసె కొయ్యదుంగలు ఒక దానిమీద ఒకటి అడ్డుగా పేర్చికట్టేరు. ఆ గదిలో పెట్టి నన్ను ఖైదుచేస్తే నా గతి బోనులో చిక్కుకున్న అడవిపిల్లితోనో బొచ్చుఉడుతతోనూ సమానం అనిపించింది నాకు. నేను నిరాశచెంది పారిపోదాం అని తలుపుదగ్గిరకీ కిటికీదగ్గిరకీ పరుగెత్తేసరికి ఆ కుర్రాళ్లు నన్ను పట్టుకుని గదిలో ఒక మూలకి ఈడ్చుకొచ్చి కూలేసేవారు.

అలాగు కొంతసేపైన తరువాత నేను స్తిమితపడినట్టు నటించాను. అప్పుడు వాళ్లు నాకు భోజనం తీసుకొచ్చి యేమిటేమిటో మాట్లాడేరు. వాళ్లు చెప్పే మాటలునా చెవిని పడినా నేను వినిపించుకోలేదు. వాళ్లు తీసుకొచ్చిన భోజనంవైపు కన్నెత్తి చూడలేదు. నాకు మా అమ్మకంటేనూ మా

---

* గుద్దులు.

బీద బిర్చిబెరడు చూమ్కంటేనూ ప్రియమైనది మరొకటి లేదనిపించింది. నాకు యేది ఇష్టమని ఆశ చూపించినా వాళ్ళ ఇంటికి వెళ్ళదల్చుకోలేదు.

ముసలివాడు మెకేయ్ నా తల నిమురుతూ తన పెద్ద బొజ్జదగ్గిరకి లాగుకొని తన చింపిరి గడ్డంతో నన్ను చక్కలిగిలి పెట్టడానికి ప్రయత్నించాడు. అతని గడ్డం నేననుకున్నంత తెల్లగా లేక అక్కడక్కడ పసుపుపచ్చ ఆకుపచ్చ చారలతో రాతిమీద మొలిచే శూకముల్లాగుంది. ఇంతట్లో నా కళ్ల ముందు ఒక ముఖమూ రెండు చేతులూ ఎదురైయాయి. పొడుగ్గా కుచ్చెళ్ల పావడా కట్టుకుని తలమీద రంగురంగుల రుమాలు వేసుకొన్న ఒకావిడె ఆ ముసలి అతని వొళ్లోనుంచి నన్ను బఱ్ఱుమని బలవంతంగా లాగేసి ముసలతని మీద సణుగుతూ అతనిని చివాట్లు వేసింది.

సాయంకాలం అయింది. చీకటిపడి రాత్రిఅయింది. ఆ కుటుంబంలో వాళ్లందరూ పండుకోవడానికి సిద్ధపడుతున్నారు. మెకేయ్‌గారి పెద్దఅబ్బాయి నేలమీద నాకోసం పడక వేసి నాకుదగ్గరంటే తను కూడా పరున్నాడు. ముసలతను ఆవిడె మరొక గదిలోకి వెళ్లిపోయారు. నాకు బాగా నిద్దర పట్టినట్టు నటించాను. కొంత సేపటికి అందరూ గుర్రుపెట్టి నిద్దరోతున్నారు. ఉప్పుపఱ్ఱలో తిరుగాడుతూన్న జంతువువెంటే దానికి తెలియకుండా వేటకాడు దాని వెంబడే ఊపిరి బిగబట్టుకుని నిశ్శబ్దంగా యెలా వెళ్లుతాడో అలాగే నేను వాళ్లందరూ గాఢనిద్రపోయేవరకు ఊపిరి బిగబట్టుకునే పండుకున్నాను.

అలాగ కళ్లుతెరుచుకునే చాలాసేపు పడుకున్నాను. అందరికీ బాగా నిద్రపట్టి వుంటుందనే నిశ్చయించుకుని మెల్లిగా జారుకోడానికి సిద్ధపడ్డాను. రాత్రి చీకటిగా నిశ్శబ్దంగా వుంది. అందరూ పెద్దగా గుర్రుపెడుతూండడంనుంచి మరింత నిశ్శబ్దంగా వున్నట్టనిపించింది.

ఎంత చిన్న చప్పుడైనాసరే విందాం అని ప్రయత్నించాను. చివరికి మూలనున్న బొద్దింకలు ఎగురుతూన్న చప్పుడు కూడా స్పష్టంగా వినిపించింది నాకు.

లేచి మెల్లిగా తలుపుదగ్గిరకి డేకిరేను. ఇంతట్లో ఒక్కసారిగా నేలనున్న బల్లకూర్పు కిర్రుమంది. నేను ఆగిపోయి పక్కమీదకి వాలేను. నాకు చేరువగా పండుకున్న మెకేయ్‌గారి అబ్బాయి దగ్గడం మొదలెట్టాడు. నేను పక్కమీదకి చేరి మళ్లీ పండుకున్నాను.

అతని దగ్గు ఆగిన తరువాత అతడు నిద్రపోతూ వున్నాడన్న సంగతి స్థిరపరచుకుని ఇందాకా కిర్రుమని చప్పుడైన బల్ల చెక్కమీద కాకుండా, మరొక చెక్కమీదకి పక్కనుంచి దొర్లి వెంటనే లేచి నిలబడ్డాను.

కిటికీ సగానికి తెరిచి వుంటే, కిటికీలోంచి అవతలికి గెంతేయడానికి నిశ్చయించుకున్నాను.

బొటనవ్రేళ్లమీద నడుస్తూ కిటికీ దగ్గిరకెళ్లి కిటికీఅంచు యెక్కి అవతల చీకటి అంధకారంలోకి దుమికేశాను.

రెండవ ప్రకరణం

ఏటి వొడ్డున

నేలమీద పడ్డాను. పడ్డ ఒక క్షణంవరకూ స్పృహతప్పిందేమో అనిపించింది. కుడికాలులో మందకొడిగా నొప్పి వున్నట్టు అనిపించింది. కాని **అతి** ఆనందం కలిగింది నాకు. నన్నిప్పుడేం చేయగలరు వీళ్లు? మెత్తగా

చల్లగా వున్న ఆ పచ్చికమీద అలాగ పడివున్నా నేను యెంత త్వరగా పరుగె త్తగలనో అంత త్వరగా పరుగెత్తి యింటికి చేరుకోడానికే నిశ్చయించుకు న్నాను. అమ్మ పాపం నాగురించి యేం బెంగ పెట్టుకుంటూాందో? నాకోసం ఎక్కడెక్కడ వెతుకుతూాందో?

లేచి పరుగెత్తుదాం అనుకున్నాను. కాని నేలమీదనుంచి లేవశక్యం కాలేదు. కిటికీలోనుంచి కాళ్లు ముడుచుకుని దుమకడంచేత కింద పడినప్పుడు పాదం బెణికిందా యేమిటి? మోకాలుని తడిమి చూసుకున్నాను. వెచ్చగా తడితడిగా చేతికి ఏమిటో అంటుకుంటూాన్నట్టు అనిపించింది. ఓహో, ఇది పచ్చికమీద వున్న మంచుకాదు రక్తమే, అని అర్థం అయింది. కాలిని చేత్తో తడుముకు నేటప్పటికి చర్మం చీరుకుపోయినట్టూ రెండుచోట్ల గాయపడినట్టూ చేతికి తగిలింది. దెబ్బతగలని కాలుతోనూ రెండు చేతులతోనూ చుట్టు పక్కల తడుముకునేసరికి కిటికీదగ్గరగా వెలికిల్లగా పడివున్న పంటినొల్ల మీద నేను పడిపోయినట్టు తెలిసింది. నేను కిందపడ్డ జోరులో నొల్లని తన్నే యడంవల్ల చివరి పళ్లు మాత్రమే నా కాలికి తగిలి గీచుకుపోయింది.

బాధ భరించ శక్యంకాకుండా వుండినా మరికాస్సేపటికల్లా అమ్మని చూడగల్గుతాను కదా అన్న సంతోషంలో బాధ యేమీ అనిపించలేదు. కిటికీ వైపు చూశాను. వెనకటిలాగే అంతా నిశ్శబ్దంగా వుంది. ఎవ్వరూ బైటికి రాలేదు.

నాకున్న సత్తువనంతటినీ కూడదీసుకుని — కిందపడిపోతూాన్నప్పుడల్లా చేతులతో పాకుకుంటూా పరుగెత్తాను.

డేకురుతూా మా చూమ్‌దగ్గరకి చేరుకొనేసరికి బిగ్గరగా అమ్మ యేడుపు, ఆ యేడుపులోనే మాటలూా వినిపించాయి:

"ఎక్కడున్నావు రా నాయనా? ఏరే నిన్ను పొట్ట బెట్టకుందో తోడేళ్లే నిన్ను నోటపడేసుకున్నా యోనురా నా బాబూ! ఓ దేవుడా! నా చిట్టితండ్రిని నాకు ఒప్పజెప్పవా? నా కడసారపు పిల్లగాడిని నా కళ్ల బడేయవా?"

"అమ్మ, అమ్మ! నేనిక్కడున్నానే!" అని నేను మెల్లిగా అన్నాను.

మా చూమ్‌కి వున్న చిన్న తలుపు తుపానుగాలికి తెరచుకున్నట్టు దభీమని తెరచుకుంది. రెప్పపాటులో అమ్మవొచ్చి నన్ను కౌగలించు కుంది. ఇంట్లోకి నన్ను యెత్తుకుని తీసుకువెళ్లి నన్ను తన గుండెలకి హత్తు కుంటూ నా తలని నిమురుతూ నా బుగ్గలనీ తలనీ ముద్దుపెట్టుకుంటూ తనలో యేమేమో అనుకుంటూంది.

చూమ్‌లో అంతా చీకటిగా వుంది. అమ్మ నన్ను తన వొడిలో మెల్లగా వూపుతూ:

"ఎక్కడికెళ్లావు నాయనా ఇంత సేపున్నూ? నిన్ను వెతకడానికి అల్బన్‌చీ వెళ్లింది స్యుర్యున్మాని తీసుకుని. నీకోసం అంతటా వెతికేం... నువ్వెక్కడికేనా వెళ్లితే నాతోనో నీ అక్కతోనో చెప్పి మరీ వెళ్ల తూండరా బాబూ!" అంది అమ్మ.

ఏటివొడ్డున జరిగినదంతా చెప్పేను. అమ్మ అంతగా గాభరాపడడం నేనెన్నడూ చూడలేదు. మోతుబరి అయిన ఆ కులాక్* మెకేయ్ తనకి యెదురు గానే నిలబడివున్నట్టు కోపంతో మండిపడుతూ:

"ఓరి పిచ్చి ముసలాడా! తెల్ల మేకగడ్డం లాగు నీ గెడ్డం నెరిసి

---

* భూమిలేని వ్యవసాయకూలీలనూ, పేదరైతులనూ దోపిడీచేసే ధని కరైతు.

వున్నా నీ హృదయం మాత్రం ఆ క్రికుక్కలాగు కారునలుపే సుమా!" అంది.

నన్ను తనకి మరింత దగ్గరగా తీసుకుని ముద్దుపెట్టుకుని:

"నువ్వు తప్ప నాకు మరెవ్వరూ దిక్కులేరు. మన చెర్లిక్‌పేన్‌ని తోడేళ్లు నోటబెట్టుకున్నాయి. షాముక్‌తై దోర-ఖెమ్ గట్టువెంట ఖామందుల దగ్గిర పనిచేయడానికి వెళ్లిపోయాడు. పెజెన్‌దేయ్ హాస్టల్లో ఉద్యోగస్థులదగ్గిర నౌఖరీకి వెళ్లిపోయాడు. ఎవడెక్కడనుంచి వచ్చినాసరే నిన్ను మాత్రం నాదగ్గిరనుంచి తీసుకువెళ్లనివ్వను!" అంది అమ్మ.

పంటినొల్లమీద పడిపోయానని తెలియగానే అమ్మ నిప్పుచేసి పాత మేకతోలు ముక్క వుంటే దాని బొచ్చుని ఊడబీకి నిప్పులమీద కాల్చి ఆ బూడిదని గాయంమీద వుంచి దానిమీద చిన్నదలెంబా* ముక్క వేసి కట్టుకట్టింది.

తాతలనాటినుండీ అనుక్రమంగా వస్తూన్న మందులనే అందరూ వాడేవారు ఆరోజుల్లో. గాయపడ్డాకాలినా దానిమీద వెంద్రుకలు కాల్చిన బూడిద చల్లడం లేకపోతే మందు ఆకులను కట్టడం. లామాని పిలిచి మందిప్పించడానికి పేదవాడిదగ్గిర డబ్బెక్కడిదీ? షామాన్ భూతవైద్యుడు మాత్రం చవుకగా వచ్చేవాడా? నాకు బాగా జ్ఞాపకం వుంది: ఒకమాటు వర్షం పడివెలిసిన తరువాత మేం కొండ మీద ఆడుకుని నేను అలిసిపోయి నేలమీద పడుకున్నాను. ఆమరునాడు నాకు కలవరింతలుతో జ్వరం వచ్చింది. భూతవైద్యుడు కోసం స్యుజుక్-ఖెమ్‌కి అల్బన్‌చీ పరు

---

* దళసరి దూది.

గెత్తింది. ఈలోగా అమ్మ ఇల్లంతా ఊడ్చి టీ తయారుచేసి సిద్ధంగా వుంచింది. స్యుజ్యుక్-ఖేమ్ రాగానే వొంగి దణ్ణం పెట్టింది. భూత వైద్యుడు అటూ ఇటూ పరికించి చూసి ఒక నిమిషం వూరుకుని ఆవులింత ఆవలించి:

"నేను ఇంతా శ్రమతీసుకుని మంత్రంచల్లడానికి వస్తే నువ్వు ఇన్ని టీనీళ్లతో నన్ను సంతృప్తి పరచదల్చుకున్నావా? నేనేదో ఇంత దూరమూ తొందరగా రావడానికి తేరగా కూచున్నాన నుకున్నావు కాబోలు?" అన్నాడు.

అంటూ వెళ్లిపోతానన్నాడు. కాని అమ్మ యేవో కొన్ని వస్తువులని పోగుచేసి ఒక మూటలో కట్టి అతనికిచ్చింది. దాంతో స్యుజ్యుక్-ఖేమ్ నాకు చికిత్స చేసేందుకు ఆగేడు. కాని అతనికేం మనస్కరించలేదు: తను గాజుల నైనా గిలగిల మనిపించలేదు. సంచీలోనించి ఢక్కానైనా పైకి తీయలేదు. అతడు చేసిన చికిత్స అంతా ఆధ్యాత్మిక చికిత్సే: మూతిబిగించి నాలుగుసార్లు వుమ్మి వూశాడు; మూడుసార్లు వేలితో నా రొమ్ముమీద పొడిచాడు. వెళ్లిపోయాడు అంతే! మూడు రోజుల పాటు విధివిరామం లేకుండా అమ్మ నాకు ఉపచారం చేసి తన చేతనైనంతవరకూ ఆమె మనసుకి యేది మంచిదని తోస్తే ఆప్రకారంగా మందూ మాకూ ఇస్తూ నన్ను విడవకుండా నాదగ్గిరే వుండి పోయింది.

నా కాలు త్వరగా నయం అయిపోయింది. అల్బన్‌చీ అక్కడా అక్కడా పనులుచేసుకుని తిరిగి రాగానే ఈ చోటనుంచి మకాం యెత్తేసి మరొక ప్రాంతానికి వెళ్లిపోడానికని అమ్మ అన్ని యేర్పాటులు చేయడం మొదలెట్టింది. తెర్‌జీగ్‌నది ముఖద్వారం దగ్గిర గుడిసె వేసుకుందాం అని నిశ్చయింకున్నాం. ఏ పటాటోపం లేకుండానే నడిచే ప్రయాణంచేశాం. తాష్-చలాన్ కాని

తోజు-హెలిన్ కాని ప్రయాణం చేసేటప్పుడు యూర్త విప్పేసి, దాన్ని మరొక చోట కట్టడానికి నిట్రాళ్ళూ స్తంభాలూ గుంజలూ ద్వారబంధాలూ కిటికీలు దాని కప్పుమీద బనాతుగుడ్డా తోలు సంచులూ, బంగారపు బందులతో అలంకరించి యెర్రటిరంగు వేసిన కావడిపెట్టెలూ, ఈ బరువులన్నింటినీ మోస్తున్న గుర్రాలూ పశువులూ, ఇవేవీ మాముందు నడవడం లేదు. పాడి ఆవులు, కొండగోవులు అంబాఅనికాని, మేకలు గొర్రెలు 'మే—మే' అనికాని అరవనూ లేదు. కొసకి పరివారం వెంటనున్న కుక్కలేనా మొరగడం లేదు. మా చూమ్ కప్పుమీద వేసిన బిర్చిబెరడు పట్టాని అమ్మ లాగేసి, దాన్ని చుట్ట చుట్టేసి నా వీపుమీద వేసి కట్టేసింది. మాకువున్న పాత్రసామానూ బట్టలూ ఇంకా పనికి వచ్చే వస్తువులు అన్నింటినీ మూటలు కట్టేసి అమ్మ అల్బాన్‌చీ భుజంమీద వేసేసుకున్నారు.

మా అమ్మ ముందు. అమ్మవెనక స్యూర్యూన్మాని యెత్తుకుని అల్బాన్‌చీ, తరవాత నేను — దాంతో మా పరివారం పూర్తి అయిపోయింది. కా-ఖెమ్ గట్టంటే నది ఎగువగా నడిచాం. చిన్నపిల్లగాలైనా వెయ్యడం లేదు. గుల కరాళ్లమీద ఏరు పారుతూంటే గలగలమని చప్పుడు స్పష్టంగా వినిపిస్తూంది. కా-ఖెమ్‌నది తన గట్లని ఊటలు ఊరేటట్టు నీటితో తడుపుతూ గట్లపైన పచ్చులతివాచీ పరచినట్టు దట్టమైన చిగురుటాకుల గున్నలతోనూ పచ్చిక పొదలతోను నింపి ఆగట్లకి ప్రాణదానం చేస్తూంది. దేవదారు వృక్షాల మీద కాని పోప్లరుచెట్లమీద కాని సంగీతపు మొక్కలమీద కాని ఒక్క ఆకైనా ఆడడం లేదు. తెల్లటి మంచుతెలుపుగల చెర్రీ పువ్వుల రేకులలో ఒకటైనా కదలడం లేదు. ఈ నిశ్శబ్దాన్ని ఛేదించుకొని, ఆకాశంలో పక్షులు కా-ఖెమ్‌లో చేపలు మాత్రమే అప్పుడప్పుడు చప్పుడు చేస్తున్నాయి. మగబాతు ఒకటి తన

రెక్కలతో నీటిని చరుస్తూన్న చప్పుడూ, నీటిలో వున్న తెల్ల చేప తూరీగని చూసి నీటిలోనుంచి గాలిలోకి మొగ్గవేసి తన తోకతో ఆ నీటిని ఛెళ్లని చరిచిన శబ్దమూ, రాళ్లబండలమీదనుంచి నీళ్లు దొర్లి పడుతూ నురగలని కక్కుతూ గర్జిస్తూన్న రణగణధ్వనీ, — ఇవి తప్ప అంతా నిశ్శబ్దమే.

ముఖంమీదనుంచి చెమట ధారలు కట్టి కారుతూన్నా నవ్వుతూనే అమ్మ నడుస్తూంది. వీపుకి సులువుగా వుండేందుకు తన వీపుమీద వున్న మూటను భుజాన్ని యెగరేసి సర్దుకుంటూ ఉండివుండి మాతో అంటూం దేది అమ్మ:

"మన సంగతులిలా వున్నాయి. ఫరవా లేదు. రష్యనువాళ్లు కాపురా లున్న కొత్త స్థావరాల్లో మనమూ హాయిగా సౌఖ్యంగా బతకొచ్చు."

గుర్రాలమీద సవారీచేస్తూన్న రౌతులు ఇద్దరు హఠాత్తుగా మాకు కనిపించారు. గుర్రాలని అతిత్వరితంగా పరుగెత్తించుతూ ప్రయాణం చేస్తూన్నారు.

"తుజుమేత్లు ఆ వస్తూన్నవాళ్లు!" అని అమ్మ కేకేసి చప్పున పరు గెత్తుకెళ్లి పక్కనవున్న గుట్టమీద తన మూటని దింపుకుని మూట తాళ్లని భుజాలమీదనుంచి జార్చేసుకుని, మూటని అక్కడే వుంచేసి, వస్తూన్న ఉద్యోగస్థులకి యెదురుగా వెళ్లి రోడ్డు పక్కగా మోకాళ్లమీద పడి దణ్ణం పెట్టింది. అక్కడకి దగ్గిరగానే వున్న అడవిగులాబీ పొదలవెనక మేందా క్కని యేంజరుగుతుందో అని గట్టిగా వూపిరి తీయడానికి కూడా భయ పడి చూస్తూన్నాం. అమ్మవున్న చోటకు ధూళిమేఘాలు సమీపించాయి. ఆ ధూళి మేఘాల్లోనుంచి మంచి బలమైన రెండు గుర్రాలు నాకు అగుపిం చాయి. ఆ రౌతులు వేసుకున్న పట్టు అంగరఖాకోట్లు సూర్యకిరణాలలో

తళతళమని మెరుస్తున్నాయి. రికాబులమీదా కళ్లేలమీదా వున్న వెండి అలంకారాలు కాంతులను వెదజల్లుతున్నాయి. వాళ్లలో వాళ్లు పందేలు వేసుకుంటూన్నట్టు గుర్రాలని నాలుగు కాళ్లు ఎగరేయించి పరుగెత్తిస్తున్నారు ఆ రౌతులు.

ఆ ఉద్యోగస్థులలో ఒకతడు అమ్మకు యెంత దగ్గిరగా తన గుర్రాన్ని ఆపేడంటే, ఆ గుర్రం మరొక్క అడుగు కసక ముందరకు వేసివుంటే దాని కాళ్లకింద అమ్మ నలిగిపోయి వుండేదే. గుర్రం తన మెడని పైకి ఎగరేసేటట్టు కళ్లేలను గట్టిగా లాగిపట్టి కీచుగొంతుకతో:

"కుళ్లులంజముండా! ఎక్కడికే యిలా దొర్లుకెళుతున్నావు? ప్రజలని వేపుకుని తినడానికి మళ్లీ బయలుదేరేవ్వా?" అని తిట్టాడు ఆ రౌతు.

అమ్మ రోడ్డుమీదే సాగిలపడి దణ్ణంపెడుతూ తడుముకోకుండా:

"తెర్‌జీగ్ ముఖానికి పోతున్నాను దొరా. అక్కడ గుడిసె వేసుకుని అక్కడున్న జనందగ్గిర కూలి చేసుకుని నా పిల్లలకింత తిండి బెడదామని..." అంటూండగానే ఆ ఉద్యోగి:

"మాయలమారి ముండా! నువ్వు ఎక్కడికి వెళ్లుతున్నావో ఎందుకు వెళ్లుతున్నావో మాకు తెలీదనుకున్నావా?" అని తన రాగిపొన్ను కోరడాని విసిరి కొట్టేడు అమ్మని. గాలిలో యెగురుతున్న కందిరీగలాగు ఆ తోలు జాటి ఫీంకారం చేస్తూ అమ్మ వొంటిని చుట్టుకుంది. రౌతులిద్దరూ తమ గుర్రాలను వెనకటి రెండు కాళ్లమీదనూ నిలబెట్టించి గిర్రున మళ్లించి ఆతర్వాత చెట్లలో అదృశ్యమై పోయారు.

అమ్మ నేలమీదనుంచి లేచింది.

దాగివున్న చోటనుంచి మేం పరుగెత్తుకుని ఆమెదగ్గరకి వెళ్లాం. చెమటతో తడిసిన ఆమె ముఖంనిండా ధూళి అంటుకుపోయి వుంది. ఆమెవైపు చూశాను నేను. ఆ కళ్లలో కఠినత్వం కోపంనిండి వున్నాయి.

"అమ్మా! వాళ్లు నిన్ను ఎందుకు అలా కొట్టేరే?" అని అడిగేను.

నన్ను ఊరడించడానికిగాను:

"వాళ్లు వెళ్లుతూన్న దారికి మనం అడ్డుగావచ్చి వాళ్ల పనులకి ఆటంకం కలిగించేం. రాచకార్యంమీద ఉద్యోగి ఎవరైనా గుర్రంమీద తొందరగా వెళ్లుతూన్నప్పుడు యెవ్వరూ రోడ్డుపక్కనీ రోడ్డుకు దగ్గరగానూ నిలబడకూడదు. నిన్ను చూచి వాళ్లుదగ్గరకు రమ్మనమని వారు ఆజ్ఞాపిస్తేనే, అప్పుడేనా మోకాళ్లమీదపడి దండాలు పెడుతూ వాళ్ల సమక్షంలోకి వెళ్లాలి. నేనేమో రోడ్డుమీద అడ్డంగా దణ్ణంపెడుతూ సాష్టాంగపడటం మూలంగా ప్రభువులకి నామీద ఆగ్రహం కలిగింది మరి. నన్ను చూసి వారిగుర్రాలు బెదరిపోయి వుంటాయి కుడాను. పదండి మనం గబగబ వెళ్లిపోదాం ఇక్కడనుంచి. లేకపోతే మనమాటలు వాళ్ల చెవిని పడ్డట్టాయెనా మన్ని చంపేస్తారు" అని సంగతులనన్నీ మాకు బోధపరుస్తూ చెప్పింది అమ్మ.

ఇదంతా చెబుతూనే తన మూటపట్టీలని చేతులలోనుంచి భుజాలమీదకి మార్చుకుని మూటని వీపుమీద వేసుకుని బయలుదేరింది. మేమూ మా మూటలను వీపుమీద కట్టుకుని అమ్మవెంటే ప్రయాణం సాగించాము.

మూడవ ప్రకరణం

మాకు కొత్తవాళ్లతో పరిచయం

కా-ఖేమ్‌నది వొడ్డున తెర్‌జీగ్ కలిసే చోట బోదలనుంచి తారు ఓడుతూన్న దేవదారు మహావృక్షాల మధ్యను చూమ్ కట్టుకున్నాం. కొద్ది రోజుల క్రితమే ఆ డెల్టాలో కొందరు రష్యను రైతులు — అంతా ఐదారు ఇళ్లవాళ్లు — నివాసాలు యేర్పరచుకుని జీవిస్తున్నారు.

ఊస్త్-తెర్‌జీగ్ వాస్తవ్యులు కట్టుకున్న పూరిళ్లను చూసి నాకు అదేమిటో అనిపించింది. వాళ్ల ఇళ్లదగ్గిరంటూ వెళ్లడానికే నాకు మనసొప్పలేదు. వాటిని చూస్తూంటే నాకు మెకేయ్ కొడుకులే గుర్తుకొచ్చారు. పూరి ఆవలి చివరకి వెళ్లాల్సివచ్చినప్పుడు, ఇళ్లముందునుంచి వెళ్లడానికి బదులు నేను ఆ పూరిళ్ల వెనకాతల చుట్టూ ప్రదక్షిణం చేసి అడుగడుక్కీ జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్లేవాడిని. అయినా ఆ ఇళ్లల్లోకి వెళ్లి ఈ కొత్త వాళ్లు యెలా జీవిస్తున్నారో వాళ్ల ఆచారాలేమిటో తెలుసుకుందాం అని నాకు చాలా కోరికగా వుండేది. రష్యను పిల్లలు ఆటలాడుకుంటూంటే నేను దూరంనుంచే వాళ్లు యెలా ఆడుకుంటున్నారో జాగ్రత్తగా కనిపెడుతూ వాళ్ల ఆటలనీ చేతలనీ అర్థంచేసుకుని జ్ఞాపకం వుంచుకోవడానికి ప్రయత్నించేవాడిని. నేను అనుకోకుండానే ఒకసారికంటే మరొకసారి వాళ్లకి దగ్గర దగ్గరగా వెళ్లుతూ వాళ్ల భాషలో మాటలని ఒకసారికంటే మరొకసారి మరింత బాగా అర్థంచేసుకునేవాడిని. వాళ్లుకూడా నావైపు చూడడం మొదలుపెట్టారు. వాళ్లలో మొట్టమొదట వాన్యక రోదిన్‌తో నాకు

స్నేహం కుదిరింది. అతను తనంతటతానే ఒక్కడూ గొరొడ్కి* ఆడుకుం టూంటే ధైర్యంచేసి వెళ్లాను ఆ కుర్రాడి దగ్గిరకి. అతన్ని చూడగానే అతడు నాలాగే బీదవాడని నాకు తోచి అతనంటే నాకు ఆసక్తి కలిగింది. వేసవి కాలంలో వాతావరణం యెలాగ వున్నాసరే, వొంటిమీద చొక్కా లేకుండానే వుండి ఇంట్లో వడికినేసిన కొరానారగుడ్డతో కుట్టి మోకాళ్లమీద అతుకులున్న పొట్టి లాగూ తొడుక్కొనేవాడు. గొరొడ్కి ఆడు తూన్నప్పుడు తన కర్రను గురిపెడుతూంటే అతని పొడుగాటి కాళ్ళు భూమిలోకి దిగిపోతున్నా యేమోనని అనింపించేది. సన్నని అతని శరీరాన్ని చం ద్రవంకలాగు వెనక్కి వంచి, కోలగావున్న తలమీద దట్టమైన బంగారపు ఛాయ శిఖలు గాలికి ఇసుకతిన్నెమీద వంగినదర్భ గడ్డిలాగున ఒకపక్కగా వంగి పడిపోయేవి. తొందరపడకుండా నిదానంగా గురిపెట్టేవాడు. కాని తన కర్రని యెంత బలంతో విసరేవాడంటే అది ఈలవేసినట్టు గాలిలోనుంచి వెళ్లి కొయ్యచీలలకు తగిలేసరికి మొదటి దెబ్బకే అవి యెగిరి చుట్టూగీసిన గీరను దాటి అవతల పడేవి. గురిపట్టడంలో అతనితో పోటీపడుతూనే అతనితో స్నేహం చేసేటప్పటికి అతనికి ఒకకన్ను గుడ్డి అని తెలిసుకుని అత్యాశ్చర్యం వేసింది నాకు. అతని స్నేహితులందరూ అతన్ని "ఒంటికంటి వాన్యక" అని పిల్చేవారు. అతని ముఖంనిండా స్ఫోటకం మచ్చలుండడంవల్ల అతనితో పోట్లాడి అతనిమీద కోపం వచ్చినప్పుడల్లా అతని స్నేహితులు అతన్ని "అమ్మ వారు మచ్చలు" అని వెక్కిరించేవారు. వాళ్లెవ్వరూ అతనితో చెయ్యిచెయ్యి చేసుకోవడానికికాని అతనిమీద ఎదురు దెబ్బతియ్యడానికికాని భయపడినా

---

* రష్యను క్రీడ.

కొందరు మాత్రం అతని పేదదుస్తులుని అంగవైకల్యాన్ని చూసి వెక్కిరిం చేవారు. నేను తొడుగుకున్నదుస్తులు కూడా నాకు సరిపడక బాగా పొట్టివిగాను బిగుతుగాను వుండడంచేత యెగతాళి చేసేవాళ్లనుండి యేమాత్రం కనికరం కూడా ఆశించకూడదనే నేను నిశ్చయించుకున్నాను. దాంతో మాకిద్దర మధ్య వుండిన మొగమోటం పోయింది. కొంతమంది కుర్రవాళ్లు మా ఇద్దరి పక్షం వహించేవారు. వీళ్లతో కలిసి మేము మిగత వాళ్లతో పోట్లాడేవాళ్లం.

నా కొత్త స్నేహితులు చొప్పతోనేసిన పూరిగుడిసెలలో నివసించేవారు. నాకు మాత్రం ఆ పూరిగుడిసెలే మహా సౌధాలలాగుండేవి. ఎంచేతంటే యూర్త లతోకాని చూమ్‌లతోకాని పోల్చిచూస్తే ఇవి యెంతో విశాలంగానూ వెల్లడి గానూ వెచ్చగానూ వుండేవి. ఈ ప్రాంతంలో కొత్త ప్రజలనే కాకుండా అద్భుత మైనటువంటివి అనేక వస్తువులని చూశాను. మా యింట్లో కొయ్యగిన్నె ఒకటి అడుగు అంతా మసితో నల్లబడిపోయి ఒకపక్క బీటవారిన పాత ఇనుపగిన్నె ఒకటి మాకున్నాయి. బూడిదెరంగు కర్రచిప్ప కూడా ఒకటి మాకుంది. తైగాలో లెక్కలేనంతమంది దారంట పోయేవాళ్లకి మా అమ్మమ్మో మా అమ్మో ఆ చిప్పతో దాహం ఇస్తే ఆ చిప్పని అందుకుని దాహం తీర్చుకువేవారు. ఎంతోమంది బాటసార్లు దానితో దాహం తీర్చుకొని వుండడంవల్ల ఆ చిప్ప అంచులు బాగా అరిగిపోయాయి. మేము భోజనం చేసేటప్పుడు ముఖ్యంగా వరిగెబొరుగులని టీనీళ్ల ఆవిరిలో తడిపిపెట్టి దానిలో ఎన్నో కోసుల దూరాన్నుంచి యేఉప్పు కొండనుంచో యే ఉప్పు పరన్నునుంచో అపురూపంగా తెచ్చుకొన్న ఉప్పును చల్లి ఆబువ్వని తినేవాళ్లం. ఇక్కడ పెద్ద మట్టిపొయ్యిల్లోవున్న గింజలని సన్నగా విసిరిన పిండితో గుండ్రంగా ఎర్రటి పెచ్చుకట్టిన పెద్ద బువ్వని తయారుచేస్తారు. ఒక మాటు తయారుచేస్తే ఈ బువ్వ కొన్ని

దినాలపాటు సరిపోతుంది. పీళ్లలాగే నాకు కూడా ఈ బువ్వని 'బ్రెడ్డు' అనడం నేర్చుకున్నాను. నాలుగు రోజులైయాక దీన్ని తింటేకాని మరి నాకు ఆకలి తీరేది కాదు. వెనకటిరోజుల్లో మేర్గెన్‌యేరు దాటవలసిన అవసరం కలిగినప్పుడే స్నానమంటూ చేశేవాడిని. ఇక్కడలాక్కాదు. ప్రత్యేకంగా వేరే ఇంట్లో వేడినీళ్లతో స్నానంచేస్తారు ఇక్కడవాళ్లు. అలాంటి ఇంట్లోకి వాన్యక నన్ను తీసుకువెళ్లాడు. అప్పుడే 'స్నానపుయిల్లు' అన్న పదాన్ని నేను నేర్చుకున్నాను.

మొదటసారి స్నానం చెయ్యడం నాకొక భయానకమైన అనుభవంగా మనసులో నాటుకుపోయింది. ఆ ఉదంతం ఇలా జరిగింది. వాన్యకా నేనూ ఆడుకుంటున్నాం. ఆడుకుంటూ ఆడుకుంటూ వాన్యక నా వెనకాలనుండే వచ్చి నా వాలుజడని పట్టుకొని మీదకి విసిరేడు.

"ఒరే అబ్బాయ్! నీ రోజులు మూడేయి రోయ్! నీ పిలకకింద పెద్ద పేలపుట్టకి పేలపుట్టా వుంది రోయ్! ఈ పాళంగా దానికి నువ్వు ఆవిరి పెట్టకపోతివా మా అందరి కొంపలూ ముంచుతావు, పదపద!" అంటూ గావుకేకలు పెట్టి నన్ను చేతితో పట్టుకుని బరబర ఆ స్నానాల ఇంటివైపు యీడ్చుకు పోయాడు.

"అమ్మా అమ్మా! చూడు వీడి పిలకజడకింద యేముందో. గుప్పెటతో గుప్పెడేసి తీస్తూంటాడు ఒక్కొక్కసారి. ఇక వీడి గుడ్డలు! రోడ్డు మీదవున్న రాళ్లపైన గుడ్డల్నిపడేసి గుడ్డలమీద రాతితో గట్టిగా రాసేసరికి ఆ కీటకాలన్ని పండిన వాకపళ్లలాగు పేలి చస్తాయి. వీడిని యేం చెయ్యాలి అమ్మా?" అని వాళ్లమ్మని కేకేసి పిలిచాడు.

వాన్యక తల్లి వచ్చి గుమ్మంలో ఒక్క క్షణం ఆగింది. మామూలుగా కఠినంగా ఉండే ఆమె తెల్లని ముఖంమీద ఒక నిమిషంపాటు నవ్వు కనిపిం

చింది. ఆవిడె ఇంట్లోకి వెళ్లి కొన్ని శుభ్రమైనబట్టలూ ఇంకా యేదో ఎరుపు వాగుగా వుండి కొద్దిగా మాడిన పిష్టాక్* ముక్కలా వున్న వస్తువునీ తీసు కొచ్చి వాన్యకకిచ్చి వెళ్లిపోయింది. వాన్యక నవ్వుతూ నా భుజంమీద చరిచేడు.

"నీళ్లగది దగ్గిరకి రా!" అంటూ అక్కడకు కాస్తదూరంలో వున్న కందకంవైపు పరుగెత్తాడు.

సాయంకాలం చలిలో గుడ్డలు విడిచేస్తే చలివేయకుండా వుండడాని కని కొంచెం వెచ్చదనం కలిగేటందుకు పరుగెత్తుతున్నాడు కాబోల్సు తరువాత కందకంలోవున్న చలమ నీళ్లను తన వొంటిమీద పోసుకుంటాడనుకున్నాను. సరే తొందరెందుకు మన నేస్తం యేమిటి చేస్తాడో ముందు చూద్దాం కదా అని అనుకుంటూ నేను అతని వెంటతాపీగానే వెళ్లాను. నాకోసం వాన్యక కందకం పక్క నున్న నల్ల గుడిసెదగ్గిర కాచుకునున్నాడు. ఆ గుడిసె చిన్నది. కిందనుంచి మీదవరకు పొగచూరిపోయి నల్లగా వుంది. ఆహూఅలమూ కాలు తూన్నట్టు పొగవాసన వేస్తూ వుంది.

ఆ గుడిసెలోకి తీసుకెళ్లాడు వాన్యక నన్ను. లోపల వేడి ఆవిరి పొగర్లలో కిటికీమీద మిణుకుమిణుకుమంటూ చిన్న వొత్తిదీపం ఒక్కటి మండు తుంది. కుడిచేతిపక్క మూలగా నల్లని రాళ్లకుప్పమీద కొండ కనుమల్లో అక్కడక్కడ కనబడే పెద్ద గుండ్రాయి మాదిరిగా వున్న గుండిగ ఒకటి నిలబెట్టి వుంది. దానిదగ్గిరసంటా నీళ్లపీపా ఒకటుంది. వెనకగోడదగ్గిర కర్ర చెక్కలతో యెత్తుగా అటకల్లాగున్నాయి బెంచీబల్లలు. వాటి ఉపయో గం నాకు తరువాత తెలిసింది. ఈ పాకలోని యేర్పాటులని నేను పరిశీలిస్తూం

---

* తువాప్రదేశంలో తయారుచేసే దళసరిగా పొంగే జొన్నముక్క.

ఠగా తను తీసుకువచ్చిన వస్తువులని ఒక బెంచీమీద పెట్టాడు వాన్య్క. హఠా త్తుగా నా వెనకాలే ఏదో కత్తిరతో కత్తిరించినట్టు చటిక్కుమని చప్పు డైంది. నేను గిర్రని తిరిగి చూసేసరికి వాన్య్క చేతిలో నల్లని పిలకజడ వుంది. చచ్చిన పసిరికపామును తోకతో పట్టుకున్నట్టు దాన్ని వాన్య్క పట్టుకుని మండుతూన్న ఆ రాతిపొయ్యి ఎర్రని వెల్తురులో వేలాడించాడు. తన మంచి కంటితో నన్ను ఉసికొల్పుతూన్న చూపుతో పరిహాసంచేస్తూ ఆ జడను పొయ్యిలో గిరవాటేశాడు. అలవాటుకొద్దీ చేత్తో నా తలని తడుముకున్నాను. నా పిలక ఎగిరిపోయింది! నేను చంగుమని ఒక్క గెంతుగెంతి కుస్తీఆటలో తను ఓడిపోయినప్పుడు పెజెన్‌దేయ్ అరచేవాడే అలాగు నేను ఎంత బిగ్గరగా కేకవెయ్యగలనో అంత బిగ్గరగా:

"ఫో! నా ఎదుటనుంచి ఫో!" అని కేకవేశాను.

వాన్య్క వెళ్లిపోక అక్కడే వుండిపోయి భయంతోనూ ఆశ్చర్యంతోనూ మిడిగుడ్లు పెట్టుకుని నావైపు చూశాడు.

"ఉండు నీ పని పట్టిస్తాను!" అని నేను అరుస్తూ వాన్య్క మీదకి ఎగిరిపడ్డాను.

నన్ను మోసం చేసినందుకూ, నాకు చేసిన ఘోరమైన అపచారానికీ, మా స్నేహాన్ని భ్రష్టంచేసినందుకూ అతనిమీద కసి తీర్చుకోకుండా నేను వుండలేకపోయాను. నేను అతన్ని యెన్నిదెబ్బలు కొట్టినా నన్ను ఒక్క దెబ్బ అయినా కొట్టలేదు. గాబరా పడుతూన్న గొంతుకతో:

"కొట్టకు! కొట్టకు!" అని అతడు అనడం ఒక్కటే నాకు వినిపించింది. నేను కోపావేశంనుండి తెలివి తెచ్చుకుని అక్కడనుంచి పారిపోదాం

అని పరుగెత్తబోయాను. కాని వాన్యక నావెంటే వచ్చి తలుపుదగ్గిర నా చెయ్యి పట్టుకుని:

"చెవికోసిన మేకలాగు యెందుకలా కేకలూ బొబ్బలూ పెడుతున్నావు? నెమ్మదిగా ఆలోచించుకుని మగకుర్రాళ్ళు జడలు వుంచుకోరనీ ఆడపిల్లలే జడలుంచుకుంటారనీ అర్థంచేసుకోడానికి ప్రయత్నించు. నన్ను చూడు. రోద్యకని చూడు. ఎపిష్కని చూడు. ఎదిగి పెద్దవాడైన కుర్రాడెక్కడేనా పిలకజడ వుంచుకుంటాడా? చూడు! నువ్వు కట్టుకున్న గుడ్డలని విడిచే. వాటిని ఆ గోలెంలో పారెయ్యి. ఆ గోలెంనిండా నేను వేడినీళ్ళు పోస్తాను" అన్నాడు.

నా జన్మంలోకల్లా అదే మొట్టమొదటిసారి స్నానం. ఏడుపులూ నవ్వులూ! అంతసేపూ వాన్యక నవ్వుతునే వున్నాడు. పోట్లాడుకున్న తరువాత మళ్ళీ యథాప్రకారంగా స్నేహం కుదిరిపోయేటట్టుగా ఒకరినిమించి ఒకరం నవ్వడం మొదలెట్టాం.

వాన్యక ఆ నూనె దీపాన్ని కొంచెం పెద్దది చేశాడు. బట్టలుంచిన గోలెంలోవున్న వేడినీళ్ళతో నా చేతులనీ ముఖాన్నీ కడుక్కొని చాలాసేపు స్నానం చేశాను కాబట్టి అంతటితో స్నానం ఇక చాలించొచ్చు అనుకుని, వాన్యకని పొడిగుడ్డల్ని ఇమ్మని అడిగేను. అది విని డొక్కలు కొట్టుకుంటూ నవ్వు పట్టలేక నేలమీద దొర్లడం మొదలెట్టాడు వాన్యక. తరువాత వాన్యక నవ్వు ఆపుకొని ఆ గుండిగలోవున్న వేడినీళ్ళని పీపాలోవున్న చన్నీళ్ళతో మరొకతొట్టెలో తడిపి తన తలపైన ఎరుపు కణికెతో రుద్దుకొనేసరికి తెల్లటి నురగటోపీ ఒకటి అతని తలమీద ప్రత్యక్ష్యం అయింది. దాన్ని చూసి ఇక నావంతు నవ్వడం మొదలైంది. కాస్సేపటికి నేనూ వాన్యకనే అనుసరించాను. ఓహో! సబ్బు అంటే ఇదా! ఎర్రగా చిన్న కణికె. రుద్దుకుంటేనురగ వస్తుంది.

ఇద రమూ దాన్ని రాసుకుని రుద్దుకున్నా ఆ కణికె అరిగిపోకుండా మా చేతుల్లో ఎప్పటిలాగే వుంది. అరే, ఎంత గమ్మత్తుగా వుంది! గమ్మత్తు గమ్మత్తు అంటూనే వున్నాను నా కళ్లలో అమాంతంగా విషంపడి కళ్లు భగ్గుభగ్గున మండిపోవడంతో ఆ గమ్మత్తు అంతా ఒక్క సారిగా అంతం అయిపోయింది. ఇంకేముంది, కళ్లల్లో విషంపడిపోయి ఇక జన్మంలో మరి కళ్లు విప్పలేను, మరిక కళ్లు విడవు అని నిశ్చయించేసుకున్నాను. నన్ను మళ్లీ మోసంచేసి యీ మహావిషాన్ని నాకిచ్చాడని నా నోటికొచ్చినట్లు తిట్టాను. ఒంటికంటి వాన్యకను మరొకసారి నమ్మేనే అని నేను నన్ను తిట్టుకున్నాను. తనలాగే నేను కూడా గుడ్డివాడిని అవాలని నన్నిలా దగాచేశాడు! వాన్యక నన్ను తన చేతితో పట్టుకున్నాడు, కాని నేను గుడ్డివాడిని అయిపోవడంచేత కళ్లు విప్పి అతని చేతిలోనుంచి విడిపించుకోలేకపోయాను. కోపావేశంతో కాళ్లని నేలమీద కొట్టాను. బొబ్బలు పెట్టాను. ఈ బీభత్సం చేయడంలో నా మీదనుంచి ధారగా పడుతున్న నీటిని నాలుగు గుటకలు మింగేను.

"కళ్లు విప్పు!" అని వాన్యక అన్నాడు బిగ్గరగా. అలాగ అంటూనే నామీద వేడినీళ్లుపోస్తూ నా తలనీ ముఖాన్నీ తన చేతితో తుడిచాడు.

కళ్లు విప్పి, అరే! అంతా యథాప్రకారంగానే నా కళ్లకి కనిపిస్తూందే అని ఆశ్చర్యపడ్డాను: కళ్లలో యేమాత్రం నొప్పి లేదు సరే కదా వొళ్లు అంతా వెచ్చగా మంచి సరదాగా శమనగా వుంది కూడాను. ఈ మాయా కుటీరంలో ఇంకా యేమి ఇంద్రజాల మహేంద్రజాలాలు చేసి చూపిస్తాడో వాన్యక? పెద్ద నారకట్ట తీసుకుని – వాన్యక శిరస్సుమీదవున్న బంగారపు జుట్టు లాగే అది పచ్చగా విదిల్చివుంది – దాన్ని నీళ్ల తొట్టెలోవున్న వేడినీళ్లలో జలజలమని ఇటూ అటూ ఆడించేటప్పటికి నీళ్ల తొట్టెనిండా అంచువరకూ

నురగతో నిండిపోయింది. ఆ వేడినురగని నా భుజాలమీద చరచి నా మెడనీ గొంతుకనీ వీపునీ ఆ నారతో రుద్దేడు. వాన్యక చేస్తూన్నదంతా సరియై నదేననీ గొరొద్కీ ఆటలో యెంత నేర్పరో స్నానం చేయించడంలో కూడా అంత నేర్పరేనని నాకప్పుడు తెలిసింది.

ఆవేళ మా చూమ్‌కి నేను తిరిగి వెళ్లిపోతూ మహాగాభరాపడ్డాను. నా జడలేకపోవడం, యీ కొత్తరకం దుస్తులూ వేషం చూసి అమ్మ యేమం టుందో యేంచేస్తుందో?

నేను చెప్పినదంతా విని జరిగినదంతా బాగానే వుంది అంది.

రోజుకి యేదో కొత్త విశేషంతోనూ కొత్త ఆటలతోనూ ఇట్టే గడిచి పోయాయి రోజులు. ఆ పిల్లకాయలతో ఆడుకుంటూ ఆరబైటనే గడిపే వాడిని దినం అంతా. మేక ఎముకలతో గొణ బిళ్ల ఆడుతూనో లప్తా బంతాట ఆడుతూనో, గొరొద్కీ ఆడుతూనో లేకపోతే యేట్లో ఈదుతూనో తెర్‌జీగ్ కా-ఖెమ్‌ల లోయల్లో కొండలమీద అడవి పువ్వులను యేరుతూనో ఎర్ర కరంటు నల్లకరంటు చెట్లపొదల్లో దూరుతూనో స్ట్రాబెర్రీ పళ్లతో అలరారుతూన్న పచ్చిక బయళ్లలో తిరుగుతూనో వేసవికాలం అంతా గడి పేం. మంచుమీద స్లెయ్ బళ్లలో కూచుని జారడం, మంచుకొండలమీద నుంచి స్కీలమీద జారుతూ పరుగెత్తడం, గడ్డకట్టుకు పోయిన కా-ఖెమ్ మీద కొయ్యస్కేట్సుతో పరుగెత్తడం — వీటితో చలికాలం అంతా గడచిపోయింది.

నిన్నకాక మొన్నటివరకూ మోతుబరి మెకేయ్‌గారి అబ్బాయిలంటే భయ పడిపోయే వాడినే అటువంటిది యీ రష్యను కుర్రాళ్లంటే నాకు భయం లేకపోవడమే కాకుండా నాలుగు రోజులు వీళ్లని చూడకుండా వుంటే మరి నాకు యేమీ తోచేది కాదన్నమాట.

రెండో సంవత్సరం వేసంగి రోజులు కూడా మహోత్వరగా గడచిపో యాయి. వెనక మేము వుండిన చోటనుంచి మా కాపురాన్ని యెత్తేసి పల్లె టూరిలోనే స్నానపుయింటి యెదురుగా, అడవిలోనే చెట్లు కొట్టేసిన ఖాళీ జాగా వుంటే అందులో చూమ్‌ను కట్టుకున్నాం. చలికాలం రాక ముందే కంగీయ్‌నీ పెజెన్‌దేయ్‌నీ చూసిరావడానికి అమ్మ వెళ్లింది. ఆరోజుల్లో నేను ఒంటరిగా వుండడంచేత రోజంతా వూళ్లోనే ఆ రష్యను కుర్రాళ్లతోనే గడుపుతూ వాళ్ల జీవితానికీ వాళ్ల ఆచారాలకీ బాగా అలవాటుపడిపోయాను. రాత్రిపూట యెవ్వరికంటా పడకుండానే యేరైతు గుడిసెలోకో చల్లగా దూరి సాధారణంగా పొయ్యిదగ్గిరే వుండే బల్లకిందకి చేరుకుని ఆ వెచ్చదనాన్ని తనివితీరా హాయిగా అనుభవిస్తూ అక్కడే పండుకొని నిద్రపో యేవాడిని.

అలాగు చాలా ఇళ్లలోకే వెళ్లేవాడిని. కాని తరుచు సాన్నికొవ్‌గారి యింటికే వెళ్లేవాడిని.

ఆ కా-ఖెమ్ ప్రాంతంలో వున్న రైతులందరిలోనూ మక్సీమ్ సాన్ని కొవే పొడగరి. కండలు తిరిగిన శరీరం. దేవదారు వృక్షంలాగు పొడుగ్గా వుండి, నిలబడితే వాళ్ల యింటికప్పు అతని తలకి తగిలేది. బట్టతల. తలమీద ఒకటో రెండో వెంట్రుకలుంటే వుండేవేమో. సన్నని పెదవులు. చప్పున కదిలేవి. నడి వయస్సులో వున్నవాడికిమల్లే నిర్మలమైన స్వరం. అతనికి వాస్కా, సెర్గేయ్ అని ఇద్దరు కొడుకులు. వాస్కాకి చెముడు. వీళ్లిద్దరూ నాకంటె వయస్సులో పెద్దవాళ్లే. కొద్ది సంవత్సరాలక్రితమే వాళ్ల తల్లి చనిపోయింది. స్వంత భూమికోసం స్వేచ్ఛాజీవనంకోసం రష్యా మధ్యప్రాంతాలని వదిలి పెట్టేసి సాన్ని కొవ్ సైబీరియాకి వచ్చాడని ఇరుగుపొరుగు వాళ్లు అనుకుంటూండగా

విన్నాను. వాళ్లవూళ్లో వున్నప్పుడు ఇతని భూమిని భూఖామందు ఒకడు కాజేశాడుట. ఆ రోజుల్లో రైతులు చాలా చోట్ల తిరగబడ్డారట. సాన్నికోవ్‌ని నానాబాధలూ పెట్టారట. దేశాటనం బయలుదేరగా దేశాటనంలో తన కుటుంబంలో సగంమంది చచ్చిపోయారట: భార్య జబ్బొచ్చి చచ్చిపోయిందట — పెద్దకొడకుని ప్రభుత్వం పట్టుకొని కఠినశిక్ష విధించి క్యాంపు జైలు సిబిరంలో పెట్టేయగా అక్కడనుంచి పారిపోయి నాటికీ నేటికీ అతని ఆచూకీ తెలియడమే లేదుట — దేశాటనంలో కొండవాగు దాటుతూండగా కూతురు కొట్టుకుపోయి చచ్చిపోయిందట — ఇదిలా వుండగా యేటిలో కొట్టుకుపోతూన్న అక్కని రక్షించడానికి యేటిలోకి దిగిన వాస్కాకి నీళ్లలో నానడంవల్ల విపరీతంగా పడిశంచేసి దాంతో చెముడొచ్చేసిందట.

నా మొదటి నేస్తం వాన్క రోదిన్‌ని నేను మర్చిపోకపోయినా నాలుగు రోజుల్లోనే నాకు వాస్కాతో మరింత స్నేహం కుదిరిపోయి వాళ్ల అమ్మదగ్గిర వాళ్ల నాన్నదగ్గిర కూడా నాకు బాగా చనువు అయిపోయింది.

సాయంకాలం వాళ్ల యింటికెళ్లి బల్లకిందకి దూరి మా చూమ్‌లో పండుకున్నట్టే కాళ్లు ముడుచుకుని పండుకోవడం నాకు అలవాటై పోయింది.

పొద్దున్నే జుట్టుని యెవరో రేవుతూన్నట్టు అనిపించి నేను లేచి చూచేసరికి — అది మరెవరూ కాదు మక్సీమ్ సాన్నికొవే!

"బల్లకిందకి మళ్లీ దూరేవూ? లే! లే!" అని నన్ను లేపేవాడు.

ఆయన గొంతుక విని నేను బల్లకిందనుంచి పాకుతూ బైటకొచ్చి నిలబడేవాడిని.

ఒక్కొక్కప్పుడు నన్ను నా కాళ్ళు పట్టుకుని బల్లకిందనుంచి బైటకి లాగేవాడు. నవ్వుతూ తల పంకించుతూ:

"గొప్పగా నిద్రపోతావ్యేమ్ నువ్వా!" అనేవాడు.

అక్కడ దగ్గరగావున్న కంచంలో ఆలుగడ్డలో అట్టుముక్కో వుంటే ఆ కంచంవైపు చూపించి:

"అవి చల్లారిపోయి వుంటే నీదే తప్పు. అప్పటికప్పుడు చేసి వేడిగా పొగర్లొస్తూండగానే వాటిని తినాలి. మేము వేడివేడిగా వున్నాము మమ్మలిని మీ నోటిలో పడేసుకోండర్రో అని అవి బతిమాలుకుంటూన్నప్పుడే వాటిని తినాలి" అనేవాడు.

వాస్కా సెర్గేయ్ అప్పుడే కూచుని తింటూన్న బల్లదగ్గరే నన్నూ కూచోబెట్టేవాడు. ఇద్దరిలో ఒకతను నన్ను చూసి తల పంకించి కన్ను గీటుతూ ఆ కంచాన్ని నా ముందుకు తోసేవాడు.

"సాన్నికొవ్‌లాంటి తండ్రీ వాస్కా సెర్గేయ్‌లాంటి అన్నదమ్ములూ వుండడం యెంత అదృష్టం!" అనుకునేవాడిని. నిజానికి నేను సాన్నికొవ్‌ని తండ్రిలాగా అతని కొడుకులని అన్నల్లాగా భావించేవాడిని.

కాని నా అదృష్టం అట్టేకాలం నిలవలేదు. ఒకనాడు వాళ్ళు ఇలా మాట్లాడుకోవడం విన్నాను:

"తెర్‌జీగ్ డెల్టాలోవున్న భూములన్నీ మిహైలొవ్ కాజేస్తూంటే మనం బతకడం ఎలాగు? అక్కడ భూస్వామి బాధపడలేక ఇక్కడికొస్తే ఇక్కడా యీ బానిసబతుకే అయితే మనమేం బాగుపడినట్టు? మనం ఇక్కడ నుంచి సంసారం యెత్తేసుకుని తన్నుఓల్ పర్వతపంక్తుల గుట్టల

మీదకిపోవాలి. అంతకంటే మరో గత్యంతరం లేదు మనకి" అన్నాడు సాన్నికొవ్.

తండ్రిపక్కను కూచున్న సెర్గేయ్ మోకాలిమీద తన మోచేతితో ఆను కుంటూ ముందుకు వొంగి:

"నిన్న నేను గుర్రానికి గడ్డికోద్దాం అని స్తెప్ బీడుకి వెళ్లితే మిహై లొవ్ నాదగ్గిరకి పరుగెత్తుకొచ్చి: 'ఇది నా భూమి. దీని చుట్టూ నేను కంచెవేస్తున్నాను. ఇక్కడ నువ్వు గడ్డికోశావంటే ఖబడ్దార్!' అన్నాడు. తెర్ జీగ్ డెల్టా అంతా అతనిస్వంతమే కాకుండా కీస్-కెజీగ్ పచ్చిక బయళ్ళు కూడా అతని వేనట. ఎగువనున్న భూమిలో అంతటా గుంజలు పాతేసి ఇదంతా నాస్వంతం అంటూ ఆక్రమించేస్తున్నాడు. ఆ భూమిలో 'మారాల్' దుప్పులపెంపకం పెడతాడట. మనం ఎక్కడికి పోగలం?" అన్నాడు.

'భూస్వామి' అంటే నాకేమీ అర్థంకాలేదు. మిహైలొవ్ అంటే యెవరో నాకు తెలియదు. కాని సాన్నికొవ్ అక్కడనుంచి వెళ్లిపోదాం అనుకుంటు న్నట్టూ తనతో కూడా నేను స్వయం నా అన్నలు అనే భావించుకుంటూన్న నా నేస్తాలని తీసుకువెళ్లిపోతాడనీ నాకు అర్థం అయింది.

నేను కన్నీళ్లు కారుస్తూ సాన్నికొవ్‌నీ అతని కొడుకులనీ పూరవతలి వరకూ సాగనంపి నిర్జనమైన వాళ్ల యింటికి వచ్చి మహాదుఃఖించి మెల్లగా మా చూమ్‌కి వెళ్లిపోయాను.

ఎన్నో సంవత్సరాలు గడిచినతరువాత సాన్నికొవ్ ఆయన కొడుకులూ మళ్లీ అక్కడికొచ్చారు. కాని అంతకుముందే నా జీవితంలో బ్రహ్మాండ మైన మార్పులు సంభవించాయి.

నాలుగవ ప్రకరణం

ఎక్కడకు వెళ్లడం?

ఒకనాడు నేనూ అమ్మా మా చూమ్‌లోనుంచి బైటకి వచ్చి అమ్మ కాస్సేపు ఇటూ అటూ ఆ కొత్త గుడిసెలవేపు చూసి:

"ఆ రష్యనులదగ్గిరికి నిన్ను పనికి పంపిస్తాను. నువ్విప్పుడు పెద్ద వాడవైయావు" అంది అమ్మ నాతో.

అమ్మ మాటలని విని సరే అన్నాను నేను. నాలుగురోజులు పోతే నాకు పదకొండేళ్లు నిండుతాయి. నేనిప్పుడు ఎదిగి పెద్దవాడనైయాను. అది అలా వుండగా అప్పటికే ఆ రష్యనులు నా జీవితంలోకి ఎంతో జ్ఞానాన్ని ఆనం దాన్ని తీసుకొచ్చారు.

ఆ చుట్టుపక్కల రష్యను లెవరెవరున్నారో వాళ్ల మంచి చెడ్డ లేమిటో నేనెవరిదగ్గర పనికి కుదురుకుంటే నాకు అనుకూలంగా వుంటుందో వీటి నన్నిటినీ జాగ్రత్తగా ఆలోచించింది అమ్మ.

నా చెయ్యి పట్టుకుని ఒక ఇంటిదగ్గిరికి నన్ను తీసుకెళ్లి:

"ఈ ఇంటి యజమాని నీకు కూలిపని చెప్తాడు. ఇతను మనుషుల కోసం చూస్తున్నాడు" అంది అమ్మ.

విశాలంగా వెచ్చగా వున్న యీ ఇంట్లో యీ కుటుంబంతో కలిసి జీవించ వచ్చునుకదా అని అనుకుని, నేను సరదా పడ్డాను. మక్సీమ్ సాన్నికొవ్‌గారి కుటుం బంవారు నన్ను ఎంతదయతో ఆహ్వానించేవారో జ్ఞాపకం తెచ్చుకుని అమ్మతో

సరే అన్నాను. బత్రాక్ అంటే యేమిటో పాలికాపు జీవితం యెలాగుంటుందో అప్పటికి నాకు బొత్తిగా తెలియదు.

అమ్మా నేనూ ఒకరి చేతులు ఒకరం పట్టుకుని గొప్ప మోతుబరి వ్యవసాయదారుడైన చొల్‌దాక్-స్తెపాన్ ఇంట్లోకి వెళ్ళాం. వెనక సాన్నికొవ్ గారూ వాళ్ళబ్బాయిలూ మాట్లాడుతూ మిహైలొవ్ మిహైలొవ్ అని అన్న మిహైలొవే ఇతడు. ఇతడు పొట్టిగా వుండడంచేత ఇతన్ని చొల్‌దాక్ అని అందరూ అంటారు. చొల్‌దాక్ అంటే పొట్టి అన్నమాట. ఇతనికి దట్టంగా పెద్ద గడ్డం. లాల్చీ వేసుకుని వుంటే, ఒక యుర్తా ఇంటికప్పునంతటినీ కప్పడానికి సరిపడినంత బనాతు గుడ్డని ఆ లాల్చీకింద పెట్టుకుని నడుస్తున్నాడా అని అనుకునేటట్టు కిందకి వేలాడుతూన్న పెద్ద బొజ్జ.

అతనికి నన్ను చూపించి అమ్మ వొంగి అతనికి దణ్ణం పెట్టింది. వచ్చీరాని తువాభాషలో మాట్లాడుతేనే గాని అతనికి మా భాష అర్థంకాదేమోనని అమ్మ అనుకుని అతనితో:

"తనీష్!* వీడు మా అబ్బాయి. వీడిని మీ పనిలో పెట్టండి. నాకు బువ్వపెట్టండి — కొడుకుని తిసుకోండి. సరేనా?" అంది.

అది విని అందుకు జబాబుగా చొల్‌దాక్-స్తెపాన్:

"నాకు నా కొడుకులున్నారు. జెట్టీల్లాంటి బత్రాక్‌లు పాలేళ్ళున్నారు. బువ్వా గివ్వా యేంలేదు. నీ కుర్రవెధవకి బత్రాక్ పని అంటే యేమిటో తెలుసా? వాడేం పని చేయగలడని? నేను చెప్పేది నీకు అర్థం అవు

---

* స్నేహితుడు.

తూందా? ఛీ! దరిద్రపుముండా! ఈ చుట్టుపట్ల కెందుకొస్తున్నావు పాపిష్ఠి ముసలి ముండా? ఫో! ఇక్కడనుంచి ఫో!'' అని గావుకేకలు పెట్టాడు.

''మా వాడిని తీసుకోండి'' అని అమ్మ ప్రాధేయ పడింది.

చొల్‌దాక్-స్త్రెపాన్ అమ్మని మెడపట్టుకుని ఇంట్లోంచి బైటకి గెంటేసి నామీదకి పరుగెత్తుకొచ్చి:

''నువ్వింకా పిల్లగాడివి. పెద్దయాక నిన్ను తీసుకుంటాను. ఇప్పుడు ఇక్కడనుంచి ఫో! '' అని నా చెవి పట్టుకుని నన్ను ఈడ్చుకుంటూ గుమ్మం లోంచి తోలేశాడు.

అమ్మా నేనూ ఒకరితో ఒకరం యేమీ మాట్లాడుకోకుండానే మా చూమ్‌కి వెళ్లిపోయాము.

ఇంటి గుమ్మంలో కూచుని యేం చేయడమా అని ఆలోచించాము.

''ఖామందు లెక ఉద్యోగస్థుడూ తువాదేశస్థుడైనా రష్యను దేశస్థుడైనా ఒక్కటే, ఏమీ భేదం వుండదు. అదీ అసలు సంగతి. ఏం చెయ్యడం మనమిప్పుడు? మరొకరి ఇంటికి వెళ్లదామా?'' అని అడిగింది అమ్మ నన్ను.

''అమ్మా నీకు తెలియనిదేముంది? నువ్వు యెలాగు చెప్తితే అలాగే. ఎవరింటికి వెళ్లి యెవరితో మాట్లాడ్డం మంచిదని నీకు తోస్తే అలాగే చేద్దాం'' అన్నాను నేను గడగడ వణకుతూ.

మరో యింటికి వెళ్లేం. పల్లెటూరి చివరను తెర్‌జీగ్ సంగమం వొద్దనే వుంది ఆ యిల్లు. ఆ యింటివాళ్లు యీ మధ్యనే అక్కడ స్థిరపడ్డారు.

ఇంట్లోపలికి వెళ్లాం. మెకేయ్‌లాగే గడ్డంతో ఒక ముసలతను కుర్చీలో కూచునున్నాడు. లావుగా పొడుగ్గా వుంది అతని భార్య. అవిడ నవ్వుతూ మమ్మలిని పలుకరించింది. మా అమ్మ అతి ఓపికగా తలా నడుమూ వొంచి దణ్ణం పెట్టి చెయ్యి చాచి వినయంతో:

"తసీష్! మీరంతా క్షేమమేనా?" అని అడిగింది.

ఆ యింటివాళ్లూ చాలా మర్యాదాగానే జబాబుచెబుతూ:

"నమస్తే తసీష్! వచ్చి ఇలా కూర్చోండి" అన్నారు.

పొడుగాటి బల్లచెక్క వుంటే దాని మీద కూర్చున్నాం. ఆ బల్లచెక్కని బెంచి అంటారని అప్పట్లో నాకు తెలీదు. చొల్‌దాక్-స్త్రేపాన్ ఇంట్లో మేం అనుభవించిన దౌర్జన్యంనుండి అమ్మ యింకా పూర్తిగా కోలుకో లేదు. అమ్మ కూర్చునేవున్నా కొంతసేపటికి గాని మాటాడ లేకపోయింది.

తలుపుదగ్గర చప్పుడైంది. కిర్రుమని తలుపు తీసుకుంటూ ఒక తనూ ఒకావిడా లోపలికొచ్చారు. పాతికేళ్లుంటాయేమో ఒక్కొక్కరికి.

నేను నాలుగువైపులా పరకాయించి చూశాను. ఆగుడిసె అంతా యీ మధ్యే వేసినట్టుంది. కొత్త ఇల్లే కాని చిన్నది. ఇలాంటి ఇళ్ళు మామూలు చూమ్‌లకంటె కొంచెం పెద్దవి. ఇలాంటి ఇంటిని మా భాషలో కజనాక్ అంటారు. ఇల్లు శుభ్రంగా యింట్లో అంతా చక్కగా అమర్చివుంది. మిగతా యిళ్లల్లోలాగు కాకుండా తగు మాత్రం వెచ్చగా వుంది. గోడనున్న అలమారా చెక్కలమీద కాగితాలు పరచివున్నాయి. మధ్య అలమారా మీద ఎర్రగా కాలిన రొట్టెలు మూడున్నాయి. అప్పుడే తయారుచేసిన రొట్టెలవాసన వేస్తుంది. మా చూమ్ నాకు జ్ఞాపకం వచ్చింది. మా యిం

ట్లోనూ ద్వారందగ్గరవున్న గోడలో కొయ్య మేకులమీద అలమారా వుంది. దానిమీద వున్న సామానంతా ఒక క్ర్రగిన్నే — సిబ్బితోవున్న పులుసు తపేలా ఒకటీ — బిర్చిబెరదు జాడీ ఒకటీ — మా యినుప మూకిటిని తోముకో డానికి నాలుగు నారపరకలూను.

రొట్టెలమీదవున్న పెచ్చు ఎర్రగా మెరుస్తూంది. నేను చుట్టు పక్క లని అంతా అలాగు పరిశీలిస్తూనే వున్నాను. మా అతిథులు కూడా మా వైపు అభిమానపూర్వకంగా చిరునవ్వుతూ చూస్తున్నారు. ఆ యింట్లో నేనుతప్ప మరెవ్వరూ పిల్లలులేరు.

అలా కూచుని మా అమ్మ యేదో దీర్ఘంగా ఆలోచిస్తూంది. మరో నిమిషానికి తన తల యెత్తి నావైపు తల పంకించి:

"వీడు నాకొడుకు. మీకు కొడుకు లేడు. వీడిని తీసుకొని నాకు రొట్టె ఇవ్వండి. అర్థం అయిందా తనీష్?" అని అడిగింది.

ముసలతను మోచేతులని కొద్దిగా వొంచి సగంసగం లేచి చేతులురెండూ పైకెత్తి:

"ఏమిటి కావాలమ్మా నీకు? నువ్వు చెప్పేది నాకేమీ అర్థంకావడం లేదు" అన్నాడు.

అమ్మ బిగ్గరగా మాట్లాడుతూ అంతా బోధపరిచి మళ్లీ చెప్పింది. నావైపు వేలుపెట్టి చూపించి తువాభాషలో:

"వీడిని నీదగ్గిర వుంచుకో!" అని చెప్పి అలమారాదగ్గిర కెళ్లి ఆ రొట్టెలవైపు చూపించి: "వీటిని నాకియ్యి!" అంది.

ముసలతను అర్థంచేసుకుని నవ్వుతూ:

"ఓహో! సరే మంచిదే! నాకు చిన్న అబ్బాయి లేడు — నీకున్నాడు.

హ—హ! నాదగ్గర రొట్టెలున్నాయి – వాటిలో కొన్ని నీకిమ్మంటావు. మంచిది. అజిర్‌బాన్*'' అన్నాడు.

ఆనందంతో అమ్మ నా చెవిలో:

''చూశావా! నువ్విక్కడుండి వీళ్లదగ్గర పనిచెయ్యి. చూస్తున్నావుగా? వాళ్లూ ఇష్టపడ్డారు'' అంది. ముసలతనివైపు తిరిగి: ''మంచిది. మా అబ్బాయి మీదగ్గర నౌఖరీ చేస్తాడు. తనీష్'' అంది.

''సరేసరే మంచి మాటే. మీ అబ్బాయి మాదగ్గర వుంటాడు. మేము అతన్ని జాగ్రత్తగానే చూస్తాం. మరేం ఫరవాలేదు'' అన్నాడు.

అమ్మ నన్ను చేతితో పట్టుకుని ఇంట్లోనుంచి బైటికి తీసుకుని వెళ్లింది.

''నాయనా! నువ్వు వాళ్లదగ్గరవుండి కూలిపని చెయ్యి. బుద్ధిగా వుంటూ వాళ్లు చెప్పిన పనులన్నీ బాగా శ్రద్ధగా చెయ్యేం? లేకపోతే నిన్ను తోలేస్తారు సుమా. మనం చాలా కష్టాలని అనుభవించాల్సొస్తుంది సుమా'' అని చెప్పింది.

అమ్మ నన్ను తన గుండెలకి హత్తుకుని నన్ను ముద్దు పెట్టుకుంది.

''బుద్ధిగా వుండి జాగ్రత్తగా పనిచేస్తూండేం'' అని పదేపదే చెబుతూ గబగబ నడిచి వెళ్లిపోయింది.

అమ్మ వెళ్లిపోతూంటే అలా చూస్తూ నిలబడ్డాను అమ్మ కనిపిస్తూండే వరకూ. తరువాత మెల్లగా ఇంటిదగ్గిరికి వెళ్లి గుమ్మందగ్గర నిలబడ్డాను.

ఇంటి ఆయన కొడుకు నన్ను చూసి బెంచీమీదనుంచి లేచి నా దగ్గిర కొచ్చి నన్ను వీపుమీద తట్టుతూ:

---

* మంచిది.

"నువ్వు యక్షీ!* నువ్వు చాలా మంచి అబ్బాయివి. ఏం? రా! నాతో ఇలారా! మనం భోంచేద్దాం ఇప్పుడు" అన్నాడు.

నన్ను బల్లదగ్గిరికి తీసుకెళ్లాడు. తతిమ్మావాళ్లందరూ అప్పుడే అక్కడ కూచునున్నారు. నాకోసం జాగాచేశారు. వీళ్లనన్నింత అభిమానంతో ఆదరించడమేమిటి? — వొల్‌దాక్-స్త్రెపాన్ నన్ను చూడగానే నామీద విరుచుకు పడడమేమిటి? — నేను అప్పటికీ ఇప్పటికీ నేనేం మారలేదే — నేను వీళ్లకింద కూలిపని చేసి వీళ్లకింకా యేవిధంగానూ సాయపడలేదే — యేమిటీ ఆదరణలో తేడా? అని చాలా రోజులవరకూ నేనేమీ అర్థం చేసుకోలేక పోయాను.

నా యజమానుల పేరు లుబోష్నికొవ్ అని నాకు తరువాత తెలిసింది. సొన్నికొవుగారిలాగునే వీరుకూడా ఆ తెల్ల రష్యను చక్రవర్తి జారు మూలాన్న నానా బాధలూ పడ్డారట. సరాతొవ్ ప్రాంతపు కులాక్ బారినుంచీ భూస్వాముల బారినుంచీ తప్పించుకొని బతుకుజీవుడా అని ప్రాణాలతో బైట పడడానికని సైబీరియాకి వలసవచ్చేశారట. లుబోష్నికొవ్‌గారి కుటుంబం చాలా బీదస్థితిలో వుంది. పెద్దాయన తలంతా నెరిసిపోయి వొళ్లంతా ముడుతల పడిపోయి వృద్ధు అయినా అన్ని పనులూ తనంతటతనే స్వయంగా చేసుకునేవాడు. ఆయనకి ఒకడే కొడుకు. అతని పేరు అగ్గేయ్. మనమలు లేరు ఆయనకి. జీను వేసి గుర్రాన్ని సిద్ధంచెయ్యడం గింజలని నూర్చడం గడ్డి మోపులనీ గోధుమ కంకులకట్టలనీ మొయ్యడం — భూమిని దున్నవలసి వచ్చేటప్పుడు గుర్రాన్ని నాగలికి కట్టి గుర్రాన్ని తోలడం — ఇలాంటి పనుల్లో వాళ్లకి నేను సాయపడగలిగినందుకు నాకు సంతోషంగా వుండేది.

---

* మంచివాడు.

అగ్గేయ్ తల్లి నన్ను 'నాయనా' అని పిలిచేది. కుటుంబంలోవాడిలాగే నన్ను చూస్తూ వాళ్ళందరికీ యేమి చేసిపెట్టేదో నాకు అదే పెట్టేది. నాకు కొత్తజత బూడ్సుజోళ్ళు కూడా యిచ్చింది ఆవిడ.

ఒక సంవత్సరం అయాక రైతు బిడ్డలందరిలాగే నేనూ పనిపాటులు చేస్తూండేవాడిని.

అప్పటికి నాకింకా కండపుష్టి లేకపోవడం మాట నిజమే. కాని అగ్గేయ్ కంటె బాగా వెనక్కి పడిపోకుండేటట్టు మాత్రం చూసుకుంటూ అన్ని పనిపాటుల్లోనూ అతన్ని అనుకరిస్తూండేవాడిని.

అగ్గేయ్ అతని తండ్రి కూడా నాకు యేవిషయం తెలియకపోయినా వెంటనే అన్నీ బోధపరచి తెలియజెప్పేవారు. రైతులు ఉపయోగించే పనిముట్లనీ వాటినన్నిటినీ ఏలాగు వాడుకచెయ్యడమో ఆ విశేషాలనీ నేను అడగడం తరువాయిగా విసుగులేకుండా ఓపికగా చూపించి చెప్పేవారు. తను గుర్రానికి జీను వేసేటప్పుడు నన్ను పిలిచి:

"దీన్ని మెడమెత్తా అంటారు. దీన్ని యీవిధంగా గుర్రంమెడలో వెయ్యాలి. మెడలో వేసేముందు మాత్రం మట్టిఅంటుకొని వుండకుండా చూడాలి. మట్టి అంటుకుని వుంటే తుడిచి శుభ్రం చెయ్యాలి. అల్లా శుభ్రం చేయకుండా మట్టిని వుండనిచ్చేటట్టాయనా గుర్రం మెడ వొరిసిపోయి పుండుపడిపోతుంది సుమా... దీన్ని పిరుదుపట్టా అంటారు. దీన్ని తగిలించకపోతే మెడమెత్తా సరిగ్గా మెడమీద కూచోదు..." అని బోధపరచేవాడు.

ఏరుకాలుపాదాన్నీ జీనుపట్టీని తొడపట్టీని చూపించి, బండీగురించీ స్లెయ్ బండీగురించీ చెప్పి, యీ బళ్ళకి గుర్రాన్ని యెలా కట్టడమో బోధపరచి చెప్పేవాడు.

కొడుక్కి తండ్రి యెలా నేర్పుతాడో అలా అన్ని పనులనీ నేర్పేవాడు అతను నాకు.

తొలకరిలో నాగలితో నేలలోనుంచి నల్లటి సారవంతమైన మట్టి పొరలు పైకి వచ్చేటట్టుదున్ని భూమిని యెలా సాగుచెయ్యాలో నేర్చుకోవడం ప్రారంభించాను. దున్నేటప్పుడు గుర్రంమీద కూర్చుని గుర్రాన్ని అజమాయిషీ చేసేవాడిని. గడ్డి కోతకాలంలో ఎండుకసవును బండీమీద వేసుకొని తీసుకు వెళ్లేవాడిని. గోధుమకోతల్లో కంకులని కుసికర్రల బండీమీద వేసుకుని బండీని తోలేవాడిని. మా యజమాని నన్ను చాలా ఆప్యాయంగా చూసేవాడు. నేనేదైనా పొడుపనిచేస్తే నేను చేసిన అపరాధాన్ని ఆ ఉత్తరక్షణంలోనే క్షమించక శిక్షించినా కూడా నాకు అతనిమీద యేమీకోపం వచ్చేదికాదు. జూలైనెలలో సూర్యోదయం కాకుండానే కొర్నవున్న భూమిని దున్నడం ప్రారంభించేవాళ్లం. అప్పుడు 'గుర్రం బుర్రకి దారిచూపించడం' నిజంగా అతి కష్టాతికష్టంగా వుండేది. ఎంచేతంటే నాకు అప్పటికింకా నిద్దరమత్తు తీరేదేకాదు. ఒక్కొక్కప్పుడు కునుకుపాట్లు కూడా పడేవాడిని గుర్రంమీద కూచునే. ఆ సమయంలో గుర్రం నా గటిచాలులోనుంచి తప్పిపోయి అటూ ఇటూ వంకరగా నడిచేది. కాని యీలోపుగానే వెనక నాగలిపట్టుకున్నతను జాగ్రత్తగావుండి తనకొరడాతో గుర్రాన్ని ఒక్క చరుపుచరిచి చారలోకి మళ్లించి పనిలోపనిగా ఆ కొరడాతోనే నాకు కూడా చురుక్కుమని ఒక చురక తగిలించేవాడు.

సేద్యంచెయ్యడం ఒక్కటే అగ్గేయ్ నాకు చెప్పి వూరుకోలేదు: రష్యను దేశస్థుల ఆటపాటలూ క్రీడావినోదాలూ వీటన్నిటినీ నాకు నేర్పేడు. ఒకనాడు పొద్దున్న మేము పనులన్నీ చేసేసుకుని కూర్చుండగా అప్పుడు అగ్గేయ్ నాతో:

"ఈవేళ గొప్ప పర్వదినం. ఈ పండుగని మేం క్రీస్తు స్వర్గారోహణం అంటాము" అన్నాడు.

ఆరోజు వాతావరణం చక్కగా వుంది. ముసలివాళ్లందరూ ఇళ్లనీడని దేవదారుపళ్లని వొలుస్తూ పిక్కలని కొడుతూ కూర్చున్నారు. పచ్చని యేటి గట్టుమీద మొగపిల్లలు ఆడపిల్లలూ గుమికూడారు. నా జీవితంలో అతిహాయిగా గడిపిన రోజుల్లో ఆ రోజొకటి. ఆ రోజే నేను లప్తా ఆట ఆడడం నేర్చుకుంటూ. ఒక జట్టుకి ఎపీష్కా అనే కుర్రాడు ఉజ్జీ రెండో జట్టుకి ఉజ్జీ మెల్లకంటి వాన్యక. ఇద్దరూ బాగా ఆడేరు. వాన్యకకంటె ఎపీష్కావే మంచి సూక్ష్మ దృష్టికలవాడైనా అతని జట్టే ఓడిపోయింది. అందుకు కారణం నేనే. నావంతు బేటు చేసేటప్పుడు బంతిని కొట్టడంకంటే బంతిని తప్పడమే నాకు మామూలు అయిపోయింది. అందుకు ఆ అల్లరి కుర్రాళ్లు నన్ను మహ వేళాకోళం చేశారు.

అన్ని పనులకంటె గుర్రాన్ని కాయడం అతి కష్టమైనపని అనిపించింది నాకు. అంతకు ముందెన్నడూ నేను గుర్రంపైన స్వారిచెయ్యలేదు. జీనూకళ్లెమూ లేకుండా గుర్రం మీదెక్కి పిల్ల గుర్రాల తుంబకడుపులని మద్దెలని చరుచుతూన్నట్టు వుత్తకాళ్లతో చరుస్తూ సవారిచేస్తూన్న పిల్లలిని చూసి నేనెప్పుడూ ఈర్ష్యపడేవాడిని.

నా మొదటి అనుభవం నాకు బాగా జ్ఞాపకం వుంది. ఎంతో కష్టం మీద ఎర్రగుర్రం వీపుమీదకెక్కి కూచుని ఆవులని ఇంటికి తోలుకొద్దాం అనుకున్నాను. రీజ్‌క ముసలి గుర్రం. అది వుత్త దుష్టజంతువన్న సంగతి నాకు తెలీదు. రీజ్‌కగురించి నేనేమీ పట్టించు కోకుండా ఆవులమీదనే నా దృష్టినంతా వుంచి అవి యెక్కడికి వెళ్లిపోయాయి చెప్మా అని ఆలోచిస్తూ

వాట్లకోసం వెతుకుతున్నాను. ఆ వెతుకుతూండడంలో కళ్లేన్ని వదులుగా పట్టుకున్నాను. ఆ వుత్తరక్షణంలో ఒక్క కుదుపుతో రీజ్‌క పరుగెత్తి నన్నుకిందకి పడతోసేసి నాలుగు కాళ్ళూ యెగరేసుకుంటూ పారిపోయింది.

చాలాసేపువరకూ నేను తమాయించుకో లేకపోయాను. సాయంకాలం పక్కమీదపడుకుని తలగడాలో ముఖంపెట్టుకుని యేడ్చాను.

ముసలాయన లుబోష్నికొవ్ వచ్చినన్ను ఓదార్చాడు:

"మరేం చిక్కులేకుండా అంతా సవ్యంగానే జరిగిపోయింది. ఆలా విచారిస్తావెందుకు? హుషారుగా లేచి కూచోవోయ్! ఆవులన్నీ సరిగ్గా ఇంటికి చేరుకున్నాయి. రీజ్‌క కూడా వచ్చేసింది."

దీని తరువాత రెండోపర్యాయం రీజ్‌క మరో విధంగా ప్రవర్తించింది. ఈసారి కూడా గుర్రాన్ని యెక్కి ఆవులను తోలుకొద్దాం అనుకుని రీజ్‌క దగ్గిరకి మెల్లిగా వెళ్లి జూలుపట్టుకుందాం అని సిద్ధపడి రెప్పవెయ్యకుండా గుర్రం మెడవైపే నిదానంగా చూస్తున్నాను. గుర్రం నన్ను ఒకపక్కనుంచి క్రేగంటితో చూసి నన్ను చూడనట్టే నటిస్తూ ఒత్తుగా వున్న పచ్చికని అలా మేస్తూంది.

నేను దగ్గిరసగా వెళ్లి మేనుపట్టుకోబోయేసరికి ఒక్క విసురుతో మెడని నామీదకి తిప్పి నన్ను భుజంమీద కరిచి నాలుగైదుసార్లు కుదిపి చివరకి నన్ను నేలమీదకి తోసేసింది.

నా చేత్తో మెడ తడుముకుని నొప్పితో మొర్రో అని అరిచాను. గుర్రం నన్ను కరవడంలో భుజంమీద చర్మం ముక్కకి ముక్కా వూడొచ్చేసి పెద్ద గాయం పడింది. రక్తంకారుతూంటే గాయాన్ని అదిమి పట్టుకున్నాను రక్తం కారకుండా. కాని రక్తప్రవాహం ఆగలేదు.

యజమాని యింటికి వెళ్ళుదామా లేకపోతే అమ్మదగ్గిరకి మా చూమ్‌కి వెళ్ళిపోదామా అని ఆలోచించుకున్నాను.

ఎవ్వరకీ కనబడకుండా వుండేటట్లు పొడవుగావున్న గడ్డిలో పడుకున్నాను. ఏమాత్రపు చప్పుడూ చెయ్యలేదు. మరి అమ్మకి నేనక్కడున్నట్టు యెలా తెలిసిందో.

నన్ను చూద్దామని అగ్గేయ్ యింటికి వెళ్ళుతూంది అమ్మ. ఆ అడవి గడ్డి దంటలు అల్లల్లాడుతూండడం ఆమె కళ్ళపడిందా? లేకపోతే అవి గాలికి ఆడుతూంటే ఆ చప్పుడే ఆమె చెవినిపడిందా? లేక యాదృచ్ఛికంగానే అక్కడికొచ్చిందో మరి? నాకు తెలిసినదంతా మెరుస్తూన్న ఆమె శిరస్సు నా మీద వొంగి చూడ్డమే. భయభ్రాంతులతో ఆమె నన్ను చూస్తూంది:

"నాయనా! ఎలా పడిపోయావు రాబాబూ? ఏడవకు. మెల్లిగా లేచి కూర్చో" అంది అమ్మ.

"ఆవులని ఇంటికి తోలుకొద్దాం అనుకుంటూండగా గుర్రం నన్ను కరించింది" అని చెప్పాను.

నా చొక్కా చిరిగివుండడం నా భుజంమీద గాయం చూసి:

"అయ్యో అయ్యో! ఏమి రా నాయనా! యెంత పని జరిగింది రా?" అనడంతప్ప మరేమీ అనలేదు.

మరోక్షణానికి నన్ను నేలమీదనుంచి లేవదీసి చుట్టూ వున్న చెట్లనుంచి కొన్ని మందుఆకులని కోసి వాటిని గాయంమీద వేసి తన నడుముకు చుట్టుకున్న గుడ్డతో కట్టుకట్టింది.

"నిన్ను యెన్నటికీ ఇక పరాయినాళ్ళదగ్గర వదిలిపెట్టను రా నాయనా! నిన్ను మన యింటికి తీసుకుపోతాను. ఇక్కడ ఒక్క నిమిషం నాకోసం

వుండు'' అని నన్ను తీసుకుని అగ్గేయ్ ఇంటికి వెళ్లి నన్ను గుమ్మంముందు వుండమని చెప్పి తను లోపలికి వెళ్లింది.

నేను గుమ్మం తలుపుదగ్గిర వుండిపోయాను.

''వాడిని నేను నాదగ్గరే వుంచేసుకుని వుంటే ఇది జరిగేది కాదు. వాడిని నాతో ఇంటికి తీసుకుపోతున్నాను. వాడు నా కళ్లముందర తిరుగుతూ వుంటే నా పంచప్రాణాలూ సుఖంగా వుంటాయి'' అని గట్టిగా అంది అమ్మ అగ్గేయ్‌తో.

వాళ్ల సంభాషణలో ప్రతీమాటా వినాలని చెవులునిక్కపెట్టుకుని వున్నాను.

''ఏమిటి! చేతినిండా పనులుండే ఈ అదనులో నీ అబ్బాయిని తీసుకువెళ్లిపోతానంటావా? నీ వాడిమీద నేను చెయ్యేనా వెయ్యలేదే. వెధవ గొడ్డు అది. దాన్ని యేం చేసేది?'' అని అగ్గేయ్ అన్నాడు ఆశ్చర్య పడుతూ.

''ఏమైనాసరే మా వాణ్ణి మాత్రం ఇక్కడుంచను'' అని అమ్మ కచ్చితంగా చెప్పేసింది.

నేను గుమ్మందగ్గిరకే వెళ్లి:

''అగ్గేయ్ నన్నేమీ చెయ్యలేదమ్మా. నాకిక్కడే వుండాలని వుంది అమ్మా!'' అన్నాను నేను.

నా మాటలతో వ్యవహారమంతా శ్రుతినిమించి రాగాన్నిపడింది: అమ్మ నన్ను లుబోష్నికొవ్‌గారి యింటినుంచి తీసుకువెళ్లిపోయింది. త్రోవలో:

''నేనంటే నీకు పూర్తిగా అయిష్టం అయిపోంది. నా చేతులతో నేనే

నిన్ను వాళ్లదగ్గిరకి తీసుకెళ్లాను. 'మంచిది స్నానాలగదికెళ్ళు — మంచిది, ముందుకు అంచు వున్న గుండ్రని టోపీపెట్టుకో' అని నేనే అన్నాను. ఇంకా యేమన్నాను? 'వృత్తి ఒకటి నేర్చుకో. వ్యవసాయం నేర్చుకో. కష్టపడి వాళ్లవొంచి పనిచెయ్యి' అని కూడా అన్నాను. నువ్వు యేమిటి నేర్చుకున్నావు? నీ పంతం చెల్లించుకోవడం నేర్చుకున్నావు. చివరికి ఎవరికి ఎదురు చెప్పడం నేర్చుకున్నావు? నిన్ను కన్న తల్లికే ఎదురుచెప్పడం నేర్చుకున్నావు!" అని మహాదుఃఖపడింది.

ఆరోజుల్లో పేద అరాత్‌కి బుర్రెత్తుకు తిరగడానికి దమ్ములుండేవి కావు. నడుం సహంవొంచి చేతులు వేలేసుకుంటూ క్షణంలో మోకాళ్లమీద పడి దణ్ణంపెట్టడానికి సిద్ధంగా వుండాలి. నేను కూడా అలాగే వుండాలనా మా అమ్మ వుద్దేశం? అబ్బే! మా అమ్మ వుద్దేశం అది అయివుండదు. ఎంచేతంటే మేము కలుసుకున్నప్పుడు ప్రతీసారీ నాలో జరుగుతూన్న మార్పు లని ఆమె చూసి ఆనందిస్తూ జీవిత యాత్రలో నేను కొత్త దారులంట వెళ్లుతూంటే యెంతో పొంగిపోతూ సగర్వంగా తన మనస్సులో ఆమె నన్ను దీవించి సాగనంపేదని నాకు తెలుసు. అయితే యిప్పుడు నా గాయం మూలంగా ఆమెకి కలిగిన భయం మామూలుగా ఆమె కళ్లలో ప్రకాశించే కళకాంతులని కొంతవరకూ కప్పేసింది.

నన్ను అతి ఆప్యాయంగా కౌగలించుకుని మా చూమ్‌కి తీసుకువెళ్లింది.

శీతకాలం మళ్లీ వచ్చింది.

కా-ఖెమ్ అవతలి తీరాన్న కొండలోయలో వుంది మా చూమ్. ఆ ప్రాంతాన్ని తోన్‌గెలిక్తీగ్ అంటారు. చలికాలంలో మిగతా చోట్లకంటే మేకలకు మంచిమేత యీ లోయలోనే పుష్కలంగా దొరుకుతుంది. ఇదంతా

కొత్త ప్రాంతం. మా చూమ్ మామూలుగా యెప్పటిలాగే కొండవాలులోనే వుండి, కొనతేలిన దిబ్బలా వుంది. ఇంతవరకు నది వొడ్డు అంచులంట మాత్రమే మంచుతో పేరుకొని వుంది. తరుచు నేను చూమ్‌నుండి బైటకి వెళ్లి మామూలుగా ప్రశాంతంగా వుండే కా-ఖేమ్ అలలతో అల్లాడిపోతూన్న అగాధంకింద మారిపోయిందే అని ఆలోచించుకుంటూ ఆ ప్రవాహంలో తేలుతూ రెపరెపలాడుతూ పారిపోతూన్న చిన్నచిన్న మంచులంకలు పాడే వీడ్కోలు పాటలని వింటూ వుండేవాడిని. నదీముఖంగా దూరానవున్న పల్లెటి గుడిసెలనుంచి ఆవిర్భవిస్తూ ఆకాశంలోకి అంతర్ధానం అవుతూన్న తెలి పొగలను పలుకరించడానికని అవి నీటిప్రవాహంతో పరుగెడుతున్నాయి. నాతోటి వాళ్లనీ నానేస్తాలనీ నా పనిపాటులనీ నా ఆటపాటలనీ అన్నీ అక్కడే దిగవిడిచి నేనొంటరిగాడినైపోయాను.

అమ్మతో కొన్ని నెలలపాటు చూమ్‌లోనే వుండిపోయాను నేనేవిధం గానూ లుబోష్నికొవ్‌వాళ్ల వూసుయెత్తకుండానే అమ్మే వాళ్లగురించి నాతో అంటూవచ్చి నన్ను మళ్లీ వూళ్లోకి వెళ్లి పనిలో చేరనిచ్చింది.

అగ్గేయ్‌వాళ్లకుటుంబం చాలా సంతోషించారు. నా పనిపాటులకి నన్ను మెచ్చుకుని గోగునార ఇజారూ లాల్చీ కుట్టి నాకు యిచ్చారు.

శనివారంనాడు అగ్గేయ్ నన్ను స్నానాలఇంటికి తీసుకువెళ్లాడు. అంత వరకూ యెప్పుడూ నేను నిలబడే స్నానం చేసేవాడిని. పైన అటకలాగు వున్న అరపైన సాగిలపడి కాని కూర్చుని కాని అందరూ సాధారణంగా నీళ్లు పోసు కుంటారు కాని అరపైకి నేనెన్నడూ యెక్కలేదు. స్నానాలఇంటిలో ఒక అరపైన నీళ్లతొట్టె ఒక బిర్చిచీపురూవుంచి అగ్గేయ్ నన్ను లోనికి రమ్మని

[illegible]
కొట్టింది. నేను మొఱ్రోమని అరిచి దిగిపోతానన్నాను.

"ఉండు. ఆ వేడిని వోర్చుకోగలిగితే నువ్వు మగవాడి వన్నమాట. వోర్చుకోలేవూ – ఆడాళ్లందరూ నిన్ను చూసి నవ్వుతారు" అని నాకు సిగ్గు వచ్చేటట్టు అన్నాడు.

నాకూ వోర్చుకుందామనే వుంది. అందుకేమీ సందేహం లేదు. మంగలంలో పేలాలు వేగిపోతూన్నట్టు నా తలకాయా ముఖ్యంగా చెవులూ యీ ఆవిరిలో వేగిపోతూంటే యేం చెయ్యను? తలని మోకాళ్లలోపెట్టేసుకుని చెవుల్లో వేడిదూరిపోకుండా చేతులని దొప్పల్లాగు చేసుకుని వాటితో చెవులని మూసేసుకున్నాను. నా పరిస్థితి మెరుగు అవడానికి యేమీ చేశాడు కాడు అగ్గేయ్. ఆ చీపురుని ఆవిరి వస్తూన్న నీళ్లలో ముంచి నాదగ్గిరకొచ్చాడు నేను అరమీదనుంచి కిందకి దొర్లిపారిపోయే లోపునే అగ్గేయ్ తన చేతితో నన్ను పట్టుకుని చీపురిని యెత్తాడు. మనిషిని మాడబెట్టేస్తున్న యీ వేడిలో అగ్గేయ్‌వల్ల నాకు చావు తప్పదనే నిశ్చయించుకుని అమ్మని తల్చుకున్నాను... గుండెలు అవిసిపోయే నాకేకలతో ఆ స్నానాలఇల్లు నిండిపోయింది. ఆ చీపురుతో నన్ను కొట్టద్దు బాబోయి అని అగ్గేయ్‌ని నేను బతిమాలుకున్నాను... ఇకమీదటినుండీ నేను బుద్ధితెచ్చుకుని మునపటికంటె ఇంకా కష్టపడి పనిచేస్తానని ఖరారు చేశాను... నాకేకలు విని అతనికి మొదలు కొస యేమీ అందక తికమకపడ్డాడు.

"దిగు. దిగి మనుషులు యెలా నీళ్లు పోసుకుంటారో చూడు" అన్నాడు.

అగ్గేయ్ నిచ్చెన మెట్టుమీద నిలబడితే కండలు తిరిగిన అతని వొళ్లు ఇంటికప్పుని అందుకుంది. వేడికి కాలిపోయిన ఆకులతోవున్న ఆరెమ్మల కట్టతో తనవంటి సంతటనీ కొరడాతో కొట్టుకున్నట్టు కొట్టుకున్నాడు. కాస్సేపటికల్లా వెలుగుబూడిదెతో తోమిన పాత రాగిపాత్రలాగున నిగనిగ మెరుస్తూంది.

అతని వొళ్ళు చూసి నాకూ ఈర్ష్యకలిగింది.

"నన్ను కూడా అలా తోమిపెడుదూ" అని అగ్గేయ్‌ని అడిగేను.

* * *

లుబోష్నికొవ్‌గారి యింట్లో సంవత్సరాల తరబడి వాళ్ల కుటుంబంలో మనిషిలాగు వుండిపోయేవాడినే అనుకుంటాను. కాని అగ్గేయ్ లుబోష్ని కొవ్‌లు నిర్బంధంగా ఆ గ్రామం విడిచిపెట్టి కోక్-ఖాక్‌కి వెళ్లిపోవలిసొచ్చింది. అతను వెళ్లిపోవడానికి కారణమేమని నేను అడగలేదు, కాని దీనికి కూడా చొల్‌దాక్-స్తెపాన్ చేస్తూన్న తప్పుడుపనులే కారణమని నాకు ఇప్పుడు అనుమానం తోస్తూంది. సల్‌చాక్ నాయోన్*కి చొల్‌దాక్-స్తెపాన్ తరుచు బహుమతులు తీసుకువెళ్లి యిస్తూండడంచేత అందుకు ప్రతిఫలంగా అతను తెర్‌జీగ్ వొడ్డంట క్రమక్రమంగా భూమి తరువాత భూమిని నిరాటంకంగా కాజేస్తూన్నాడు.

లుబోష్నికొవ్‌గారిని విడిచిపెట్టేముందు అనేక విషయాలగురించి ఆలోచించుకోవలసి వుంది. అగ్గేయ్‌తో వెళ్లితే అమ్మ చాలా దూరమైపోతుంది.

---

* రాజు.

వెళ్ళకపోతే అమ్మదగ్గిరికి వెళ్ళిపోయి మళ్ళీ మా చూమేలోనే జీవించాలి. దానికితోడు శీతకాలం అప్పుడే ప్రారంభం అయింది.

చౌల్‌దాక్-స్త్రైపాన్ నన్నిప్పుడు యెక్కడ చూసినా నాతో మాట్లాడ్డానికి ఆగేవాడు. అమ్మ నన్ను ఇంటికి తీసుకెళ్ళి పోవడానికి వచ్చింది. అప్పుడు అతను అమ్మని చూడ్డానికి కూడా వెళ్ళాడు.

"నీ కొడుకుని నాదగ్గరకు తీసుకురా. భోజనం బాగుంటుంది పని కూడా తేలికే. నీకు సరిపడ్డంతా తిండి దొరికేటట్టు నేను యేర్పాటు చేస్తాను" అని కొత్త యెత్తు వేశాడు.

మా అమ్మ ఆలోచనలో మునిగి యేమీ జబాబుచెప్పలేదు.

లుబోష్నికొవ్‌లు ప్రయాణం పెట్టుకున్న రోజు వచ్చింది. వాళ్ల సరుకూజప్రా రెండు స్లెయ్‌ల మీద యెక్కించారు. దూరప్రయాణానికే అన్ని యేర్పాటులూ చేసుకున్నారు.

నా చెయ్యి గట్టిగా పట్టుకుని కరచాలనంచేస్తూ:

"సరే సెలవోయ్ నేస్తం! కోక్-ఖాక్‌కి వెళ్ళిపోతున్నాం. మమ్మలిని చూడాలని నీకెప్పుడేనా బుద్ధిపుడితే మాత్రం తప్పకుండారా. ఇక్కడనుంచి అటు వైపు వస్తూనే వుంటారు యెవరో ఒకరు" అన్నాడు.

"ఖులాసాగా వెళ్ళండి. సెలవు!" అని పెద్దగా నవ్వుతూ నేను బిగ్గరగా అన్నాను. కాని నాకు మనసులో మాత్రం బెంగగానే వుంది.

లుబోష్నికొవ్‌లని సాగనంపిన తరువాత అమ్మతో మాట్లాడి చౌల్‌దాక్-స్త్రైపాన్‌దగ్గర పనిచెయ్యడానికి నిశ్చయించుకున్నాను.

ఐదవ ప్రకరణం

గోతిలో ఇల్లు

చీకటి పడుతూంది. ఆకాశం నీలంగా యెంతో దూరాన్న వున్నట్టుంది. భూమీ ఆకాశమూ కలసిన అంచుదగ్గిరనుండి మాత్రం మంచుపొగ భూమి మీదకి పాకుకుంటూ వస్తూంది.

చొల్‌దాక్-స్తెపాన్ చాలా ధనికుడని ఇప్పుడు తల్చుకుంటే జ్ఞాపకం వస్తూంది. తెర్‌జీగ్ సంగమం దగ్గిర స్థావరం యేర్పరచుకున్న పదికమ తాల తాలూకు పొలాలూ నివేశనాలు ఇళ్ళూ దొడ్లూ సమస్తం కలపితే యెంత భూమివుంటుందో అంతకి ఎన్నిరెట్లో మించి విస్తీర్ణంగల భూముంది అత నికి. భూమిచుట్టూ దట్టమైన కోరడి వుంది. ఇంటి ముంగలిలో రెండు కొట్లున్నాయి. అసలు ఇంట్లో పెద్ద చావడీ వంటిల్లూ — ఇవే కాకుండా రెండు పెద్ద గదులున్నాయి. చూట్టూ గోడవున్న పెద్ద ఆవరణలో కొన్ని పశువుల దొడ్లు, ఒకపాక, వీటికితోడు ఒక కమ్మరంపాల కూడా వున్నాయి.

చొల్‌దాక్-స్తెపాన్ ఇంటిముందు నేను ఆగి ఇంట్లోకి వెళ్ళదునా వద్దా అని మనస్సు నిశ్చయించుకోలేక తటపటాయించాను. కిందటిసారి నా చెవులు పట్టుకుని నన్నెలా బరబర ఈడుస్తూ తన ఇంట్లోనుంచి తగిలేసి నదీ నేను మర్చిపోగలుగుదునా? మళ్లీ మరొకసారి ముందు వెనుక ఆలోచించాను. అంతట్లో అమ్మ జ్ఞాపకం వొచ్చింది. అయ్యో నాకంటె ఎంతో దుఃఖాన్ని అను భవించి మీదటికి మంచి రోజులు వచ్చి తీరతాయనే ఆశతోనే యెప్పుడూ వుం టుందే అమ్మ అని అనుకున్నాను. "బాగా కష్టపడి పనిచెయ్యి. భయపడకు"

అని అమ్మ నాకు బుద్ధులు చెప్పింది. ఆ మాటలు గుర్తుకుతెచ్చుకుని: "నాకు భయం లేదు" అని మనసులో అనుకుని తలుపు తీశాను.

నేను లోపలకి వెళ్లగానే చొల్‌దాక్-స్త్రెపాన్ ఎలుగ్గొడ్డులాగున్న వూరంత మనిషి లేచి తిన్నగా తలుపుదగ్గర కొచ్చాడు.

"మళ్లీ ఇతని చేతిలో పడ్డాను రా బాబూ! కిందటి మాటులాగే యిప్పుడూ నన్ను పరాభవిస్తాడు" అని అనుకుని మరి ముందుకు వెళ్లకుండా దభీమని తలుపు వేసేసి యింటి ముంగిటకి పరుగెత్తి కొంత దూరం ఇంటి ముందుకి వెళ్లి అప్పుడు ఆగేను.

చొల్‌దాక్-స్త్రెపాన్ ఇంటిముందు వసారోలో అగుపించి:

"ఎందుకాలా పరుగెత్తి పారిపోతున్నావు? పని చెయ్యడాని కొచ్చావా లేకపోతే యేదేనా దొంగిలించడాని కొచ్చావా?" అని అడిగేడు.

కాస్సేపటికల్లా నేను అతని వంటగదిలోకెళ్లి కూచున్నాను.

"నాదగ్గిర నీకు పనిచెయ్యాలని వుంటే వొళ్లువొంచి సరిగ్గా పని చెయ్యాలి. నువ్వు సరిగ్గా చెయ్యవూ నీకు బువ్వ దొరదు. బాగా పని చేస్తివా నీకు పుష్కలంగా తిండి దొరుకుతుంది. పాడుగా పనిచేస్తివా కావలసినంత మికిలాష్ తగులుతుంది" అని ఒక ఉపన్యాసం యిచ్చాడు.

ఉపన్యాసం ఆఖరైన తరువాత తన పిడికిలిని నావైపు చూపించాడు. ఇక నా చెవులు పట్టుకునే సమయం వచ్చింది అని నిశ్చయించుకుని నాలో నేను క్రుంగిపోయి అనుకోకుండానే గోడదగ్గిరికి పరుగెత్తాను.

చొల్‌దాక్-స్త్రెపాన్ బిగ్గరగా నవ్వేడు. తన భార్య నతాల్యాని పిల్చి:

"వీడికేదేనా ఇయ్యి. తిని మిగతా మనుషులతో పండుకోనీ. తెల్లవారి వాడిని చొల్‌దాక్-ఓల్‌తో కూడా గడ్డి తీసుకురావడానికి పంపిస్తాను" అన్నాడు.

చౌల్‌దాక్-స్తెపాన్ రెండో భార్య నతాల్య. అతనికి బాగా యేభై యేళ్లు దాటి పోయాయి. ఆమెకి మాత్రం ఇరవై యేళ్లకి మించి వుండవు. ఆమె తండ్రి పేరు తియునోవ్. తియునోవుది కర్రలుకొట్టే వృత్తి. చౌల్‌దాక్-స్తెపాన్ ఇంటివెనక అగడ్తకు అవతలగావున్న గోతి యింట్లో అతడు కాపురం ఉండేవాడు. తియునోవ్‌కి ముక్కోణాకారంగా వున్న గెడ్డం వుండి నుదుటి మీద తలవెంట్రుకలు యేదుపంది ముళ్లులాగు పైకి పొడుచుకుంటూ వుండేవి పేరుకున్న మంచులాగు తెల్లటి తలవెంట్రుకలుండబట్టిగాని లేకపోతే చురుకుగా చకచకమని తిరుగుతున్న ఈ వ్యాత్కా పట్టణపు వాస్తవ్యుడికి డెబ్బై యేళ్లుంటాయని యెవ్వరూ అనుకోరు. మోకాళ్లవరకూ పడుతూన్న లాల్చీ తొడుక్కొని గోగునార చెప్పులు వేసుకుని తిరిగేవాడు. అతను నడుమున వెడల్పు పటకా పెట్టుకుని ఆపటకాలో గొడ్డలిని దోపుకునే యెప్పుడూ తిరిగేవాడు.

ముఖం అంతా ముడుతలు పడిపోయి పళ్లు అన్నీ వూడిపోయి వుండడం చేత తియునోవ్ భార్య ఎవ్దొకీయ తన పెనిమిటికంటె ముసలిదానిలాగు కనబడేది.

నేను తరుచుగా అగడ్తను ఒక్కదాటులో దాటుతూ వాళ్ల యింటికి వెళ్లి వాళ్లని చూసేవాడిని. నేను యెప్పుడు వెళ్లినా భార్యాభర్తలు యిద్దరూ సంతోషించి ఆదరించేవారు. మెత్తని నానురొట్టే, ఓట్సుగింజలతో తయారు చేసిన కుమీస్* ఇచ్చేవారు. వాళ్లు ముసలి వాళ్లైపోయినా యెప్పటిలాగే దారుఢ్యంగా వుండి చురుకుగా యెప్పుడూ నవ్వుతూ పరదాగా వుండేవారు. వాళ్లకున్న భూమిని మరొకరి సహాయంలేకుండానే సొంతంగా సేద్యం చేసుకుని

---

* ఆడగుర్రము పాలు.

కూరగాయలని పండించుకునేవారు. వాళ్లకొక తెల్ల మచ్చలు మచ్చలున్న ముసలి ఆడగుర్రం వుండేది. ఆ గుర్రాన్ని వాళ్లు సొంతంగానే చూసుకునే వారు.

చొల్‌దాక్-స్త్రెపాన్ వాళ్లని చూడ్డానికి వాళ్లింటికి వెళ్లినప్పుడు:

"మీరు యెందుకీ పనులన్నీ వొంటిగా చేసుకోవడం? దేముడి దయవల్ల భోజనానికి మాకేం లోపంలేదు. మీకు పెట్టడానికి కూడా మాకింత వుంది" అనేవాడు.

అందుకు ముసలతను తియునోవ్ జబాబుచెబుతూ:

"పొరుగువారింట్లో తిన్న భోజనం బాగుండొచ్చు. కాని యెవరింట్లో వారు వండుకొన్న భోజనమే వారికి మరింత రుచిగా వుంటుంది. మీ వ్యవహారాల్లో మేమేమీ కలుగజేసుకోవడం లేదు. అందుచేత మీరుకూడా మా వ్యవహారాల్లో కలుగజేసుకోవద్దని మా కోరిక..." అనేవాడు.

ఒకనాడు సాయంకాలం తియునోవ్‌తో నేను:

"ఒకసంగతి దయచేసి నాకు చెప్పండి. నేను తెలియక అడుగుతున్నాను. తువాదేశస్థుడు మొలలో కత్తిని చెకుముకిరాయిని వుంచుకుంటాడు. మీరు మాత్రం గొడ్డలిని దోపుకుని యెప్పుడూ తిరుగుతూంటారే. ఇది రష్యనుల ఆచారమా?" అని అడిగేను.

"చిన్నతనంనుంచీ కర్రలుకొట్టడమే నా వృత్తి. మా సొంతవూరు వ్యాత్కాలో రంపం అంటూ యీమధ్యే వచ్చింది. మీ స్త్రెపాన్‌లాంటి యజమానులందరికీ నా జీవితంలో అంతా గొడ్డలితోనే చెట్లని కొట్టాను. నాతోనేనా గొడ్డలి కూడా ముసలదైపోయింది" అన్నాడు.

అలాగు అంటూ ఒరలోనుంచి గొడ్డలిని తీసి ముడుతలుపడిన తన

బుగ్గకి ఆ గొడ్డలిని హత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. ఆ గొడ్డలి కూడా నిజానికి ముసలిదే అయిపోయింది: అంచులు మొద్దు తేరి గుండ్రడపడిపోయి యే పురాతన గండ్రడగొడ్డలిలాగో వుంది.

తన అల్లుడంటే యేమీ కిట్టక పోవడంవల్ల బక్కపలచగా చురుగ్గా వున్న యీ ముసలాయనా మేనూ ఒక్క తల్లివేరులోనుంచి పుట్టిన మొక్కలమే అని నాకు స్పష్టంగా తెలిసిపోయింది. తను పుట్టిన కొమ్మనుండిని వేరుపడిపోయి స్త్రెపాన్ గూడులోకి పారిపోయిందని తన కూతురిని తిట్టిపోసేవాడు.

స్త్రెపాన్ ఇంటికి నేను వచ్చిన రోజున ఇంటిఆవిడ అతను చెప్పిందంతా మాట్లాడకుండా విన్నప్పటికీ నావైపు చూడనైనా చూసింది కాదు. చూడకుండానే చేతులు కడుగుకునే బల్లకింద పులుసు తప్పేలా ఒకటివుంటే దాన్నితీసి తలుపు దగ్గరవున్న ముక్కాలిపీటమీద దాన్ని ఉంచింది. వుంచి దాల్లో యింత పులుసుపోసి నాను రొట్టెని విరిచి ఒకముక్కని పులుసుగిన్నకు పక్కగా పీటమీద పెట్టి:

"కూచుని త్వరగా తిను. ఈ యింట్లో అందరం పొద్దున్న వేకువ జామునే లేస్తాం. ఇంకా తినడం ఆరంభించక యెవరికోసం చూస్తున్నావు రా దరిద్రగొట్టా?" అని మొదలెట్టింది.

ఆ మొక్కాలిపీట ముందే మోకాళ్లమీద చతికిలబడ్డాను. ఆలుగడ్డ పులుసున్నూ రుచిగావున్న రొట్టె నాకు చేదనిపించాయి. నతాల్యకు కించిత్తయినా ఏవిధమైన హానీ చెయ్యడానికి యే మాత్రమూ అవకాశము లేకుండానే నన్నెందుకిలా తిడుతూందో నాకేమీ అర్థంకాలేదు.

నాముందు పెట్టినదంతా గబగబా తినేశాను. నేను తింటూండగా చొల్‌దాక్-స్త్రెపాన్ ఒక గుడ్డల మూటను తీసుకొచ్చి:

"ప్రొద్దున్నే నువ్వు చౌల్‌దాక్-ఓల్‌తో కూడా గడ్డికోసం వెళ్లాలి. అప్పుడు యీ గుడ్డలని తొడుక్కో" అని పాత లాల్చీనొకదాన్ని అక్కడ పడేసి అరిగిపోయిన బ్రోద్ని* జతని అక్కడ పారేశాడు. ఆ గుడ్డల మూటలో, ఒక చెవిదొప్ప మినహాగా వున్నా నెత్తిమీద పెట్టుగోడానికి వీలుగా వున్న బొచ్చుటోపీ ఒకటి కనిపించింది.

"నేను ఎక్కడ పండుకునేది?" అని చౌల్‌దాక్-స్త్రైపాన్‌ని అడిగేను.

వెనక ఆవరణలో ఒక మూల వున్న గోతియింటిని చూపించి:

"గుర్రపు సామాన్లనీ పూజులనీ అక్కడ వుంచుతాం. ఆ సామాన్లని వుంచేచోటే పండుకుంటారు మనుషులు కూడా. ఇల్లారా!" అన్నాడు.

ఆ గుడ్డలని చేతితో పట్టుకుని అతనివెంట ఆ యింట్లోకి వెళ్లాను. ఒక గోడకి అన్నీ మేకులు వరుసగా దిగ్గొట్టున్నాయి. నేలమీద గడ్డి పడేసి వుంది. ఆ గడ్డిమీద పాత దగలాకబ్బాలూ చిరిగిపోయిన గోనెపట్టా లాల్చీలూ వాటితోపాటు మాసిపోయి అరిగిపోయి కంబళ్లకు వుపయోగపడే బొచ్చు అంగరఖాలు కూడా వున్నాయి.

"ఇదీ నీ చోటు. నువ్వు పండుకోడం తినడం ఇక్కడే. సోమరిపోతు లాగు వూరికే ఇటూ అటూ చూస్తూ కూర్చోక ఆ పైగుడ్డలను విడిచేసి పోయి పండుకో" అని ఆజ్ఞాపిస్తూ దర్జాగా అడుగులేసుకుంటూ ఆ యింట్లో నుంచి బైటకి వెళ్లిపోయాడు.

ఆ యింట్లో నేనుతప్ప మరెవ్వరూ లేరు. అయినా అప్పటికే బాగా ప్రొద్దుపోయివుండడంచేత నేను పడుకున్నాను. నాకు వెంటనే నిద్దరపట్టి

---

* సాఫుచెయ్యని చర్మంతో తయారుచేసిన బూడ్సుజోళ్లు.

పోయింది. పెద్ద చప్పుడు అవుతే దానితో నాకు మెలకువ వచ్చింది. తలుపెవరో తీసి దభీమని తలుపు మళ్లీ వేసేశారు. చల్లటిగాలి — ఆ గాలితో కూడా తారూ గుర్రపు చెమటవాసనా — రంయ్‌మని కొట్టుకొచ్చింది ఆ యింట్లోకి. గుర్రపు జీనులూ మెడమెత్తాలూ జీనుపట్టీలు మోసుకొస్తూ చొల్‌దాక్-స్తెపాన్‌యొక్క బత్రాక్‌లు ఆ యింట్లోకొచ్చారు. వాళ్లందరూ పది మందుంటారు. వాళ్లలో నా స్నేహితులు: నిదానంగా చురుకైన చూపులు చూస్తూ మంచి బలమైనవాడని చూడగానే మనిషికి తట్టేటట్టు జమానులాగున్న తర్బగాన్, పొట్టిగా గున్నఏనుగులా బలంగా వున్న చొల్ దాక్-ఓల్, డేగముక్కులాగు ముక్కుండి పొడగరైన వెదెనేయ్ సీదొరొవ్, రొదివోన్ ఎలిసేయెవ్, దానీల్కా రోష్చిన్, వాన్యకా మరి కొందరూ వున్నారు.

నతాల్య ఆ యింట్లోకొచ్చి పరుపులా పరచిన ఆ గడ్డిముందు ఒక తపేలాతో పులుసూ నారతో అల్లిన బుట్టతో కొన్ని తీపిరొట్టెలనూ అక్కడ వుంచి మావైపు చూడకుండానే కోపంగా వున్న గొంతుకతో:

"అటూ యిటూ తచ్చాడక త్వరగా తినండి" అంటూ వూపిరి తిరగకుండా వుండే ఆ గాలిని పీల్చడానికే భయపడుతూన్నట్టు రెండు వేళ్లతోనూ ముక్కుమూసుకుని ఆ యింట్లోకి పరుగెత్తి పారిపోయింది.

రాత్రి భోజనం చెయ్యడానికి ఆ మనుషులు సిద్ధపడ్డారు. ఆ తపేలా చుట్టూ అందరూ కూచున్న తరువాత తర్బగాన్ చెమ్చాని తీసుకుని తెలివితేటలైన పని మంతురాలి లాగు నల్లగావున్న ఆ పులుసునీళ్లని చెమ్చాతో పైకి తీసి మళ్లీ తపేలాలోకి పోసేశాడు.

"రుచిగావున్నా రుచిగా లేకపోయినా మనం తినకతప్పదు. మాకిదక్కరలేదు అదికావాలి అని అన్నామా మనకి అసలే దొరకదు" అని అంటూ వెదెనేయ్

సీదొరొవ్ తినడం మొదలెట్టాడు. అతన్ని చూసి మిగతావాళ్లూ భోజనం చెయ్యడం మొదలెట్టారు.

భోజనం త్వరగా అయిపోయింది. మనుషులు అందరూ పండుకోడానికి సాగిలబడ్డారు. తన కట్టుగుడ్డలని విడిచేయకుండానే వాటితోనే నా పక్కని సాగిలబడ్డాడు వెదెనేయ్.

"మన మతం పెరుగుతూంది. అసలుసంగతి ఇదీ అబ్బాయిలూ. ఇంతమంది మనుషులు మన యజమానికి యెందుకు కావలసి వచ్చిందో నాకు ఆశ్చర్యం ఆవుతూంది. వున్నవాళ్లు చాలనట్టు ఇందుకుతోడు యీ బుల్లి అబ్బాయిని కూడా పనిలోకి తీసుకున్నాడు. సరే కానీ. ఏనాడో ఒకనాడు అతనితో మనం ఇటో అటో తేల్చుకోవడం తప్పదు" అన్నాడు వెదెనేయ్.

మాట్లాడుతూ కాస్సేపు ఆగి ఇటించటు పొత్తిగిలి మళ్లీ అన్నాడు:

"ఊస్‌నదీ ప్రాంతంలోనూ మినుసీన్‌స్క్‌లోను చాలామంది దొడ్డవాళ్లని కలుసుకున్నాను. మనలాంటి ప్రజలను హింసిస్తూన్న స్తెపాన్ మిహైలొవ్‌లాటి యజమానులనీ మీ రాజులాటి దొరలనీ ప్రజలు తరిమి వెళ్లగొట్టే రోజులు వచ్చి తీరుతాయని వాళ్లు అన్నారు."

పాలేళ్లందరూ యీ మాటలన్నీ జాగ్రత్తగా విని ఊస్ ప్రాంతంలోనూ మినుసీన్‌స్క్‌లోను జీవిస్తున్న ప్రజగురించి అడిగేరు. కొంతమంది సీదొరొవ్ వైపు అపనమ్మకంతో చూస్తూ విధికృతం యోలాగుంటుందో అలా జరిగి తీరుతుంది, కాగా యెందుకొచ్చిన మాటలివి అంటూ అతను చెప్పినదానిని వ్యతిరేకించారు.

వెదెనేయ్ చక్కని గొంతుక ధైర్యంతో ఉట్టిపడుతూన్న అతని మాటలూ వింటూంటే నాకెంతసేపటి నరకూ నిద్దరపట్టలేదు.

సిదొరొవ్ చెప్పిన వాళ్లగురించీ వాళ్ల బలాన్ని గురించీ వాళ్ల ధైర్య స్థైర్యాల గురించీ ఆలోచించాను. నేను కూడా వాళ్లలాగ ఎట్లా అవగలను? ఆ యింటి గోడలవైపూ గోడలనుండి వేలాడుతూన్న మెడ మెత్తాల వైపూ చూస్తూంటే: "నామీద పడ్డ యీకొత్త బరువును మోయడానికి అవసరమైన శక్తి సామర్థ్యాలు నాకున్నాయో లేదో?" అని ఆలోచన తట్టి భయం వేసింది.

తలుపు దభీమని చప్పుడవడంతో నేను కళ్లుతెరిచాను. మామూలుగా వుండే కోపంకంటె మరింత మండిపడుతూ చొల్‌దాక్-స్తెపాను ఆ యింట్లోకి వచ్చి:

"ఏమిరోయ్! మీకు మహా బద్ధకం మండిపోతూంది! ఎంతసెపూ మీతిండీ మీ నిద్దర గురించేనా ఆలోచించుకోవడం? గుర్రాలకి అలసట తీరిపోయి గంటలతరబడి అలాగ అవి నిలబడున్నాయి. వాట్లకి దాణా యెందుకేశారు కారు? మీకొక్క పూట తిండి పెట్టకపోతే నన్ను నానా మాటలు అంటారే మీరు? లెండిరా! దగల్బాజీ వెధవల్లారా! లెండి!" అని రంకెవేస్తూ తర్‌బగాన్ని బూడ్సుకాళ్లతో ఒక్కతాపు తన్ని అక్కడ పడుకున్న దానీల్కా రోష్చిన్ను జుట్టుపట్టుకుని పడకమీదనుంచి బరబర యీడ్చాడు.

దానీల్కా సింహగర్జన గర్జించాడు. ఆ గర్జనలో బాధకంటె ఆగ్రహమే హెచ్చుగా ధ్వనించింది. తన పాదాలకి గుడ్డపట్టీలని చుట్టేసుకుని తొందరగా బ్రోడ్నిబూడ్సులని తొడుక్కున్నాడు.

తను కప్పుకున్న కంబళిని వెదెనేయ్ కాళ్లతో తన్నేసి లేచి చొల్‌దాక్-స్తెపానుకి యెదురుగా వెళ్లి నిటారుగా నిలబడి స్తెపాను భుజంమీద కండలు విరిగిన తన చెయ్యివేసి గట్టిగా నులుపుతో:

"ఏమి పని చేస్తున్నావో నీకేమైనా జ్ఞానం వుందయ్యా? అర్భకుణ్ణి టయ్యా నువ్వు కాల్చుకు తినడం? ఎవడిచ్చాడయ్యా నీకా అధికారం? పొలం చేస్తూన్నప్పుడు నువ్వు మామీద యజమానివి. ఇక్కడ మాత్రం పెత్తనం నాది. ఇటువంటి ఆటలని ఇక్కడ నేను సాగనిచ్చేది లేదు! దగల్బాజీలు అంటున్నావు. దగల్బాజివి నువ్వే!" అని తన యెముకపుష్టిగల పిడికిలిని చొల్‌దాక్-స్త్రెపాన్ తలమీద ఝళిపిస్తూ బెదరించాడు.

దాంతో చొల్‌దాక్-స్త్రెపాన్ భయపడిపోయి తలుపుదగ్గిరకి పలాయనం చిత్తగించాడు.

వెదెనేయ్ తన పక్క దగ్గిరకొచ్చేసి:

"ఇలాగే ప్రవర్తిస్తూంటే మాత్రం చంపేస్తాం నిన్ను యేమనుకుంటున్నావో!" అని దబాయించాడు.

అప్పటికప్పుడే చొల్‌దాక్-స్త్రెపాన్ యింట్లోనుంచి బైటికి దాటేసి గుమ్మానికి అవతలి నిలబడ్డాడు. తలుపు సహం తెరిచి ముందువెనుకలు ఆలోచించుకుంటూ:

"తొందరగా గుర్రాలకి మేతవెయ్యండి. ఈ మాటుకి మిమ్మలిని యేం చెయ్యకుండా వదిలిపెడుతున్నాను. ఇకమీదమాత్రం జాగ్రత్తగా వుండండి. వెదెనేయ్ నువ్వు మాత్రం కోపాన్ని అదుపులో పెట్టుకో. నామజా చూపిస్తాలే వుండువుండు!" అని వెళ్ళిపోయాడు.

"ముసలాడిని మబాగా హడలుగొట్టావు కదూ! వాడికి ఉచ్చోసుకున్నంత పని అయింది!" అన్నారు పాలేళ్ళందరూ నవ్వుతూ. వాళ్ళు తొందర తొందరగా బూడ్సుజోళ్ళని తొడుక్కుంటూ కోటులని భుజాలమీద వేసుకుంటూ గుర్రాలకి మేతవేయడానికి బైటకివెళ్ళారు.

ఆరవ ప్రకరణం

బందివాడనయ్యాను

ఆ మొదటిరోజు సాయంకాలం మరేమీ బాతాఖానీ జరగలేదు. మనుషులందరూ పనులన్నీ చేసుకుని బాగా అలిసిపోయి వుండడంచేత అందరకీ వేగంగా నిద్దర్లు పట్టిపోయాయి. నాలాగే వాళ్లందరకీ కూడా నిద్దట్లో మంచి సరదాఅయిన కలలే వచ్చాయనుకుంటాను. సహంకలలో నాకు గబుక్కుమని మెలకువొచ్చి లేచేసరికి చౌల్‌దాక్-స్తైపాన్ నాముందు నిలబడున్నాడు. అతని గడ్డం నా ముఖానికి తగులుతూ అతని నుదుటిమీద పొంగివున్న నరాలు కొట్టుకుంటూండడం కనిపించింది. అమ్మతో నేను మొట్ట మొదటి సారిగా పనికోసం వెళ్లినప్పుడు హెలీన్‌పెళ్లాం నా చెవిని పట్టుకుని నులిపినట్టు సరిగ్గా అలాగే యితడు కూడా నా చెవి పట్టుకుని, చెవి నులుపుతూనే ఒక పెద్ద బొమ్మలాగు నన్ను పక్కమీదనుంచి లేవదీసి నిలబెట్టాడు.

"ఇంకా పడుకుని నిద్దరోతున్నావ్! లేరా కుర్రవెధవా! బోలెడంత పని వుంది. నువు ఇక్కడికి పనిచెయ్యడానికి వచ్చావా తొంగోడానికి వచ్చావురా? ఏం?" అని కసిరేడు నామీద.

చుంచెలుక దాని కన్నంలోకి పరుగెత్తేటట్టు ఆ గుడ్డలమూటలోకి దూరి నా కొల్తకంటే యెంతో పెద్దవైన బట్టలని తొడుక్కొని: "ఇక నా పని మూడినట్టే, పనిలో ప్రవేశించానో లేదో ఆదికి ముందే మొదటి రోజునే వీళ్లతోసహా నాకు తెలివి రాకుండా నిద్రపట్టిపోయిందే!" అని అనుకుని భయంతో హడలుతూ నాలుగు దిక్కులూ కలియజూశాను. ఇంట్లో యెవ్వరూ

లేరు. గోడమీద చిలక్కొయ్యలకున్న గుర్రపు మెడమెత్తాలు ఏరు కాళ్ల పాదాలూ ఇంచుమించు అన్నీ మనుషులందరూ పట్టుకెళ్లిపోయారు. గాఢ మైన గుర్రపు సామానుల వాసనా చిందరవందరగా వున్న బిచాణాలు — ఇవే మిగిలున్నాయి. ఇంత వేకువనే నన్ను లేపడం యెందుకులే అని వీళ్లు అనుకుని, తరువాత నా మాట మర్చిపోయి వెళ్లిపోయార నుకుంటాను.

చొల్‌దాక్‌-స్తెపాన్ వెంబడే నేను పరుగెత్తుకునివెళ్లాను. బైట యింకా చీకటిగానే వుంది. గుర్రాలన్నీ వరుసగా నిలబడివుంటే వాటిదగ్గిర మా యజమాని తన వేలితో గుర్రాల డొక్కల్లో పొడుస్తూ నిలబడి:

“ఈ యెరుపు గుర్రాన్నీ యీ పొన్నకాయరంగు గుర్రాన్నీ యీ గోధుమ వర్ణం గుర్రాన్నీ నీకు ఒప్పజెబుతున్నాను స్లెయ్‌లకు వీటిని కట్టు. తెలిసిందా?” అంటూ ఇంట్లోకి మళ్లీ నన్ను ఈడ్చుకునివెళ్లి మెడమెత్తా లనీ జీనుపట్టీలనీ వేలుపెట్టి నాకు చూపించి మారు మాట్లాడకుండా నావైపు గుడ్లెర్రజేసి చూశాడు. గుర్రపు సామాన్ల గురించీ జీనుపట్టీల గురించీ నేను తెలుసుకోవలసిన విషయాలు యింకా చాలా వున్నాయని నేను గ్రహించుకుని అక్కడున్న సామాన్లని విడివిడిగా మెడమెత్తాలనూ జీనుపట్టీలనూ కళ్లేలనూ వాటి పేర్లని మననం చేసుకుంటూ యేర్చి పెట్టాను.

“వానపాములా యేమిటక్కడ పడి పాకురుతున్నావు?” అని అరుస్తూ నన్ను పట్టుకుని ఆ యింట్లోనుంచి బైటకి గెంటేశాడు.

ఆ హడావుడిలో కంగారుపడుతూ నేను ఏరి చేతిలో పట్టుకున్న కళ్లేలలోను పట్టీలలోనూ నా కాళ్లు చిక్కుకుని గుమ్మం అంచుమీద పడి పోయాను. ఆ పడిపోవడంలో అరచేతులమీది చర్మం చీరుకు పోయింది.

గబగబ లేచి రక్తాన్ని లాల్చీ అంచుతో తుడుచుకుంటూనే పట్టీలనీ కళ్లేలనీ యీడ్చుకుంటూ గుర్రాలదగ్గిరకి పరుగెత్తాను.

ముంగిట్లోవున్న గుర్రాలను మూడింటినీ స్లెయ్ కట్టి గుర్రాలని గుదిగుంజకి కట్టేను. బగ్రాకేలలో చొల్‌దాక్-ఓల్ ఒక్కడే ముంగిట్లో నిలబడివున్నాడు.

తన గుర్రాలని అప్పుడే స్లెయ్ కట్టేసి నాకోసం కనిపెట్టుకున్నాడు అతను.

"పరుగెత్తుకెళ్లి యేదో దబ్బున యింత కడుపులో పడేసుకుని రా. గడ్డి తీసుకునిరావడానికి చాలా దూరం వెళ్లాలి మనం. అది కూడా రెండు మార్లెళ్లిరానాలి" అని నన్ను తొందరపెట్టాడు చొల్‌దాక్-ఓల్.

"నేనేం ఆలస్యం చెయ్యను. నాకోసం ఆగేం!" అని కేకేసి ఇంట్లోకి వెళ్లాను.

ఇంట్లో నిన్న నేను చూసిన తపేలా ముక్కాలిపీటమీదుంది. దానినిండా టీ వుంది. దాని పక్కని నాను రొట్టె పెచ్చు ఒకటి వుంది.

"త్వరగా కానీ. మిగతా వాళ్లందరూ ఎప్పుడే వెళ్లిపోయారు" అని ఆ యింటి యజమానురాలు తన కఠినమైన చూపులతో ఒక్కసారి చూసి మళ్లీ తన చూపులని నావైపునుంచి మరల్చేసింది.

నేనింకా చల్టితింటూండగానే చొల్‌దాక్-ఓల్ తన స్లెయ్‌లను కోరడిదగ్గరకే తోలుకొచ్చి నాబళ్లకి ముందుంచి తన మొదటి బండీలో మోకాళ్లమీద నిలబడి యెడం చేతితో కళ్లేన్నీ కుడిచేతితో తోలుకొరడానీ పట్టుకుని రోడ్డువైపే తన దృష్టినంతా సారించి నేను సైంయ్ అనే సరికల్లా బయలుదేరడానికి సిద్ధంగా వున్నాడు.

నేను రెండో స్లెయ్‌మీద కూచుని చొల్‌దాక్-ఒల్‌తో 'సరే నేవొచ్చాను ఇక బయలుదేరు' అని కేకవేయ్యబోతూండే సరికల్లా కంచె వెనక నుంచే చొల్‌దాక్-స్త్రెపాన్ పరుగెత్తుకుంటూ వచ్చి:

"ఈ గుర్రాన్ని నిన్నెవర్డా కట్టమన్నది? నీకేం కళ్లులేవా వెధవ?" అని తిట్టాడు.

ఆ తిట్లు వినిపిస్తూ వుండగానే నా మెడమీదేదో ఫెడీమని పడింది. చెవులు గింగురుమన్నాయి. భూమి తల్లకిందులైనట్టు అనిపించింది. నాకు స్మార్కం తప్పిపోయింది.

తెలివొచ్చి చూసుకునేటప్పటికి నేనింకా స్లెయ్‌లోనే వెల్లకిలా పడి వున్నాను. వొళ్ళు చలితో తిమ్మిర్లుకమ్మివుంది. స్లెయ్ పక్కలకున్న చెక్కల మీదనుంచి నా కాళ్లుబైటకి వేళ్లాడుతూ స్లెయ్ పరుగెడుతూంటే ఆ పక్కలని దారంట పడివున్న మంచుకుప్పలని రాసుకుంటూంది. పొలానికి అవతలివైపుగావున్న కొండమీదకి పరుగెత్తుతున్నాయి గుర్రాలు. లేచి కూచోడానికి శక్తి చాలింది కాదు. ఒత్తిగిలి బోర్లాపడుకుని కాళ్లని కూడ దీసుకుని మెల్లిగా లేచి కూర్చున్నాను. తలకాయ బరువెక్కి పోయినట్టైపోయి, జోరీగల దుందు కాట్లకి తట్టుకోలేక యీ పక్కనుంచి ఆ పక్కకు తిప్పుకుంటూన్న గుర్రప్పిల్ల తలకాయలాగు, నా తల తిరుగుతూంది.

చొల్‌దాక్-ఒల్ గుర్రంవెనకాల పరుగెడుతూన్న గుర్రమూ నా గుర్రమూ స్లెయ్‌వరుసకి బాగా వెనక్కి వుండి పరుగెడుతున్నాయి. చొల్‌దాక్-ఒల్ తన తలకాయని వెనక్కి నావైపు తిప్పి:

"కొరడాతో కొట్టి దౌడేయించు! కొరడాతో కొట్టి దౌడేయించు!" అని నన్ను కేకేశాడు.

జాటీ చేతబుచ్చుకుని పొన్నకాయరంగు గుఱ్ఱం లాగుతున్న స్లెయ్ లోకి ఒక్క గంతువేసి జాటీతో గుఱ్ఱం తుంటిమీద నా బలాన్నంతా వుపయోగించి చుఱ్ఱుమని ఒక దెబ్బ తగిలించాను. హఠాత్తుగా కలిగిన బాధకి ఆ గుఱ్ఱం వెనక రెండు కాళ్లమీద నిలబడి, నాలుగు కాళ్ళూ యెగరేసుకుంటూ వెఱ్ఱిజోరుతో ముందుకు దూసుకు పోయింది. గుఱ్ఱాన్ని ఆప శక్యం కాలేదు. వాయువేగంతో చొల్‌దాక్-ఓల్ వున్న స్లెయ్‌ని రోడ్డు అంచమ్మటనుంచే దాటేసి, రోడ్డమ్మటపడి పందెంలో పరుగెత్తుతున్నట్టు స్తెప్‌మైదానాల వేపు దారితీసి దౌడేసింది గుఱ్ఱం. చొల్‌దాక్-స్తెపాన్ తాలూకు గడ్డిమేట్లు కీస్-కెజీగ్ పచ్చిక బయలుమీద వున్నాయి. అక్కడికి వెళ్లాలంటే రోడ్డుకు కుడివైపుగా వుండే మళుపు తిరగాలి. ఆ పిచ్చెత్తిన గుఱ్ఱానికి ఇదంతా కావాలా? ఆ మళుపు తిరగకుండా తిన్నగా మరో రోడ్డంట దారి తీసింది. చొల్‌దాక్-ఓల్ నావెంటే వస్తున్నాడు. తన గుఱ్ఱాన్ని చబుకుతో కొడతూ చబుకు దెబ్బకల్లా మరింత వేగంగా గుఱ్ఱాన్ని పరుగెత్తించి దెబ్బ దెబ్బకీ నాకు మరింత దగ్గిరపడుతున్నాడు అతను. నా స్లెయ్‌కి కట్టిన గుఱ్ఱం మచ్చికకానిదవడం చేత వెనకనుంచి తనని యెవరో తరుముకొస్తున్న డెక్కల చప్పుడు తన చెవుల పడగానే మరింత త్వరగా పరుగెత్తడం మొదలు పెట్టింది. నాలుగు కాళ్లని యెగరేసుకుంటూ పరుగెత్తేసరికి నాకూ చొల్‌దాక్-ఓల్‌కు మధ్య వుండే దూరం మరింత హెచ్చుకాసాగింది. ఏమి చేయడానికీ నాకు తోచింది కాదు. నా చేతిలో కళ్లెం గనక వుండివుంటే యోలాగో ఒక లాగున ఆ వెఱ్ఱిగుఱ్ఱాన్ని లొంగదీయడానికి వీలుండేది. బళ్లవరుసలో ఆఖరు బండీ అవడంచేత గుఱ్ఱానికి కళ్లెంవెయ్యలేదు. వెనకనే వుండవలసిన గుఱ్ఱం నా అజాగ్రత్త మూలంగానే బళ్లవరుస కంతటికీ ముందుకు వచ్చేయగలిగింది.

ఏంచేసేది? ఇంతట్లో చౌల్‌దాక్-ఓల్ గొంతుక వినిపించింది:

"గెంతేయి! కిందకి గెంతేయి!"

మంచులోకి దుమికేను. చౌల్‌దాక్-ఓల్ తన చేతులని ముందుకు వూపుతూ నాకు సంజ్ఞచేస్తూ:

"ముందుకు పరుగెత్తు! పరుగెత్తు!" అని కేకేశాడు.

నా సత్తువంతా ఉపయోగించి పరుగెత్తాను. సైతానులాంటి తన గుర్రంతో నన్ను అందుకున్నాడు చౌల్‌దాక్-ఓల్. నా పక్కనే వెళ్లుతూన్న అతని స్లెయ్‌ని అందుకుని అందులోకి దుమికాను.

కొద్దిగా యెడమకు వొరిగి తన గుర్రాన్ని చబుకుతో కొట్టి కళ్లేన్ని నా చేతికి అందిచ్చి చౌల్‌దాక్-ఓల్ తన వేటతాడుని చేతబుచ్చుకున్నాడు. మేం ఇంతవరకూ దాటించడానికి యెంతో ప్రయాసపడిన ఖాళీ స్లెయ్ ఇప్పుడు మాకుడివైపున మాకు ముందుగా వెళ్లుతూంది.

తెల్లవారక పోయినా తెల్లవారినట్టే వెలుగ్గానే వుంది. ఆ మిడిమిడి వెల్తురులో ఆ గుర్రమూ స్లెయ్ కనపడ్డమే కష్టమైంది. అయినా సంచార జీవితంలో ఆరితేరిన అనుభవం వుండడంవల్ల చౌల్‌దాక్-ఓల్ మా స్లెయ్‌కి ఆ స్లెయ్‌కి మధ్య వున్న దూరాన్ని సరిగా లెక్కకట్ట గలిగేడు. చౌల్‌దాక్-ఓల్ తన వేటతాడుని విసిరేసరికి సరిగ్గా ముందు వెళ్లు తూన్న స్లెయ్ యెడమ ఆకు ముందు భాగాన్ని లంకించుకుంది ఆ తాడు. గుర్రాన్ని యెడమవైపు మళ్లించి చబుకుతో ఒక్కటి వెయ్యమని నాతో చెప్పాడు. రెండు స్లెయ్‌లనూ పొడుగాటి తాడుతో ఆ చివర యీ చివర కట్టడం మూలాన్న, పెద్ద విసరువలని ఆ కొస యీ కొస పట్టి యీడుస్తూంటే మధ్య చేపలతో ఒక బుట్టలాగ యేర్పడేటట్టు, నిష్కలంకమైన మం

చును మధ్యను పోగుచేసుకుంటూ రెండు బళ్ళూ పరుగెత్తుతున్నాయి. దాంతో కాస్సేపటికల్లా గుర్రాల పరుగు తగ్గిపోయి నిలబడిపోయాయి.

వెనక స్లెయ్ రోడ్డు చీలికదగ్గిర ఆగిపోవడంవల్ల మళ్ళీ వెనక్కి వెళ్ళాం.

ఇంకా తెల్లవారి వెల్తురొచ్చే సూచనలేవీ లేవు. కాని నిన్నటి సాయంకాలంనుండీ ఆకాశాన్ని ముంచుకొచ్చిన మబ్బులు యిప్పుడు విడిపోయాయి. తెల్లవారకముందే నల్లని ఆకాశంలో ఆటలాడుకోవాలని ఆత్రంతో పరుగులెడుతున్నా యేమో అన్నట్టున్న నక్షత్రాలు కాంతులని వెదజల్లుతున్నాయి. మా చుట్టు పక్కల యేమాత్రపు అలజడీ లేదు.

నా చెవులు హోరుమంటున్నాయి. తల పోటు పెడుతూంది. చేతిమీద గాయం సలుపుతూంది.

"స్తెపాన్ నామీద యెందుకలా యెగిరిపోయాడు?" అని చౌల్‌దాక్-ఓల్‌ని అడిగాను.

"ఎందుకో నీకు తెలీదూ? అతని సవారీ గుర్రాన్ని నువ్వు స్లెయ్ కట్టావు మరి!" అన్నాడు.

"గుర్రాన్ని నేను స్లెయ్‌కి కడుతూండగా నువ్వు చూస్తూనే వున్నావు కదా. వద్దు అని నువ్వు చెప్పితే నేను మానేసేవాడినే?" అని అన్నాను నేను.

"అతను నీకు అనుమతి యిచ్చాడేమో అనుకున్నాను. నిన్ను కొత్తగా పనిలోకి తీసుకోవడంచేత నువ్వు అతనికి చాలా ఇష్టుడవనీ నువ్వు యిక్కడ యే ఆటలాడినా సాగుతాయనీ అనుకుని నీమీద నాకు కొంచెం ఈర్ష్య కలిగింది కుడాను. నేను పొరపాటు పడ్డానని యిప్పుడు నాకు తెలిసింది" అన్నాడు అతను.

మా స్లెయ్‌లను ఒక దానివెంట ఒకటి వరుసగా పెట్టుకుని మళ్ళీ

ముందుకు సాగేం. కాస్సేపటికల్లా మంచు శిఖరాలలాగున్న ఆ గడ్డిమేట్లు కా-ఖెమ్ ఒడ్డంట నల్లగా అంత దూరాన్న కానొచ్చాయి.

యెత్తుగా వున్న ఆ గడ్డిమేట్ల చుట్టూరా వున్న కోరడితలుపు దగ్గిర కొచ్చేసరికి చొల్‌దాక్-ఓల్ సంతోషంతో:

"వచ్చేశాం! వచ్చేశాం!" అని కేకేశాడు.

నేను పరుగెత్తి గేటు తీయడానికి వెళ్లూతూ:

"మనమిప్పుడు యేం చెయ్యాలేమిటి?" అని అడిగేను అతన్ని.

"తాడు తీసుకురా" అన్నాడు అతను.

ముందు స్లెయ్‌కి కట్టిన వేటతాడుని విప్పి దాన్ని చొల్‌దాక్-ఓల్‌కి యిచ్చాను.

రోడ్డుమీదున్నప్పుడు యెంత నేర్పుగా తాడుని విసిరేడో యిప్పుడూ అంత నేర్పుగా విసిరేసరికి ఆ తాడు యెగిరి గడ్డిమేటు నడికొప్పు మధ్యగా పడి ఒక కొస అవతలి పక్కకి జారింది.

"ఇదిగో తాడు యీకొసని నువ్వు స్థిరంగా పట్టుకొని నిలబడు. వెనక పక్కనుంచి రెండోకొస పట్టుకుని నేను గడ్డిమేటుమీదకి యెగబాకు తాను" అని నాకు తెలియజెప్పి తను గడ్డిమేటువెనుక తను మాయం అయిపోయి:

"ఏం?" అని కేకేశాడు.

"సరే నేను గట్టిగా పట్టుకునే వున్నాను!" అని నేను జబాబుచెప్పాను.

తాడు బిగిసింది. నా మడమలను నేలలో దిగదొక్కి గట్టిగా వూపిరి తీస్తూ తాడు పట్టుకుని నిలబడ్డాను. చొల్‌దాక్-ఓల్ నాకంటె బరువైన మనిషిమరి.

ఒక్కసారిగా తాడు వదులైంది. గడ్డిమేటు నడికొప్పుమీదకి యెక్కి పోయాడు కదా అనుకుని నా చేతిలో వున్న తాడుని పట్టువిడిచేసి తాడు వదులవడంవల్ల గట్టిమేటు శిఖరాన్నుండి రేగిన మంచుని చూస్తూ నిల బడ్డాను. చౌల్‌దాక్-ఓల్ యేడీ? ఎక్కడున్నట్టు? నడికొప్పుమీదకి రాడేం? ఇంతట్లో చౌల్‌దాక్-ఓల్ గడ్డిమేటు వెనకనుంచే వచ్చి నామీదకు ఉరికేడు. ఆ దెబ్బతాకిడికి నేను నేలమీదకి యెగిరిపడ్డాను. నా జీవితంలో యెన్నడు యింత పరాభవం అనుభవించలేదు అనిపించింది నాకు. తాడు వదల కూడదని నాకేం తెలుసు? నేనేం చెయ్యాలని చేశానా? మొదటినుంచీ కూడా యితన్ని నా స్నేహితునికిందే భావించానే. నేలమీద పడిపోయిన వాడినల్లా లేచాను. కాని కళ్లనీళ్లు పెట్టుకోవడం అన్నది యేనాడో మర్చిపోయిన వాడిని ఇప్పుడు కన్నీటి ధారలని ఆపుకో లేకపోయాను.

చౌల్‌దాక్-ఓల్ ముఖం చూసేసరికి నాకు బోధపడింది తప్పు నాదే అని. అతని వొళ్లంతా మంచుమయం. ముఖంమీద రక్తం కారుతూంది. గడ్డిమేటుమీదనుంచి జారిపడిపోయాడు. ఆ జారిపడిపోవడంలో గాజుపెం కులకంటే సూదిగా వుండే మంచు పెచ్చులకి అతని ముఖం గీసుకొని పోయింది.

వేటతాడుని చౌల్‌దాక్-ఓల్ మళ్లీ మరోసారి గడ్డిమేటుమీదకు విసిరేడు. ఈ మారు మాత్రం నామీద ఆధారపడక పంగటికర్రని గడ్డిమేటు దగ్గిర పాతి దానికి ఆ తాడు కట్టి పంగటికర్రకొనను నన్ను గట్టిగా పట్టుకోమని గడ్డిమేటు వెనకటివైపుకి వెళ్లాడు. గడ్డిమేటుమీద అని తలకాయ, ఉద్యోగస్థులు పెట్టుకొనే తెల్ల బొచ్చుటోపీపైన వుండే గుండ్రటి బిళ్లలాగ కానొచ్చింది.

"నా స్లెయ్‌లోనుంచి పారని పట్టుకురా" అన్నాడు.

పరుగెత్తుకెళ్లి పారని తీసుకొచ్చి గడ్డిమేటుమీదకి విసిరాను.

చౌల్‌దాక్-ఓల్ దాన్ని అందుకుని పనిమొదలు పెట్టేసరికి అతను తవ్విపారేస్తున్నది గడ్డిమేటుమీద వున్న మంచుకాకుండా పాలమీద తేరిన మీగడని చెమ్చాతోతీసి గిన్నెలో వేస్తున్నట్టే అనిపించింది — అంత చకచక పనిచేస్తున్నాడు పారతో.

అతను గడ్డిమేటుమీదనుంచి దిగిపోయినతరువాత గడ్డిని స్లెయ్‌కెక్కిం చేటప్పుడు గడ్డిని మేము తొక్కేయకుండా వుండేందుకు గడ్డిమేటుముందు కొంతనేలని ఇద్దరమూ ఖాళీచేసి అక్కడికి స్లెయ్ తీసుకొచ్చి పెట్టాం.

స్లెయ్‌మీద నాలుగు గుంజలని అడ్డుగా వేసి చౌల్‌దాక్-ఓల్ వేట తాడు తీసి మళ్లీ గడ్డిమేటుమీదకి విసిరేడు.

"ఈసారి గడ్డిమేటుమీదకి నువ్వెక్కు" అని నన్ను ఆజ్ఞాపించాడు.

నాకీ పని ఒప్పజెప్పినందుకు నేను చాలా గర్వపడ్డాను. దేవదారు చెట్టు మీదకి పాకుతూన్న ఉడతలాగ ఆ గడ్డిమేటుమీదకి యెక్కుతూంటే గాలిలో తేలిపోతున్నానేమో అనిపించింది. సహంయెక్కానోలేదో తాడు చట్టుక్కుమని లాగినట్టైంది. దానితో నా పట్టు తప్పిపోయి కిందకి పడ్డాను.

మెడమీద పడ్డమంచుని దులిపేసుకుంటూ లేచి చౌల్‌దాక్-ఓల్ దగ్గిరకి పరుగెత్తుకొనివెళ్లి కోపంతో:

"ఏం మనిషివయ్యా నువ్వు? తాడు పట్టుకుని మనిషి యెక్కుతూంటే తాడుని వదిలేస్తావుటయ్యా?" అని నేను కేకలేశాను.

"మరి నన్నంటున్నావే యిప్పుడు? కిందటిమాటు నువ్వు నన్ను గడ్డి మేటుమీదనుంచి కిందకి జార్చేసినప్పుడో! ఆ సంగతి మర్చిపోయావు కాబోలు? ఈమాటు యెక్కు ఫరవా లేదు. తాడుని గట్టిగా పట్టుకుంటానులే!" అని నవ్వుతూ అన్నాడు.

ఈసారి మేటుమీదకి సరిగ్గా యెక్కిపోయి హాయిగా వూపిరి తీస్తూ నాలుగు దిక్కులా చూశాను. తెల్లవారుతూంది. దూరంలో మొదల్లూ కొసా లేకుండా వుంది గడ్డకట్టిపోయిన కా-ఖెమ్. ఎంతో దూరాన్న ఆకాశాన్నే అందుకుంటున్నాయి నల్లని అడవులని కప్పుకున్న బ్రహ్మాండమైన పర్వతాలు. వాటిని దాటి మంటలు మండుతూన్న ఆకాశం అంచుల్లోంచి ఉదయిస్తున్నాడు సూర్యుడు.

అది చూస్తూ మంత్రముగ్ధుణ్ణయి నిలబడిపోయాను అలాగు. కిందనుంచి చొల్‌దాక్-ఒల్ నాకేదో చెప్పడానికి కేకేస్తున్నాడు. వేకువజాములో అతని మాటలు మరింత గట్టిగా ప్రతిధ్వనించుతూ ఒక పర్వతపంక్తి నుంచి మరో పర్వతపంక్తికి వ్యాపిస్తూంది. ఆ ప్రతిధ్వని గావించుతూన్న బృందగాన రాగాలాపనలో:

"పంగటిక్ర్ర—క—ర్ర... అ—ం—దు—కో..." అన్న రెండు మాటలు నాకు వినిపించాయి.

ఆ పంగటిక్రని అందుకొని చెయ్యి చీరుకుపోయిన సంగతే మర్చిపోయి గడ్డిని కిందకి తొయ్యడం మొదలెట్టాను. పంగటిక్రతో ఆ గడ్డిని కిందను స్లెయ్‌మీదకి యెగరేస్తూ స్లెయ్‌లమీద - అది క్రుక్రుమని శబ్దంతో పడి స్లెయ్‌మీదకెక్కి చొల్‌దాక్-ఒల్ పాడుతూ వాటిని సర్దుతూంటే ఆ హుషారులోను ఆ సరదాలోను నాకు గడ్డి బరువుగా వున్నట్టే అనిపించలేదు.

స్లెయ్‌లు అన్నీ నిండిపోయినతరువాత నన్ను కిందకి దిగమన్నాడు చొల్‌దాక్-ఒల్. కిందకి దిగినాక వలంపటి కొసలదగ్గిర గళ్ళుచెక్కిన కురుచ గుంజలని గడ్డిమీద వేసి ఆ గడ్డిని తాళ్లతో స్లెయ్‌లకు యెలా గట్టిగా కట్టాలో నాకు చూపించాడు.

ఆరు స్లెయ్‌లనూ సిద్ధంచేశాక ఇంటిముఖంగా బయలుదేరేం.

పర్వతపంక్తుల శిఖరాల అంచులనుంచి శీతకాలపు పొద్దు అప్పుడే పొంచి చూస్తూంది.

ఏడవ ప్రకరణం

కొదూర్-ఓలు బీచె-కీసుల కథ

బత్రాక్ పనికి క్రమక్రమంగా నేను అలవాటుపడుతూ వచ్చినా పని మాత్రం తేలిక అనిపించ లేదు నాకు. మేమందరమూ కూడా పగలనక రాత్రి అనక విధివిరామంలేకుండా నతాల్య తిట్టేతిట్లు చౌల్‌దాక్-స్తెపాన్ పెట్టే బాధలు పడవలసి వచ్చేది. అయితే చౌల్‌దాక్-స్తెపాన్ యింట్లో పడ్డ ఇతర బాధలతో కూడా స్నేహం అంటే యేమిటో—నా ఆత్మీయుల స్నేహమే కాకుండా నా సన్నిహితుల స్నేహం కూడా అర్థం చేసుకో గలిగాను.

వెదెనేయ్ అంటే మాకందరికీ అతి ప్రేమ. నిరంతరం మమ్మలిని వెంటాడుతూన్న యిబ్బందులనుంచే కాకుండా మా యజమాని పెట్టే బాధల నుంచే కూడా మమ్మలిని తప్పించడానికి అతడు యెప్పుడు సిద్ధంగా వుంటూ, అన్నివిధాలా మాకు చేదోడువాదోడుగా వుండేవాడు. మా తువీనియను అందరలోకి పెద్దవాడైన తర్బగానూ మేమూ అందరమూ ఇంట్లో కలిసి

సాయంకాలంపూట కూర్చున్నప్పుడు యేవో కొత్త సంగతులని సరదాగా మాకందరకీ చెపుతూండేవాడు వెదెనేయ్.

ఒకరోజు నాకు బాగా జ్ఞాపకం వుంది. ఆరోజు చీకటిపడిన తరువాత కూడా చాలా పొద్దువరకూ పనిచేసి ఇంటికొచ్చేసరికి అదివరకు మేం యెన్నడూ చూడని అమ్మాయి మా గదిలో పొయ్యిని రాజబెట్టుతూంది. నతాల్య యింటికి అతిథులు రావడంచేత మా భోజనాన్నిచ్చి తనను నతాల్య పంపించిందని చెప్పింది ఆమె. తన పేరు వేర అని చెప్పింది. ఆమె వేసుకున్న దుస్తులని పట్టే ఆమె కూడా మాలాగే బ్రతాక్ ఊడిగం చేస్తూందని మాకు తెలిసింది. మా భోజన వస్తువులని అక్కడ వుంచి వెళ్లిపోతూ మాకు వీడ్కోలు చెప్పడానికన్నట్టు గుమ్మందగ్గిర చెయ్యూపింది. ఆమె చేతులెంతో అందంగా వున్నాయి. నిర్మలమైన ప్రాతఃకాలంలో చెరువు మధ్య వున్న రెల్లు గడ్డిపొదల పక్క నుంచి మెడని వొయ్యారంగా వొంచి ఈదుతూన్న హంస లాగుంటుంది ఆమె శిరస్సు. నవ్వుతూ వున్న కళ్లతో నావైపు చూస్తూ:

"బొద్దూడని యీ కుర్రాడు కూడా బ్రతాకే? వీడి చేత యేంపని చేయించుకోగలరు మీరు?" అంది ఆమె.

వేర గొంతుకలో పరిహాసం వుంది. "ఈ అమ్మాయి మాటలు విసిరితే ములుకుల్లాగ తగులుతాయే" అనిపించింది నాకు. కాని అప్పటికే వెదెనేయ్ సీదొరొవ్ నవ్వు గొంతుక వినిపించింది:

"కుర్రాడు చిన్నవాడైనా పనిలో మా అందరికంటే ముందే! కుర్రాడిలో కావలసినంత చేవ వుంది. కాస్త యెదగనిచ్చావంటే నీదగ్గిరకే పంపిస్తాడు పెళ్లిళ్ల పేరయ్యలని తన్ను చేసుకోమని — నువ్వేమో బొద్దూడని పిల్లా

డంటున్నావు! నీ కోసం యెలాంటి పెళ్లికొడుకుని కుదిర్చి సిద్ధంగా వుంచామో చూశావు కదా!''

వేర ముఖం య్రెరబడి నావైపు చెయ్యి వూపుతూ యింటిలోంచి పారిపోయింది.

వేర గుణాతిశాయాలను తర్బగాన్ పొగడుతూ కాస్సేపయాక వెనుకటి సంభాషణని మళ్లీ యెత్తుకున్నాడు.

"వెదెనేయ్ మాటలేకనక నిజమవుతే యెంత బాగుండును! మా చిన్న తనంలో మాతాత మాకొక కథ చెప్పాడు. అలాంటి కథలని యిప్పుడు యెవ్వరూ చెప్పరు. ఒక ఖామందూ, అతిన్ని లక్ష్యంచేయని ఒక ముసలివేటగాడూ, అతని కొడుకూ వీళ్లిద్దరూ తమ కష్టం మీదనే ఆధారపడి సౌఖ్యాన్ని యెలా సంపాదించినదీ — దీన్నిగురించి కథ'' అని చెప్పాడు.

పాలేళ్లలో కొందరు మోచేతులమీద ఆనుకొని లేచారు. కొందరు తర్బగాన్‌కి దగ్గరగా జరిగేరు. మరికొందరు సిగరెట్లులను చుట్టుకుంటున్నారు. ఆ కథని చెప్పమని అందరం అతన్ని అడిగేం. దీర్ఘాలు తీసుకుంటూ పాటపాడు తున్న గొంతుకతో మొదలుపెట్టాడు తర్బగాన్:

"ఐతే చెప్తాను వినండి. అనగా అనగా చాలా కాలంకిందట తుసూగ్-ఖెమ్‌నదివొడ్డున బూర-బష్త్గ్ అని ఒక గొప్పవాడుండేవాడు. అతనికి తెల్లగా ఒక పెద్ద యూర్త వుండేది. అతనికి కొన్ని వేల పశువులుండేవి. ఎంతో మంది నౌకర్లు పాలేళ్లు అతనిదగ్గిర పనిచేస్తుండేవారు. వాళ్లలో ఒక ముసలి వేటకాడు, అతని కొడుకు కొదూర్-ఓల్, బీచె-కీస్ అనే మరొక అమ్మాయి వున్నారు. కొదూర్-ఓల్నున్ను బీచె-కీస్సున్ను ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఏదో ఒక నెపంమీద ఒకనాడు బూర-బష్త్గ్ ఆ ముసలివేటకాడిని కొట్టాడు.

అందుమీద ఆ వేటకాడు తన కొడుకుని తీసుకుని అడవిలోకి వెళ్ళిపోయి యిల్లు కట్టుకుని అక్కడే వుండిపోయాడు. అడవిలోకి వెళ్ళిపోయేముందు తన ప్రియురాలిని చూడ్డానికి వెళ్ళాడు కొదూర్-ఓల్.

" 'మా తండ్రితో కూడా వుండడానికి నేనూ అడవిలోకి వెళ్ళిపోతున్నాను. దుర్మార్గుడు యీ బూర-బష్త్గ్ దగ్గిర బానిసనౌకరీ చేస్తూ బతక దల్చుకోలేదు' అని చెప్పాడు కొదూర్-ఓల్ బీచె-కీన్‌తో.

" 'నన్నిక్కడ వదిలేసి వెళ్ళిపోతావా?' అని బీచె-కీన్ అడిగి యేడ వడం మొదలెట్టింది.

"కొదూర్-ఓల్ ఆ అమ్మాయిని తన హృదయానికి హత్తుకుని ముద్దుపెట్టుకుంటూ:

" 'నేను నిన్ను యెన్నటికీ వదిలిపెట్టను. అడవిలో కెళ్ళి యెన్నో మృగాలని చంపేస్తాను. బూర-బష్త్గ్ బారినుంచి నిన్ను విడిపించేస్తాను' అని తన ప్రియురాలితో చెప్పాడు.

"తన కోటు చేతితో కన్నీళ్ళని తుడుచుకుని నవ్వుతూ:

" 'అలాగైతే మంచి మాటే ప్రియా! నా ఆశీస్సులు నీకు' అంది.

"కొదూర్-ఓల్ తన తండ్రిని కలుసుకుని అతనితో కూడా అడవిలోకి వెళ్ళిపోయాడు. వెళ్ళుతూ వెళ్ళుతూ తన బిజంచీ*ని కూడా భుజాన్ని వేసుకెళ్ళాడు. అతనికి పాటపాడుతూ తన బిజంచీని వాయించడం అంటే అతనికి భలేసరదా. నడుస్తూ నడుస్తూ తన ప్రియురాలున్న నల్ల యూర్త

---

* వాద్యవిశేషము.

వైపు చూస్తూండేవాడు. తను వెళ్లిపోతూన్నప్పుడు తన గొంతుక ఆమెకి వినిపించాలని గట్టిగా పాడుతూ ముందుకు నడిచాడు:

"కుస్‌కున్నూగ్ దిగువ నేను బావి తవ్వితే
తప్పక లభించు నాకు నిర్మలాజలము.
పేదావారింటి పడుచునే నేను పెండ్లాడితే
దొరకు నాకు దయగలా పెండ్లాము.

"అతని మనసంతా బీచె-కీస్ మీదే వుంది. అలాపాడుకుంటూ ముందుకు నడుస్తూండేసరికి హఠాత్తుగా యెక్కడినించి వచ్చిందో మరి, బూర-ఖష్తిగ్ పెద్దకూతురు చిల్‌జకై అతని ముందు నిలబడింది. ఆమె పట్టుదుస్తులని తొడుక్కుని మంచి బొచ్చు టోపీ పెట్టుకొని వెండి జీనువేసి వున్న గుర్రంమీద సవారీ చేస్తూంది. చెవినున్న బంగారపు తమ్మెట్లు తళతళమని మెరుస్తున్నాయి. పట్టరాని కామావేశంతో ఆమె వొళ్లంతా కంపించిపోతూంది. అడవినక్క గోళ్లలాగున్నాయి ఆమె చూపులు కత్తుల్లా దూసుకుపోతూ.

" 'మా తండ్రి దగ్గిరవున్న పాలేళ్లందరిలోనూ నువ్వు అందమైనవాడివి. అటువంటి వాడివి నువ్వు మన వూరినీ నన్నూ విడిచిపెట్టేసి వెళ్లిపోతున్నావు! నువ్వు వెళ్లిపోతే నన్ను కౌగిటచేర్చి నాకోరిక తీర్చి నన్ను సుఖపెట్టే వాళ్లెవరు ఇక?' అని అడిగింది ఆమె కొదూర్-ఓల్‌ని.

"కొదూర్-ఓల్ వెంటనే యే జబాబు చెప్పలేదు. అడవిపిల్లి నోటపడి గోళ్లతో తనను ముక్కముక్కలకింద చీల్చి వేయబడ్డానికి సిద్ధంగా వున్న పక్షి ఆ పిల్లితో యేమి మాట్లాడుతుంది?

''కొంతసేపయాక ప్రశాంతచిత్తంతోనూ తీవిగానూ ఆ కుర్రవాడు:

'' 'నువ్వు భాగ్యవంతురాలవు. నీకు విలువైన దుస్తులూ నగలూ వున్నాయి. కాని నీకు హృదయం లేదు. నువ్వు అంటే నాకు అసహ్యం. నీ ముఖం నేను చూడదలచుకో లేదు.' అని అంటూ గబగబ వెళ్లిపోయాడు.

''చిల్‌బకై ఆ మాటలని విని అతన్ని తనదగ్గిర వుండిపోమనీ తనతో మాట్లాడమనీ అనేక విధాల బతిమాలుకుంది. కాని అతడు మరింత త్వరగా అడుగులు వేసుకొంటూ వెళ్లిపోయాడు. దారిలో ఒక కొండవుంటే ఆ కొండ మీదకెక్కి వెనక్కి తిరిగి చూసేసరికి చిల్‌బకై తనగుర్రాన్ని తనబలం అంతటితోను కొడుతూ స్తెప్‌మైదానాల మీదనుంచి వాయువేగ మనో వేగంతో వెళ్లిపోతూండడం చూశాడు.

''తను మంచిపనే చేశానని సంతోషించుతూ కొదూర్-ఓల్ తన దారంట వెళ్లిపోయాడు. స్తెప్‌మైదానాల నన్నింటినీ దాటుకుని అడవి అంచు దగ్గిరకొచ్చాడు. అక్కడికొచ్చేసరికి అతి జోరుగా పారుతూన్న కొండవాగు ఒకటి అడ్డం వచ్చింది. ఆ వాగుకి అవతల అంతులేని ఒక మహారణ్యం, ఆ మహారణ్యానికి ఆవల ఆకాశాన్ని అందుకునే పర్వత పంక్తుల శిఖరాలు అతనికి కనిపించాయి. అప్పటికే సూర్యుడు ఒక పర్వతశిఖరాన్ని తాకుతున్నాడు. మరి కొద్దిసేపట్లో కొండ చాటున దిగిపోతాడు.

''వాగుకి ఎగువగా చీకటిగా వున్న వాగు వొడ్డంటే వెళ్లగా వెళ్లగా వొడ్డంట వున్న పెద్ద బండరాయిదగ్గర తండ్రి వుండడం చూశాడు.

'' 'ఎక్కడున్నావు ఇంత సేపూ నువ్వు? నీనుంచి సాయంకాలం వేట మానుకోవలసి వచ్చింది' అని తండ్రి అడిగేడు.

'' 'నేనెక్కడకీ వెళ్లలేదు. తప్పుదారిని పడిపోయాను' అని కొదూర్-

ఓల్ జబాబు చెప్పాడు, కానీ తండ్రి ముఖం చూసి గాభరాపడ్డాడు. బీచె-కీస్ గురించి మాత్రం యేమీ తన తండ్రితో చెప్పలేదు.

"ఆ బండరాతిదగ్గిర వేటగాళ్లిద్దరూ పెద్ద నెగడి వేసుకొని అక్కడే పడుకున్నారు నిద్రపోవడానికని.

"అగ్గిరవ్వలు నల్లటి ఆకాశంలోకి ఎగిరిపారిపోతూండడం చూస్తూ పడుకుని కొదూర్-ఓల్ తనలో తను ఇలా తలపోసుకొన్నాడు: 'ఈ చుట్టూ వున్న చెట్లూ ఆకాశాన్ని వున్న నక్షత్రాలూ నా తండ్రీ నేనూ – అందరికీ బతుకంటే తీపే. కష్టాలున్నప్పటికీ జీవితంలో ఎంత ఆనందం వుంది! నేను మా తండ్రిలాగు వుండాలి. ఆయన యంతో ముక్తసరు మనిషి. అయితేనేం? వేటగాండ్రందరిలోనూ ఆయనదే పైచెయ్యి. ఆయన చంపినన్ని జంతువులను మరియే వేటకాడూ చంపలేదు.'

"ఇలా అనుకుంటూ నిద్రపోయాడు.

"మెలకువ వచ్చి అతనులేచి చూచుకొనే సరికి నిప్పు ఆరిపోయి వుంది. తండ్రి యెక్కడా కనిపించలేదు. కొదూర్-ఓల్ దబ్బున లేచి తన తుపాకిని శుభ్రంచేసుకొన్నాడు. అలా శుభ్రంచేసుకోవడంలో తన ప్రియురాలు బీచె-కీస్ మాట జ్ఞాపకం వచ్చింది.

" 'నాకు వేటలో జయం కలిగేటట్టు నన్ను ఆశీర్వదించు' అని ఆవిడని మనసులో ప్రార్థించి తన బిజంచీని పట్టుకుని దాన్ని వాయిస్తూ పాడేడు:

"కోయిల గానము
కాననము మేల్కొల్పు మాడ్కి
నాప్రేయసి పల్కులు
నా యెదలో లేపును సుడిగాలు.

''ఒక బండరాతిదగ్గిర ఆరబయిటనే తన బిజంచీని వుంచేసి తుపాకీని పట్టుకుని వేటకి బయలుదేరేడు అతను. దారిలో అడ్డొచ్చిన ఆకులమీద కొమ్మలమీద కాలుపడితే యెక్కడ చప్పుడు అవుందో అని వాటిమీద కాలుపడకుండా కొంగ నడచినట్టు కాళ్లు యెత్తెత్తి వేసుకుంటూ వెళ్లేడు.

''అలా చీకటిపడేవరకూ అడవిలో తిరిగేడు. కాని వేట యేమీ దొరకలేదు. ఒక్క జంతువనైనా పట్టుకోకుండా ఆ బండరాతిదగ్గిరకి వచ్చి చేరుకున్నాడు.

''కాస్సేపటికి తండ్రి వేటనుంచి వచ్చాడు. ఒక భుజంమీద తుపాకీ వేలాడుతూంది. రెండవ భుజంమీద అడవి గొర్రె ఒకటి వుంది. కొదూర్-ఓల్ ధ్యానం అంతా బిచె-కీస్ మీదే వుండడంచేత తండ్రి రావడం అతను చూసుకోలేదు.

'' 'అలా విచారంగా వున్నావేమి నాయనా?' అని తండ్రి కొడుకుని అడిగేడు.

''కొదూర్-ఓల్ తుళ్లిపడిలేచాడు. కాని తన మనస్సులో వున్న ఆలోచనలు తన తండ్రికి తెలియకుండా వుండాలని:

'' 'విచారం కాకపోతే మరేమిటి? వేటకి వెళ్లి పెద్ద జంతువని వేటాడి తీసుకు వచ్చావు నువ్వు. వుత్తచేతులతో వేటనుంచి వచ్చాను నేను' అని బాబు చెప్పాడు కొడుకు.

'' 'అలాగని నువ్వు కంటతడిపెట్టుకో కూడదు. నిజమే నేను గొర్రెని వేటాడి తీసుకొచ్చాను. ఎవరికోసం వేటాడి తీసుకొచ్చాను? మనిద్దరి కోసమూన్నూ! రా! ఇలా వచ్చి నీ బిజంచీ వాయిస్తూ చక్కని పాట ఒకటి పాడు నాయనా!' అన్నాడు తండ్రి.

"తండ్రి కోరిక ప్రకారం కొదూర్-ఓల్ పాడడం మొదలు పెట్టాడు. అలాపాడుతూ పాడుతూనే బిజంచీ చేతిలో వుంచుకునే నిద్ర పోయాడు. నిద్రలోంచి లేచి చూసుకునే సరికి తండ్రి అక్కడలేడు. తన తుపాకి చేత బుచ్చుకొని యేదైనా ఒక్క జంతువనైనా వేటాడనిదే మరి తిరిగి రాకూడదని నిశ్చయించుకుని బయలుదేరాడు వేటకి. తీరాబయలుదేరే సరికల్లా మెరపులతోనూ పిడుగులతోనూ కుంభవృష్టి కురవడం ఆరంభించింది.

" 'ఇదేమిటి? ప్రతీదీ నాకు అడ్డుగానే వస్తూందేమిటి! శరదృతువులో మెరపులతోనూ పిడుగులతోనూ వర్షమూ! అయితేనేమి? నా చేతిలో నా బిజంచీ వున్నంతకాలం నాకు గాత్రం వున్నంతకాలం నా ప్రయత్నాన్ని నేను వదిలిపెట్టను' అని కొదూర్-ఓల్ తన మనస్సులో అనుకొని అక్కడ ఒక రాయి వుంటే తన తుపాకిని ఆ రాతిని ఆనుకునేటట్టుంచి తన బిజంచీని వాయిస్తూ గానం చేయడం మొదలుపెట్టాడు. తుపానుకంటే మించి వున్న అతని కంఠం వర్షానికి తడిసిన భూమిలాగు మృదువుగాను కోమలంగాను వుంది. హోరుమని పడుతూంది వాన. ఢణేలుమని పిడుగులు ధ్వనిస్తున్నాయి. తన గానంలోనే మునిగి తేలుతూన్న కొదూర్-ఓల్‌కి తుపాను హోరు యేమాత్రమూ వినిపించలేదు.

"హఠాత్తుగా ఆకాశం బద్దలైనట్టు భయంకరమైన చప్పుడైంది. రాతిబండలని కొమ్మలతో ఆనుకుని పెరుగుతూన్న ఒక దేవదారు వృక్షం మీద పిడుగుపడగా వృక్షంనిలువునా రెండు చెక్కలు అయిపోయింది. మరొక సారి పెద్ద చప్పుడైంది. మొదటికంటె మరింత భయానకంగా వుంది యీసారి ధ్వని. కొదూర్-ఓల్ కూచున్న బండకిదగ్గిరగా వున్న మరొక

రాతిలోంచి ఎర్రనిపట్టు వస్త్రాలు కట్టుకుని పచ్చని పటకా పెట్టుకుని జరీకుచ్చుగల అడవిపిల్లిబొచ్చుతో చేసినటోపీ ధరించి జల్తారు మైమూకీలని తొడుగుకున్న యువతి ఒకామె ప్రత్యక్షమైంది... వాలుగా నల్లగా వున్న ఆమె కళ్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఆమె జడకుచ్చులు నేలమీదపడుతూ నేలను చుట్టుకుంటున్నాయి. ఆరిపోయిన నిప్పుదగ్గిర ఆమె కూర్చుంది. ఆ గాలివానని ఆమె గమనించినట్టేలేదు.

"యేమి చెయ్యడమో కొదూర్-ఓల్‌కి యేమీ తెలియలేదు. ఒక మాటు తన తండ్రిని తల్చుకుని, ఒక మాటు తన బీచె-కీన్‌ని తల్చుకుని మౌనంగా కూచున్నాడు. కొంత సేపటికి:

" 'ఎవరివి నువ్వు? నువ్వెకడనుంచి వచ్చావు?' అని అడిగేడు ఆమెని.

" 'ఈ పర్వతాలనీ యీ అడవులనీ పాలించే రాణిని నేను. నీ బిజంచీ గానం నన్ను నీదగ్గిరకి తీసుకొచ్చింది. మూడు రోజులై నీ బిజంచీస్వరం నా హృదయాన్ని కరిగించేస్తోంది. ఆ గానం విని నేను నిన్ను మోహించాను' అంది ఆమె.

"ఈ మాటలు చెవిని పడేసరికల్లా కొదూర్-ఓల్ హృదయంలో ఒక విధమైన హాయి పుట్టుకొచ్చింది. అయినప్పటికీ యీ విచిత్రమైన స్త్రీ అంటే మరి యెందుచేతనో అతనికి ఒక విధమైన యేవగింపు కలిగింది. దాంతో:

" 'నాదగ్గిరనుంచి నీకేంకావాలి?' అని కఠినంగా అడిగేడు ఆమెని.

" 'నావెంట రా! నాకు వేలాది పశుసంపద వుంది. నా యీార్త వెండి బంగారాల మయం. నన్ను పెళ్ళాడితే నా ఐశ్వర్యానికంతకు నువ్వే నాధుడవు అవుతావు. రా! నాతో వచ్చేయ్!' అంది ఆమె.

“ ‘నేను ఆలోచించుకుని మా నాన్నని అడిగి చెబుతాను. ఆయన వేట కని అడవిలోకి వెళ్లాడు. త్వరగానే వచ్చేస్తాడు. ఆయన వచ్చాక అప్పుడు నీకు జబాబు చెబుతాను’ అని చెబుతూ కొదూర్-ఓల్ అడవిలోకి వెళ్లి పోయాడు.

“ మళ్లీ మరొక మాటు గాలివానొచ్చింది. అదృశ్యమైనటువంటి మహా శక్తి ఒకటి వచ్చి కొదూర్-ఓల్‌ని గాలిలోంచి యెగరేసుకుంటూ తీసుకు పోయింది. అలా యెగిరియెగిరి భూమిమీద పడిపోయాడు. ఆ పడిపోవడంలో ఒక గొప్ప యుర్తకి దగ్గరగా పడిపోయాడు.

“ఆ యుర్తలోకి వెళ్లాడు. నేలమీద రత్నకంబళ్లు పరచివున్నాయి. గోడదగ్గిర వరుసగా రకరకాల రంగులతో అలంకరించబడిన భోషాణాలున్నాయి. పొయ్యిమీద పెద్ద బాణలినిండా మీగడపాలు కాగుతూన్నాయి. ఎడమపక్కని వున్న బీరువానిండా సింహాలు సర్పాలు చెక్కిన గిన్నెలున్నాయి. కుడిపక్కని చెక్కమంచం. ఆ మంచంమీద పట్టుపరుపు. ఆ పరుపుమీద పట్టుకంబళి ఒకటి పరచి వుంది. యుర్త మాత్రం నిర్మానుష్యంగా వుంది.

“కొంతసేపటికి రాణి వచ్చి అగుపడి:

“ ‘ఈ యుర్త నాది. నన్ను పెళ్లిచేసుకుంటే యీ ధనాన్నంతా నీకిచ్చేస్తాను’ అంది అతనితో.

“కొదూర్-ఓల్ యేమీ మాట్లాడలేదు.

“ ‘నువ్వెందుకలా బిడియపడుతున్నావు? నేనంటే నీకు భయమెందుకు? నన్ను వివాహమాడు’ అని మరోసారి నొక్కి అడిగింది.

“కొదూర్-ఓల్ మళ్లీ యేమీ మాట్లాడలేదు.

“ ‘నీ బంధువుల మాట యేమిటని దిగులుపడుతున్నావేమో? వాళ్లగురించి

నీకు యే చీకూ చింతా అవసరం లేదు. మనం భార్యాభర్తలం అయినాక వాళ్లనందరనీ నివ్విక్కడకే తీసుకొొచ్చే దువుగాని' అంది ఆమె.

" 'నీ ఐశ్వర్యం నాకక్కరలేదు. నీ అందాన్ని చూసి నేనేం మురిసి పోవడంలేదు. ఒక పేద అమ్మాయి వుంది. ఆ పేద అమ్మాయిని నేను ప్రేమించాను' అని కొొదూర్-ఓల్ ఆమెకు ప్రత్యుత్తరం యిచ్చాడు.

" 'నువ్వు ఆమెదగ్గిరకు వెళ్లడానికి యెంత మాత్రం వీలులేదు. ఆమెదగ్గిరకు వెళ్లడానికి నేను నీకు గుర్రాలనీ యివ్వనూ నీకు దోవా చూపించను. ఎలాగు వెళ్లతావో చూస్తాను!' అని అతనిమీద మండిపడి కేకలేస్తూ ఆ సుందరి గభాలుమని బైటకెళ్లిపోయింది.

"వెళ్లిపోయి యూర్త చుట్టూ పహరా పెట్టించింది.

"కొొదూర్-ఓల్‌కి యెక్కడకి వెళ్లడానికీ వీలైందికాదు. యూర్త లోంచి కదిలివెళ్లితే విల్లునుండి వదలిన బాణం యెంతమేరకి వెళ్లుతుందో ఆమేర దాటి అతను కదిలివెళ్లడానికి వీలులేదని ఆజ్ఞాపించింది ఆ రాణి.

"కొొదూర్-ఓల్ మాత్రం ప్రతీ రోజూ చేరువగా వున్న ఒక కొొండెక్కి అక్కడ తన బిజంచీమీద అన్నిటికంటె తనకే పాట యిష్టమో ఆ పాటను పాడుకుంటూ వుండేవాడు. ఆ పల్లెలోవున్న ఆ బాలగోపాలమూ అతని గానాన్ని వినడానికి ఆ కొొండ దగ్గిరకొొచ్చి చేరేవారు.

"అహో రాత్రాలుగా కొొన్నాళ్లపాటు, యీ అందాలరాణినుంచి తప్పించుకుని బైటపడ్డానికి మార్గం ఆలోచించాడు. అందుకు అతనికి అదృష్టంకూడా కలిసొొచ్చింది. ఇతని ఓర్పును పరీక్షించడానికి నిశ్చయించింది ఆ రాణి.

"ఆరోజు సూర్యాస్తమం ముందు ఆమె అతని దగ్గిరకొొచ్చి:

“ ‘నేను చెప్పేది జాగ్రత్తగా విను కొదూర్-ఓల్. ఈ ప్రపంచంలో వున్న వస్తువులన్నిటిలో నువ్వు అమూల్యమైన వస్తువని దేనిని యెంచుకొంటున్నావో దాన్ని పొందాలని నీకు కోరిక వుంటే, నేను చెప్పే షరతును పాటిస్తే నీకావస్తువు లభిస్తుంది. ఆ షరతు యేమిటంటే తొంభై రోజులు నువ్వు యెవ్వరితోనూ మాట్లాడకుండా మౌనం వహించి వుండాలి. ఈ షరతుని నువ్వు పాటించుతే నువ్వు దేన్ని కోరుకుంటే అది నీకు లభిస్తుంది. షరతుని పాటించ లేకపోతే అడవిలోవున్న నెగడికి వుత్త చేతులతో నిన్ను తన్ని తగిలేస్తాను. నన్ను దగాచెయ్యడానికి మాత్రం ప్రయత్నించకు. ఎందుచేతంటే నన్ను దగాచెయ్యడం నీ తరంకాదు. కావాలని నువ్వెవరితోనైనా మాట్లాడితివా బతికున్నంతకాలం నీకు యీ యూర్తలో ఖైదు తప్పదు’ అని చెప్పింది.

“ ‘నువ్వు చెప్పినట్టు చెయ్యడానికి నేను సిద్ధంగా వున్నాను’ అని కొదూర్-ఓల్ ప్రత్యుత్తరం ఇచ్చాడు.

“చాలా రోజులవరకూ కొదూర్-ఓల్ ఒక్కమాటైనా మాట్లాడ లేదు. అప్పుడప్పుడు కొండమీదకెక్కి తన బిజంచీని మాత్రం వాయించే వాడు. తన స్వగ్రామాన్ని బీచె-కీన్‌నీ తల్చుకునేవాడు. ఈ గొప్ప యూర్త నుండి యెప్పుడు వెళ్ళిపోగలుగుదునా అని అనుకుంటూండేవాడు. బుద్ధి పూర్వకంగా యెవరితోనూ మాట్లాడకుండానే యాదృచ్ఛికంగా గట్టిగా యేమి మాటలు మాట్లాడ్డమో అతనికేమీ తెలిసింది కాదు.

“ఒక రోజు యూర్తలోకి వెళ్ళి నిప్పుమండుతూంటే నిప్పుమీద చిదుగులు వేస్తూ యాదృచ్ఛికంగా వుండేటట్టుగా యేమి మాటలని అనడమా అని ఆలోచిస్తున్నాడు.

“ఆ ఆలోచనలో పడిపోయి నిప్పు రాజుకుని మంటలు మండుతూన్నదీ,

నిప్పులమీద గిన్నెలోవున్న పాలు పొంగిపోయి చుంయ్ మంటూ పాలుకారి పోతున్న సంగతీ అతను మర్చేపోయాడు. చుంయ్ మన్న చప్పుడు వినబడగానే మాత్రం అప్రయత్నంగా:

" 'పాలు పొంగిపోతున్నాయి! పాలు పొంగిపోతున్నాయి!' అని కేకే శాడు.

"ఆ మాటలు అనగానే చెవులు చిల్లులు పడేటట్టు పెద్దధ్వని విని పించి తనని యెవరో గాలిలో యెగరేసుకుని వెళ్లిపోతూన్నట్టు అనిపిం చింది కొదూర్-ఓల్‌కి. ఎంతసేపు అలా గాలిలో యెగురుతూ వెళ్లాడో అత నికేమీ తెలియలేదు. కాని కొంతసేపటికి దభీమని భూమిమీద పడ్డాడు. ఆ పడ్డంలో అతనికి దెబ్బ తగిలింది. కొంతసేపటికి ఆ దెబ్బనుంచి కోలుకొని నాలుగు వైపులా పరికించి చూసేసరికి మామూలు బండరాయిదగ్గిర తను వేసుకున్న నెగడి వున్నట్టూ ఆ నెగడిదగ్గిర పాతదుస్తులతోనే తను వుంటూ న్నట్టూ, చేతిలో తన బిజంచీ వుంటూన్నట్టూ తెలుసుకున్నాడు. తండ్రి అతన్ని చూసి కౌగలించుకొని:

" 'ఎక్కడికి వెళ్లావు రా నాయనా? నిద్రాహారాలు లేకుండా నీకోసం తైగా అంతా వెతికేను రా బాబూ! అప్పుడప్పుడు నీ గానం వినపడేది. కాని నాలుగు దిక్కులనుంచీ ప్రతిధ్వనించడంచేత యేదిక్కునుంచి నీ పాట వస్తూ న్నదో తెలిసేది కాదు. కొండకనుమవరకూ వెళ్లివచ్చాను నీకోసం వెతుక్కుంటూ. నువ్వు యెక్కడికి వెళ్లుతూన్నదీ చెప్పకుండా వెళ్లిపోయావేమిరా?' అని అడిగేడు.

"కొదూర్-ఓల్ తను అనుభవించిన చిత్రవిచిత్ర దృశ్యాలనన్నిటినీ తండ్రికి చెప్పాడు. అదంతా తండ్రి చివరకంటా విని:

" 'ఈ భూప్రపంచంలో యెక్కడుండనీ ధనికులందరూ ఒక్కటే. మన అదృష్టం కొద్దీ నువ్వు తిరిగి రాగల్గేవు' అన్నాడు.

" 'నీ వేట యీవేళ కూడా ఫలించిందా?' అని అడిగేడు కొదూర్-ఓల్ తండ్రిని.

" 'ఫలించకేమి? నలభై యేళ్లనుంచి వేటకి వెళ్లతున్నాను. కాని యీవేళ దొరికినంతవేట యిదివరకెన్నడూ దొరకలేదు నాకు,' అన్నాడు తండ్రి.

"చెట్లకొమ్మలతో కప్పిన పెద్ద కుప్ప ఒకటి అక్కడ వుంటే తండ్రి అక్కడికి వెళ్లి ఆ కొమ్మలని తీసేయగా మంచిమంచి బొచ్చుతోళ్లు వరుసలుగా పేర్చి వుండడం కనిపించింది.

"కొదూర్-ఓల్ ఆ బొచ్చుతోళ్ల కుప్ప దగ్గిరకి పరుగెత్తుకుని వెళ్లి ఆకాశంలో యెగురుతూన్న డేగని చూడగానే తల్లికోడి తన పిల్లలనన్నింటినీ కూడదీసుకున్నట్టు చేతులు రెంటినీ బారచాపి ఆ బొచ్చుతోళ్ల కుప్పమీద బోర్లాపడ్డాడు.

" 'దీన్ని చూసి బూర-బష్త్ గ్ రీమీద మహా తెగులు వస్తుంది నాన్న! నిన్ను చూసి నాకు ఈర్ష్య కలుగుతూంది. ఏమంటావా? నువ్వు ఇంత వేటవేటాడి తీసుకురాగా వుత్తుత్త చేతులతో వచ్చాను నేను,' అన్నాడు కొడుకు.

" 'అలా విచారిస్తా వెందుకు నాయనా? ఇంత వేట దొరకడానికి నాకు యెవరు సహాయం చేశారో నేనింకా నీతో చెప్పలేదు. ఆ సంగతి చెపుతాను విను. నీ గానమే నాకింత సహాయం చేసింది. అడవిలో తిరుగుతూన్న జంతువులన్నీ నీ పాట వాటి చెవినిపడగానే వున్న పాటుగా యెక్కడ వున్నవి అవి దారిలో అలాగు నిలబడిపోయాయి' అని తండ్రి చెప్పాడు.

“ ‘ఈ భూప్రపంచంలో యెక్కడుండనీ ధనికులందరూ ఒక్కటే. మన అదృష్టం కొద్దీ నువ్వు తిరిగి రాగలిగేవు’ అన్నాడు.

“ ‘నీ వేట యీవేళ కూడా ఫలించిందా?’ అని అడిగేడు కొదూర్-ఓల్ తండ్రిని.

“ ‘ఫలించకేమి? నలభై యేళ్లనుంచి వేటకి వెళ్లుతున్నాను. కాని యీవేళ దొరికినంతవేట యిదివరకెన్నడూ దొరకలేదు నాకు,’ అన్నాడు తండ్రి.

“చెట్లకొమ్మలతో కప్పిన పెద్ద కుప్ప ఒకటి అక్కడ వుంటే తండ్రి అక్కడికి వెళ్లి ఆ కొమ్మలని తీసేయగా మంచిమంచి బొచ్చుతోళ్లు వరుసలుగా పేర్చి వుండడం కనిపించింది.

“కొదూర్-ఓల్ ఆ బొచ్చుతోళ్ల కుప్ప దగ్గిరకి పరుగెత్తుకుని వెళ్లి ఆకాశంలో యెగురుతూన్న డేగని చూడగానే తల్లికోడి తన పిల్లలనన్నింటినీ కూడదీసుకున్నట్టు చేతులు రెంటినీ బారచాపి ఆ బొచ్చుతోళ్ల కుప్పమీద బోర్లాపడ్డాడు.

“ ‘దీన్ని చూసి బూర-బష్తిగ్ నీమీద మహా తెగులు వస్తుంది నాన్న! నిన్ను చూసి నాకు ఈర్ష్య కలుగుతూంది. ఏమంటావా? నువ్వు ఇంత వేటవేటాడి తీసుకురాగా వుత్తుత్త చేతులతో వచ్చాను నేను,’ అన్నాడు కొడుకు.

“ ‘అలా విచారిస్తా వెందుకు నాయనా? ఇంత వేట దొరకడానికి నాకు యెవరు సహాయం చేశారో నేనింకా నీతో చెప్పలేదు. ఆ సంగతి చెపుతాను విను. నీ గానమే నాకింత సహాయం చేసింది. అడవిలో తిరుగుతూన్న జంతువులన్నీ నీ పాట వాటి చెవినిపడగానే వున్న పాటుగా యెక్కడ వున్నవి అవి దారిలో అలాగు నిలబడిపోయాయి’ అని తండ్రి చెప్పాడు.

“ ‘ఇదిగో అషక్* చూడూ! నీతో రహస్యంగా రెండు మాటలు చెప్పాలి’ అన్నాడు కొదూర్-ఓల్ తండ్రితో బురా-బష్త్రిగ్.

“వాళ్లిద్దరూ యూర్తనుంచి వెళ్లిపోయారు. కాని కొదూర్-ఓల్‌కి తన తండ్రితో బూర-బష్త్రిగ్: ‘నీకు కొడుకున్నాడు. నాకు కూతురుంది. వాళ్లిద్దరి సౌఖ్యం మనం ఆలోచించాలి’ అంటూ బిగ్గరగా గుసగుసలాడడం వినిపించింది.

“కొదూర్-ఓల్ గిర్రని తిరిగి బూర-బష్త్రిగ్ కూతురివైపు చూశాడు. అతన్ని చూసి బూర-బష్త్రిగ్ కూతురు అతనితో:

“ ‘మనం యిద్దరం యిప్పుడు సమానులం, ఓయ్ కొదూర్! నేను పెద్ద యింటి పిల్లని. నువ్వు గొప్పవాడి పిల్లడివి. నన్ను నువ్వు పెళ్లాడు. నిన్ను నేను ప్రేమిస్తున్నాను.’ అంది.

“ ‘నీకు నామీద ప్రేమలేదు. నీ ప్రేమంతా మా నాన్న వేటనుంచి తెచ్చిన బొచ్చుతోళ్లమీంద వుంది. కాని వాటిని నేను అమ్మ జూపడం లేదు. నువ్విక్కడ వుండనవసరం లేదు. నువ్వు వెళ్లిపో యిక్కడనుంచి’ అన్నాడు కొదూర్-ఓల్ ఆమెతో.

ఇదిలా జరుగుతూండగా బూర-బష్త్రిగ్ యూర్తలో బీచె-కీన్ మహా దుఃఖిస్తూంది.

“ ‘ఇలాగు జరుగుతుందని నేనిదివరకే అనుకున్నాను. ఇప్పుడు అతను భాగ్యవంతుడైపోయాడు. ఇక నేనంటే అతనికేంకావాలి?’ అని కళ్లంట ఏకధారగా యేడుస్తూంది.

---

* ముసలి ఆయన.

"బూర-బష్త్రగూ అతని కూతురూ కోపంతో ముఖాలు ఎర్రబడిపోయి వాళ్లింటికి వచ్చేశారు.

"ఆ వచ్చేసినప్పుడు బీచె-కీన్ వాళ్లకంటపడింది. బీచె-కీన్ని చూసి బూర-బష్త్రగ్:

" 'నువ్విక్కడేం చేస్తున్నావు? ఫో యిక్కడనుంచి! ఫోవే!' అని ఆమెను తిట్టాడు.

"తనని యెందుకిలా తిడుతున్నాడో ఆమెకేంతెలియక యుర్త తెర తీసుకుని బైటకి పారిపోయింది. నిజంగా కొదూర్-ఓల్ వాళ్ల సంబంధాన్ని తోసిపారేసి తనమీదే, బీచె-కీన్మీదే, మనసుపెట్టుకుని వున్నాడా? ఇది సంభవమేనా? అని అనుకుని మనసులో ఆశపుట్టి కొదూర్-ఓల్ యింటికి పరుగెత్తుకుని వెళ్లింది. అలా పరుగెత్తుకుని వెళ్లుతూండగా కొదూర్-ఓలే ఆమెకి యెదురుపడ్డాడు. కొదూర్-ఓల్ ఆమె చేతులుపట్టుకొని:

" 'నేను యిక యెప్పుడూ నిన్ను వదిలిపెట్టను' అన్నాడు.

" 'నేనూ నిన్ను వదిలిపెట్టను' అంది ఆమె.

"బీచె-కీన్ కొదూర్-ఓల్ పెళ్లిచేసుకుని వాళ్లింట్లో ఖులాసాగా వున్నారు."

* * *

తర్బగాన్ తన కథని పూర్తిచేయగానే ఆ వింటున్న వాళ్లందరూ ఒక్కసారిగా మాట్లాడ్డం మొదలుపెట్టారు. కొదూర్-ఓల్ గురించి బీచె-కీన్ గురించి వాళ్లవాళ్ల అభిప్రాయాలని ఒకరికంటె ముందు ఒకరు చెప్పబోయారు.

"కథ చాలా బాగుంది. కాని దంపతులిద్దరూ తరువాత యెలా జీవించారో ఆవృత్తాంతాన్ని కూడా నువ్వు చెప్పి వుంటే బాగుండేది. తరువాత ఇలా జరుగుతుందని నేననుకుంటాను. రంగురంగుల బిళ్లటో పీలుపెట్టుకుని రాజుగారి ఉద్యోగస్థులు ఒకనాడు అక్కడ కొచ్చి కొదూర్-ఓల్ బీచె-కీస్ దగ్గిర వున్న బొచ్చుతోళ్లని తీసుకుని తన భార్యనుంచి కొదూర్-ఓల్‌ని వేరుపరచేసి బీచె-కీస్‌ని యే రాజకొడుక్కో బానిసగా ఆమ్మేసి, వీడికి తగిన శాస్తి చెయ్యండని చెబుతూ, కొదూర్-ఓల్‌ని బూర-బషీ గ్‌కి అతని కూతురుకి ఒప్పజెప్పేసి వెళ్లిపోయుంటారు. ఏం? సర్వత్రా జరిగేది యిదేగా?" అన్నాడు వెదెనేయ్.

తర్బగాన్ చెప్పిన కథనీ వెదెనేయ్ సమాధానాన్నీ విన్నప్పటినుంచి చౌల్ దాక్-స్త్రెపాన్ దగ్గిర దాస్యంనుంచి తప్పించుకొని బైటపడే మార్గాలేమిటా అని ఆలోచించడం మొదలుపెట్టాను. మాలాంటి వాళ్లం కూడా యెప్పటి కైనా సౌఖ్యం అంటూ అనుభవించి తీరుతామనే ఆశపుట్టింది నాకు. కాని యీ సౌఖ్యం యెక్కడుంది, దీన్ని పొందడం యెలాగు, ఒకవేళ యీ సౌఖ్యాన్ని నిజంగా పొందితే తరువాత దీన్ని భద్రపరచుకోవడం యెలాగు, అనేది మాత్రం ఆ కందకం ఇంట్లో పడున్న అందరి మనుషులలాగే నాకూ తెలియలేదు.

మూడవ భాగం

పోరాటం మొదలు

మొదటి ప్రకరణం

వేర

వేరని చూడ్డం మాకెప్పుడోకాని పడేదికాదు. ఒకవేళ చూడడంపడినా దూరంనుంచే చూసేవాళ్లం. అయితేనేం అంధకారమైన మా బ్రతాకు బతుకులో మాకు ఆమె సూర్యరస్మిలా కనిపించి మాకెంతో ఆనందాన్ని ప్రసాదించేది.

మా గోతియింట్లో ఆమె అడుగు పడేటప్పటికల్లా ఆమెతో కూడా ఒక తేజస్సు మా పాకలో వెలిగినట్టుండేది. మేము కూడా ఆమెకి సంతోషం కలిగించడానికి ప్రయత్నించేవాళ్లం. అయితే ఆమె అట్టే వచ్చి యిట్టే వెళ్లిపోయేది. ఆమె మా గుమ్మంలో కాలుపెట్టేటప్పటికల్లా "వే – ర్కా" అని ఆ రోతపుట్టించే గొంతుకతో మా యజమానురాలు కేకవేసి మాకా రవంత ఆనందాన్నీ కూడా కలుగకుండా చేసేది. ఆ పిలుపు వినపడీ వినపడంతోనే వేర తన చేతితో మాకు వీడ్కోలు చేస్తూ పరుగెత్తి పారిపోయేది.

ఈస్టరు యింకా యెప్పుడో వుందనగానే పండుగపనులు ప్రారంభించాడు మా యజమాని. అతి నిష్ఠతో చివరకి చేప మాంసమైనా ముట్టుకోకుండా ఉపవాసాలు చేశాడు. ఉపవాసాల మిషపెట్టుకుని వుడికించినకేబేజీ పుట్ట

కొక్కుల వూరగాయతోనే మాకు కడుపునింపేవాడు. అప్పుడప్పుడు వేర మాత్రం సైబీరియా అట్లు ఒక్కొక్కప్పుడు వుడికించిన మాంసం కూడా పట్టుకొచ్చి మాకిచ్చేది. కుర్రాళ్లు ఆమెతో సరదాగా సరసాలు ఆడుతూండే వారు. హాస్యానికని ఆమెతాలూకు వస్తువనేదైనా — ఆమె చేతిరుమాలో ఆమె దువ్వెనో లేకపోతే ఆమె చేతిమేజోడునో ఆమెకి తెలియకుండా తమ దగ్గిర వుంచేసుకొని కొన్నాళ్లకి ఆమెకి మళ్లీ యిచ్చేసేవారు. ఒకనాడు నేను మెల్లగా అవకాశం కనిపెట్టి ఆమె చేతిరుమాలుని లాగేశాను.

"రేపు ఇచ్చేస్తావు కదూ? ఇవ్వకపోతే యజమానురాలితో చెపుతాను సుమా!" అని బెదరించి నవ్వుతూ పారిపోయింది.

అది అందమైన చేతిరుమాలు. తెల్లగా నున్నగా వుంది. దాన్ని ఎక్కడ దాచడమో నాకు తెలిసింది కాదు. నా చొక్కాకి జేబులు లేవాయె. నా లాల్చీకిందనో పటకామొలనో దాచుకుందామా అంటే చేతిరుమాలు నలిగి పోతుందాయె. ఆవులసాలలో గుంజ చీలిక ఒకటి వుంటే ఆ గుంజ చీలికలో దాచుతేసరి అని అందులో దాచేశాను ఆ చేతిరుమాలుని. వేర తన జడిపింపుని మర్చిపోయి చేతిరుమాలిని యివ్వమని అడగేలేదు. నాకు యేమాత్రం అవకాశం దొరికినా ఆవులసాలలోకి పరుగెత్తుకొని వెళ్లి ఆ చేతిరుమాలును చూసుకొని వేరని తల్చుకొని ఆమెను మళ్లీ యెప్పుడు చూడడంపడుతుందా అని అనుకుంటూండేవాడిని. ఎంత మంచి మనిషి ఆ అమ్మాయి! అందరం కలసి ఒక జట్టుగా ఆటలాడుకున్నప్పుడూ లేకపోతే వూళ్లో కుర్రాళ్లతోనూ అమ్మాయిలతోనూ కలిసి నృత్యం చేసినప్పుడూ యెలా నవ్వుకొని హాస్యాలాడుకొనేవాళ్లం!

తన పెనిమిటిలాగే నతాల్య కూడా ఈస్టరుపండుగకి చురుకుగా

యత్నాలు చేయసాగింది. తన దుస్తులన్నింటినీ తిరగేసి చూసుకుంది. బీరు మద్యం సిద్ధంచేసింది. హడావుడిగా యింటికి వెల్లవేయించింది. పండుగ దగ్గిరపడుతూన్న కొద్దీ ఆడకూలీలను ఆమె తిట్టడం కసరడం మరింత హెచ్చైపోయింది. ఎలాగైతేనేం ఈస్టరు సాయంకాలం వచ్చింది. మాకు పనులు కాస్తతేలిక అయాయి. వేరకి మాత్రం ఆ గడబడలలోపీకమొయ్యా పని వుంది. నాకు పని చేస్తూచేస్తూ మధ్యమధ్యని కిటికీలోంచి చూసినా చావడిలోకి చూసినా కుంపటి రాజబెడుతూనో లేకపోతే నీళ్లు మోస్తూనో కనిపించేది వేర. ఇక పిండివంటలు చేసేవేళ వచ్చేటప్పటికల్లా వంటగదిలో బూర్లెమూకుడుపట్టుకునీ తపేలాపట్టుకునీ వేర ఒదే పరుగు. ఆ హడావుడిలో వేర అట్లకాడపట్టుకుని వెళ్లతూండగా అట్లకాడ నతాల్య చొక్కా చేతికి రాసుకుపోయింది.

"నీకు కళ్లులేవూ?" అంటూ నతాల్య వేరని నానాబూతులూ తిట్టి వెర్మిసిలీకోసం పిండి వొత్తుతూ వొత్తుతూ ఆ అప్పడాలకర్రతో వేర గుండెల్లో నాలుగు పోట్లు పొడిచింది.

దాంతో వేర చేతిలో వున్న అట్లకాడ పెళపెళమని కింద దొర్లింది. వేర కింద పడిపోయింది. వెక్కివెక్కి యేడుస్తూ యెంతో కష్టంమీద తనంతట తనే లేచి వేర మళ్లీ తన పని చేసుకుంటూంది.

అది చూస్తూన్న వాడినల్లా వేరదగ్గిరకి పరుగెత్తుకెళ్లి ఆమెని సంబాళించకుండా ఎంతో విశ్వప్రయత్నం మీద కాని ఆగలేకపోయాను. మిగతా పనికత్తెలందరూ పనులు మానేసి యజమానురాలువైపు కోపంగా చూస్తూ వుండిపోయారు.

"నోరు వెళ్లబెట్టుకుని యేమిటా చూపులు? లంజముండల్లారా!" అని అరుస్తూ అప్పుడాలకర్ర పట్టుకుని వాళ్లని బెదరించింది ఆమె.

ఆవేళ నేను యెన్ని బాల్చీల నీళ్లు యెన్ని మోపులు వంటచెరకు మోశానో లెక్కజమలేదు. నీళ్లు పట్టికెళ్లుతూనో కట్టెపుల్లలు మోస్తూనో నేను ఆ పనికత్తెల మధ్యనుంచి వెళ్లుతూ, వేర యెంతో విచారంతో దిగాలుబడి ఆలోచిస్తూ నావైపు చూస్తూండడం నేను కనిపెట్టాను. ఆమె నావైపు తేరపారిచూడ్డం చూసి నేను కంగారుపడ్డాను. ఆమెతో యేకాంతంగా వుండాలనీ ఆమెతో మాట్లాడి ఆమెను వోదార్చాలనీ నాకెంతో వుంది. ఇలాగు అనుకుంటూ వసారాలో కూచుని తలపోస్తున్నాను. వేర ఇంట్లోనే వుండిపోయింది బైటకి రాలేదు.

అప్పుడు నేను మోచేతులనిండా కట్టెపుల్లలని మోసుకుని ఇంట్లోకి వెళ్లాను. తలుపు తీసి ఒక కాలు గుమ్మంలోపెట్టి వేరకి వినపడేటట్టు దగ్గేను. హఠాత్తుగా కర్ర ఒకటి పుచ్చుకొని నతాల్య నామీదకి విరుచుకుపడ్డం చూశాను. ఆక్షణమే ఉడతని తన్నుకుపోతూన్న గద్ద జ్ఞాపకం వచ్చింది ఆమెను చూసేటప్పటికల్లా. నామీదకలా ఆమె యెందుకు విజృంభించుకొస్తూందో నాకేమీ అర్థంకాక గుడ్లెక్కబెట్టుకుంటూ ఆమె వైపు అలా చూస్తూ నిలబడిపోయాను.

"ఓరి సైతానా! పుల్లలింక అవసరం లేదని నేను నీతో చెప్పలేదూ? ఎందుకొచ్చావు నువ్విక్కడకి?" అని కేకలేసి నన్నక్కడనుంచి తరిమేసింది ఆమె.

ఆమె నన్ను కూకలేసిందని కాదు, ఇదంతా వేర యెదుట జరిగిందే అని మాత్రం నేను చాలా బాధపడ్డాను. ఆమె కళ్లముందే నన్ను గెంటివేయడం ఎంతో పరాభవం అనిపించింది నాకు.

మా పాకలోకి వెళ్లిపోయాను.

“ఇంటి ఆడంగులు అందరూ యీవేళ మిఠాయిలు మాంసం కుడుములు చేస్తున్నారు. ఎప్పుడూ లేనిది యీవేళ మనకి మంచి భోజనం తగిలేటట్టుంది” అని తర్బగాన్ హాస్యం చేస్తూన్నాడు.

“పండుగ భోజనం మనకీ నేళ తప్పనట్టే!” అని ఒక అబ్బి అన్నాడు.

“నీకేమైనా మతిపోయిందా యేమిటి భాయ్? వాళ్లకి యెంతసేపూ మనచేత యెలా పనిచేయించుకోవడమా అన్న ఘోషతప్ప మనకి తిండిపడేయడం వూసు పిసరంతైనా కావాలా వాళ్లకి? ఈస్టరుపండుగ చేసుకోవడానికి మన యజమాని అతిథులని పిలిచాడు. పిండివంటలన్నీ వాళ్లకోసం” అన్నాడు వెదెనేయ్ సీదొరొవ్.

ఈస్టరుపండుగనాటికి మంచు అంతా కరిగిపోయింది. నేల బాగా యెండిపోయి నేలమీదనుంచి ఆవిరి పొగర్లొస్తున్నాయి.

వెదెనేయ్ తర్బగాన్ చొల్‌దాక్-ఓల్ నేను కా-ఖెమ్ వొడ్డుకెళ్లి, అక్కడ కొండఅంచున గాలికి వేళ్లతో పెల్లగించిపడిపోయిన దేవదారు చెట్టు ఒకటుంటే ఆ చెట్టుబోదమీద కూచున్నాం. ఉన్నికుప్పల్లాగున్న మేఘాలు ఆకాశాన్న తేలుతూ వాటి అంచులతో సూర్యుడికి వింజామరాలు విసురుతున్నాయి.

తూతికపిట్టలు హాయిగా పాటపాడుకుంటున్నాయి. కనివినియరగని దూరదేశాలనుంచి పెద్ద బాతులు తిరిగి వచ్చేస్తున్నాయి. అడవిలో గాలివీస్తూ జంయ్‌మని చప్పుడు చేస్తూన్నట్టు తుర్పాను* పక్షుల మందొకటి యెగిరి వెళ్లిపోతూ అడవిలో వీస్తూన్నగాలిలాగ సరసరమని రెక్కలుతో చప్పుడు చేసుకుంటూ యెగిరి వెళ్లిపోయాయి.

---

* పసుపుపచ్చ ఆకుపచ్చ రంగుల యీకలుకల బాతుజాతికి చెందిన పక్షి.

మా పక్కనేవున్న సంగీతపు చెట్లతోట చిగిర్చడం మొదలెడుతూంది.

వెదెనేయ్ తన పొగాకుగొట్టాన్ని నింపుకొని చెకుముకిరాతితో దాన్ని వెలిగించుకున్నాడు.

"మన యజమాని అతిథులకోసం యెదురు చూస్తున్నాడు" అన్నాడు అతను.

"మాకూ తెలుసునోయ్" అన్నాడు తర్బగాన్ చికాకుగా నిట్టూర్పు విడుస్తూ.

"నీకు ఏమి తెలీదు" అన్నాడు వెదెనేయ్.

అందరం నిశ్శబ్దంగా కూచున్నాం.

మా వెనకాతల యెక్కడో కుక్క ఒకటి అరుస్తూంది. వెనక్కి తిరిగి చూశాం. గ్రామం ఫాదరీ ఇవాన్ ష్చెనొవ్ ధూపకలశాన్ని పట్టుకుని రోడ్డుమీద గబగబ నడుస్తున్నాడు. అతని జల్తారు అంగీ తళతళమని మెరుస్తూంది. గాలికి అతని గడ్డం భుజంమీద యెగిరిపడుతూ చీపురుకట్టలో పుల్లల్లాగు కానొస్తూంది. అతని మెడలోనుంచి శిలువవిగ్రహం ఒకటి యిటూ అటూ వేలాడుతూంది. అతనివెంట ముసలాళ్లూ ముసలమ్మలూ ఒకరి వెంట ఒకరు గబగబా నడుస్తున్నారు. కొంతమంది చేతిలో విగ్రహాలున్నాయి. కొందరు గంపలను అంచులని పట్టుకుని మోస్తున్నారు. ఆ వరుస చివరని పెద్దబండీ ఒకటి నడుస్తూంది.

ష్చెనొవ్‌యొక్క కూలిమనిషి రంగుకాగితాలతో చేసిన పువ్వులతో అలంకరించిన ఎర్ర గుర్రాన్ని నడిపిస్తున్నాడు. ప్రతీ పూరింటిదగ్గిర ష్చెనొవ్ గబగబ ప్రార్థన శ్లోకాన్నొక దానిని గొణుగుతూ ఆ యింట్లోకి తొందరగా వెళ్లుతున్నాడు. అతనివెంట వున్న పరివారం కూడా జోళ్లకి

అంటుకున్న బురదని దులుపుకోడానికి జోడుకిజోడు రాపాడిస్తూ ఇంట్లోకి వెళ్ళుతున్నారు.

"చూశారా మనం యిలా యిక్కడ కూచుంటూండగానే ఫాదర్ ఇవాన్ యెంతెంత కాజేస్తున్నాడో! బండీనిండా వున్నాయి మిఠాయిలూ కోడిగుడ్లూ కోసిన కోళ్ళూనూ. మనవేమో పగలనక రాత్రి అనక సంవత్సరాల తరబడి బండచాకిరీ చేస్తున్నా ఎర్రని యేగాణి అంటూ లేదు మనదగ్గిర" అన్నాడు వెదెనేయ్.

"నా అదృష్టం బద్దలై నేనూ ఫాదరీజన్మ యెత్తివుంటే యెంత బాగుండిపోను! అయితే వెధవది నా గడ్డం మొలవనంటుంది!" అని ఆశా భంగాన్ని నటిస్తూ హాస్యంగా అన్నాడు తర్బగాన్.

ఇంతట్లో వేర అక్కడి కొచ్చి యజమాని మాకోసం ఇటూ అటూ చూస్తున్నాడని చెప్పింది.

వెదెనేయ్ తర్బగాన్ చొల్‌దాక్-ఓల్ వెళ్ళిపోయారు. నేను మాత్రం వేరతో వుందామని వాళ్ళతో వెళ్ళకుండా వుండిపోయాను.

"మీరందరూ యేమిటి మాట్లాడుతున్నారు? అలా చూస్తావెందుకు నావైపు? నా చేతిరుమాలు యెప్పుడిస్తావు?" అని అడిగింది నవ్వుతూను.

ఏమి జబాబు చెప్పడానికీ నాకు తోచక మాట్లాడక వూరుకున్నాను.

చిన్న మూటని వేర నా చేతిలో పెట్టి దాన్ని విప్పింది. దానిలో వేడివేడి 'పిరొజ్కీ' బోండా వుంది. "నాకెప్పుడూ యేదో ఒకటి తెచ్చియిస్తూనే వుంటుంది. నేనెప్పుడూ యేమీ ఇవ్వలేదు ఆమెకి. నేనుత్త వెధవల్లో వెధవని..." అని నాలో నేననుకున్నాను. 'పిరొజ్కీ'వద్దని ఆ మూటని వేరకి ఇచ్చేశాను. ఆ మూటని వేర అందుకుని 'పిరొజ్కీ' నా చేతిలో పెట్టేసింది.

"ఇదిగో అలా సిగ్గుపడతావెందుకు? నీకివి ఇష్టం అని నాకు తెలియదనుకున్నావు కాబోలు?" అంది వేర.

ఆ 'పిరొజ్కీ'ని నోట్లోకుక్కేసుకుని ఇటూ అటూ చూస్తూ: "వేరకి నా కృతజ్ఞతని యెలా చూపించడం?" అని ఆలోచించుకున్నాను నాలోనేను. తోటలో ఒక మూల అడవిచేమంతి పూస్తుందని నాకు జ్ఞాపకం వొచ్చింది.

"తోటలోకి వెళ్లదాం రా! పువ్వులు కోసి నీకిస్తాను" అన్నాను నేనామెతో.

"రా! రా!" అంది వేర.

నా భుజంమీద తట్టుతూ: "నన్ను పట్టుకో చూదాం!" అని కేకేసి పరుగెత్తి పారిపోయింది. నేను సర్వం మర్చిపోయి యేమైనాసరే ఆమెని పట్టుకుందాం అని నిశ్చయించుకుని ఆమెవెంట పరుగెత్తాను. ఆమె బిగ్గరగా నవ్వుతూ పరుగెత్తుతూంది. నేను ఆమెకుదగ్గిర పడుతూన్న కొద్దీ ఆమె నవ్వు మరింత సరదాగా వుంటూంది.

"నువ్వు నన్ను పట్టుకోలేవు! నువ్వు నన్ను పట్టుకోలేవు!" అని నన్ను వెటకారం చేసింది.

"వుండు చూదువుగాని!" అని నేను బదులు కేకేశాను ఒగర్చుకుంటూ.

పొదల్లోనుంచి చెట్లచుట్టూర అతిసునాయాసంగా పరుగెత్తింది వేర. నేను మొద్దులాగు వాట్లలో చిక్కుకుకొని వాట్లమీద పడిపోతూండే వాడిని. చెట్లకొమ్మలు నా ముఖాన్న చురుక్కుమని తగిలేవి. నేను మాత్రం అదేం చూసుకోకుండా ఆమె వెంటపడ్డాను.

"నిన్ను పట్టేసుకున్నానులే!" అని నేను కేకేశాను.

"అవును..." అంది ఆమె.

తోటలో ఒక మూలకి నేను చప్పన పరుగెత్తి అడవిచేమంతి పువ్వులనీ కుందేటిపంజాలనీ — విల్లోచెట్ల తెల్లని ముఖమల్ చిగుళ్లనీ మేం అలా అంటాం — యేరుకొచ్చాను.

వాటినన్నిటిని పెద్దగుత్తిగా కట్టి వేర కిచ్చాను.

"ఓ! ఎంత బాగుంది!" అని సంతోషిస్తూ అంది వేర. "ఇంటి కెళ్లాక గాజుగళాసులో నీళ్లుపోసి ఆ గళాసులో యీ పువ్వులనువుంచి కిటికీలో పెడతాను. ఇప్పుడు అడవిచేమంతులు తప్ప మరే పువ్వులూలేవు. తరువాత చెట్లన్నీ పూతలో వున్నప్పుడు పువ్వులుకోసుకుందుకి నాతో వస్తావా? ఏం?" అని అడిగింది.

పూలగుత్తితో తన ముఖాన్ని అద్దుకుంటూ ఒక కంటితో నవ్వుతూ నావైపు చూసింది.

"తప్పకుండా వస్తాను వేర! నేను యిప్పుడు కోసుకొచ్చిన పువ్వులు చిన్నవి. ఏమీ అందంగా లేవు కుడాను. ఈమాటు మంచివి యేరుదాం..." అన్నాను నేను.

వేర జానపద గేయాలని పాడుతూంటే నాకు చాలా సరదా. అలాగే యింటికి వెళ్లుతూ పాటపాడ్డం మొదలుపెట్టింది. నవ్వుతూన్న ఆమె గొంతుకను ఆ ప్రతిధ్వని కా-ఖెమ్ వొడ్డున తైగాతో కప్పకున్న కొండ అంచులమీదుగా యెగరేసుకుంటూ పోయింది.

ఛాయనిచ్చు మహావృక్షం
మిన్నుముట్టు నిటారు దేవదారు
— దహించే దావానలం
నమవలచి ప్రేమించునే

నను గోరి వరించునే
— నల్లచూపుల నా వలపులరేడు?

చొల్‌దాక్-స్త్రెపాన్ కేక మా చెవినపడింది. వేర పాట నిల్చిపోయింది. ఆమె ముఖం పూర్తిగా మారిపోయింది.

“తొకా! వేర! వెధవలు! యెక్కడున్నార్రా మీరు?” అంటూ ముక్కిడి దీర్ఘం తీసుకుంటూ యజమాని కేకలేస్తున్నాడు.

“మనం త్వరగా వెళ్ళాలి. లేకపోతే కొంప మునుగుతుంది” అని అంటూ వేర తొందరపడి యింటికి వెళ్ళింది.

రొజుకుంటూ రొప్పుకుంటూ ఆమెవెంట నేనూ వెళ్ళాను. ఏదో పెద్ద దురదృష్టం నాన్నావరించినట్టు నా ముఖం వేలబడిపోయింది. వేరని తల్చుకున్నాను. మెడచాచి జీనువాయి పిట్టలాగే ఆమె పాడుతూంది. పాట పాడుతూ పాడుతూ డేగకూత ఆమె చెవినిపడగానే ముఖం చిట్లించు కుని వెంటనే పాట మానేసింది.

రెండవ ప్రకరణం

అతిథులు

ఇంట్లో పొడుగ్గా పెద్ద బల్లలని అమర్చి వాటిమీద బక్షణాలు రాసులు రాసులుగా పేర్చిపెట్టారు.

ఇంటిఆయనా ఇంటిఆవిడా అతిథులని ఆహ్వానిస్తున్నారు.

అందరికంటె ముందొచ్చాడు ఇవాన్ ష్చేనొవ్. అప్పటికే అతను నిషాతో తూగిపోతూన్న వాడు, బొంగురు గొంతుకతో పాడడం మొదలెట్టాడు:

పెండిలియప్పుడు నా సుందరి నాకిచ్చిన ముద్దుటుంగరం
నడి సాగర తరంగముల నేవైచితి నా చేతులార
మటుమాయమయ్యె నా ఉంగరముతొ
నా జీవితమందలి ఆనందము.

అతను తరువాత గలగలమని గంటలు మోగుతూ నల్లని జోడు గుఱ్ఱాల బండిమీద కోక్-ఖాక్ లోకల్లా గొప్పవాడు మెద్వేదెవ్ వచ్చాడు. ఆతరువాత సరీగ్-సెప్ వూళ్లో పెద్ద షాహుకారు మెలేగిన్ వచ్చాడు. తరువాత గ్రామంలో పోలీసు కనిస్టేబు, అతని తరువాత మరో పదిమందీ వచ్చారు. వాళ్లలో సల్‌చాక్ రాజు ఇదామ్-స్యుర్యున్, అతని పరివారమూ వున్నారు.

వీళ్లొక్కళ్లే గుమ్మందగ్గిరకి రాగానే మనుషులు పాలికాపులు గుఱ్ఱాలని బండినుండి విప్పేసి వాటిని గుంజలకి కట్టేసేవారు.

చొల్‌దాక్-స్తెపాన్ ఇంటికి సల్‌చాక్ రాజు కూడా వస్తాడని మా పాలికాపుల్లో పెద్ద పాలికాపులు చెపుతూండగా నేను విన్నాను. మా 'సూర్య వంశపు రాజుగారి'తో యేమిటి మాట్లాడుదామా అని తర్బగాన్ నేనూ ఆలోచించుకున్నాము. ముందు నేను వెళ్లి ఆయన దర్శనం చెసుకోవడానికి నిశ్చయించుకున్నాం. తొడితొక్కుడుగాను హడావుడిగాను ఆ అతిథుల గుంపులోనుంచి నేను తోవచేసుకుంటూ మా రాజుగారు యెక్కడున్నారా అని చూస్తున్నాను. "చొల్‌దాక్-స్తెపాన్ మమ్మలిని యెంత అన్యాయంగా చూస్తున్నాడో ఆయనకెలా తెలుస్తుంది? నేను ఆయనతో అన్ని సంగతులు చెపుతాను. రాజుగారు మధ్యవర్తిత్వం వహించి మాకు న్యాయం యిప్పిస్తారు తప్పకుండా.

తన యేలుబడికింద వున్న చౌల్‌దాక్-స్త్రైపాన్‌న్ని తప్పకుండా మందలిస్తారు'' అని నాలో నేను అనుకుని రాజుగారు యెక్కడ వున్నదీ చూస్తున్నాను.

''హారేయ్? నిన్నేను రా పిలుస్తూంటా, దగల్బాజీ వెధవా! నీకేంపని రా ఇక్కడ?'' అని మా యజమాని నన్ను చూసి కేకలేస్తూ, మొట్ట మొదట నన్ను చూసినప్పుడు నా చెవి నులుపుతూ నన్నెలా తన యింట్లో నుంచి గెంటేశాడో అలాగే నా చెవిపట్టుకుని పైకి ఈడ్చేబోయాడు.

''ఆరె నీ యిల్లు బంగారంగాను! ఈ అల్లర చిల్లర గుంటవెధవ నీకెక్కడ దొరికేడోయ్, స్త్రైపాన్?'' అని ఇదామ్-స్యుర్యున్‌గారు అడిగారు.

''ముసలి తువాదాని కొడుకండి. దాని పేరు తాస్-బష్త్రిగ్ అండి. హో—హో! దాని తలమీద ఒక్క వెంట్రుకైనాలేదు. వుత్త బోడిగుండండీ. వీడాండి? లొడితడే వున్నాడని మీరు అపోహపడుతున్నారేమో. చూడ్డానికి పొట్టిగా వున్నా పనిలో మాత్రం ఫైల్మానుకూడా వాడి తరవాతేసుమండీ!'' అని ఆత్మసంతుష్టితో మొరుగుతూ నావైపు చూసి: ''ఇంకా ఇక్కడే వున్నావుట్రా! ఫో! ఇక్కడనుంచి ఫో!'' అని మళ్లీ తిట్టాడు నన్ను.

''ఇది సరియైన సమయం కాదు రాజుగారితో మాట్లాడ్డానికి'' అని నేను అనుకుని వెళ్లిపోదాం అని వెనక్కి తిరిగేసరికి నా వెనకనుంచి ఇదామ్-స్యుర్యున్‌గారి గొంతుక వినిపించింది:

''ఏయ్ ఇలా రారా!''

''ఎంతైనా రాజుగారు తువా దేశస్థులు కదా. నేను కూడా తువా దేశస్థుడనే. తోడి తువా దేశస్థుడని ఆయన అవమానించడు. నిష్పక్షపాతంగా విచారించి న్యాయాన్ని యిప్పిస్తాడు'' అని అనుకుని చనవుగా ఆయనదగ్గిరకి వెళ్లాను.

"నీ మనసులో నువ్వెవడివి అనుకుంటున్నావు రా? చచ్చు పెద్దమ్మా చింకి వెధవ గుడ్డలతో వస్తావా మా దర్శనం చెయ్యడానికి? నీకెంత పొగరెక్కిందిరా?" అని రాజుగారు రంకెవేస్తూ అంగరఖా చేతులతో యీడ్చి నాముఖంమీద కొట్టారు.

నేనెంత పొరపాటుపడ్డాను! చొల్‌దాక్-స్త్రైపాన్ యెంత నిర్దయుడో ఇదామ్-స్యుర్యున్ అంతే.

అతిథులందరూ బల్లముందు కూర్చుని భోంచేస్తున్నారు, తాగుతున్నారు. బత్రాకులందరూ సావడిలో చేరి గుసగుస లాడుకుంటున్నారు. బల్లమీద వాళ్లకెదురుగా రుచిగావున్న పిండివంటలను చూసి అవి తమ కంచాల్లోకి యెప్పుడు డొచ్చిపడతాయా అని ఆత్రంతో కనిపెట్టుకున్నట్టున్నారు వాళ్లు.

మా చిన్నతనంలో యెంతో కాలంకిందట మా అక్క కంగియ్ మా అన్న పెజెన్‌దేయ్ నేను కలిసి తాష్-చాలాన్ యూర్త వెళ్లడం జ్ఞాపకం వచ్చింది.

పీపాలాగు గుండ్రంగా దుడ్డుగా వున్న శరీరంమీద పిచిక వాలినట్టు చిన్నతలకాయతో అచ్చంగా తాష్-చలాన్ అక్కడ కూర్చునట్టూ — గొర్రె పోతు కాలునుంచి మాంసంముక్కలు చిన్నచిన్నవి చీర్చుతూ కొన్ని మాంసంముక్కలను మాకు విసిరి పారేస్తున్నట్టూ — మూడు మూర్తులా ఆ తాష్-చలానే మళ్లీ నా కళ్లముందు ప్రత్యక్షం అయాడా అనిపించింది నాకు.

వేపుడు వేయించిన ఆ మాంసం ముక్కలు నల్లగా పండిన దేవదారు కాయలాగున్నాయి. తాష్-చలాన్ ముఖం ఎర్రగా వుంది. ముఖంనిండా పొక్కులూ చెమటకాయలూ. ముఖాన గడ్డంలేదు తాష్-చలాన్‌కి. కాని

చౌల్‌దాక్-స్త్రైపాన్‌కి పెద్ద గడ్డం వుంది. ఇంట్లోకాచిన బీరుతో తడిసిన ఆ గడ్డం యెంత దట్టంగా వుందంటే ముఖాన్నంతా కప్పేసి నిప్పుల్లా మెరుస్తూన్న ఆ రెండు కళ్ళూ, పెద్ద కాయలా ఆ ముక్కూ, ఇవి మాత్రమే పైకి కనిపిస్తున్నాయి.

భయానకమైన ఆ తాష్-చలాన్ విగ్రహాన్ని నా మనసునుంచి తర మేసి తర్బగాన్ దగ్గిరకెళ్లి చౌల్‌దాక్-స్త్రైపాన్ నన్ను మొదట కొట్టినదీ తరువాత సల్‌చాక్ రాజుగారు నన్ను కొట్టినదీ అంత వృత్తాంతం అతనితో చెప్పాను.

తర్బగాన్ నన్ను తనదగ్గిరకి తీసుకుని ఒత్తుగా బిరుసుగావున్న నా తలని నిమురుతూ:

"నాతో చెప్పడం మంచి పని చేశావు" అని నా చెవిలో చెప్పాడు.

కొంతసేపు అయిన తరువాత అతిథులందరూ బాగా తాగి హుషా రెక్కి కొందరు గొంతుకలుచించుకుని పాడుతున్నారు. కొందరు పిచ్చియేడు పులు యేడుస్తున్నారు. మరి కొందరు కడుపులో వికారంతో వాంతులు చేసు కుంటున్నారు.

బల్లముందు కుర్చీలమీద కూచున్న వాళ్లల్లా మెలేగిన్నూ, ఇవాన్ ష్చేనొవున్నూ, ఇదామ్-స్యుర్యున్నూ. వీళ్ళు ముగ్గురూ పెద్దగా నోరు చేస్తూ ఒకరితో ఒకరు వాదించుకుంటున్నారు.

"నేను భాగ్యవంతుడిని. నేను చదువుకున్నవాడిని. నీ కాళ్ళముందు నేను పడతాననుకుంటున్నావా యేమిటి?" అని మెలేగిన్‌మీద ఫాదరీ అరుస్తూ మావైపు చూసి: "వొరేయ్! పస్తులున్న కుక్కల్లారా! నేను చెపుతూన్నది వింటున్నారా లేదా?" అని తన అంగరఖామీద బీరు ఒలుక పోసుకుంటూ అన్నాడు.

"ఓహో! సైతానుకి ఆగ్రహం వస్తూందే! ఏమిటీ? నాతో నువ్వు సమానుడవని అనుకుంటున్నావా? అబ్బోసి!" అంటూ మెలేగిన్ గర్జిస్తూ ష్చేనొవ్‌మీదకి విజృంభించి అతని గడ్డం పట్టుకున్నాడు.

తనదెక్కడ కిందచెయ్యి అయిపోతుందో అని ష్చేనొవ్ మెలేగిన్ జుట్టు పట్టుకున్నాడు. దట్టమైన ఆ పొగాకు పొగలో ధూళిధూసరమయమైన రోడ్డుమీద పోట్లాడుతూన్న పందెపుకోళ్లలాగున్నారు ఇద్దరున్నూ. మిగతా అతిథులెవ్వరూ వీళ్ల గురించి పట్టించుకోవడమే లేదు.

వీళ్లిద్దరినీ చూసినవాడు సరీగ్-సెవ్ పోలీసు ఒక్కడే. అతను మద్యం తాగి ఇంతకు ముందే కిందపడిపోయాడు, కాని యిప్పటికి కొంచెం నిషా తగ్గి తెలివొస్తూంది. ఆ స్థితిలో అతను వీళ్లిద్దరినీ చూసి చేతులమీద కాళ్లమీద పాకుకుంటూ వీళ్లదగ్గిర కొచ్చి తలకాయ యెత్తి:

"అయ్యా! అయ్యా!" అంటూ ఒగర్చుకుంటూ వీళ్లని సముదాయించాడు.

మెలేగిన్ ష్చేనొవ్ గడ్డాన్ని వదిలేశాడు. దాంతో ష్చేనొవ్ కూడా మెలేగిన్ జుట్టును వదిలేశాడు. ష్చేనొవ్‌ని మెలేగిన్ తన దగ్గిరనుంచి ఒక తోపుతోసి బల్లదగ్గిర కెళ్లి:

"నాతో సమానుడవా నువ్వు? నా తడాఖా చూపిస్తాను వుండు!" అని గొణుగుతూ కూచున్నాడు.

మరి కాస్సేపటికల్లా అతిథులందరూ ఒక్కొక్కరే బల్లదగ్గిరనుంచి లేవడం మొదలెట్టారు. కొందరుకింద పడిపోయారు. కొందరు వాళ్లవాళ్ల బల్లదగ్గిరకి వెళ్లిపోయారు.

బల్లకి యెదురుగా తాడులాగుతే బుర్రవూపే బొమ్మలాగు తలకాయని

ఒకసారి కుడిపక్కకీ మరోసారి యెడమ పక్కకీ ఆడిస్తూ వొళ్లు మాత్రం కదలకుండా గొంతుక కూచున్నాడు ఇదామ్-స్యుర్యున్.

తన పక్క కూచునున్న ఉద్యోగస్థుడిని ఒక తోపుతోసి మాట నత్తిపోతూ:

"ఒరేయ్! అబ్బీ! పాట ఒకటి పాడురా..." అన్నాడు.

ఆ ఉద్యోగస్థుడు కిందకూచున్న వాడల్లా మోకాళ్లమీద నిలబడి తూగి పోతూ చేతులతో ఆపుకుంటూ శ్రుతిని దాటిపోయిన అపస్వరంతో:

"ఓయి ఇనాయి ఊ—ఊ...
ఓయి ఇనాయి ఊ—ఊ..."

అని పాట మొదలెట్టాడు.

అది విని ఇదామ్-స్యుర్యున్ తలకాయ వెనక్కి వాల్చి కళ్లుమూసుకుని పరవశుడైన గొంతుకతో:

"భలే! భ-లే! ఎ-ం-త ది-వ్యం-గా-వుంది!" అని అరుస్తున్నాడు.

మూడవ ప్రకరణం

ప్రపంచంలో యేం జరుగుతోంది?

బత్రాకు కూలీగా చాకిరీచేసిన సంవత్సరాల్లో నేను అనేక కష్టాలని అనుభవించి పెరిగి యువకుడనైయాను.

కాని ప్రపంచంలో ఏమి జరుగుతూందో నాకు బొత్తిగా తెలియదు. తువాదేశంలో వున్న వాళ్లే కాక ప్రపంచంలో ఇంకా ఇతరులున్నారన్న సంగతే నాకు యెన్నడూ తోచలేదు.

1914 సంవత్సరం శరత్కాలంలో యుద్ధం గురించి ప్రజలు సాధారణంగా చెప్పుకోవడం మొదలుపెట్టారు.

తియునోవ్‌ని దనీల్కా రోష్చిన్ తల్లి దార్య అడిగింది ఒకనాడు:

"యుద్ధం యెలా ప్రారంభం అయింది అసలు?"

తన గొడ్డలి ఒరని చేత్తో నిమురుతూ సావకాశంగా చెప్పాడు:

"రకరకాల గాలికబుర్లు చెప్పుకుంటున్నారు ప్రజలు. నేను అనుకోవడమేమిటంటే యుద్ధం ఆసన్నమయే సమయం రావడాన్ని యుద్ధం ప్రారంభం అయింది. అంతే మరి. వాళ్ల జారుచక్రవర్తి — అంటే జర్మనుల జారు అన్నమాట — కత్తి ఝళిపించాడు మొదట. దాంతో మన జారు మాత్రం మరి వూరుకుంటాడా? ఒకడికేమో మతిపోయింది. రెండోవాడికి తనమీదే వుంది మతి అంతాను. దాంతోటల్లా యుద్ధం మొదలైంది."

సంభాషణ ప్రజమీదకి తిరిగింది.

"యుద్ధమే కనక వస్తే మగాళ్లనందరినీ తీసుకుపోతారు" అంది దార్య.

తియునోవ్‌గారింటిదగ్గిర కూచున్న ఆడపిల్లలందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకోవడం మొదలెట్టారు.

"నన్ను కూడా బహుశా తీసుకుపోతారనుకుంటాను" అన్నాను నేను బిగ్గరగాను మాటలు త్వరత్వరగా అంటూ తియునోవ్‌ని అనుకరిస్తూ.

ఆడపిల్లలందరూ చిరనవ్వునవ్వారు. దార్య మాత్రం బిగ్గరగా నవ్వుతూ:

"ముందు గోచీ తిన్నగా పెట్టుకుని చీముడి ముక్కు తుడుచుకోవడం నేర్చుకోవోయ్, బాలవీరుడా!" అంది.

"ఒడ్డూ పొడుగూ వున్న కోసక్కులొక్కరే గుర్రాలమీద యెక్కి యుద్ధం చేయగలగినట్టు మాట్లాడతావేమి? కుర్రాళ్లు మాత్రం గుర్రాలమీద

సవారీ చెయ్యలేరా యేమిటి? గుర్రాన్నీ కత్తినీ యిస్తే కుర్రాళ్లూ యుద్ధం చేయగలరు'' అని నేను దార్యతో వాదించాను.

యుద్ధం గురించి అందరూ చెప్పుకుంటూండే మాటల్లో ముప్పాతిక మూడు వంతులు నాకర్థమే అయేదికాదు. రైళ్ళురైళ్లు అని అందరూ అను కుంటూంటే ''ఓహో! రోడ్లని అందరూ తొక్కేసి ధ్వంసం చెయ్యకుండా రోడ్లమీద ఇనుపరేకులు వేసివుంచుతారు కాబోలు — ఈ ఇనుపరోడ్లమీదనుంచి గుర్రాలు నాలుగు కాళ్లు యెగరేసుకుంటూ పరుగెత్తి వెళ్లుతూ వుంటాయి కాబోల్సు'' అని అనుకునేవాడిని నేను.

నిర్బంధసైనికులని యుద్ధంలోకి పంపేటప్పటికి ఊస్త్-తెర్జిగ్‌లో వున్న రైతులందరూ పనులు ఆపుచేసేసుకున్నారు. చొల్‌దాక్-స్తైపాన్ కొడుకులు వాళ్ల తండ్రిదగ్గిర వున్న గుర్రాలలో మంచి వాటిమీద యెక్కి వీధుల్లో వెర్రిజోరుతో పందేలు వేసుకుంటూ పరుగెత్తేవారు. సొంత గుర్రాలులేని రైతుల కొడుకులు కవాతు చేస్తూండేవారు. యుద్ధం రాకముందు ప్రతీ వాడూ ''సముద్రంలో యెంత సౌఖ్యాన్ని ముంచానో'' అన్న పాటేపాడేవాడు. ఇప్పుడు ప్రతీవాడు ''ఆఖరి దినం'' అన్న పాటే పాడుతున్నాడు. ఆ పాట పాడడంతో సహా యెక్కడ చూసినా ఆడంగుల యేడుపులూ రాగాలూ వినిపి స్తున్నాయి. ఇప్పుడు అందరిళ్లలోనూ బీరు తాగడం పరిపాటైపోయింది. ఈ తాగి తందవాలాడ్డంలోనూ యేడుపుల్లోనూ తరుచు యెవరో ఒకరు చెప్పుకుంటూండగా యీ మాటలే వినబడేవి:

''జర్మనులు రష్యామీద దండెత్తారు!''

''వాళ్లు మనని నాశనం చెయ్యాలని చూస్తున్నారు!''

"మనం వాళ్ళపని పట్టిద్దాం!"

"అయ్యో అయ్యో! మా అబ్బాయిలు! నేనేంచేయన్రా? మిమ్మలినివాళ్ళు అక్కడ చంపేస్తార్రా బాబూ!" అంటూ దార్య యేడుస్తూ మొర్రపెట్టేది.

"మనం వెనకంజ వెయ్యకుండా నిలబడ్డాం అంటే నీకు ఇంకా బోలెడు మంది కొడుకులు పుడతారులే" అన్నాడు ముసలి తియునోవ్.

ఒకనాడు చొల్దాక్-స్తెపాన్ తాగి తూలిపోతూ తిట్లుతిట్టుకుంటూ రోడ్డుమీదనుంచి వెళ్ళుతున్నాడు. అతను వేసుకున్న కొత్తపట్టులాల్చీ బీరుతో తడిసిపోయింది. కొత్త మతశాఖవాళ్ళలాగు కత్తిరించుకున్న అతని తల దిబ్బమీద గాలికి కొట్టుకుంటూన్న విషగంధి రెమ్మల్లాగు యెగురుతూంది.

"నా కొడుకుల్లో ఇద్దరు సైన్యంలో చేరుతున్నారు. జారుకోసం వాళ్లను యుద్ధంలోకి తరలి వెళ్లనీయండిరా! ఏయ్! ఎవడురా అక్కడ? రోడ్డుఖాళీ చెయ్యండ్రా! ఖాళీ చేస్తారా లేకపోతే మీ పని పట్టించమన్నా రా? కుక్కల నాకొడుకుల్లారా!" అని వెలుగు రాసిన గొంతుకతో అరుచుకుంటూ వెళ్ళుతున్నాడు.

నిర్బంధ సైనికులు వూళ్లోనుంచి బయలుదేరి వెళ్లిపోయే రోజున దనీలొవ్క వూరిలో వున్న ఆబాల గోపాలం వీధులోకి వచ్చి చేరారు. ఒక్కొక్క సైనికుడి చుట్టూ ఐదారుగురు చేరి గుంపులుగుంపులుగా నిలబడి సైనికులని సాగనంపే ముందు ఆఖరి సారిగా సలహాలు ఇస్తున్నారు.

హఠాత్తుగా ఊరి కుక్కలు మొరిగేయి. ఇద్దరు కోసక్ సైనికులు గుర్రాలమీద సవారీచేస్తూ రోడ్డుమీదనుంచి వూరిలోకి వస్తున్నారు. అక్కడున్న ప్రజ అంతా వాళ్లని చూడ్డానికి వాళ్లవైపు తిరిగేరు.

గ్రామ పెత్తందారు ఇల్యా దూత్లికొవ్ వాళ్లని ఆహ్వానించడానికి వాళ్లకి యెదురుగా పరుగెత్తుకుని వెళ్లాడు.

"నిర్బంధ సైనికులందరూ తయారుగా వున్నారు" అని గాభరాగా కష్టంమీద మాటలని సగంసగం మింగుతూ వొంగి నమస్కారం చేస్తూ వాళ్లకి నివేదించాడు.

అతనివైపైనా చూడకుండానే ఆ కోసక్కులు జనం గుమికూడివున్న చోటకు గుర్రాలమీద సవారీచేస్తూ వెళ్లారు. ప్రజని పలుకరించడంబదులు:

"ఎక్కడికి రా తోసుకొస్తున్నారు, నెత్తిమీదకి? వెళ్లండి రా వెనక్కి!" అని అరవడం మొదలెట్టారు.

ఇద్దరిలోనూ పొట్టిగా వలంగా ఎర్రని జుట్టున్న కోసక్ తనతోడి రౌతుకంటె గుర్రంమీద రెండడుగులు ముందు కొచ్చి:

"అ-ట్టెన్-షన్!" అని అందరి గుండెలు బద్దలైపోయేటట్టు కోడికూతలాగు కీచుగొంతుక పెట్టుకుని అరిచాడు. ఒక దగ్గుదగ్గి మీసాన్ని నిమురుకుంటూ మళ్లీ: "అట్టెన్షన్! హాజరు పిలువ్వూ!" అన్నాడు.

వెంటనే అంతా నిశ్శబ్దం అయిపోయింది. త్రాగి నిషామీద వున్న వాళ్లందరూ తెప్పరిల్లి తెలివి తెచ్చుకున్నారు. ప్రజంతా శిలావిగ్రహాల్లాగు చెక్కు చెదరకుండా నిలబడ్డారు.

"రోష్చిన్ మిహేయ్!"

"హాజర్!" అంటూ జనంలోంచి సరదాగా చురుకైన గొంతుక వినిపించింది.

"రోష్చిన్ దనీల్క!"

"హాజర్!"

ఎర్రతలకాయ కోసక్ సుమారు ఇరవై పేర్లని పిలిచాడు. హాజరుపట్టీ పిలవడం అయిపోగానే మళ్లీ గడబడ ప్రారంభం అయింది.

“సామానులని తీసుకువెళ్లే బళ్లేవి?” అని దూత్లికొవ్‌ని అడిగేడు రెండో కోసక్.

“చిత్తం అండి. అన్నీ సిద్ధపరిచామండీ. నాలుగు జతలండి. గంటలు కూడా కట్టించి సిద్ధంగా వున్నాయండి. చిత్తం!” అంటూ వెనకటిలాగే వొంగి నమస్కారాలు చేశాడు.

“వెళ్లండి. వెళ్లి మీ సామానులని తెచ్చుకురండి” అని ఆ ఎఱ్ఱజుట్టు కోసక్ పేర్లుపిలచిన మనుష్యులతో తన కీచు గొంతుకతో చెప్పాడు. “మళ్లీ అందరూ యీ ముంగిట్లోకే వచ్చి చేరాలి” అన్నాడు.

మనుష్యులందరూ చెదిరిపోయి కొంతసేపటికి సామాన్లతో మళ్లీ వచ్చారు. ఇన్ని రోజులనుంచీ వోడ్కా కల్లు, ఆరాకా సారాయి అదే త్రాగిత్రాగి చాలామంది ముఖాలు పొంగి వున్నాయి. వెదెనేయ్ సీదొరొవ్, దనీల్కా రోష్చిన్, యింకా మరికొందరు చొల్‌దాక్-స్తెపాన్ తాలూకు మనుషులు బయలుదేరడానికి సిద్ధం అవుతున్నారు.

“బండికి ఐదేసి మంది!” అని ఆ కోసక్ కేకేశాడు.

బళ్లకి కట్టిన గుఱ్ఱాలని ముంగిటిలోకి తీసుకొచ్చారు. అవి వాటి తల కాయలని కిందకి మీదకి ఆడిస్తూంటే గణగణమని గంటలు మోగుతున్నాయి.

ఇంతకు ముందల్లా కాస్త దూరాన్న నిలబడ్డ ప్రజ నిర్బంధ సైనికులందరూ బళ్లల్లో యెక్కడంతోనే బళ్లదగ్గరకి పరుగెత్తుకుంటూ వచ్చి బళ్లచుట్టూ మూగి యెవరివారిని వాళ్లు సాగనంపడం మొదలుపెట్టారు. కొంతమంది సైనికులు బళ్లల్లోంచి దిగి వాళ్ల పిల్లలిని పెళ్లాలిని బంధువులను ముద్దుపెట్టుకున్నారు.

"ఎందుకింకా ఆగేరు? బయలుదేరండి!" అని ఆ కోసక్ ఒక్కరంకె వేశాడు.

నిర్బంధ సైనికులు అందరూ గబగబ బళ్లల్లోకి ఉరికేరు.

గుర్రాలు బయలుదేరిపోయాయి.

గంటలమోత తప్పెటతాళాల చప్పుడుల్లో ఆడంగుల యేడుపులూ కుక్కల అరుపులూ లీనమైపోయాయి.

గొప్ప రణగణధ్వని చెలరేగింది. ఎర్రనిధూళి రేగి చెట్లని ఆవరించి సాయంకాలం అయి పొగమంచుపడుతూందా అనిపించింది. వీడ్కోలు విందుల్లో త్రాగగా మిగిలిపోయిన సారాయిని ఇంట్లోకిపోయి అందరూ త్రాగేశారు. కాని ఆరోజు మాత్రం తందనాలేమీ లేవు.

యుద్ధం యెందుకు ప్రారంభం అయిందో ఆ కారణం మాత్రం నాకు బోధపడలేదు. వాళ్లూ వీళ్లూ మాట్లాడుకుంటూండగా నా చెవిని పడ్డ మాటలనిపట్టి జర్మనులు వుత్త అడవిమనుష్యుల్లాగు ప్రవర్తిస్తున్నారని నాకు అర్థం అయింది. వాళ్లు వశపరుచుకొన్న వూళ్లల్లోవున్న ప్రజనందరనీ చంపిపారేస్తున్నారనీ బతికివున్న వాళ్లనే నిలువునా నిప్పంటించి కాల్చేస్తున్నారనీ నిండుప్రాణాలతో వున్న వాళ్లనే పూడ్చి పెట్టేస్తున్నారనీ విన్నాను.

రష్యను సైనికుల వీరకృత్యాల గురించి అనేక కథలను విన్నాను. చాలా గుడిసెలలో కుజ్మా కృచ్‌కోవ్ చిత్రాన్ని పెట్టారు. వొంటిగాడు అతడొక్కడే ముప్ఫైమంది శత్రుసైనికులని తన కత్తితో నరికి పారేశాడని చెప్పుకున్నారు. గుర్రంమీదెక్కి ఛల్‌ఛల్‌మని సవారీ చేస్తున్నట్టున్నాడు ఆ చిత్రంలో అతను. ఆ చిత్రాన్ని చూసి నేనెంతో మురిసిపోయాను. అతనంటే నాకు కొంత ఈర్ష్య కూడా కలిగింది.

"వచ్చే సంవత్సరానికి మనం కూడా యుద్ధానికెళ్ళి కుజ్మా లాగే యుద్ధం చేద్దాం. చొల్దాక్-స్తెపాన్ గుర్రాలకి జీనులువేసి వాటిని సవారీ చేస్తూ సయానీ పర్వతాలను దాటుకుని వెళ్ళిపోదాం" అని స్నేహితులం కలుసుకున్నప్పుడల్లా మాలో మేం డంబాలు కొడుతూండేవారం.

సాయంకాలంపూట్ల పశువులమందలను మేపడంబదులు తెర్జీగ్ అవతలి వొడ్డుకు దాటి గుర్రాలమీద సవారీ చేస్తూ యుద్ధం చేస్తూన్నట్టు తెల్లవారిందాకా దొంగాట ఆడుకునేవారం.

మా అందరిలోనూ రోమ్క లెవ్కోవ్ బలమైనవాడవడంచేత కుజ్మా కృచ్కోవ్ పాత్రని అభినయించేవాడు. మేమందరం అతన్ని అటకాయించే వాళ్ళం. ఒకనాడు సాయంకాలం యేకారణం చేతనో రోమ్క రాకపోవ డంవల్ల కుజ్మా పాత్రని నేను తీసుకున్నాను. నా కాకినలుపు మగ గుర్రాన్నెక్కి దాన్ని నాలుగు కాళ్ళా యెగరేసి పరుగెత్తనిస్తూ బల్లెం బదులు పెద్ద కర్రను చేత బుచ్చుకొని నా శత్రువు సమూహంమీద విజృం భించాను...

వేసంగి అయిపోయి శీతకాలం వచ్చింది. యుద్ధానికి వెళ్ళినవాళ్ళు యింకా తిరిగి యిళ్ళకి రాలేదు.

కొన్నాళ్ళకి యుద్ధానికి వెళ్ళినవాళ్ళలో దనీల్క రోష్చిన్ ఒక్కడే ఇంటికి వచ్చాడు. అతన్ని మేము పోలికే పట్టలేకపోయాం. తలమీద టోపీని ఒక చెవిమీద వాటంగా పెట్టుకున్నాడు. రెండో చెవిమీద వుంగరాల జుట్టు దుబ్బుగా పడుతూంది. సైబీరియా కణితి కొమ్ముల్లాగు మెలితిప్పిన మీసాలు. లాగ్చీన వున్న బొత్తాములు నిగనిగమని మెరుస్తున్నాయి. వేటగాండ్ర బూట్సు జోళ్ళలాకాకుండా అతని బూట్సులు ముడుతలు ముడుతలు

పడక సాఫుగా మోకాళ్లని అందుకుంటున్నాయి. కొక్కేం కుట్టిన వెడల్పు కాసెకోక నడుముకు చుట్టుకుని చేతులని జేబుల్లోనే యెల్లప్పుడు పెట్టు కునేవాడు. అతన్ని చూసి కుర్రాళ్లందరూ అసలైన సోల్జరని మెచ్చుకున్నారు. ఆడపిల్లలందరూ గుసగుసలాడుకున్నారు. యుద్ధం విశేషాలు చెప్పమని అతని దగ్గరకి ప్రజ అదేపనిగా వచ్చేవారు. అడిగే అడగడంలో వాళ్లని సంతృప్తి పరచడానికి దనీల్కా ఖబుర్లు చెప్పేవాడు. అతను యుద్ధ విశేషాలని చెప్పడం వింటూంటే ఆ విశాలమైన స్తెప్‌మైదానాలమీద ఖడ్గాలు తళుకుతళుకు మని మెరుస్తూన్నట్టే బల్లేలు చీరుకుపోతూనట్టే మా దేశస్థులందరూ కరతీ-ఖాన్ మూకలమీద పడివాళ్లని వెనక్కి తోసేస్తూన్నట్టే నా కళ్ల ముందు జరుగుతూన్నట్టు అనుకునేవాడిని.

"నీకెప్పుడేనా జర్మనులు కనిపించారా?" అని యెవరో అతన్ని అడిగేరు.

"అదేమిటయ్యా అలా గడుగుతున్నావ్? మేం చాలామందినే ఖైదీలుగా పట్టుకున్నాం. లేడి అగుపించగానే తుపాకి తీసి గురిపెట్టినట్టు వాళ్లని చూడగానే తుపాకితో గురిపెట్టడమే. మనిషి అసలు కళ్లకే కనపడకపోతే తుపాకితో గురిపెట్టి కాల్చడం యెలాగయ్యా? భలే ప్రశ్నేవేశావులే!" అన్నాడు దనీల్కా నవ్వుతూను.

"జర్మనీ వాళ్లె లాగుంటారో కాస్తమాకు చెబుదూ! ఏమిటి, వాళ్లూ మనలాగే వుంటారా, లేకపోతే...?" అని కుర్రకార్లు నొక్కినొక్కి అడిగేరు అతన్ని.

"అబ్బే! మన లాగుండే వుండరు వాళ్లు అసలు. మన టోపీ చాలా సుళువుగా వుంటుంది. వాళ్లది మఠం కప్పులా వుండి మీదని ఒక గుండ్రపాటి బొడ్డూ యీ పక్కనీ ఆ పక్కనీ కొమ్ములున్నా" అని దనీల్కా వర్ణించాడు.

"వాళ్లు బలమైన వాళ్లేనా? చేతిలో తుపాకీ లేకుండా వుత్త చేతులతో నీమీదకొస్తే వాళ్లని నువ్వు కిందకి కొట్టేయగలవా?" అని కుర్రాళ్లు అడిగేరు అతన్ని.

"చేతిలో యేమీ లేకుండా అసలు వాళ్లు మనమీదకి రావడమే? వుత్తది! కాని బల్లేలనీ సన్నీలనీ యెదుర్కోడం యెలాగో వాళ్లకి తెలీదు. మనకోసక్కులలో ఒక్కరమే వాళ్లలో పదిమందితో సమానం" అన్నాడు దనీల్కా.

"ఆఁ! ఏమిటీ? నిజంగానే?" అని వాళ్లు ఆశ్చర్యపోయారు.

"అయితే జిత్తులమారి వెధవలు సుమండీవాళ్లు! మన యూనిఫారాలనే వేసుకుని మన కొఠారములదగ్గిర కొచ్చి మన సామగ్రిని మన ఆయుధాలనీ కాజేస్తారు. ఒక్కొక్కప్పుడు శత్రువుమీద పేల్చడానికి మనదగ్గిర తుపాకులు కాని తూటాలు కాని యేమీ వుండవు... ఒక్కొక్కప్పుడు కళ్ల యెదుట అలా మైళ్ల కొద్దీ గడ్డి మొలచి వున్న బల్లపరపునేల తప్ప మరేమీ కనిపించదు. ఆవేళ మన కథలో చెప్పినట్టు, భూమిలోంచే హఠాత్తుగా వాళ్ల శతఘ్ని దళాలవారు పైకొచ్చేసి ఫిరంగులని మనమీద పేలుస్తారు. వాళ్లు చాలా కాలం ముందునుంచే యుద్ధానికి తయారై యున్నారు" అన్నాడు దనీల్కా.

అందరూ వెళ్లిపోయాక నేను దనీల్కాని:

"వెదెనేయ్ యేడీ? వాళ్లందరికంటే ముందుగా నువ్వెందుకొచ్చేశావు?" అని అడిగేను.

నేను అడగ్గానే తనకేదో చాలా తొందరపని వుందని చెప్పి నేనడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్పకుండానే దనీల్కా వెళ్లిపోయాడు.

ఇది జరిగిన కొన్నినెలల తరువాత మన వెదెనేయ్ ఇంటికి తిరిగి వొచ్చాడు. శ్రామికులూ సైనికులూ యేకమై జారు చక్రవర్తిని యెలాగు పదచ్యుతుని చేశారో రాజ్యాధికారాన్ని సోవియట్లు యెలా హస్తగతం చేసుకున్నాయో అదంతా వెదెనేయ్ తన నిదానమైన కంఠంతో చెబుతూంటే మేము మా పాకలో అనేక సాయంకాలాలూ అనేక రాత్రుళ్ళూ అలాగు వింటూ గడిపాం.

నాలుగవ ప్రకరణం

గెరిల్లాలు

సాయుధులైన మనుష్యులు చాలామంది మా ప్రాంతానికి వస్తూ పోతూండేవారు. వాళ్లలో కొంతమంది తెల్లసైనికులనీ* కొంత మంది ఎర్రసైనికులనీ** మరి కొంతమంది మంగోలులనీ ప్రజ చెప్పుకుంటూండేవారు.

అది శరదృతువు. ఆవేళ సాయంకాలం మహా రమ్యంగా వుంది. ఎక్కడో సయానీ పర్వతాల వెనుక సూర్యుడు అస్తమించాడు. కుస్కున్నుగ్ పర్వత శిఖరాల్లోకల్లా యెత్తైన శిఖరాలమీద అక్కడక్కడ కుంకుమ వర్ణంతో సూర్యుని ప్రతిబింబం కానవస్తూంది. ఈ దృశ్యాన్ని తువా దేశస్థులు "ఎర్ర

---

* అంతర్యుద్ధంలో సోవియట్ ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడిన విప్లవ ప్రతీఘాతక సైన్యాలు.

** విప్లవసైన్యాలు.

సూర్యుడు'' అంటారు. ఈ కుంకుమవర్ణం సూర్యాస్తమసమయాన్ని నేనెప్పుడు చూడడం తటస్థించినా వేటకాడు తొంబష్త్రాయ్ నాకు జ్ఞాపకం వచ్చేవాడు. ఇలాంటి సూర్యాస్తమసమ యాన్ని చూసి "మరునాడు బాగా యెండకాసే సూచన యిది, రేపు మంచి వేట దొరుకుతుంది'' అనేవాడు అతను.

"ఎర్ర గెరిల్లాలమని చెప్పుకునే వీళ్లవల్ల మనం సుఖసంపదలని పొంద గలిగితే యెంతో బాగుంటుంది. వెదెనేయ్ యేప్పుడూ ఆషామషీగా మాట్లాడ్డు'' అనుకున్నాను నేను.

ఒకనాడు నేను యజమాని గోధుమవర్ణం గుర్రాన్నెక్కి పశువులని యింటికి తోలుకొద్దామని తెర్‌జీగ్ నదివైపు వెళ్లాను.

తెర్‌జీగ్ వొడ్డంట వున్న పిల్లలు పశువులు మేర్గెన్‌లోయకి యెగువగా వెళ్లడం చూశారు.

"నా ఆవులని అంత దూరం యెవరు తోలేసి వుంటారో? మందని ఇంటికి తోలు కొచ్చేసరికి తెల్లవారి పోతుంది. యజమాని నాకు గట్టిగా తగిలిస్తాడు'' అని వ్యాకులపడుతూ అనుకున్నాను.

కొండలోతట్టు కనుమలో ఒక ముప్పై మంది సాయుధ రౌతులు స్వారిచేస్తూ నావైపు వస్తూండడం చూశాను.

"నువ్వెక్కడనుంచొస్తున్నావు? నీదేవూరు? తెల్లసైనికులు యెక్కడు న్నారో నీకు తెలుసా?'' అని వారిలో ఒకడు రష్యనుభాషలో నన్నడిగేడు.

తల పంకిస్తూ నాకేం తెలియదని తువాభాషలో చెప్పాను.

వీళ్లు నన్నిలా ప్రశ్నిస్తూండగా తోలుకోటు తొడుక్కొని పటకాలో

రివాల్వరూ మందుపాత్రలూ దోపుకుని మంచి అందమైన గుర్రంమీదెక్కి ఒకతను అక్కడికి వచ్చి:

"ఆ కుర్రాడిని యెందుకలా అల్లరి పెడుతున్నారు మీరు? అతన్ని వది లేయండి!" అన్నాడు.

ఆ మాటలని విని నా ముఖం తేటపడింది.

ఆ గుర్రపు రౌతుల్లో ఒకతడు తోలుకోటు తొడుకున్న అతనితో:

"కామ్రేడ్ కమాండర్! నువ్వు అనుమతిస్తే యీ కుర్రవాడి గుర్రం నేను తీసుకుని అందుకు బదులు నా గుర్రాన్ని అతనికిస్తాను" అన్నాడు.

"అది వేరే సంగతి. అందుకు నా అభ్యంతరం యేమీ లేదు" అన్నాడు ఆ కమాండరు.

అందుమీద ఆ రౌతు నాదగ్గిర కొచ్చి:

"నా గుర్రాన్ని నువ్వు తీసుకోవాలి. ఇది చాలా మంచి గుర్రం. కాని అలిసిపోయి వుంది. మనం యిద్దరం గుర్రాలని మార్చుకుందాం" అని రష్యను భాషలో నాతో అన్నాడు.

నేను నా గుర్రంమీదనుంచి దిగిపోయిన తరువాత నా గుర్రంమీద వున్న జీనుని తన గుర్రంమీద వేసి నన్ను చంకలలో పట్టుకుని గుర్రంమీదకెత్తి జీనుమీద కూచోపెట్టాడు.

"అద్దీ! ఇప్పుడు నువ్వెక్కినది భేషైన గుర్రం" అని సరదాగా నవ్వుతూ గోధుమవర్ణం గుర్రంమీద జీను వెయ్యసాగేడు.

ఆ యెర్ర గుర్రంమీద కూచోగానే అది చాలా గొప్ప గుర్రం అనీ దానికి మాత్రం కొంచెం విశ్రాంతి అవసరం అనీ నేను పోల్చుకున్నాను.

సైనికదళం ముందుకు సాగిపోయింది. కాని వాళ్ల నాయకుడు మాత్రం వెనక వుండిపోయి అక్కడే తచ్చాడుతున్నాడు.

"మీరెవరు? ఎక్కడనుంచి వస్తున్నారు మీరు?" అని నేను అతన్ని రష్యనుభాషలో అడిగేను.

అతడు ఆశ్చర్యంతో నావైపు చూశాడు.

"రష్యనుభాష తెలియదని నువ్విందాక అన్నావు? రష్యనుభాష యెక్కడ నేర్చుకున్నావు?" అన్నాడు అతడు.

"చొల్‌దాక్-స్తెపాన్ దగ్గిర నేను పనిచేస్తున్నాను. మిమ్మలినందరినీ చూసి నాకు భయంవేసి మిమ్మలిని మోసంచేశాను" అని నేను నిజం చెప్పేశాను.

"మాదగ్గిర మీరేమీ భయపడనక్కరలేదు. ష్చెతీన్‌కిన్ నాయకత్వం కింద వున్న ఎర్ర గెరిల్లాదళంవాళ్లం మేము. వీళ్లగురించి నువ్వెప్పుడేనా విన్నావా?—పేదవాళ్లని రక్షించడానికొచ్చాం మేము" అని చెప్పాడు అతను.

అలాగంటూనే తన జీను సంచీలోంచి ఒక రొట్టె తీసి నాకు అందిస్తూ:

"దీన్ని పుచ్చుకో. నేను వెళ్లివస్తానుమరి, నమస్తే కామ్రేడ్!" అన్నాడు.

"నమస్తే!" అని ప్రత్యుత్తరం యిచ్చాను.

కొత్తగా పరిచయం కలిగిన వ్యక్తి వెళ్లిపోతూవుంటే అలా చూస్తూ నాలోనేను యిలా తలపోశాను:

"ఇప్పుడు నేనేం చెయ్యాలి? నేనిప్పుడు యెక్కిన గుర్రం మంచి అందమైనది. భేషైన గుర్రం. కాని యిప్పుడది పూర్తిగా చిత్తైపోయి వుంది. దీనిమీదెక్కి కొండల్లోకెళ్లి ఆవులని తోలుకురావడం వుత్తమాట. ఒకవేళ ఆవులని తోలుకొచ్చినా చొల్‌దాక్-స్తెపాన్ యీ గుర్రాన్ని చూసి సంతోషిస్తాడా? మన యెర్రగుర్రంలాగే అతను కూడా వుత్త మూర్ఖుడు.

అబ్బే! నేను మళ్లీ అతనిదగ్గిరకెళ్లి లాభంలేదు.'' అలా గనుకుని అమ్మదగ్గిరకి వెళ్లదాం అని నిశ్చయించుకుని ఆ రోడ్డంట వెళ్తూనాలో నేను: ''ఈ ఎఱ్ఱ సైనికులు నిజమైన మనుష్యులు. వీళ్లే మనకి నిజమైన స్నేహితులు'' అనుకున్నాను.

ఐదవ ప్రకరణం

ఎంత బాగుంది!

కాస్సేపటికల్లా అమ్మని చూస్తాను! శరదృతువు దగ్గర పడుతూందనగానే కుస్కున్నుగ్ కొండలకి లోతట్టుగా అమ్మ వచ్చేసి అక్కడ గుడిసెవేసుకుని వుంటూంది. మళ్లీ నా చిన్ననాటి మేర్గెన్ని నేను చూడగలుగుతాను — కదా! అని సంతోషించాను.

పాపం ఆ గుఱ్ఱానికి కాళ్లీడవడమే కష్టంగా వుంది. దాన్ని కొంచెం పరుగెత్తించగలిగేసరికి నాకెంతో శ్రమ కలిగింది.

గుఱ్ఱం యెంత తెలివైన జంతువు! తన మీదున్న రౌతుయొక్క ప్రాణాలన్నీ తనకి ఒప్పచెప్పాడు కదా అని యీ గుఱ్ఱం వెంటనే పోల్చుకుని దానికి వున్న రవంత శక్తినీ వినియోగించి తను యెంత త్వరగా పరుగెత్తగలదో అంత త్వరగా ముందుకు సాగిపోతూంది.

దాని మెడని దువ్వాను.

''ప్రపంచంలో యేమారుమూల దేశాలనుంచి వచ్చావో కదా నువ్వు? చెప్పడానికి నీకు నోరులేదే! ఎన్నెన్ని కష్టాలని అనుభవించావో కదా నువ్వు!

ఛల్, ఛల్! కాస్త చురుగ్గా అడుగెయ్యాలి మరి. ఇంక యెంతో దూరం లేదులే. నాలుగు అడుగులు వేశావంటే మా బిర్చిబెరడు చూమ్ చేరుకున్నా మన్నమాటే. ఇంటికెళ్లగానే నీకు మంచి దాణా వేస్తాను. నువ్వంటే నాకెంతో యిష్టం కూడా. ఆ గోధుమవర్ణం గుర్రంలాగు తయారవుతావు నువ్వూను. దాని గురించి నాకేమీ విచారం లేదు. ఎందుకంటే నీలాగున కాకుండా అది డబ్బున్న యజమానులది!'' అని దాని మెడ తట్టుతూ అన్నాను.

ఆ శరదృతువుయొక్క బంగారపు ఛాయలకంటె నా ఆలోచనలు నా ఆశలు మరొకవన్నె మించే వున్నాయి. ఆ శరత్తుదృశ్యం యెంత రమ్యంగా వుంది! చలనంలేని సంధ్యారాగం మేర్గెన్‌మీద ఒక తెరలాదిగింది. మేలిమి బంగారపు తుషారంలో ఆ పండుటాకుల రంగులు మరింత శోభాయమానంగా ప్రకాశిస్తూన్నట్టున్నాయి. సన్నటి పిల్లగాలికి ఆ పండుటాకులు చలికాలంలో మొట్టమొదట పడే మంచుపింజల్లాగు తీరికగా తాపీగా నేలరాలుతున్నాయి. రోడ్డుమీద ఆ ఆకులు ఎంత ఒత్తుగా పడున్నాయంటే ఇందాకా స్తెప్‌మైదానాన్ని దాటుతూన్నప్పుడు కుంటుతూ అడుగులువేసిన గుర్రం యిప్పుడు ధైర్యస్థైర్యాలతో ఆ రోడ్డుమీద పరుగెత్తుతూంది.

దూరాన మా చూమ్ కానొచ్చింది. అక్కడున్న మిగతా చూమ్‌లన్నీ కుస్‌కున్నుగ్ కొండకింద వున్న మేర్గెన్‌ని తైగా చెట్లపొదలు కప్పేసి వుండగా మా చూమ్ ఒక్కటే ఒంటరిగా వేరే రవంత దూరంగా వుంది. మా చూమ్‌లోనుంచి సన్నటి నీలిరంగు పొగకుచ్చులు ఆకాశంలోకి లేస్తున్నాయి. చుట్టుపక్కలంతా యెంత ప్రశాంతంగా వుందంటే మా చూమ్‌లో పొయ్యి రాజుకుంటూ చిటచిటమంటూన్న చిదుగుల చప్పుడు సహా నాకు వినబడుతూంది.

గడ్డి యెంత దట్టంగా మొలుస్తూంది ఇక్కడ!

నేను నేలమీదకి గెంతేసి గ్నెదోక్ — నా గుర్రానికా పేరు పెట్టేను నేను — మీదనుంచి జీనుని తీసేసి దాన్ని అలాగే గడ్డిమేయడానికి వదిలిపెట్టే శాను. ఇదివరకు దానికున్న నిస్త్రాణ అంతా ఒక్కసారిగా మాయం అయి పోయింది. నాలుగడుగులు ముందుకెళ్ళి నేలమీద ఒక పక్కని పడుకుని అక్కడ నుంచి పదిమాట్లు యిటూ అటూ దొర్లింది. చప్పున లేచి నిలబడి వొళ్ళంతా ఒక మాటు విదిలించుకుని ముక్కు చలమల్ని యెగరేసుకుంటూ ఒక్క మాటు కాండ్రించి సకిలించింది. ఆ కాండ్రింపు సకిలింపూ యెంత బిగ్గరగా వుండెనంటే దాని ప్రతిధ్వని ఆ కొండలన్నింటిని ప్రదక్షిణం చేసేసరికి దట్టమైన ఆ త్రైగాలో నూరు గుర్రాలు కాండ్రించి సకిలిస్తు న్నాయా అని అనిపించిందన్నమాట. ఆ పచ్చని గడ్డిని అతి ఆబతో మేసి తొందరతొందరగా కబళించేస్తూంది గ్నెదోక్. దాని గెరిల్లా యజమానికి దాన్ని సరిగా చూడడానికే తీరికలేకపోయి వుండాలన్న విషయం ఒకరు చెప్పకుండానే తెలుస్తూంది.

గ్నెదోక్‌వైపు నేను నిదానంగా చూస్తూ:

"దరిద్రం వోడుతూన్న మా చూమ్‌ను చేరుకునేముందు చక్కని మేర్గెన్‌లోయలని దాటుకొని యెంత దూరంనుంచో నువ్వు ప్రయాణం చేసి వుండాలి. ఆ యెర్ర యోధుడిని నీ వీపు మీదెక్కించుకుని అనంతమైన స్తెప్‌మైదానాలని, ఉన్నతమైన పర్వతశ్రేణులని దాటుకొని వచ్చివుండాలి బహుశ నువ్వు!" అని నాలో నేను అనుకున్నాను.

చిన్న జల్లు అప్పుడే పడివెలిసింది. వాలుగాపడుతూన్న సూర్యకిరణా లకి వెచ్చగిలి సన్నని పొగమంచు వస్త్రం కట్టుకుంది భూమి. పర్వతాలమీద

కమ్ముకున్న దట్టమైన మేఘాల్లోనుండి పైకిదూసుకొని వచ్చి కనబడు తూన్న పర్వత శిఖరాన్ని చూస్తే తేరె-హోల్ సరస్సు మధ్య తేలుతూన్న పిల్లలంక జ్ఞాపకం వచ్చింది నాకు. మా మేర్గెన్ తల్లి అందంగా వుండడమే కాకుండా సర్వాంగ సుందర శోభాయమానంగా మెరిసిపోతోందనిపించింది ఆ సంధ్యారాగంలో నాకు. కన్నులపండువగా వున్న శరత్తుసంధ్య ఒయ్యా రాన్ని తనవితీరా ఆనందిస్తూ తైగా పరిమెళాన్ని హృదయంనిండా నింపు కుంటూ పక్షుల పిలుపులని చెవులార వింటూ అలాగు చాలాసేపు అక్కడ నిలబడిపోయాను. ఈ ప్రాంతాన్ని నేనిదివరకు ఎన్నో సార్లు చూశాను. దాని గొంతుక నేనెన్నో సార్లు విన్నాను. ఆరోజు మాత్రం అదంతా ఒక నూతన తేజస్సుతో నాకు సాక్షాత్కారం అయింది...

చూమ్ బైటనే నెగడి వేసుకుని నిప్పులో కొరకంచులని ఎగదోస్తూ కూచుంది అమ్మ. నన్ను కౌగలించుకుని చూమ్ గోడని ఆనుకుని చేరగిల బడింది. మా పెద్దక్క అల్బన్‌చీన్నీ స్యుర్యున్మన్నూ పని యేదేనా దొరుకు తుందేమో అని దగ్గరున్న పేటల్లోకి వెళ్లారు.

“ఆహా! ఎంత హాయిగా వుందే అమ్మా ఇక్కడ!” అని సంతోషంతో అన్నాను అమ్మదగ్గరనే కూచుని. “ఎన్ని పువ్వులు పూస్తున్నాయ్! ఇం తకుముందు నేనెన్నడూ చూడేలేదు సుమా! కొందరు రష్యను రౌతులని చూశానే అమ్మా. గెరిల్లాలమని చెప్పారు వాళ్లు. వాళ్లని చూసి నేను మొదట భయపడ్డాను, కాని మన శ్రేయోభిలాషులే అని తరువాత నాకు తెలిసింది. నేను యెక్కిన చొల్‌దాక్-స్త్రైపాన్ తాలుకు గోధుమవర్ణం గుర్రాన్ని తీసుకుని నాకొక మంచి గుర్రాన్నే మార్పిడికింద యిచ్చారు. గ్నెదోక్ మీద వాళ్లంతట వాళ్లే జీనునీ సామానునీ వేసి నన్ను దానిమీద కూచో

పెట్టారు... ఇదిగో యీ నానుగొట్టె కూడా యిచ్చారు'' అని ఆవైనం చెప్పాను.

''వాళ్లు మన యింటినుంచి వెళ్లిపోతూండగా వాళ్లు నీకు దారిలో యెదురు పడ్డట్టున్నారు. ఈవేళ పొద్దున్నే లోయలో నాకు గుర్రపుడెక్కల చప్పుడు వినబడింది. ఏటిదిగువ వొడ్డుమీదనుంచే వచ్చి వాళ్లు మన చూమ్ దగ్గిర ఆగేరు. ఆగి మన ఇనపమూకిట్లో వంట వండుకునేందుకు అనుమతి యివ్వమని అడిగేరు నన్ను. వాళ్లు వెళ్లిపోయే ముందు పసుపుపచ్చ పొగాకున్ను యిన్ని టీఆకులనీ యిచ్చారు. వాళ్లు నువ్వు చెప్పే ఎర్రగెరిల్లాలే అయివుండాలి రా నాయనా'' అంది అమ్మ.

అమ్మ నావైపు నిదానంగా చూస్తూ చిరునవ్వు నవ్వింది. ఆ నిశ్శబ్దంలో అమ్మ పొగగొట్టాన్ని పీలుస్తూన్నప్పుడు ఉస్సుమని అయే చప్పుడూ దగ్గరనే యెక్కడో పచ్చిక మేస్తూ గ్నెద్కో గడ్డిని గరగరమని నవులుతూన్న చప్పుడూ వినిపించాయి.

ఇందాకటికంటె మరింత వాత్సల్యంతో నన్ను కౌగలించుకొని:

''మునుపటికంటే మన బతుకులు ఇక బాగుపడతాయి ఇప్పుడు. తన్నా-తువాకి వచ్చిన యీ కొత్త వాళ్లని మనలాంటి బీద ప్రజంతా సంతోషంతో ఆహ్వానిస్తున్నారు. చివరకి తైగా కూడా వాళ్లకి నమస్కారం చేస్తూంది'' అంది అమ్మ.

''అమ్మా! ఇలా నాతో వచ్చి గ్నెద్కోని చూద్దూ!'' అన్నాను.

అమ్మా నేనూ బైటకి వెళ్లాం. నీలిరంగుతో మెరుస్తూన్న ఆకాశం కింద మేర్గెన్ పరచిన పువ్వుల తివాచీని చూచి నేను మళ్లీ మరొక మాటు ముచ్చటపడ్డాను.

"అమ్మా! దుర్మార్గుడైన రాజు బారినుంచి తనని విడిపించడానికి వచ్చిన తండ్రిని కలుసుకొనేటప్పుడు నగలన్నిటితోనూ అలంకరించుకుని అందంగా వున్న అల్ధిక్-కీన్ లాగుందే మన మేర్గెన్ చూడవే!" అన్నాను.

అదే పనిగా గడ్డిని మేస్తూ గ్నెద్కో మమ్మలిని క్రీగంటితో కన్ను గీటుతూంది.

"అమ్మా! అమ్మా! గ్నెద్కోని బాగా వాళ్లొచ్చేటట్టు మేపాలేమనం. పాపం! చూడవే అది వుత్త యెముకలు తప్పమరేంలేదే" అన్నాను అమ్మతో.

"మరేమీ ఫరవాలేదు నాయనా! గ్నెద్కో త్వరగానే కోలుకుంటుందిలే. గడ్డి యెంత మృదువుగా వుందో చూడు. మనమూ గ్నెద్కో లాగే వున్నాము రా నాయనా! జవసత్త్వాలులేక నీరసించి వున్నాం. అయితేనేమి. మనమూ కోలుకుంటాంలే. అల్లదిగో అక్కడున్న వాళ్లందరూ అలా అంటున్నారని చెప్పుకుంటున్నారు" అని పడమటి ముఖంగా తిరుగుతూ "ఒమాని పత్మిహోమ్"* అని మెల్లిగా మననం చేసుకుంటూ:"అక్కడ పడమటని మాస్కో అనే ఒక పెద్ద పేటలోను పెట్రోగ్రాద్ అనే మరో పెద్ద పేటలోను వున్న భాగ్యవంతులందరూ కూలిపోయారుట. ఎర్ర వీరుడు ఒకతను అవతరించి భూలోకంలో నాలుగు మూలలనుంచీ ప్రజలనందరినీ కూడగట్టుకుని బీదబిక్కినీ రక్షించడానికి బయలుదేరేడుట. అలాగని అందరూ చెప్పుకుంటున్నార్రా నాయనా!" అంది అమ్మ.

---

* ప్రార్థన మాటలు.

“నేను చెప్పేది వినవే అమ్మ! నేను సరీగ్-సెప్*కు వెళ్ళతాను. ఎర్రయోధులు ఆ వూరిలో మకాం వేసుకుని వున్నారు. నేనక్కడికి వెళ్లితే విశేషాలన్నీ వివరంగా వాళ్ళు నాకక్కడ చెబుతారు” అన్నాను.

గుర్రాన్ని యేం చేద్దాం అని ఆలోచించి అది బాగా కోలుకున్న తరువాతే నేనా వూరికి వెళ్లి దాన్ని గెరిల్లాకి ఇచ్చేద్దాం అని నిశ్చయించుకుని అంతవరకూ ఆగేను.

ఆరవ ప్రకరణం

మకాంలో నెగళ్ళు

మేర్గెన్‌లోయలో దట్టముగా మొలుస్తూ రసం ఓడుతూన్న ఆ పచ్చ గడ్డిని చాలా రోజులు మేసింది గ్నెద్కో. మళ్లీ యెప్పటిలాగే దాని చర్మం నిగనిగలాడుతూంది. ఇక దానిమీద జీనువేసి సవారీ చేస్తూ సరీగ్-సెఫ్‌కు వెళ్లొచ్చు ననుకున్నాను.

కళ్లెం వెయ్యడానికి దానిదగ్గరకి వెళ్లేటప్పటికి అది గడ్డి నములు తూంది. బుర్రెత్తి నావైపు అయిష్టంగా చూసి వెనకటికంటె మరింత ఆబతో హడావుడిగా ఆ పచ్చగడ్డికొమ్మలనిని వేళ్లదగ్గిరసంటూ కొరికి పొడు గుపాటి ఆకులని కబళించడం ప్రారంభించింది.

“మమ్మలిని వదలి సరికొత్త దారులంట కనివినియెరుగని కొత్త ప్రాం

---

* కా-ఖెమ్ పొడ్డునవున్న జిల్లాకి ముఖ్యమైన వూరు.

తాలకి వెళ్లడం అంటే నీకు విచారంగా వుంది కాబోలు? లేకపోతే బయలుదేరే ముందు ఇంకా మరి కొంత బలాన్ని కూడదీసుకుందాం అనుకుంటున్నావా? మాదగ్గిర నీకు వంటరిగా వున్నట్టు అనిపించడం లేదు కదా గ్నెద్కొ?" అన్నాను దాంతో.

గుర్రానికి జీనువేసి జీనుమీదకి యెగిరి కూచుని:

"అవమ్*! అవమ్! నేను బయలుదేరడానికి సిద్ధంగా వున్నాను" అని అమ్మని కేకేశాను.

చూమ్‌లోనుంచి అమ్మ పరుగెత్తుకొచ్చి:

"గుర్రాన్ని గెరిల్లాలకిచ్చేసి నువ్వు యెంత త్వరగా రాగలవో అంత త్వరగా వచ్చేయి. దేముడి దయవల్ల క్షేమంగా వెళ్లిరా నాయనా!" అంది అమ్మ.

అమ్మదగ్గిర సెలవు తీసుకుని సరీగ్-సెప్ రోడ్డంట బయలుదేరేను.

"అంత తొందరగా వెళ్లుతున్నావే యెక్కడికి తొకా?" అని నేను వెళ్లడం చూసి తెలిసినవాళ్లు నావెంట కేకేశారు.

"గెరిల్లాలదగ్గరకి! గెరిల్లాలదగ్గరకి!" అని వాళ్లతో కేకవేస్తూ అస్తమిస్తూన్న సూర్యుడికిరణాల్లో వెలుగుతూన్న సరీగ్-సెప్‌పర్వతాలవైపు చూపించాను.

నేను చేస్తూన్న పని మంచిదే అని కొందరు ఒప్పుకున్నారు. కొందరు నన్ను వెక్కిరించారు:

"వాళ్లిన్నాళ్లూ నీలాంటి చీముడిముక్కుగాడి కోసమే కనిపెట్టుకు న్నార్రా!" అని కొందరూ.

---

* అమ్మ.

"నల్లకళ్లతోడేలు మేక పిల్లని కబళించేసినట్టు నిన్ను వాళ్లు కబళించేస్తా్రరా ఒరేయ్!" అని కొందరూ వెటకారాలాడారు.

ఇసుక తిన్నెల మధ్యనుంచీ నాచుకప్పేసిన రాక్షసగుళ్ల మధ్యనుంచీ పాము మెలికల్లా వుంది దారి అంతా. నేను మా్రతం తిన్నగా సరాసరి ముక్కుకు సూటిగా వెళ్లి పోయాను. కొండలూ దిబ్బలూ యెక్కినప్పుడు గ్నెదో్క యే మా్రతమూ వెనకంజ వేయకుండా చకచకమని పరుగెత్తింది. నీటిమీద పడవ తేలుతూ వెళ్లుతూన్నట్టు తుప్పలూ పొదలూ వున్న నేలమీద సునాయాసంగా పరుగెడుతూ వెళ్లిపోయింది.

సరీగ్-సెప్ కొండలమీద కెక్కేసరికి కొండలకింద గెరిల్లాలు దండు విడిసి వుండడం వాళ్ల మకాముల్లో నెగళ్లూ నాకు కనబడ్డాయి.

కా-ఖేమ్ నదిమీద వుండే అత్యంత రమణీయమైన స్థలాల్లో ఇదొకటి. తోజ-కిజీల్ తైగా లోయలోంచి బైటకొచ్చిన పొడుగాటి కొండ అంచులున్నూ తన్నూవోల్ పర్వతపంక్తులున్నూ యేటి వొడ్డుకి దిగివచ్చేశాయి. బ్రహ్మాండమైన యీ నల్లరాతి గోడ దాట శక్యంకాని అడ్డకట్టలా కనబడింది. కాని కా-ఖేమ్ పారుతూ పారుతూ తన దారిలో యేలాంటి అవరోధాలు కలిగినాసరే లక్ష్య పెడుతుందా? ఆ అవాంతరాల్లోంచి దూసుకు పోయేసరికి అవి తుత్తునియలైపోయి జలపాతాలు సుడిగుండాలు కింద మారి పోయాయి. వాట్లని దాటుకు పోయి తన చెల్లెలు బీ-ఖేమ్‌ని కలుసుకోడానికి ఉరకలేసుకుంటూ పరుగెత్తుతూంది. తైగా పొళ్లనుంచి యేటి అంచువరకూ ఠీవిగా దిగివస్తూన్న దేవదారు పేరీత సగ్గు సంగీత మహావృక్షాల సమూహాలతో కా-ఖేమ్ తీరమంతా అతిరమణీయంగా ముస్తాబై వుంది. ఆ యేటి వొడ్డునున్న అడవులు తొంబష్తాయ్ యెంతో నైపుణ్యంతో

వేటాడే అడవిపందులుతోనూ దుప్పి మరాల్ దుప్పులతోనూ సేబుల్ ఉడతలతోను, ఓట్టర్ ఉడుములతోను యెల్లప్పుడూ కిటకిటలాడుతూ వుంటుంది.

దట్టమైన పొదలమధ్యని గెరిల్లాలు దండు విడిసి అక్కడ నెగళ్లని వేసుకున్నారు. దూరంనుంచి చూస్తే ఆ మకాంమీద యెర్రని తెర వేసినట్టు అంతా వెలుగ్గా వుంది. ఆ మకాం అంతటికీ ఒకేనెగిడి వున్నట్టు కనిపించింది. ఆ ఒక్క నెగిడిలోంచి పసిడి తేనెటీగలపుట్టల్లాగు నిప్పురవ్వలు ఆకాశంలోకి యెగురుతూ మేఘాల్లో అంతర్ధానం అయిపోతూన్నాయి. తర్బగాన్ చెప్పిన కథ, ఆ కథలో వున్న కొదూర్-ఓల్ అతని తండ్రీ వేటకి వెళ్లినప్పుడు బండరాతి పక్కన వాళ్లు వేసుకున్న నెగిడే, నాకు జ్ఞాపకం వచ్చింది. అయితే ఆవేళ నాకు కనిపించినది యెక్కడో కథలో చెప్పిన సౌఖ్యం కాదు. ఆవేళ నా కళ్లకి కనపడినది ఎర్రగెరిల్లాలు దండు విడిసిన మకాం. మన అందరి సౌఖ్యంకోసం వాళ్లు యుద్ధం చేస్తున్నారు.

నేను లోయలోకి దిగేటప్పటికల్లా చీకటి పడిపోయింది. దగ్గరనే గుర్రాల వాసనని పసికట్టి గ్నెద్కో సకిలించింది. దాన్ని ఒక చెట్టుకి కట్టి భయపడుతూ భయపడుతూ మకాందగ్గరకి వెళ్లాను. ఆయుధాలని శుభ్రపరచుకుంటూ జీను సామాన్లని బాగుచేసుకుంటూ వున్నారు ఆ గెరిల్లాలు. పనులు చేసేసుకున్నవాళ్లు అతి హడావుడిగా చేతులు తిప్పుకుంటూ కళ్లెగరేసుకుంటూ మాట్లాడుకుంటున్నారు. నాకు అన్ని సంగతులూ తెలుసుకోవాలని అనిపించింది. ముఖ్యంగా వాళ్ల నాయకుడిని కలుసుకొని అతనితో మాట్లాడి అతనివల్ల యీ మహాప్రపంచం అంతటిలోనూ యేమేమి

జరుగుతూన్నదీ అడిగి తెలుసుకుందాం అనిపించింది. నిశ్శబ్దంగా ఆ మనుష్యులదగ్గిరసంటా వెళ్లి వాళ్లవైపు నిదానంగా చూస్తూ మెల్లగా నడిచాను.

ఆవేళ రాత్రికి అక్కడ మకాం చేసి కా-ఖెమ్ యెగువ తీరంలో నిలదొక్కుకుని వున్న తెల్లసైనికుల దళాలమీద యుద్ధం చెయ్యడానికి తయారవుతున్నారు.

మొదట నా కందరూ పరాయివాళ్లే కనపడ్డారు. ఈ గెరిల్లాలకి సెర్గేయ్ ప్లేబ్నికొవ్ నాయకుడు. అతనిది బెల్బేయ్ గ్రామం. అందుచేత అతని దళంలో తీరా వెదెనేయ్ సీదొరొవ్, తర్బగాన్, సన్‌జా నాకు యెదురు పడేసరికి నా కళ్లని నేనే నమ్మక, ఇదేమి కలగంటున్నా నా, అని ఆశ్చర్యపోయాను. వాళ్లు మామూలు దుస్తుల్లోనే వున్నారు కాని అదొక విధంగా కనబడ్డారు. వాళ్లు రైఫిళ్లని శుభ్రం చేసుకుంటూ దెబ్బలాడుకుంటూన్నట్టు వాదించుకుంటున్నారు. ఆ నెగిడిదగ్గరకి యెలాగు వెళ్లానో నాకు ఇప్పుడు గుర్తులేదు. కాని రైఫిళ్లని అక్కడ చూసేటప్పటికల్లా వాటిని తీసుకుందామని అప్రయత్నంగా చెయ్యిజాపాను.

"స్తెపాన్ మిమ్మలిని దూర ప్రాంతానికెక్కడికో పనులమీద పంపించాడనుకున్నాను కాని మీరిక్కడ ఆయుధాలు చేతబుచ్చుకుని గెరిల్లాలతో వుంటారని నేనెప్పుడూ అనుకోలేదు సుమండీ" అన్నాను నాతోటి పాలేళ్లతో.

"నువ్వు వెళ్లిపోయిన తరువాతే మేమూ నాఖరీనుంచి వెళ్లిపోయాం. నువ్వు యిక్కడెలా తటస్థపడ్డావు? అది ముందర చెబుదూ" అని వెదెనేయ్ నన్ను ప్రశ్నిస్తూ నెగిడిదగ్గిర కూచోబెట్టాడు.

నేను ఆవులని తోలుకురావడానికి వెళ్లడం, నేనెక్కి వెళ్లిన గోధుమ వర్ణం గుర్రం గురించీ గ్నెద్కో గురించీ మా అమ్మా నేనూ మాట్లాడుకున్న మాటలూ వీటినన్నింటినీ చెప్పి చివరకి:

"యజమానిదగ్గిరకి వెళ్లిపోతే అతను నన్ను అష్టకష్టాలూ పెడతాడు. వెళ్లక పోయినా కష్టాలు తప్పవు. నా అదృష్టం బాగుండి మిమ్మలిని కలుసుకోవడం తటస్థించిది" అన్నాను.

"చొల్దాక్-స్త్రెపాన్‌దగ్గిరకి మళ్లీ వెళ్లడంలో అర్థం లేదు. అతనంటే భయపడడము అసలే అవసరం లేదు. నువ్వు కమాండర్‌దగ్గిరకెళ్లి సంగతులన్నీ అతనితో మాట్లాడు. అన్నిటికంటే అదే ఉత్తమం" అన్నాడు వెదెనేయ్ నవ్వుతూను.

"వెదెనేయ్ చెప్పింది బాగుంది" అని కడమ గెరిల్లాలందరూ అన్నారు.

నాకిప్పటికి బాగా ధైర్యం కలిగింది. నా చుట్టూర ఐదార్గురు జట్టు జట్టుగా చాలామంది నెగిడి చుట్టూ కూచుని వున్నారు. అందరిదగ్గరా తుపాకులున్నాయి. కొందరు వంట చేస్తున్నారు. కొందరు గుడ్డలని ఆరవేస్తున్నారు. కొందరు బూడ్సుజోళ్లని బాగుచేసుకుంటున్నారు. మరికొందరు తుపాకులను తుడుచుకుంటున్నారు.

నా చెయ్యి పట్టుకుని తర్బగాన్ నన్ను పక్కనున్న నెగడిదగ్గిరకి తీసుకెళ్లాడు. ఆ నెగడి యింకా నాలుగు అడుగులుందనగా నా చెవిలో:

"చూడు! అక్కడున్నది ఎవరు?" అని అడిగేడు.

వేర వుంది అక్కడ. గొర్రెబొచ్చుకుడతా వేసుకుని పొయ్యిదగ్గిర కూచుని ఆలుగడ్డలని గీస్తూంది. నేను ఆశ్చర్యపోయి కనురెప్పపాటు నిలుచున్న చోట నుంచి కదలలేక పోయాను. కాస్సేపయాక ముందుకు అడుగు పెట్టబోయే

సరికి సాఫుగా వేర గొంతుకే వినిపించి ఆగిపోయాను. చిరపరిచితమైన పాట చిరపరిచితమైన మాటలు వినిపించాయి:

ఛాయనిచ్చు మహావృక్షం
మిన్నుముట్టు నిటారు దేవదారు
— దహించె దావానలం.

"రా! ఆమెదగ్గరకి వెళ్లదాం" అని తర్బుగాన్ నన్ను తొందర చేశాడు. "ఇంతకీ ఆమెదగ్గర నీకేం కొత్త కాదుగా. మీరిద్దరు కలిసి ఊడిగం చేశారుగా..." అన్నాడు.

వెనక్కి తిరిగి పారిపోవా లనిపించింది నాకు. వయస్సులో వేర నాకంటె పెద్దది. అయినా నన్ను దాటుకు పోయి నాకంటే ఒక మజిలీకి మజిలీ ముందుకు సాగిపోయిందే అని నామీద నాకే సిగ్గువేసింది. తన బలమైన చేతులతో తర్బుగాన్ నన్ను ఆమెదగ్గరకి నెట్టాడు. ఇద్దరం పలుకరించుకున్నాం.

తోలుకుడతా వేసుకుని అందుమీద శాలువ కప్పుకుని శాలువని కోటుమెడలో దోపుకుని వుంటే యేదో వెర్రి వేషం వేసుకున్నట్టుంది వేర. అయితేనేం ఎంతోలావణ్యంగా వుంది!

"ఎక్కడనుంచి వస్తున్నావు నువ్వు? యెక్కడికి వెళ్తున్నావు?" అని చిరునవ్వుతో అడిగింది నన్ను.

"ఎర్రగెరిల్లాల సంగతీ సమాచారం యేమిటి? తెల్లసైనికులు ఎవరు? ఈ సంగతులన్నీ తెలుసుకుందాం అని ఇక్కడకి వచ్చాను. చొల్‌దాక్-స్తైపాన్ దగ్గిరకి మాత్రం మరి వెళ్ల దల్చుకోలేదు. అతడి గుర్రాన్ని నేను గెరిల్లాలకి ఇచ్చేశాను. ఆవులని తోలుకు రావడానికి యేనాడైతే

వెళ్ళానో నాటినుంచి నేటివరకూ నేనక్కడకి వెళ్లనేలేదు" అని ఆమెతో అన్నాను.

"ఇన్ని రోజులూనా? తెల్లసైనికుల చేతిలో నువ్వు పడిపోయి వుంటావేమో అని మేము చాలా భయపడ్డాం. స్త్రైపాన్‌దగ్గరకి నువ్వు తిరిగి వెళ్లనందుకు నాకు చాలా సంతోషంగా వుంది" అంది వేర.

నేను చెప్పిన వృత్తాంతం అంతా విని వేర భలే సంతోషించింది. నేను మరెక్కడకీ వెళ్లకుండా నా స్నేహితులతోనూ వేరతోనూ వుండి పోదాం అనే ఆలోచన తప్ప మరొక ఆలోచన యేదీ నా మనసులో లేదు.

తోలుకుడతా వేసుకున్న తర్గా* దగ్గరకెళ్లమని చెప్పింది ఆమె.

"అతనిదగ్గరకి వెళ్లి అతనితో అన్ని సంగతులూ చెప్పు" అంది.

ఆ తర్గావైపు నిదానంగా చూసే సరికి గ్నైద్కోనీ నాను రొట్టెనీ నాకిచ్చిన మనిషి ఇతడే అని పోల్చుకున్నాను. అతనిదగ్గరకి జాగ్రత్తగా వెళ్లి:

"ఎకీ!"** అన్నాను.

తర్గా గిర్రని నావైపు తిరిగి సరదాగా నవ్వేడు.

"ఓహో! ఎలాగు వున్నావు వాయ్! ఎక్కడనుంచి వచ్చావు? నిన్నిక్కడకెవరు తీసుకొచ్చారు? ఇలా వచ్చికూచో!" అన్నాడు.

"మిమ్మల్ని చూడాలనే వచ్చాను. మా అమ్మ నన్ను మీదగ్గరకి పంపించింది" అని జబాబుచెప్పాను.

"సరే. నీకేంకావాలి?" అని అడిగేడతడు.

---

* నాయకుడు.

** "నమస్తే!"

"మీతో గుర్రాన్ని మార్పిడి చేసుకున్నాక మళ్లీ మా యజమానిదగ్గిరకి వెళ్ల బుద్ధి అయింది కాదు నాకు. తన గుర్రాన్ని పోగొట్టినందుకు చొల్దాక్-స్త్రెపాన్ నన్ను చంపేసి వుండును. యేంచేద్దామా అని ఆలోచించుకున్నాను — చూ చూమ్‌లోనే వుండి పోవడమా? లేకపోతే మా యజమాని దగ్గిరకి తిరిగి వెళ్లిపోవడమా? లేకపోతే... నన్ను మీతో తీసుకెళ్లరూ?" అని అడిగేను.

"హో — హో! అబ్బే! స్త్రెపాన్ అంటే నువ్వు భయపడ నక్కర లేదు. నిన్న మొన్నటివరకూ యజమానులుండేవారు. తెల్ల జారు చక్రవర్తి వాళ్లకి సాయం చేస్తూండేవాడు. ఇప్పుడు జారు లేడు. యజమానులనందరనీ తుడిచి పారేశారు. మరిప్పుడు యజమానెవరు?" అంటూ దళం నాయకుడు నెగళ్లవైపు చూపించుతూ "వాళ్లు! మన దేశంలో వున్న యావన్మంది ప్రజలూ! నువ్వూ! నేనూ! ఎర్ర ప్రభుత్వం మనకి సాయం చేస్తూంది" అన్నాడు అతను.

దళం నాయకుడిదగ్గిరకి గెరిల్లాలు వచ్చేవాళ్లు వస్తున్నారు వెళ్లేవాళ్లు వెళ్లుతున్నారు. వాళ్లు చెప్పినది వింటూ వాళ్లకి ఉత్తరవులు యిస్తూనే నాతో మాట్లాడుతున్నాడు. అతను చెప్పినది విన్న తరువాత భూమందుల పెత్తనం పడిపోయిందనీ పేదప్రజకి తమ హక్కులని ఇవ్వమని గట్టిగా అడిగే సమయం వచ్చిందనీ నాకు అర్థం అయింది. అయినా చొల్‌దాక్-స్త్రెపాన్‌కి నాకూ వున్న సంబంధం గురించి మాత్రం నాకింకా అగమ్యగోచరంగానే వుంది. మళ్లీ మరొక మాటు అడిగేను అతన్ని:

"నన్ను మీతో తీసుకుపొండి. మా యజమాని అంటే నాకు భయం వేస్తూ౦ది."

"నువ్వేమీ భయపడ నక్కర లేదు" అని అంటూ చిన్న కాగితంమీద యేదో రాసి ఆ చీటీని నా కిచ్చి: "అతడు గనుక నిన్ను అడిగితే తన గుర్రాన్ని ష్చెతీన్‌కిన్ మనుషులు తీసుకున్నారని చెప్పి యీ చీటీని అతనికి చూపించు" అన్నాడు.

ఆ కాగితాన్ని రెండు చేతులతోనూ పట్టుకుని మధ్యకి మడతపెట్టి నా లాల్చీలో దాచేసుకున్నాను.

"మాదగ్గిరకి రావడానికి నువ్వే మీ తొందరపడకు. మేము చాలా దూర ప్రాంతాలకీ ప్రమాదమైన స్థలాలకీ వెళ్లుతున్నాం. అయితే యేమిలే! మనం మళ్లీ ఖేమ్-బెల్‌దీర్*లో కలుసుకుందాం" అన్నాడు తర్గా.

నన్ను తనదగ్గిరకి తీసుకుని తర్బగాన్ నన్ను యెంత ఆప్యాయంగా నా తలని నిమిరేవాడే అలాగే అంత ఆప్యాయంతోనూ నా తలని నిమిరేడు.

"నువ్వు బడిలో చేరు. చదువుకుంటే ఇప్పటికంటే మంచి తెలివైన వాడవు అవుతావు నువ్వు. ఖేమ్-బెల్‌దీర్‌కి వెళ్లు. అక్కడ నిన్ను మళ్లీ కలుసుకుంటానులే. యేం చేసేదీ అప్పుడు నిశ్చయిద్దాం" అన్నాడు అతడు.

ఆరాత్రి గెరిల్లాలతో సరదాగా కడుపునిండా భోజనం చేసిన తరువాత నెగడిదగ్గిర మూడంకె వేసుకుని పడుకుని నిద్రపోయాను.

---

* ఖేమ్-బెల్‌దీర్ ("నదీ సంగమము") కిజీల్ పట్నానికి పూర్వపు పేరు.

బ్యుగిలు వూదుతూంటే దాంతో నాకు తెలివొచ్చింది. గెరిల్లాలు లేచి తుపాకులను తీసుకుని ముందుకు సాగిపోవడానికి సిద్ధం అవుతున్నారు. రైఫిళ్ల పట్టీలని భుజంమీద వేలేసుకుని గుర్రాలమీద జీనులువేసి సామాను బళ్లని సిద్ధం చేస్తున్నారు. పరుగెత్తి వెళ్లిపోవడానికి ఆయత్తపడుతూ కాం(డిస్తూ ఊపిరి తీస్తూ డెక్కలతో నేల రాస్తూన్న నల్ల గుర్రంమీద యెక్కి వున్నాడు తర్గా.

నాయకుడు ఉత్తరవు యివ్వగానే గెరిల్లాలు ఒకరి తరువాత ఒకరు బిగ్గరగా చెప్పడం మొదలెట్టారు: "ఒకటి, రెండు, మూడు... నూట ఒకటి... రెండు వందల యేడు..."

దృఢమైన కంఠాలతో వీళ్లు చేస్తూన్న యీ బృందగీతంలోనుంచి నాకు పరిచితి అయిన నా స్నేహితుల గొంతుకలని పోల్చుకుంటూంటే నాకు ఎంతో హాయిగా వుంది. ఎర్రగెరిల్లాల అండదండలతో వీరు తమ స్వేచ్ఛని సంపాదించుకుని ఇప్పుడు మేము కూడా మా స్వేచ్ఛని సంపాదించడానికి శాయశక్తులా సాయపడుతున్నారు...

"గుర్రాల నెక్కండి!" అని మళ్లీ వుత్తరవు. దాంతో వందలాది మంది తమ గుర్రాలని అధిష్ఠించారు.

గ్నెద్కో ఒక్కటే రౌతులేకుండా అక్కడ నిలబడింది. దానిని కట్టి వున్న తాడుని నా చేతికి మెలి వేసుకుని దాన్ని తీసుకుని తర్గాదగ్గిర కెళ్లాను. తన నల్ల గుర్రంమీద కూచున్న వాడల్లా నావైపుకు తిరిగి:

"మాతో కూడా వద్దామనా నీ అభిప్రాయం? ఖేమ్-బెల్‌దీర్‌లో మనం మళ్లీ కలుసుకుందామని ఇందాకనే నీతో చెప్పానుగా" అని కేకేశాడు.

“గ్నెద్కోని... మీరు తీసుకోండి” అని తత్తర పాటుతో అన్నాను.

“అది వేరే సంగతి. పెత్రోవ్! ఈ గుర్రాన్ని తీసుకోవోయ్!.. సరే మరి. నీకు చాలా ధన్యవాదాలు. నమస్తే!” అన్నాడు.

వరుసలుతీర్చి నిలబడివున్న ఆ రౌతులని చూసి అతను:

“కుడి వైపునుంచి వరుసకి ముగ్గురేసి కలిసి మార్చ్!” అని ఉత్తరవు చేశాడు పాట పాడుతున్న స్వరంతో. దాంతోటల్లా ఆ గెరిల్లాదళం యేటి వొడ్డంటే కా-ఖెమ్ ఎదుటి ముఖంగా వెళ్లిపోయింది.

“పాడండోయ్!” అని కమాండర్ కేకేశాడు.

ట్రాన్స్-సయాన్స్క్ గెరిల్లా పాట ఒకటి ఎవరో షడ్జమంలో యెత్తుకున్నారు:

అడవికావల కాచె మండుటెండ.

నా గుండెలు ఝల్లుమన్నాయి. కడుపులో అదేదో బెంగ అనిపించి యేం తోచక యేడుపొచ్చినట్టు అయింది. నాతోటి కూలీలందరూ వెళ్లిపోతూంటే వాళ్లని వదిలిపెట్టి నేనొక్కడనే వెనక వుండిపోవడం నాకు మహాకష్టం అనిపించింది. వెదెనేయ్ సీదొరొవ్ తర్బగాన్ సాగిపోవడానికి సర్వసిద్ధంగా వున్నారు. వేర కూడా అప్పడే సామానుబండి ఒక దానిలో కూచుంది. బళ్లు బయలుదేరి పోయాయి. ఆమె నాకు నమస్తే చెప్పడానికని తన చేతిరుమాలిని వూపుతూంది. అది చూసి నేను చప్పన నా టోపీని తలమీదనుంచి తీసి నిరుత్సాహంతో:

“నమస్తే! వేర!” అని అన్నాను.

“మస్తే! మళ్లీ మనం కలుసుకుంటాంగా!” అంది వేర.

గుర్రాలు ఉత్సాహంగా ముందుకు సాగిపోయాయి. ఆ బండీ చుట్టూ ధూళిమేఘాలు లేచాయి. ఏరుదాటే చోటకి పరుగెత్తి కెళ్ళాను. కాని నేను అక్కడకి వెళ్లేసరికే వాళ్ళు ఏటి నడిమధ్యలో వున్నారు. బళ్ళు అన్నీ బల్ల కట్టుమీద వొత్తుగా కలగాపులగంగా గుమికూడి వున్నాయి. గుర్రపు రౌతులు ఈదుతూ యేటిని దాటుతున్నారు.

వాళ్లని చూస్తూ చాలాసేపు అలాగు అక్కడ నిలబడి పోయాను. నేనిందుకింకా పెద్దవాడిని అయూను కాను? నేనేం పాపం చేసుకు న్నానని? వెంటనే వాళ్లవెంబడి పరుగెత్తి వెళ్లడానికి నా కెందుకు ధైర్యంలేక పోయింది? ఆ ధైర్యంలేక పోవడాన్నే కదా నేనిలా కా-ఖెమ్ వొడ్డున వుండిపోవలసి వచ్చిందే. "ఛా! ఏమేనాసరే నేను వెనకబడి పోయేది లేదు! అమ్మదగ్గిర కెళ్లతాను. అమ్మ సరియైన సలహా చెబుతుంది" అనుకున్నాను.

అమ్మదగ్గిర కెళ్లి జరిగిన సంగతులన్నీ చెప్పాను అమ్మతో.

" నేను ముసలిదాన్ని అయిపోయాను. నీతో సమానంగా నేను అడుగులు వేయగలనా నాయనా? నువ్వూ పెద్దవాడవయావు. నా సలహా విను బాబూ! దళం నాయకుడు చెప్పినట్టూ ఖేమ్-బెల్‌దీర్‌కు వెళ్ళు. నీకు ప్రయాణానికి కావలసినదంతా నేను సిద్ధంచేస్తాను. నిన్ను అభిమానించి నీకు సాయంచేసి నిన్ను ముందుకు తీసుకొచ్చే వాళ్లు అక్కడ నీకు తప్పకుండా కనిపిస్తారు నాయనా!" అంది అమ్మ.

ఈ కులాక్ షాహుకారి బారినుండి తప్పించుకుని ఖేమ్-బెల్‌దీర్‌కు వెళ్లి చదువుకుని ఆ గెరిల్లా దళం నాయకుడిలాగు అవాలి నేను కూడా అన్న ఆలోచన ఒక్కటే నా మనస్సులో నిలిచిపోయింది.

ఏడవ ప్రకరణం

గెరిల్లాల నిష్క్రమణ

అది 1919 శరత్తు. అతి గడ్డు రోజులు అవి. మినుసీన్స్క్‌-ఉర్యన్‌ఖై ప్రాంతాల్లో కొల్చాక్* మనుషులతో కలిసి తిరుగుతూన్న బొలొగోవ్ ముఠాలవాళ్లూ ఇంకా ఇతర ముఠాలవాళ్లూ నిలదొక్కుకుని వున్న తెల్ల విప్లవశత్రువుల ముఖ్యకేంద్రాలని తుక్కు తుక్కుకింద రేగగొట్టేసిన తరువాత, ష్చెతీన్‌కిన్ నాయకత్వాన్నవున్న గెరిల్లాసైన్యం కొల్చాక్‌ని అణచి పారెయ్యాలనే లక్ష్యంతో, మధ్యరష్యానుంచి సైబీరియాలోకి విజృంభించుతూవున్న ప్రధాన ఎర్రసైనిక బలాలని కలుసుకునే ఉద్దేశంతో మినుసీన్స్క్‌ క్రస్నొయార్స్క్‌ పట్నాలని తిరిగీ చేరుకుందాం, అని వెనక్కి మళ్లేయి. దాంతో స్థానికంగా కోచెతొవ్ ప్లొబ్నికొవ్‌ల కింద వున్న గెరిల్లాలు ష్చెతీన్‌కిన్ సైన్యంతో వెళ్లిపోయారు. ఎర్రగెరిల్లా దళాలు అక్కడనుండి వెళ్లిపోవడం చూసి ఆ ప్రాంతాల రాజులు, కులాక్‌లు, లామామతగురువులు, షాహుకార్లు సంతోషంతో పొంగిపోయి కూలినాలి చేసుకుని బతుకుతూన్న

---

* కొల్చాక్ – జారుకింద యుద్ధనౌకాదళాలిని ఎడ్మిరల్‌గా (అత్యున్నత యుద్ధనౌకాదళాధికారి) పనిచేశాడు. సోవియట్ ప్రభుత్వానికి బద్ధశత్రువు. విదేశసైనిక దురాక్రమణ, అంతర్యుద్ధ కాలాల్లో (1918–1920), సైబీరియాలో సోవియట్ ప్రభుత్వంపై తిరుగబాటు చేసిన తెల్లవిప్లవ ప్రతీఘాతక సైన్యాలకు ఇతడు నాయకత్వం వహించాడు.

బీద బిక్కీ మీదా పల్లేటి గొడ్లకాపరిజనంమీదా రష్యను కూలీ బత్రాకుల మీదా ప్రతీకారచర్యలు ఆరంభించారు.

ష్చేతీన్‌కిన్ గెరిల్లా సైన్యం అక్కడ వున్నంత కాలం తెరెహోల్ జిల్లాలో దాగుకొని వుండిపోయిన షాహుకారు స్త్రఫానోవ్ మోతుబరిరైతు మెలేగిన్ నాయకత్వం కిందున్న ముఠాలు ఇప్పుడు కా-ఖెమ్ జిల్లాలోనూ సరీగ్-సెప్ సివార్లలోనూ విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలని నానా హింసలూ పెట్టడం మొదలెట్టారు. వాళ్లందరిలోనూ చొల్‌దాక్-స్తెపాన్ కొడుక్కి నెత్తురు దాహం మరీ మితిమీరిపోయింది.

కా-ఖెమ్ తీరం పొడుగునా కొత్త గెరిల్లా జట్లు జమ కూడడం మొదలైనా, అవి యింకా కార్యరంగంలోకి దిగలేదు.

తేర్‌జీగ్ చుట్టు పక్కలవున్న పేటలమీద పడ్డారు ఈ బందిపోటు దొంగలు. మన కోల్ సన్‌జా ఒక యూర్తలో వుండగా పట్టుకున్నారు అతన్ని యీ బందిపోటుదొంగలు. తర్బగాన్ వెదెనేయ్ సీదొరొవ్‌లు ఇంకా మిగిలిన కూలీలందరితోనూ కలిసి ఇతను కూడా సరీగ్-సెప్‌నుంచి వెళ్లిపోయిన తరువాత గెరిల్లా నాయకుల్లో ఒకడైన సెర్గేయ్ ప్లేబ్నికొవ్ కింద వేగులవాడుగా పనిచేస్తూండేవాడు.

స్థానికంగా వున్న మోతుబరి రైతులకింద అతను కూలీగా పనిచేస్తున్న కాలంలోనే ఖామందులంటే ఇతనికి పరమ అసహ్యమూ వాళ్ళ మంటాన్నూ. ప్లేబ్నికొవ్ కిందవున్న గెరిల్లాదళం కా-ఖెమ్ జిల్లాలో యుద్ధ చర్యలకి ఉపక్రమించినప్పుడు మొట్టమొదటగుండా దళంలో చేరిన తువా దేశస్థులలో ఇతనొకడు.

సన్‌జాని విప్లవద్రోహులు ఉస్త్-తెర్‌జీగ్ వున్న బొజురా అన్న చోటకి యీడ్చుకుపోయి అతనునిందు ప్రాణంతో వుండగానే పూడ్చి పాతిపెట్టేశారు.

నేనెప్పుడేనా సరీగ్-సెప్‌కి వెళ్లవలసి వచ్చినప్పుడు, లేకపోతే అన్న పెజెందేయ్‌ని అక్కలని చూడడానికి వెళ్ల వలసి వచ్చినప్పుడో తప్ప అమ్మని ఒక్కర్తెనే వదిలిపెట్టి వెళ్లడానికి నాకు భయంవేసేది.

ప్రజంతా భయభ్రాంతు లైపోవడంచేత కా-ఖెమ్ జిల్లాలో కొంత కాలంపాటు ఒక విధమైన నిశ్చల వాతావరణం యేర్పడిపోయింది. షెచ్తీన్‌కిన్ క్రిందనున్న గెరిల్లా సైన్యంనుంచి సెర్గేయ్ కోచెత్రావ్ తిరిగి వచ్చేసి అతని నాయకత్వాన తువాప్రాంతపు మధ్యపరగణాలలోనూ తూర్పుపరగణాలలోనూ వున్న స్థావరాలనుంచి కొత్త గెరిల్లాదళాలు కొన్ని ఖెమ్-బెల్‌దీర్‌లో తయారవుతూన్నట్టు వార్తలు వస్తూన్నాయి.

కాని మా ప్రాంతాల్లోనుంచి మాత్రం గెరిల్లాలు పూర్తిగా మాయం అయిపోయారు. 'ఇది మనకి బాగా లాభించింది మన కింతకంటే మంచి తరుణం దొరకదు' అని చొల్‌దాక్-స్త్రెపాన్ అనుకున్నాడు. ఒకనాడు రోజుకుంటూ రొప్పుకుంటూ చెమటతో తడిసిన జుట్టు కళ్లలో పడిపోతూ పరుగెత్తుకుంటూ అతను మా చూమ్‌కి వచ్చాడు. వెర్రికోపంతోవున్న మనిషి వూపిరి తిప్పుకోలేక గాండ్రించడం మొదలు పెట్టాడు:

"ఊ — ఊ — ఊ!" అంటూ.

కొంతసేపటికి కాస్త సర్దుకుని బొంగురు గొంతుకతో:

"లంజముండా! రావే యిలాగ! మీ గెరిల్లాలు ఇక్కడనుంచి ఉడాయించేశారు. చుట్టు పక్కల ఒక్క మనిషి లేకుండా పారిపోయారు యిక్కడ నుంచి. వాళ్లున్నన్నాళ్లు నీదే రాజ్యం అయింది. పట్టపగ్గాలు లేకుండా

నీదేస్వేచ్ఛ అంటూ నీ యిష్టం వచ్చినట్టూ తిరిగావు!" అంటూ గర్జించాడు.

మేం నిశ్శబ్దంగా కూచున్నాం. తన పొగగొట్టాన్ని నింపుకోవడంలోనే వుంది మా అమ్మ ధ్యానం అంతాను. పొయ్యిలోకి వంగి కాలుతూన్న బొగ్గను తీసి పొగాకుగుండతో వున్న పొగగొట్టపు భరణిలో వేసి పొగాకు అంటుకోకముందే నిప్పు యెక్కడ ఆరిపోతుందో అని భయపడేటట్టుగా చిన్న పీల్పు గబగబ పీల్చింది. పాలిపోయిన ఆమె దవడలు ఒక మాటు లొత్తలుపడుతూ మరొక మాటు పొంగుతూ కమ్మరవాని కొలిమితిత్తుల్లాగుంది. ధైర్యాన్ని చిక్కబట్టి యే మాత్రమూ ఉద్రేకపడకుండా:

"యేమిలా వచ్చారు దొరా?" అని అమ్మ అడిగిందతన్ని.

అమ్మ మాటలు వినగానే చొల్‌దాక్-స్తెపాన్ తుంటి మీద చేతులు పెట్టుకుని ఆ కోపంలోనే తెచ్చిపెట్టుకున్న నవ్వు నవ్వుతూ అడవిబాతు, తన ముక్కుతో పట్టుకున్న రెయ్యిని మింగడానికి మెడ వెనక్కి విసరినట్టు తన మెడని వెనక్కి విసరి:

"హో—హో—హో! యేమిలా వచ్చానని అడుగుతున్నావా! అయితే చెబుతున్నాను విను. నీ కుర్ర వెధవ యే రాచకార్యం వెలిగించడానికని పారిపోయాడే నా పనిలోనించి? నా సివ్కని ఎర్రగెరిల్లాల కెందుకిచ్చాడే? నేనెందుకొచ్చానో చెప్పాను కద! ఇహ బైటికి రా!" అని అరిచేడు.

మరొక్క గడియలో మునుపటిలాగు నన్ను జుట్టు పట్టుకుని బరబర బైటకి యెలాగు యీడ్చేవాడో అలాగు ఇప్పుడు కూడా అతడు నన్ను పట్టుకునే వాడే. కాని నేను చూమ్‌లోనుంచి బైటకొచ్చే సరికి బొజ్జ ఆడించుకుంటూ

నావెంటొచ్చాడు. తన బూడ్సు అంచులోనుంచి కొరడా తీసి రోడ్డువైపు చూపించాడు కొరడాతో. నేను కదల్లేదు.

నాకు పాఠం చెప్పడానికని కొరడా యెత్తాడు. ఇంతట్లోకి అమ్మ పరుగెత్తుకుంటూ మా యిద్దరి మధ్య వచ్చి యజమాని చెయ్యిపట్టుకుని రష్యను భాషలో:

“అంత పాపానికి వొడిగట్టుకోకు! అంత పాపానికి వొడిగట్టుకోకు!” అంటూ మొర్రపెట్టింది.

దాంతో యజమాని ఉగ్రుడైపోయి కేకలూ బొబ్బలూ పెడుతూ అమ్మని నానా బండ బూతులు తిట్టడం మొదలుపెట్టాడు.

ఆ తిట్లని విని అమ్మ మరి కోపాన్ని ఆపుకోలేక అతని ముఖంమీద ఉమ్మేసింది. అక్కడ యెవరైనా దగ్గరగా వున్నారేమో అని నేను వెనక్కి తిరిగి చూసి అమ్మదగ్గిరకి ఒక అడుగు వేశాను. అమ్మ యేం చేస్తూన్నట్టు? మోకాళ్లమీద మోకరించి నిలబడిందా? కాదు కాదు. నేలమీద చతికిలబడి యేదో పురాణంలో కథ చెబుతూన్నట్టు అటూ యిటూ వూగుతూంది. తలమీదనుంచి రక్తం ధారకట్టి కారుతూంది. వెనకకు తిరిగిపోయి చొల్దాక్-స్తెపాన్ తన కొరడా పిడిని తుడిచేసుకుంటున్నాడు.

నేను ఒక బండరాతిని చేత బుచ్చుకుని యజమాని మీదమీదకి వెళ్లడం చూసి అమ్మ:

“అతన్ని యేమీ చెయ్యకు! ఇక మన జోలికి రాడులే అతడు”అని బిగ్గరగా అంది.

మరునాడు ఇదామ్ స్యుర్యున్ చోబుదార్లు నన్ను తీసుకుపోవడానికొచ్చారు. మరొకమాటు కనక నేను యజమానిని నిర్లక్ష్యం చేసి అతని యెడల

అవిధేయతగా ప్రవర్తించానంటే "నవచిత్రహింసలు" చట్టం ప్రకారం అమ్మని కూడా శిక్షిస్తామని ఆమెని బెదరించారు.

"అమ్మా! నేను వెళ్ళొస్తాను. నేను వెళ్లి చూస్తాను..."అన్నాను.

నేను వెళ్లిపోయేముందు:

"మంచిది నాయనా. వెళ్లి చూడు. పేదలని రక్షించడానికి కొత్త పద్ధతులని చేస్తూన్న వాళ్లెవరో తెలుసుకుని వాళ్లదగ్గిరికెళ్లు" అంది అమ్మ.

ఎనిమిదవ ప్రకరణం

రాజుగారి ప్రాసాదంలో

ఆ రౌతులు నన్ను చొల్‌దాక్-స్తెపాన్‌దగ్గిరకి తీసుకువెళ్లకుండా రాజుగారిదగ్గిరకి తీసుకెళ్లారు. దారి పొడుగున వాళ్ళు గుర్రాలమీదెక్కి సవారీచేస్తూ నన్ను వాళ్ల ముందు పరుగెత్తమన్నారు. చబుకులని పేలిస్తూ గుర్రాలని కదంతొక్కిస్తూవాళ్ల ముందు పరుగెత్తుతూన్న నన్ను వాళ్లతో సరిగా పరుగెత్తమని సోమరిపోతు గుర్రాన్ని తోలుతున్నట్టు నన్ను బిగ్గరగా హెచ్చరిస్తూండేవారు.

మా చూమ్‌నుంచి రాజుగారి మకాంవరకూ అట్టే దూరంలేదు. కాని నాకు మాత్రం ఆ కాస్త దూరమూ అనంతం అనిపించింది. కుక్కలని వుసికొల్పిన కుందేటి పిల్లలాగు వాళ్లు నన్ను పరుగెత్తించి తొందరపెడుతూ "సూర్యుని కుమారుడైన మహారాజుగారి" గొప్ప యూర్తదగ్గిరకి నన్ను తీసుకెళుతూన్నప్పుడు నేను అనేకవిధాల ఆలోచించుకున్నాను.

విషగంధిచెట్లతో కప్పుకుపోయిన యీ దారమ్మటే ఎన్నో సంవత్సరాల క్రిందట సంజాయిషీ యివ్వమని అమ్మనీ అల్‌బంచీనీ యీడ్చుకుపోయారు. అప్పుడు వాళ్ల కళ్లనుంచి కార్చినకన్నీరే యీ ప్రాడుగా మారిపోయి దారి అంచులని మెఃలుస్తూన్న గడ్డి దుబ్బులకి యీనాటివరకూ కూడా అంటుకు పోయివుందేమో? రాజుగారి మకాంలో వాళ్లిద్దరినీ కొరడాలతో బాదగా దెబ్బలుతిని యింట్లో పిల్లలంమేం యేమై పోతున్నామో అన్న బెంగతో మాకోసం రక్తాలు కారుతూన్న దెబ్బలతోనే యింటికి పరిగెత్తుతూ వస్తూండగా రక్త పుచుక్కలు ఆకులమీద కారి ఆ రక్తాన్ని గడ్డిచెట్లు పీల్చడంచేతనే అవి యిప్పుడు ఇలాగు ఎర్ర బడిపోయాయేమో? కాదు కాదు. అది జరిగిన తరువాత ఎన్ని శీతకాలల్లో మంచు పడిందో! ఎన్ని వసంతకాలపు హిమజలాలు భూమినంతని శుభ్రంగా కడిగేశాయి కావు! అయితే నేమి? ఇన్ని సంవత్సరాలు గడిచినా తాన్-బష్త్రీగ్ అల్బన్‌చీలాంటి ప్రజలు యీనాటికి కూడా చిత్రహింసలపాలు అవుతున్నారు. వీళ్లపగ యెవరు తీరుస్తారు?

కొరడా దెబ్బలని తప్పించుకుంటూ ప్రజల మనుగడల గురించి ఆలో చించుకుంటూ నేను ఆ దారంట పరుగెత్తాను. గెరిల్లాల మకాంలో ఆ వేళ రాత్రి ఆ నెగళ్లు యెంత కాంతివంతంగా వున్నాయి! వాళ్ల హృద యాలు యెంత ఉత్సాహంగా వున్నాయి! ఇప్పుడు "సూర్యుని మారుడైన ఈ రాజుగారి" మకాం చేరేటప్పటికి చీకటి పడుతూ అంధ కారంగా భీతావహంగా వుంది.

రాజుగారి మకాంలో అంతా నల్ల యుర్తలు ఇరవై యున్నాయి. వాటి మధ్య రాజుగారి తెల్ల యుర్త కోట బురుజులా వుంది. దాని పక్కనే రాజుగారు కచేరి చేసే యుర్త మరొకటి వుంది. తర్బగాన్ చెప్పిన

కథలోలాగు ఆ యుర్తలు రెండూ తెల్లగా మెరిసి పోతున్నాయి. నన్ను పట్టుకుని తీసుకొచ్చిన ఇద్దరు రౌతులకీ రాజుగారి పరివారంలో యేమి హోదావుందో నాకు తెలియదు. కాని జీనుమీద వాళ్ళు కూచున్న తీరుని పట్టి అడ్జుటెంట్ అయివుండాలి లేకపోతే న్యాయమూర్తి అయివుండాలి. కాని తెల్ల యుర్త సమీపించేసరికి వాళ్ల అహంకారం అంతా మటుమాయమైపోయింది. వాళ్ల ముఖాల్లో ఇదివరకున్న గర్వమూ క్రౌర్యమూ పోయి, వాటి స్థానే నమ్రత భయమూ కనపడ్డాయి.

అదెలాగున్నా గుర్రాన్ని దిగినతర్వాత అందులో ఒకడు నన్ను ఉద్దేశించి:

“ఒరేయ్ దున్నపోతా! నీ జాతకం నిన్ను యెక్కడకి తీసుకొచ్చిందో నీకేమేనా జ్ఞానం వుందా? సాక్షాత్తూ సూర్యుని కుమారులైన సల్‌చాక్ మహారాజులుంగారి దివ్యప్రాసాదానికి వచ్చావు అన్న సంగతి తెల్సుకో. ధర్మానికి కట్టుబడి యెలా వుండాల్సిందీ మహారాజులుంగారు నీమీద కటాక్షం వహించి నీకు ప్రసాదించినటువంటి యజమాని యడల భయభక్తులతో యెలాగు మెలగాలో నీకిప్పుడు తెలియజెప్తారు. నీ ఆత్మని ఉప్పు తీసుకురావడానికి పంపించకుండా* నిన్ను గొలుసులతో కట్టిపడేసి ఈ దర్జాపురుషుల్లాగు నిన్నూ నీనెత్తి మీద వున్న నల్లని ఆకాశాన్ని చూస్తూ ధ్యానం చేసుకోవడానికి ఆ న్యాయమూర్తులు నీ మీద దయతలచి నీకు అవకాశం యిచ్చినట్టాయనా నీ యావజ్జీవం నువ్వు వారికి కృతజ్ఞుడవై యుండవలసినదే! తెలిసిందా?”

---

* తువా భాషలో ‘ఉప్పు తీసుకురావడానికి వెళ్లడం’ అంటే చచ్చిపోవడం అని అర్థం.

అని అంటూ ఆ తెల్ల యుార్త్రదగ్గిర చిత్రహింసకులోనై యాతన పడుతూ కాళ్లకీ చేతులకీ సంకెలతో పడివున్న వాళ్లని నాకు చూపెట్టారు.

రాజుగారి మకాంలో నన్నొక దుక్కకి గొలుసులుతో కట్టేసి మోకాళ్ల మీద నిలబెట్టించగా సూర్యుడు మూడుసార్లు ఉదయించడం రెండుసార్లు ఆకాశం యీ చివరనుంచి ఆ చివరవరకు వెళ్లడం చూశాను. నా కన్నతల్లి తాన్-బష్త్రగ్ నా ముద్దులతోబుట్టువు అల్బన్‌చీ సరిగ్గా యీ స్థితిలోనే తూర్పునలేస్తూన్న సూర్యుడిని దర్శనం చేసుకుని పశ్చిమాద్రిని దిగిపోతూన్న సూర్యుడిదగ్గిర సెలవు పుచ్చుకొనేవారు. ఇంటిదగ్గిర దిగవిడచిన మాగతి యేమైపోతూందో అన్న బెంగతో కొట్టాడుకుంటూన్న గుండెల చప్పుదును లెక్కించుకుంటూ సూర్యుడివైపు చూస్తూ రాజుగారి ఉద్యోగులు పెడుతూన్న నవ చిత్రహింసలకి భరించరాని బాధలు అనుభవిస్తూ వుండేవారు.

నన్ను సంజాయిషీ అడిగే రోజు వచ్చింది. నా రెక్కలని విరిచి కట్టేసి యుార్త ద్వారందగ్గిర నన్ను నిలబెట్టారు. రాజుగారి ఉద్యోగి ఒకడు నా మీద పహరా కాస్తూ నిలబడ్డాడు.

ఆ ఉద్యోగి జల్తారు అంచు ఎర్రని పట్టు అంగీ తొడుక్కుని కొసని గాజుగుబ్బా నెమిలి కన్నూవున్న సూదిమొన టోపీని పెట్టుకున్నాడు. తనదగ్గిర వున్న పొడుముడబ్బితో ఆడుతూ తరుచు డబ్బీ మూతతీసి చిట్టాతో పొడుం తీసి అరచేతిలో వేసుకుని అరచేతిని ముక్కుకిందకి తెచ్చి ముక్కు చెరమలన్నీ ఉబ్బించి పొడుముని పీల్చేవాడు. తరువాత కీచుగా తుమ్మి పొగాకుని పొయ్యిగూడు అంచుమీద 'థూ' అని ఊసేవాడు.

"ఒరేయ్ పరారి లంజకొడకా! మహనీయులైన శ్రీశ్రీశ్రీ మహారాజులుం గారునీ యజమానిగారిని 'తమ్ముడా' అని పిలుస్తారు. అటువంటి యజ్ఞ

మానిగారి దగ్గిరనుంచి నువ్వు యే కారణంచేత పారిపోయావు? వారి గుర్రాన్ని నువ్వు ఎర్రరష్యనులకి యెందు కిచ్చావు?'' అని అడిగేడు.

వెనక్కి విరిచి కట్టిన నా చేతులని మణికట్లదగ్గిర నులుముతూ వాచి పోయివున్న నా వేళ్లని యిటూ అటూ తిప్పుతూవున్న ఆ ఉద్యోగివైపు చూస్తూ నేనేమీ ప్రత్యుత్తరం చెప్పక మాట్లాడక వూరుకున్నాను.

ఆ ఉద్యోగి మళ్లీ మరొక మాటు తుమ్మి పొడుము డబ్బీని వేళ్లతో తట్టేడు. ఆ తుమ్ముల వర్షం వెలిశాక గుడ్లు తిప్పుకుంటూ అపశకునపు గొంతుకతో దీర్ఘాలు తీసుకుంటూ:

''నవశాస్త్రాలూ అధ్యయనంచేసి నువ్వు మాట్లాడ్డం నేర్చుకున్నావు. నీనోరిప్పుడు యెందుకు పెగల్డంలేదో నాకు తెలుసును. నీ బుగ్గలని షోగాయ్ దువ్వలేదు. నీ వొంటిని బిర్చిబెత్తాలు ముద్దు పెట్టుకోలేదు. అవి త్వరలోనే నిన్ను ముద్దులాడుతాయిలే, తొందరపడకు'' అన్నాడు.

వెధవ ఉద్యోగి! తాష్-చలాన్‌కంటె చండాలపు వెధవ. తాష్-చలాన్ మేకమాంసపు ముక్క చూపించి మాతో చలగాటం ఆడేవాడు. నిండు ప్రాణాలతో వున్న మనిషినే చర్మం వొలిచేస్తానంటున్నాడు వీడు. ఎన్నటికీ వీడికి జబాబు చెప్ప దల్చుకోలేదు నేను. అయినా అప్రయత్నంగా నానాలుక దానంతట అదే నామటుకు నాకే కొత్త అనిపించిన గొంతుకతో మాట్లాడింది:

''నన్ను కొట్టేవంటే ఖబడ్దార్! నేనేం తప్పు చేయలేదు. నేను మా అమ్మదగ్గిరకి వెళ్లిపోయాను. ఖేమ్-బెల్‌దీర్‌కి వెళ్లి నాకు అక్కడ చదువు కోవాలని వుంది. నా దగ్గిరనుంచి గెరిల్లాలు ఆ గుర్రాన్ని తీసుకున్నారు'' అన్నాను.

"అవును అవును! నువ్వేమీ తప్పు చెయ్యలేదు పాపం! నువ్వు చేసిన దల్లా రాజుగారికి ఆగ్రహం కలిగించడమూ పద్ధతిని కాలపెట్టి రాసేయడమున్నూ! నీ యజమానిదగ్గిరకే నువ్వు మళ్లీ వెళ్లిపోవాలి తెలిసిందా! వెళ్లిపోయి గుర్రంఖరీదు ముదరా ఇచ్చుకోవడానికి బతికున్నంత కాలం నువ్వు ఆయనకింద చాకిరీ చెయ్యాలి తెలిసిందా! చదువుకోవాలని వుందేం నీకు? మేము చదువు చెబుతాంలే నీకు. కాస్త ఓపిక పట్టివుండు. మేము చదువు చెబుతాంలే నీకు" అన్నాడు.

చిత్రహింస చేసేవాళ్లిద్దరు నన్ను జుట్టు పట్టుకునిలాగి నా తలకాయని వాళ్ల మోకాళ్లమీద వంచి పెట్టారు. ఒకడిదగ్గిర ఇసుకతో నింపిన తోలుసంచులున్నాయి — భారంగా ఖామందు పిడికెళ్లలాగు కాలసర్పం నాలికలాగు. ఇవి షగాయ్‌లు. మరొక్క నిమిషంలో నా దవడలని చరుస్తాయి. కళ్లని గట్టిగా మూసేసుకున్నాను.

"ఒకటి! రెండు! మూడు! నాలుగు!.."

నా కుడి దౌడ మండి పోతూంది. దౌడపళ్లు అన్నీ ఒక్కసారే పీకేసినట్టు సలుపుతూంది. వాళ్ల మోకాళ్ల మీదనూ వున్న ముఖాన్ని రెండో దవడ వైపు తిప్పమని చిత్రహింస చేసేవాళ్లని ఆజ్ఞాపించాడు ఆ ఉద్యోగి. ఈ దవడమీద పదిసార్లు కొట్ట మన్నాడు.

"ఒకటి!..రెండు!.."

ఆ నాఖర్లు నా తలకాయని యెత్తారు. కాని ఆ ఉద్యోగి ఉత్తరవుని యెదురు చూస్తూ నా తలని జుట్టు పట్టుకుని పైకి యెత్తి అలాగే వుంచారు.

"ఇప్పుడెక్కడికి వెళ్లతావురా?" అని ఆ ఉద్యోగి. అడిగేడు నన్ను.

నా దవడలు రెండూ మండి పోతున్నాయి. కాని నా హృదయం అంతకంటే మరింత భయంకరంగా మండి పోతూంది. ఈ మాటు నా నాలుకని అదుపాజ్ఞల్లోనే వుంచుకుని ఆ ఉద్యోగికి నేనే బదులు చెప్పడానికి నిశ్చయించుకుని:

"నేను గెరిల్లాలదగ్గిరకి వెళ్లి తీరుతాను!" అని బిగ్గరగా కేకవేశాను.

ఉద్యోగి సంజ్ఞ చేయగానే నా వంటిమీద వున్న గుడ్డలని పీకిపారేసి నన్ను నేలమీద బోర్లాపడేసి నా ముఖాన్ని నేలకి వేసినొక్కి పట్టుకున్నారు. రెండవ శాస్త్రం అధ్యయనం అయిపోయి, మూడవ శాస్త్రం నేర్పడం మొదలుపెట్టారు. ఈ పాఠాన్ని 'మన్‌జా'తో చెబుతారు. చెయ్యాంత పొడవు, అరచేతి వెడల్పు, వేలంత దళసరి వుండే బల్లచెక్క అది. ఉన్నిని బాగు చేసినప్పుడు కాని గోధుమలని నూర్చినప్పుడు కాని కొడతారే అలాగు దాంతో ఒకసారి కుడిపక్కని ఒకసారి ఎడమ పక్కని అలాగు ఇటు అటు బాదడం.

నాకు స్పృహ తప్పిపోయింది. నాకు తెలివి వచ్చేటప్పటికల్లా నామీద యెవరో చన్నీళ్లు దిమ్మరిస్తూ కేకలు పెడుతున్నారు:

"నువ్వు యెక్కడికెళ్లాలో నీకిప్పటికైనా తెలిసిందా?"

నేను మాట్లాడ దల్చుకోలేదు. మాట్లాడానికి శక్తీ లేకపోయింది. ఆ చండాలపు గొంతుక నా చెవిలో అలాగు గింగురుమని వాగుతూనే వుంది:

"మళ్లీ మరొకసారి కాని నీ యజమానిని ధిక్కరించితివా నీ వేళ్లని పటకార్లతో పిండేస్తాము. అది చాలా హాయిగా వుంటుంది. వేలి గోళ్లలో ముళ్లు దిగగొడతాం. అది మరీ హాయిగా వుంటుంది. సూదుల్లాంటి రాళ్లమీద నిన్ను మోకాళ్లమీద నిలబెడతాం. నీకెంతో సౌఖ్యంగానూ సరదాగానూ

వుంటుంది. నీ గెరిల్లాలని నువ్వు బాగా చూడగలిగేటట్టు నీ కళ్లనిండా సన్నని తల వెంౖడుకలని పోస్తాము. నీ కాళ్లని చెట్టుకు కట్టి వేలాడదీసి నీ యెముకలని కుక్కలు కడుపునిండా తిని ఆనందించేందుకు అడుగున మంట చేసి నిన్ను పొగపెట్టి మాడుస్తాము'' అన్నాడు.

మంచూరియా ఖానులనుంచి వారసత్వంగా తువా రాజులకి దఖలు పడ్డయీ నవచిౖతహింసల వివరాలని నాకు జ్ఞప్తికి తెచ్చేందుకు పైమాటలతో ఆ జాబితాని పూర్తిచేసి ఆ ఉద్యోగి:

''చేతుల కట్లు విప్పేసి ఆ నల్ల యుార్తలో* పారేయిండి వీడిని. తడి వొళ్ళు యెండినాక వాడి యజమానిదగ్గిరకి తీసుకెళ్లి ఆయనకి క్షమాపణలు మనవిచేసి త్వరలోనే మన వాడిని దారిలోకి తీసుకొస్తామని చెప్పండి. మళ్లీ యేదైనా జరిగిందంటే మనకి ఫిర్యాదు చెయ్యమనండి'' అని వాళ్లకి తాఖీ దిచ్చాడు.

నల్ల యుార్తలో అలా నేను పడివుండగా ౖపజగురించి మళ్లీ ఆలోచించాను. ౖపజల్లో ఆచారవ్యవహార భేదాలుండడంవల్లనే ఒకరి నొకరు అర్థం చేసుకోలేక పోవడానికి కారణం అని, ఇదివరకు అభిౖపాయపడేవాడిని. చొల్‌దాక్-స్త్రైపాన్ మాటే తీసుకుందాం. నామీద అతనికి ద్వేషము. నన్ను ఒక గడ్డి పోచకింద చూసేవాడు. అటువంటిది నన్నూ ఒక మనిషి ౖకిందే చూసేవాడు ఆ తువా ఖామందు. నాకు వయస్సు వస్తూన్నకొద్దీ యీ వుద్దేశాలన్నీ చాలా కాలంకిందటే తల్లకిందులై పోయాయి. చొల్‌దాక్-స్త్రైపాన్ కింద నౌకరీ చేస్తున్న పాలేళ్లలో కొందరూ తూవవాళ్లూ ఉండే

---

* ఇక్కడ 'నల్ల యుార్త' అంటే ఖైదు అని. అర్థం.

వారు, కొందరు రష్యనులూ వుండేవారు. అయినా నాకు అందరితోనూ స్నేహం అయిపోయింది. తర్బగాన్...! వేర...! గెరిల్లా ధీరులతో కలిసి మెలసి వాళ్లెంతో హాయిగా వున్నారు. ఎంత మంచివాడు వాళ్ల నాయకుడు! మనం త్వరలోనే ఖేమ్-బెల్‌దీర్‌లో కలుసుకుందాం అని ఖరారు చేశాడు కుడాను! అలాంటిది — మహారాజులుంగారైన ఇదామ్ స్యుర్యూన్‌గారి మాటేమిటి? మరి ఆయన ఉద్యోగులో? వీళ్లందరూ చౌల్‌దాక్-స్త్రెపాన్‌తో బుజాలుబుజాలు రాసుకుంటూ దనీల్కా రోష్చిన్, సెర్గేయ్ సాన్నికొవ్, వెదెనేయ్ సీదొరొవ్, తర్బగాన్, తొంబష్త్రొయ్‌లాంటి పేదవాళ్లని ద్వేషిస్తూ నానా చిత్రహింసలు పెడుతున్నారే!

కొన్ని రోజులైయాక రాజుగారి మకాముకు నన్నెలాగైతే లాక్కొచ్చారో అదే విధంగా నన్ను మళ్లీ నా యజమాని యింటికి తీసుకెళ్లారు.

తొమ్మిదవ ప్రకరణం

అమ్మా! సెలవు!

మళ్లీ మరొకసారి మోతుబరిరైతు చేతులో పడ్డాను. మా గోతి ఇంట్లోకి పరుగెత్తుకుని రావడానికి యీ మాటు వేర లేదక్కడ. కథలు చెప్పడానికి తర్బగాన్ లేడు. ఇప్పుడు చౌల్‌దాక్-స్త్రెపాన్ కొత్త కూలివాళ్లని పెట్టుకున్నాడు.

శీతకాలం వొచ్చింది. శీతకాలంలో ఒకనాడు ఘోరమైన ఖబురు అందింది: మా అమ్మ తాస్-బష్త్రగ్ చనిపోయిందని.

యజమానిదగ్గిరకి పరుగెత్తుకుని వెళ్లి యీ ఖబురు చెప్పి నన్ను ఇంటికి వెళ్లనివ్వమన్నాను.

గడ్డాన్ని వేళ్లతో దువ్వుకుంటూ కోరచూపులతో నావైపు చూస్తూ:

"నువ్వు చచ్చినప్పుడు నిన్ను వెళ్లనిస్తాను. గడ్డి తోలుకు రావాలె, గోధుమలిని నూర్చాలె, గుర్రాలకి నీళ్లు పెట్టాలె, ఆవులని మందనుండి తోలుకు రావాలె. ఈ పనులన్నీ యెవడు చేస్తాడనుకున్నావు?" అన్నాడు.

"ఆలస్యం చెయ్యక త్వరగానే వచ్చేస్తాను" అన్నాను నేను.

"ఆలస్యంగా వస్తావో త్వరగా వస్తావో మొత్తంమీద నువ్వువుత్త దండగమారి వెధవ్వి దొరికేవు. ఇన్ని రోజులూ కావలసిన స్వేచ్ఛ అంతా అనుభవించావు చాలు!" అంటూ యేమైనాసరే సెలవివ్వను పొమ్మన్నాడు.

మిగతా కూలివాళ్లతో మాట్లాడి వాళ్ల సలహా ప్రకారం రాత్రిపూట రహస్యంగా పారిపోయాను.

ఒక్క తడిచుక్కైనా మిగలకుండా గాలిలో వున్న చెమ్మని అంతా శీత గాలి ఆర్చేసింది. నేలమీద వున్న ప్రతీ వస్తువూ ముళ్లల్లా గుచ్చుకొని కత్తుల్లా కోసేస్తూంది.

ఆకాశాన చంద్రుడు లేడు. నా చుట్టూర భూమినుంచి నల్లగా నక్ష త్రాల సముద్రంలా వున్న ఆకాశంవరకూ యెక్కడ చూసినా భూమి, కొం డలు, పర్వతశిఖరాలు అన్నీ ఆ నీలిరంగు మంచులో లీలగా మెరుస్తున్నాయి. గడ్డమంచుతో ఘనీభవించి మంచుతో మంత్రించిన రాజ్యంలో గస్తీలు తిరుగుతూ స్తెప్మైదానాల్లో యీ మూలనుంచి ఆ మూలవరకూ స్వైర విహారాలు చేస్తూ కబళించబోయే జంతువను తప్పించుకోడానికి వీలులేకుండా మారుమూలలను ఇరికించి పళ్లుకొరుకుతూన్న తోడేళ్లు కొండ అవతల ఒక

దాన్నొకటి కూతపెట్టి పిల్చుకుంటున్నాయి. కాని వీటి గురించి నేను అనుకోవడమే లేదు.

"అమ్మా! సెలవిప్పించు నాకు. ఎంత దుఃఖభాజనమై పోయిందమ్మా నీ బతుకు!"

అమ్మ యెంత దివ్యమైన మనిషో అప్పట్లో నేను తెలుసుకో లేకపోయాను. తాన్-బఖ్తాగ్ నిజమైన వీరవనిత అనీ విముక్తిపొందిన ప్రజానీకంచేత చిరస్మరణీయులని ఎంచబడే అనేకమంది పేదస్త్రీలల్లో ఈమెకూడా ఒక్కర్తె అనీ ఆరోజుల్లో మేమెవ్వరం గ్రహించలేకపోయాం. వాళ్ల పిల్లల జీవితాలని భవిష్యత్తుని ధైర్యస్థైర్యాలతో వాళ్లు కాపాడేరు. తమది యెంత నికృష్టపు బతుకైనప్పటికీ ప్రజాబలంమీద వాళ్లకున్న దృఢమైన నమ్మకం రవంతైనా కూడా మొక్కపోలేదు. మన శత్రువులని ఎలా ఏవగించుకోవాలో, తరతరాలనాటి నుండీ పడుతున్న బాధల నుంచి పేదకూలిప్రజను విముక్తి పొందేటటందుకు సాయపడడానికి వచ్చిన స్నేహితులని ఎలా ప్రేమించాలో వాళ్లు మనకి నేర్పేరు.

కొంతసేపటికి నేను పుట్టిన చూమ్ నా కళ్లపడింది. ఆ గుడిసెనుంచి మా మేర్గెన్ వాద్దకు నన్ను అమ్మ యెత్తుకుని తీసుకెళ్లితే మేర్గెన్‌ని చూసి ముచ్చటపడేవాడిని. మా పూరిగుడిసె గోడలు మునపటికంటె మరీ శిథిలమై పోయివున్నాయి. పొయిలో మండుతూన్న నిప్పు గోడసందుల్లోంచి కనిపిస్తూంది.

కంగీయ్ గుమ్మందగ్గిర నిలబడి వుంది. నన్ను చూసి కోటు చేతుల్లో ముఖంపెట్టుకుని:

"అమ్మ మన దగ్గిరనుంచి వెళ్లిపోయింది" అని భోరుమని యేడ్చింది.

మా చూమ్‌లో మేము వుండడం అదే ఆఖరురోజు. ఆ రోజంతా అమ్మ దగ్గిరనుంచి సెలవు తీసుకుంటూ గడిచిపోయింది. మంచుతుపాను వచ్చి అంతటినీ తుడిచిపెట్టేసినట్టు వెనకటి సంగతులన్నీ జ్ఞాపకొచ్చి కళ్ళ చీకట్లు కమ్ముకుపోయాయి. గొంతుకలో మాటలు గొంతుకలోనే అడ్డుపడి పోయాయి.

అమ్మని పడుకోపెట్టిన మూల మేకతోలుతో అడ్డుగా పరదా కట్టేము. మా అన్నయ్యలూ అక్కయ్యలూ అమ్మకు వీడ్కోలు ఇవ్వడానికి అంత్యక్రియలకి వంట వండుతున్నారు.

మా జిల్లాలో బోలెడుమంది మతగురువులున్నారు. ఎవడిని వేటాడు కుని తిందామా అని తోడేళ్లలాగు యూర్తల చుట్టూ సంచారం చేస్తూం డేవారు. అటువంటిది పేదరికంతో బాధపడిన మా అమ్మ పూరిగుడిసెలో వాళ్లలో ఒకడైనా కాలుపెట్ట లేదు.

పొయ్యి వెనకతట్టున గౌరవస్థానంలో భేతాళవైద్యుడు పురోహితుడు అయిన స్యుజూక్-ఖమ్ కూచున్నాడు.

అతడు కూచున్న చోటనుంచి లేచి కళ్ళు మూసుకుని డప్పువాయించ డం మొదలెట్టాడు. అతని అంగీని వేలాడుతూన్న రాగిగాజుల గలగలశబ్దం అతని కంఠస్వరంలో కలిసిపోతూంది:

నల్లనీ మేఘాల ఆకాశాన — ఎగిరి పోతూండా నేను
నల్ల బూతామే సెప్తుతూంది — ఎగురుతూ నా సెవిలో,
"రాగి డబ్బే ఇస్తివా — నరకకూపాన నెట్టుతా
"బంగారు మాడనే ఇస్తివా — స్వర్గానికే దారితీస్తా."

మరి నా చేతులార కూకుండబెడుతా — నిన్నే స్వర్గాన.
"బలిపెట్టినా నీ మేకపోతూ — సేరింది బూతాల కాడ."
మరి సెప్పింది పిశాచమే నాతోన — స్వర్గాని కెళితేను
ఆడ నీకూ సల్లంగనుండాలనీ — కోరితే నీవు
దానమేసేసేయి మేకపిల్లలని — పుణ్యాత్ములుండారు.
మనసుండి నాకే ఇస్తివా సరే — నేవద్దనా బోను
మొలనున్న నీకత్తులూ — తెచ్చేను గండాలు నీకు.
మనసుండి నాకే ఇస్తివా సరే — నేవద్ద నా బోను.
మేఘాలు ఎగిరిపోతుండాయి — కిందకీ దిగుతుండా నేను.
పొగసుట్టలూ నాకియ్యి — మూరేడు బారేడు ఘాటైన పొగసుట్ట
ముంత నిండంగనింపు — నీటితోగాదు పిచ్చోడ!
బూతానికీ గావాలె — అచ్చమైనా 'ఆరక' సారాయి,
మనసుండి నాకే ఇస్తివాసరే — నేవద్ద నా బోను.

పురోహితుడు స్యూజాక్-ఖమ్ కర్మ మంత్రాలు చదవడం అయిపోయింది. మేకనిబలివేసి వండిన మేకమాంసాన్ని అందరం తినడం అయింది. ఖామందుల నుంచి మామూలుకంటె మూడింతలు హెచ్చుధర ఇచ్చి కొన్న ఆరక కల్లును సేవించడం అయింది.

మా కెవ్వరకీ పట్టు కడక్* లేదు. మాకు పట్టు ఉత్తరీయాలుకు డానా! అందుకు బదులు మా లాల్చీలనే పేలికలకింద చింపి వాటిని అమ్మ

* వెడల్పయిన చవకరకపు చైనా పట్టురుమాలు.

మీద కప్పి తాళ్లతో కట్టేం. పెళుసుగా వున్న ఆ మంచుమీద నడుస్తూ అమ్మ శవాన్ని మోసి ఒక కొండమీదకి తీసుకెళ్లి అక్కడ భూస్థాపితంచేసి అందుమీద బండరాళ్లతోకప్పేం. తెల్లవారిన తరువాత తెల్లని తొలికిరణాలు తొలుత అక్కడ కనిపించాయి. పొడుగాటి కొయ్యలకి కట్టిన తెల్లటి ముదుక నూలు గుడ్డపేలికలు ఆ అరుణ కిరణాలకాంతుల్లో పసిడి పతాకాల్లాగు కానొచ్చాయి. మా అమ్మ కడసారి విశ్రాంతి స్థలాన్ని రెపరెపలాడుతూ యెగు రుతూన్న ఆ పతాకాలే కావలికాస్తూ రక్షించాలి!

ప ద వ ప్ర క ర ణ ం

ధ్యేయానికి పురోగమనం

మా అమ్మ సమాధినుండి మేము సెలవు తీసుకుని యెవరి దారిని వాళ్లం వెళ్లిపోయాము. మేము ఇవ్వవలసిన కత్తులనైనా పురోహితుడికి మేము ఇవ్వ లేదు. మేక పిల్లలని అతని కిచ్చినందుకే అతను సంతుష్టి పడాలి.

కొత్తబలగం కోసమని తెల్లవిప్లవద్రోహులు కా-ఖెమ్ ఎగువ ప్రాంతాల నుంచి తెర్‌జీగ్‌యేటిదగ్గిర వూళ్లకి వచ్చినట్టు నేను చొల్‌దాక్-స్తెపాన్ కమతానికి తిరిగీ వెళ్లిపోతూండగా తోవలో కనిపించిన వాళ్లు చెప్పారు. ఈ ముఠాలో అప్పుడే నలభై మందివరకూ వున్నారట. తెర్‌జీగ్ ప్రాంతపు మోతుబరి రైతుల్లోకల్లాకసాయివెధవలైన ఎవ్‌స్తిగ్నేయ్ మిహై లొవ్ పిచూగిన్‌లు యీ ముఠాకి నాయకులట. ఇంతకు ముందల్లా వీళ్లు

యీ ముఠాలో ఆకతాయి మనుషులే. పాపం స్థానికంగా వుండే బీదజనాన్ని కొరడాలతో బాది ముఠాలో చేరకపోతే చంపుతామని భయపెట్టి వాళ్ల ముఠాలో బలవంతాన జేరిపిస్తున్నారట. కూలినాలి చేసుకునే పేద జనంలోనూ బత్రాక్‌లు చాలామందీ అడవుల్లోకి పారిపోయి అక్కడ తలదాచుకుంటున్నారట. సెర్గేయ్ కోచెతొవ్ ప్లేబ్నికొవ్‌ల కిందవున్న గెరిల్లాలో చేరడానికని కొందరు సరీగ్-సెప్‌కి వెళ్లారట.

చొల్‌దాక్-స్త్రెపాన్ కమతం నేను చేరుకొనేటప్పటికి బాగా చీకటి పడిపోయింది. అక్కడ తెల్లవిప్లవవిద్రోహులెవరైనా వున్నారేమో అని ఆ చీకటిలో జాగ్రత్తాగా తొంగిచూశాను. తన సెలవులేకుండా నేను వెళ్లిపోయినందుకూ తన నౌకరీనుండి బత్రాక్‌లు పారిపోయినందుకూ ప్రజల్ని కాల్చుకు తినే వారందరిమీద క్షణంలో విరుచుకు పడ్డానికి సిద్ధంగా కమ్ముకొని వున్న కారు మేఘాలకీ యజమాని నామీద కసితీర్చుకోవడమే కాకుండా నన్ను చంపేస్తే చంపేయవచ్చునని కూడా నాకు స్పష్టంగా తెలిసిపోయింది. బొజురాలో నిండుప్రాణాలతో వుండగా నిలువునా పూడ్చివేయబడ్డ మన సన్‌జా, మేర్గెన్‌వొద్దున కలకాలానికీ వదిలిపెట్టేసి వచ్చిన మా అమ్మ, నేను — మా పగసాధించే వాళ్లెవరైనా వున్నారా?

కంచెవెంబడే మా గోతి యింట్లోకి వెళ్లాను. పాక అంతా చీకటిగావుంది. అందులో యెవ్వరూ లేరు. చెమటలు కక్కుకుంటూన్న గుర్రాలు ముంగిట్లో కట్టివున్నాయి.

యజమాని ఇంట్లో దీపం వెలుగుతూంది. ఇంట్లో చాలా మందే వున్నారు. కాని కిటికీలమీద దట్టమైన మంచు వుండడంచేత మనుషుల ముఖాలు నాకు సరిగా కనపడ లేదు.

ఇంటి ముంగిలి దాటుతూ సాయుధులైన రౌతులు చాలామంది గుర్రా లని పరుగెత్తించి స్వారిచేస్తూ వెళ్లుతున్నారు.

వేళ్లమీద అడుగులు వేస్తూ సావడిలోకి వెళ్లాను. చాలా గొంతుకలు వినిపించాయి. 'వాళ్లెవరు స్నేహితులా శత్రువులా? స్నేహితులా శత్రువులా?' అని పదేపదే ఆలోచించాను.

సావడి తలుపు ఓరవాకిలిగా వుంది. ఆ గొంతుకల గందరగోళంలో చొల్‌దాక్-స్త్రెపాన్ కంఠాన్ని గుర్తుపట్టాను:

"మన తడాఖా చూప్పిద్దాం! మన తడాఖా చూప్పిద్దాం!" అంటు న్నాడు అతడు.

యజమానురాలు కీచుగొంతుకతో అతనితో వాదిస్తూంది:

"తొందర పడొద్దు! ఉండండి! ఎవరిని ముందు పట్టుకోవడమో మనం ఆలోచించుకోవాలి" అంటూంది.

"మీ ఆవిడె చెప్పినది బాగుంది. ఉద్రేక పడితే లాభం లేదు. అన్ని పనులూ యథావిధిగా సావధానంగా చెయ్యడం చాలా అవసరం" అంటూ యజమానిని ఒప్పించడానికి ప్రయత్నిస్తూ అంటున్నాడు షాహుకారు సఫ్రోనావ్.

నేను ముంగిట్లోకి వెళ్లిపోయాను. నన్ను యెవరో గుర్తుపట్టేశారు: నన్నెవరో సమీపించారు... దనీల్కా రోష్చిన్ ఆ మనిషి.

"నావెంట రా" అని అతను నా చెవిలో వూదేడు.

చిన్న పందిరి వుంటే దాని కిందకి నిలబడ్డాం. ముంగిలి అంతా కలియ జూసి దనీల్కా:

"మూడు రోజులై ఈ తెల్లవిప్లవద్రోహులు కమతంలోనూ

పేటలోనూ వుంటున్నారు. ఇళ్లల్లోవున్న సరకూ జప్రా అంతా కొల్లగొడుతూ సాయంకాలంనుంచి అదే తాగుడు తాగుతున్నారు. చూడు ఆ తాగుడులో పహరావాళ్లని పెట్టడం కూడా మర్చిపోయారు" అన్నాడు.

"మనం యిప్పుడేం చేద్దామంటావు?" అని అడిగేను నేను.

దనీల్కా ఒక్క నిమిషం ఆలోచించి:

"సరీగ్-సెప్‌కి వెళ్లి తెల్లవిప్లవద్రోహులు ఇక్కడున్నారనీ వాళ్ల సంఖ్యయింత అనీ కమాండర్‌తో చెప్పదాం. ఈలోపుగా మనం గుర్రాలని విప్పేస్తే అవి అటూ యిటూ పోతాయి" అన్నాడు.

ఇంటి వెనకతట్టునుంచి కూరగాయల మళ్లోకి వెళ్లాం. ముంగిట్లో కట్టివున్న గుర్రాలకంటె మరిన్ని గుర్రాలు ఇక్కడ కట్టివున్నాయి. కాని బైట చలిలో కొలనులోనుంచి ఆవిర్లువస్తూన్నట్టు పొగమంచుదట్టంగా వుండడంవల్ల అక్కడవున్న గుర్రాలనన్నీ చూడగానే స్పష్టంగా గుర్తు పట్టడం కష్టం అయింది.

సన్నని మంచుపడిన గుర్రాలనుంచి కళ్లేలని తీసేసి ఆ కళ్లేలని దాచేశాం. అక్కడనుంచి మా పూరిపాకలోకి త్వరత్వరగా వెళ్లాం. బాగా అల వాటైన ఆ పాకలో గోడలమీద వేలాడుతూ వున్న జీనుల తాలూకు నడుము పట్టాలనీ కోసేమని చెప్పి ఆ పనిని నాకు ఒప్పగించి పొయ్యిదగ్గిర కుప్పగా పడివున్న జీనుల తాలూకు నడుము పట్టాలని తను కోసేయడం మొదలు పెట్టాడు.

ఆ పని పూర్తిచేసుకుని పూరిపాకలోంచి బైటకి వచ్చేసి, గాలికి పడి పోయిన చెట్లసందుల్లో దాక్కుని వున్న జంతువులని పసికట్టేటప్పుడు ముసిలి వేటకాడు తొంబష్తాయ్ వూపిరిని యెలాగు బిగపట్టేవాడో అలాగు, మేమూ

వూపిరి బిగపట్టి ఇటూ అటూ జాగ్రత్తగా చూసుకుంటూ ముంగిళ్ల నన్నింటినీ దాటేం. ఎక్కడ చూసినా తెల్లవిప్లవద్రోహులు తిరుగుతూండడమే కనిపించింది. ఓ సరీగ్-సెప్! ఇంకా యెంతదూరంలో వున్నావు నువ్వు? ఓ గెరిల్లా సైనికులారా! ఎక్కడున్నారు మీరు?.. పేరుకున్న మంచుని కప్పుకొని వున్నకొండలమధ్యవున్న ఉస్త్-తెర్‌జీగ్‌లో యిళ్లు కనుచూపు మేరలోకి రాగానే మేము మాట్లాడకుండా నిశ్శబ్దంగా వుండి ఒకరి చేతులని యింకొకరం గట్టిగా నొక్కిపట్టుకుని ఒకరివైపు ఒకరం దిగులుపడుతూ చూసుకున్నాం. మేము నడుస్తూ వుంటే మా పాదాల కింద మంచు కరకరమని చప్పుడ వుతూంది. సూదుల్లాంటి మంచు ముక్కలతో చలికాలం మమ్మలిని పొడిచే యకుండానూ పొగమంచు పడుతూంటే ఆకలి మమ్మలిని పీకనులిసేసి చం పేయకుండాను మమ్మలిని కాపాడ్డానికని మా అమ్మ మంచుమేటవేసిన స్తెప్‌మైదానాల్లోకి ఎన్ని కష్టాలు పడైనాసరే మాకు బువ్వసంపాదించ డానికి మమ్మలిని ఇంటి దగ్గిర వదిలేసి రాత్రిపూట వెళ్లిపోతూండేటప్పుడు మా అమ్మ అడుగుల చప్పుడు ఆ చలికాలపు రాత్రియొక్క నిశ్శ బ్దాన్ని సరిగ్గాయిలాగే పరపరమని పటాపంచలు చేసేవి.

దనీల్కా మొదట మాట్లాడేడు:

“అబ్బ! ఎలాగైతేనం సరీగ్-సెప్ చేరుకున్నాం బాబూ! ఇక మనం మన చిత్తం వచ్చినట్టు మాట్లాడుకోవచ్చు. ఉస్త్-తెర్‌జీగ్‌లో మనని యెవరైనా వినిపోతారేమో అని మన భయపడ నక్కరలేదు. నీ నాలుక గడ్డకట్టుకు పోయిందా యేమిటి?” అన్నాడు.

“పెద్దవాడివి నువ్వు మాట్లాడ్డం లేదు కదా — ఒకవేళ తెల్లవిప్లవ ద్రోహులు మనని యెక్కడ వినిపోతారో అని భయపడి వుంటావు కాబోలు

అని అనుకుని నేనూ మాట్లాడకుండా వూరుకున్నాను. మనని వాళ్లు పట్టు కునివుంటే సర్వనాశనం అయిపోయివుండును. అంతేగా?'' అన్నాను నేను.

''అంతవరకూ నువ్వు అన్నది నిజమే... మనం సరిగ్గా సమయానికి అక్కడనుంచి దాటేశాంకాని లేకపోయివుంటే యీపాటికి మనం యీ ప్రపంచంలో వుండేవాళ్లము కాం. తను యీవేళ స్త్రైపాన్ ఇంటి ముంగిలిలోనుంచి వెళ్లుతూంటే స్త్రైపానే తనకి యెదురుపడ్డాడని మా అమ్మ నాతో యీవేళ చెప్పింది. నువ్వున్నూ కడమ బత్రాక్‌లున్నూ యెక్కడున్నారో నీకు తెలుసునా అని అమ్మని అడిగి నిన్ను చంపేస్తానని బెదిరించాడట.''

''తాగి వున్నాడు మరి. తాగి వున్నప్పుడు అతను యెప్పుడూ ఎవరినో ఒకరిని బెదిరిస్తూనే వుంటాడులే'' అన్నాను నేను.

''అబ్బే! ఈమాటు అలాక్కాదు సుమా. కొసదగ్గిర పడినట్టు అనుమానం కలిగి అడవి మృగంలాగ ప్రవర్తిస్తున్నాడు. వోడ్కా సారాయి పడేసరికి మృగానికి రక్తదాహం మరింత హెచ్చు అవుతూంది. ఒకరిద్దరిని చంపినా అతనికేం తృప్తి కావడం లేదు. తనచుట్టూ రక్తప్రవాహం కళ్లచూడాలని వుంది అతడికి. వాళ్ల కంటబడ్డ వాళ్లనందరినీ వాళ్లు పొట్టబెట్టుకుంటున్నారు. ప్రాణాలమీద నీకు ఆశవుంటే అష్టకష్టాలూ పడినా సరే వాళ్ల కళ్ల పడకుండా ఎలాగోవకలాగు గెరిల్లాలతో కలసి గుర్రంమీద ఖేమ్-జెల్‌దీర్‌కి వెళ్లిపో'' అన్నాడు దనీల్కా.

''అలాగే చేస్తాను. గుర్రాన్ని సంపాదించి గుర్రంమీద వెళ్లుతాను ఖేమ్-జెల్‌దీర్‌కి'' అన్నాను నేను.

సరీగ్-సెప్ వూరికిదగ్గిర పడ్డాం. దనీల్కాతో సమానంగా నడవడం నాకు కష్టం అయింది. మరీ త్వరగా నడవడం మొదలెట్టాడు.

చీకటిలోనుంచి కేక వినిపించింది:

"ఎవరక్కడ?"

"నేను దనీల్కాని!" అని దనీల్కా బదులు కేకవేశాడు.

"సాంకేతికపు మాట చెప్పు!"

నేల యీనినట్టు నేలలోనుంచి బ్రహ్మాండమైన సైబీరియా బొచ్చు కోటు పైకి లేచొచ్చి మాదగ్గిర కొచ్చింది.

దనీల్కా జవాబుచెబుతూ యెదో గొప్ప రహస్యం తనకొక్కడికే తెలిసి నట్టు ఠీవిగా ఆ పహరా జవానుతో గుసగుసలాడేడు.

"సరే నువ్వు వెళ్ళొచ్చు. ఈ ఒంటి చెవిటోపీ కుర్రాడి మాటేమిటి? ఎవరీ కుర్రాడు? నీ సైన్యమా?" అని అడిగి ఆపహరా సైనికుడు తన తుపాకిని నేలమీద ఆని వుంచి నవ్వేడు.

"అవును. ఈ కుర్రాడు నాదగ్గిరుంటాడు! వీడిని కూడా లోనికి పోనీ కామ్రేడ్!" అన్నాడు దనీల్కా.

"అయితే సరే!.. సైనుకుర్రాడా! నువ్వు లోపలికి వెళ్లవచ్చు" అన్నాడు ఆ పహరా సైనికుడు.

కాస్త దూరం వెళ్లాక మరి ఒక సాయుధ సైనికుడిని అడిగేడు దనీల్కా:

"కామ్రేడ్! సెర్గేయి ప్లేల్బిశికొవ్‌ని మేము చూడాలి. అతను యెక్క డుంటాడు?"

మేం అట్టే దూరం వెళ్లలేదు — వెనక సత్రోనొవ్ వుండే యింటి వరకూ వెళ్లాము. ఇంటి ముందున్న పిల్లగుమ్మం దగ్గిర మరో పహరా వుంది. ఆ పహరా జవాను మమ్మల్ని పరీక్షిస్తూ చూసి సంతోషంతో:

“హోహో! దనీల్కా లాగుందే! కమాండరు రెండుమూడు సార్లు అడిగేడు నీకోసం. లోపలికి వెళ్లు” అన్నాడు.

దనీల్కా గుమ్మందాటగానే అతనికోసం యెదురుగా వచ్చాడు ఒక మనిషి తొందరగా.

మధ్యవయస్సులో వున్నాడు. పొడుగూ కాదు పొట్టీకాదు మామూలుగా వున్నాడు. నల్లని మేకబొచ్చు టోపీ. రివాల్వరూ దేవదారుకాయలాగ వున్న ఒక చేతిమందుపాత్రా పటకాలో దోపుకున్నాడు.

“సరే. అయితే వాళ్లందరూ యెంతమంది వున్నారు? ఏమేమి ఆ యుధాలున్నాయి వాళ్లదగ్గర? బెర్డాన్లు* రైఫిళ్లు చాలా వున్నాయా యేమిటి వాళ్లదగ్గర?” అని అడిగేడు అతను దనీల్కాని.

ఇంతట్లో నేను అతని కళ్లపడ్డాను.

“ఈ కుర్రాడిని ఆ పక్కయింటికి తీసుకెళ్లి అక్కడ నాకోసం వుండ మను” అన్నాడు.

“నాతో కూడా ఊస్త్-తెర్జీగ్‌నుంచి వచ్చాడు. మీకు తెలిసే వుండొచ్చు చొల్దాక్-స్తెపానుదగ్గర కూలివాడు. తాస్-బష్టీగ్ కొడుకు” అన్నాడు దనీల్కా.

“అలాగా. నాకు పరిచయంచేయి యీ కుర్రాడిని” అన్నాడు అతను.

దనీల్కా తన సంజాయిషీని ఇవ్వడం మొదలుపెట్టాడు:

“స్త్రఫోనొవ్ మెలేగిన్లదగ్గిర అట్టేమంది మనుష్యులు లేరు. ఊస్త్-తెర్జీగ్‌లో అంతా నలభైమంది. ఇంచుమించు అందరిదగ్గిర బెర్డాన్లు

---

* వేటకి ఉపయోగించే తుపాకి.

వున్నాయి. పదిమందిదగ్గిర రైఫిళ్లున్నాయి. వీళ్ల ముఠాలో కొందరు బెల్బేయ్ లోను కొందరు కొక్-ఖాక్‌లోనూ వున్నారు'' అని చెప్పాడు దనీల్కొ.

''బాగా చూశావా?'' అని ప్రశ్నించాడు అతడు.

''అతను చెప్పినదనంతా సరిగ్గానే వుంది. అంతా నలభైమంది వుంటారు. వాళ్ల జీనులన్నింటినీ దాచేసి జీనుల నడుము పట్టాలని కోసేశాం'' అని నేను కూడా చెప్పాను.

కసూండరు మమ్మలిని మెచ్చుకుని ఒక బల్లదగ్గిరకెళ్లి ఒక పెద్ద తావుకాగితాన్ని మడత విప్పాడు:

''సరే సరే... సరిగ్-సేప్... తెర్‌జీగ్... ఏరుదాటే రేవుస్థలం ఇదీ... వీళ్లని యిక్కడ మన చేతుల్లోనుంచి జారిపోనిస్తిమా బెల్బేయ్‌కి వెళ్లిపోతారు... ఒక పటాలం చాలును. పెత్రోవ్ అదనంగా పార్శ్వంనుంచి వచ్చి వాళ్లమీద దాడి చేస్తాడు... అన్నట్టు ఒక విషయం అడగడం మర్చిపోయాను: తెల్లవిప్లవద్రోహుల్లో రాజుతాలూకు ఉద్యోగస్థులెవరైనా వున్నారా?''

''తాష్-చాలాన్ తాలూకు హర్కారావాళ్లున్నూ సాసార్-బరిన్మా తాలూకు గుమాస్తాలున్నూ వున్నారు ఉస్త్-తెర్‌జీగ్‌లో'' అని చెప్పాడు దనీల్కొ.

''అలాగా సరే... పెత్రోవ్!'' అని పిల్చాడు కమాండర్.

ఆ పిలుపు అందుకుని పొడుగాటి గెరిల్లా ఒకతను యువకుడు రంయ్‌మని గదిలోకి వస్తూ ఆ రావడంలో కూడా మంచి హుషారుగా ఆ పొట్టి గుమ్మం అంచుతనకి తగలకుండా వచ్చాడు.

''ఇదుగోవచ్చాను కామ్రేడ్ కమాండర్!'' అంటూ అతడు తన బణాతుబూడ్సులని భూమిమీద కందంతొక్కుతూ ఎంతగట్టిగా సెల్యూటు

కొట్టడంతే ఆ జోరుకి ఆ చిన్నయింట్లోవున్న కిటికీతలుపులన్నీ కిటకిట మని కొట్టుకున్నాయి.

"కామ్రేడ్ పెత్రోవ్! మనుషుల నందరినీ లేపి ముంగిట్లో వరుసలో నిలబెట్టించి నాదగ్గిరకొచ్చి చెప్పు. ఇదంతా యెన్ని నిమిషాలు పడుతుంది?" అని అడిగేడు కమాండర్.

"ఇరవై నిమిషాలు చాలు కామ్రేడ్ కమాండర్!" అన్నాడు పెత్రోవ్.

"కానీమరి!" అన్నాడు కమాండరు.

పెత్రోవ్ హుషారుగా గిర్రనితిరిగి గుమ్మంలోనుంచి వెళ్లిపోయిన తరువాత తన జేబులోనుంచి వూలుతో అల్లిన పొగాకుసంచీని తీసి కమాండరు మాకు దాన్ని అందిస్తూ:

"అరేరే! నేను మీకు ఇంతకు ముందే ఇవ్వవలిసింది మర్చిపోయాను సుమండీ ఇదిగో తీసుకోండి కామ్రేడ్స్!" అన్నాడు.

వాళ్లిద్దరూ సిగరెట్లని చుట్టుకుని కాలుస్తూండగా మనుషులందరూ బారలు తీర్చినిలబడడానికి తయారవుతూ కిటికీకి యెదురుగా వెళ్తూండడం కనిపించింది.

"మనకి వేళ అవుతూంది..." అంటూ కమాండరు లేచాడు.

ముంగిట్లోకి వెళ్లాం. కిటికీలోంచి వస్తూన్న వెలుతురు అతని మీద పడుతూన్నప్పుడల్లా కనిపిస్తూ తరువాత రెండో నిమిషానికల్లా చీకటిలో మాయం అయిపోతూ పెత్రోవ్ వరుసలు తీర్చినిలబడివున్న సైనికులముందర ఇటూ అటూ నడుస్తున్నాడు. చంటిపిల్లలకి తలమీద రుమాలు కప్పి అది జారిపోకుండా మెడమీద ముడివేస్తారే అలాగు రుమాలు తలమీద వేసుకుని దగలా జుబ్బాతొడుక్కొని పెద్దగడ్డంతో వున్న ముసలి అతను ఒకడు

కిటికీలోంచి వస్తూన్న దీపపుకిరణాలు అతనిమీద పడుతూ కమాండరుకి యెదురుగా నిలబడ్డాడు.

"సైనికులందరూ హాజరైయారు, కామ్రేడ్ కమాండర్!" అని సంజాయిషీ ఇచ్చాడు ఆ ముసలి గెరిల్లా సైనికుడు.

"కామ్రేడ్సు! మిమ్మల్ని హాజరు అవమనడానికి కారణం చెబుతాను వినండి. స్త్రప్ సౌవ్-మెలేగిన్ మురా పుట్టకిపుట్టా అంతా ఉస్త్-తెర్‌జీగ్ వుంది. సరీగ్-సెప్‌నీ ఖేమ్-బెల్‌దీర్‌ని తమ వశం చేసేకుంటామని వాళ్లు బడాయిలు కొడుతున్నారు. అందుకు మీరు యేమంటారు కామ్రేడ్సు?" అని అడిగేడు కమాండరు వాళ్లని.

మొదటి వరుసలో నిలబడివున్న ముసలిఅతను వాళ్లందరి తరఫున జబాబుచెప్పేడు:

"తెల్లవిప్లవద్రోహుల ఆఖరి పుట్టని తుడిచి పారేస్తాం... పంపించండి మమ్మల్ని!"

పదకొండవ ప్రకరణం

ఉషఃకాలం

కమాండరు సైనికుల ఆయుధాలని తనిఖీ చేసిన తరువాత తను పన్నిన యుద్ధవిధానాన్ని వాళ్లకి తెలియజెప్పాడు. అప్పటికప్పుడే దనీల్కా బారు కోసేసిన రైఫిలును భుజంమీద వేలవేసుకుని ఇటు అటు తిరుగుతున్నాడు.

గంభీరంగా వున్న ముఖాలతో తమ నాయకుడు చెప్పిన దానిని శ్రద్ధగా

వింటూన్న గెరిల్లాలను చూడగా: "అసలైన మనుష్యులంటే వీళ్లే!" అని నాకు తోచింది. "ఇలాగు చలివేస్తూ వున్న చీకటిరాత్రిలో పల్లెటి పేద ప్రజని విముక్తి చెయ్యడానికి వెళ్లుతున్నారే!" అనుకున్నాను. మా కమాండరు గుర్రంమీద కూచోడానికని చెంగున యెగిరినప్పుడు అతను వేసుకున్న టోపీయొక్క ఆకారం ఆ తెల్లవారు చీకట్లలో స్పష్టంగా కనిపిస్తూంది.

కమాండరకి కుడిపక్కన గుర్రపురౌతులు వరుసగా నిలబడ్డారు. గుర్రాలులేని గెరిల్లాలు యెడమపక్కని బారలుతీర్చి నిలబడ్డారు.

"దనీల్కా! నువ్వు మకార్ మాశీషెవ్‌తో వెళ్లి అతన్ని శత్రువుల పార్శ్వముమీదకి తీసికెళ్లు. వాళ్లని అక్కడకి తీసుకువెళ్లి నువ్వు నాదగ్గరకు వచ్చేయి. నువ్వేమో రెండో పటాలంతో వెళ్లివాళ్లకి ఊస్త్-తెర్‌జీగ్‌కు తోవ చూపించు" అని మా యిద్దరితో అన్నాడు.

"ఏమి భేషైన నాయకుడు! చెయ్యవలసిన పనిని మహబాగా పంచేడు" అని నేను మనస్సులో అనుకుని దనీల్కాను కౌగలించుకుని నా పటాలం నాయకుడిదగ్గిరకి వెళ్లాను.

తను గుండును పేలుస్తాననీ తను గుండుపేల్చినప్పుడు మాత్రమే అటకాయింపు నిప్రారంభం చెయ్యాలని మరీమరీ నొక్కిచెబుతూ బయలు దేరడానికి ఉత్తరవు యిచ్చాడు. కా-ఖెమ్‌లోయగుండా వెళ్లాం. నాకు అక్కడ ప్రతీచెట్టూ ప్రతీగట్టూ తెలుసును. తెల్లవారబోతూంది. మంచుకిరీటాలు పెట్టుకున్న దేవదారు మహావృక్షాలూ, క్రిందనుండి మీదవరకూ ఆకులముళ్లతో కప్పకుని ఠీవిగా నిలబడివున్న సంగీతపు చెట్లూ, మేము ముందుకు సాగిపోతూ వుండగా మమ్మల్ని చూస్తున్నాయి.

"ఇంత పెందలకడే యెక్కడికి వెళ్ళుతున్నారు?" అని దారిపక్కన మంచుబొచ్చుతో ముస్తాబై వున్న బిర్చిచెట్లు ఆదుర్దా పడుతూ అడిగేయి. ఈలోపున పేరిన మంచుకుచ్చులతో తళుకుతళుకుమని ప్రకాశిస్తూన్న పోప్లరుచెట్లు మాయవెల్తురితో మెరుస్తూండగా తమ వెండిబెరడు గడ్డ కట్టి కొమ్మలకి పేరుకొని అంటుకుపోయి రాలకుండా వుండిపోయిన మిగతా ఆకులను సరసరమని వూపుకొంటున్నాయి.

ఆ దారంటే నదిఒడ్డు చేరుకున్నాం. ఇక్కడ చెట్లు మరింత పొడవుగాను మరింత దట్టంగాను వున్నాయి. గడ్డకట్టుకుపోయిన భూమిని తన ఉచ్ఛ్వాసనిస్వాసాలతో వెచ్చచెయ్యాలని కా-ఖెమ్‌నది నిశ్చయించిందేమో అన్నట్టు యేటిలో గడ్డకట్టుకొని పోకుండా మిగిలిన కొలనులమీద మంచు ఆవిరి మబ్బులు అద్దరిని నిటారుగా లేచివున్న కొండగట్ల యెత్తుకు లేచి తేలి ఆడుతున్నాయి. నదిఒడిలో కూచుని నదిని కౌగలించుకుంటూన్న రాతిబండల చుట్టూరా ఒడ్డునవున్న చెట్లబోదలచుట్టూరా చేరుకున్న తెట్టు పెరిగిపోయి జూలు అంచులలాగు వేలాడుతూవుండగా చాదుతో తెల్లబడిపోయి నదీగర్భాన్నవున్న చాపరాతి చిప్ప నదీజలాలతోనిండి యెసరుకాగుతూన్నట్టు జలజలమంటూంది. మంచుకుచ్చులతో నీటుగావున్న చెట్లు నవ్వుల తళుకులతో ఆహ్వానించడానికి సిద్ధంగా వున్నాయి. పగటిచుక్క పర్వత శిఖరాల్లో మంటలు వెలిగించింది. ఆ పర్వతశిఖరాలని దాటుకుంటూ వస్తూన్న ఉషస్సు నల్లని ఆకాశంలో అప్పుడే ఉదయిస్తూంది.

ఆ రాత్రియెంత శోభాయమానంగా వుంది! సర్వవ్యాపితంగా ఆవరించి యున్న పవిత్రమైన ఆ నిశ్శబ్దానుభూతిని నేనెన్నటికీ మరచిపోలేను. ప్రపంచంమీద స్వేచ్ఛగా బతకడానికి మనకందరికీ వుండే జన్మహక్కును

పరిరక్షించు కొనుటకుగాను అగ్నిపరీక్షను యెదుర్కోడానికి సాగిపోతూన్న తరుణం యిటువంటి రాత్రి యందే ఆసన్నం అవాలని మనం అనుకుంటాము. హర్కారుగా నేను నా విధులని యెంత సగర్వంగా నిర్వర్తించినదీ సుళువుగా సుబోధకము అవుతుంది. బాటచీలిక వచ్చినప్పుడల్లా నాశాయశక్తులని వినియోగించి అన్నిటికంటే దగ్గరదారినీ అన్నిటికంటే సురక్షితమైన దారినీ యెంచి ఆ దారినే తీసుకువెళ్ళేవాడిని. ఈ విధంగా బిర్చిచెట్లతో దట్టంగా కమ్ముకొనివున్న కొండగుట్టల్లో ఆఖరుగుట్టను చేరుకున్నాము. మాకు దిగువను కొద్ది అడుగుల దూరంలో వున్నాయి ఉస్త్-తెర్‌జీగ్ సివారులు.

సూర్యుడి తొలి కిరణాలతో ఆ బిర్చిఅడవి ప్రాణాలు లేచివచ్చి కిలకిలలాడుతూంది. నల్లని పిగిలిపిట్టలమంద ఒకటి హుష్షుమని పక్కనుండి యెగిరి బిర్చిచెట్టు కొమ్మలమీదవాలి మొగ్గలని ముక్కులతో కొరికితింటూండగా వాటిలో ఒకపక్షి తన మెడనిపైకెత్తి నాలుగు దిక్కులా పరికించి కాపలాకాస్తూ తన కూతలతో కడమపక్షులకు సంజ్ఞలు చేస్తూంది. ఎర్రటి కొండకోళ్ళు ఎగిరివెళ్ళిపోతున్నాయి. కంసాలిపిట్టలు దేవదారులమీద మద్దెళ్ళు వాయిస్తున్నాయి. ఉడుతలు చరచరమని తిరుగులాడుతున్నాయి. అడ్డకత్తెరపక్షులు పురుగుల పుట్టలు కొల్లలుగా వున్న చెట్లని ఎంచిచూచుకుని ఆ చెట్లమీదవాలి ఆబతో ఆహారాన్ని ఆరగిస్తూ చెట్లమీదనుంచి కావుకావుమని కూస్తున్నాయి. ఉస్త్-తెర్‌జీగ్ వూరు మాత్రం యింకా నిద్రలోనే వుంది. "దనీల్కా యెక్కడున్నాడు? శత్రువుల వెనుక తట్టును దాటుకుని వాళ్ళలోకి వెళ్ళగలిగాడా? వెళ్ళి యెక్కడైనా గోతిలో దాగుకొనగలిగేడో లేదో? సంజ్ఞని ఇవ్వడానికి కమాండరు యింకా యెందుకు ఆలస్యంచేస్తున్నాడు?" అని యెండకాస్తూన్న వూరివీధులని చూస్తూ అనుకున్నాను. పక్షులు తమ

రెక్కలని వూపుకుని చప్పుడు చేస్తూ ఆకాశంలోకి ఎగిరి అడవిమధ్యలోకి పారిపోయాయి.

ఆ వూరు నిద్రలోంచి మెల్లిగా మెల్లిగా మేలుకొంటూంది. కోడి కూతలు నూతిగిలకల కీచుకీచులు మాకు వినిపిస్తూన్నాయి. ఈ చప్పుడుల మధ్య ధణేలుమని తుపాకి గుండుధ్వని వినిపించింది. దాంతో పోరాటం ప్రారంభం అయింది. గుర్రపురౌతుల గెరిల్లాలు పల్లెటూరి సివార్లని చుట్టు ముట్టారు. ఈ లోపున మా పటాలం దగ్గరున్న గుట్టమీదనుంచీ ఇరుగు పొరుగునవున్న యిళ్లకప్పులమీదనుంచి చౌల్‌దాక్-స్తెపాన్ కమతంమీద సరిగ్గా గురిచూచి గుళ్లవర్షంకురిపించారు. నాకు దగ్గరంటే వెళ్లి చూడాలని వుంది. ఆ మంచు గుట్టమీదనుంచి కిందకి జారి పక్కవీధిలోనుంచి పరుగెత్తి ఒక పాక కప్పుమీదకి యెక్కాను. నాకంటె ముందే ముగ్గురు గెరిల్లాలు ఆ పాక కప్పుమీద వున్నారు.

ఆ ముగ్గురిలో ఒకడు వెనక నేను సరీగ్-సెప్‌లో చూసినప్పుడే అతని యెడతెగని ఉత్సాహాన్నీ శక్తినీ ఆశ్చర్యపడిన దగలాజుబ్బా తొడుక్కొని రుమాలు చుట్టుకున్న ముసలితాత.

నల్ల గుర్రాన్ని యెక్కి తలమీదనుంచి పైకి యెత్తిన చేతిలో పిస్తోలును పట్టుకుని పెద్దవీధిలోనుంచి రయ్‌మని వస్తూన్నది స్తెపాన్ కొడుకు ఎవ్లాష్క. మాకంటె ఒక్క అడుగు ముందున్నాడు.

"ఓ... ఎవ్లాష్క తప్పించుకుని పారిపోతాడు! త్వరగా పేల్చండి!" అని ముసలితాత చెవిలో అన్నాను.

"ఇంతకంటె జిత్తులమారి తోడేళ్లను చంపాను నా తుపాకితో... వాడు యెక్కడకీ తప్పించుకొనిపోడు..." అని గొణుగుతూ ముసలిఅతను

తన పొట్టిరైఫిలుని గురిపెట్టాడు. రోడ్డుతిన్నగా వున్న మేరకి ఆ రౌతు వచ్చిన తరువాత రైఫిలు ధణేలుమంది. చేతులరెంటినీ మీదకి యెగరేసికుని ఎవ్లాష్కి గుర్రంమీదనుంచి పడ్డాడు.

చొల్‌దాక్-స్తెపాన్ కమతాన్ని గెరిల్లాలు చక్రబంధంలో పెట్టి అంత కంతకు బిగించడం మొదలుపెట్టారు.

శరత్తులో కళింగ వెనకాతల చిక్కుకున్న చేపలగుంపు లాగు తెల్లవిప్లవద్రోహులు ముంగిట్లో ఇటూ అటూ పరుగులెడుతున్నారు. మంచుతో గడ్డకట్టుకుపోయిన కా-ఖెమ్‌మీద మరొక యుద్ధం జరుగుతూంది. స్రఫ్‌నావ్‌తో కూడా కొందరు తెల్లవిప్లవద్రోహులు యుద్ధంలోనుంచి తప్పించుకుని యేరుదాటే రేవుస్థలానికి పరుగెత్తారు. ఫ్లొబ్నికొవ్ నాయకత్వంకింద వున్న గెరిల్లాలు వాళ్లని అడ్డగించేరు. దిబ్బల్లోనూ గడ్డకట్టని నీటిగుంటల్లోను చిక్కుకుని గుర్రాలు ముందురెండు కాళ్లూ యెగరేసి వెనకకాళ్లమీద నిలబడి వెనక్కి నడవ సాగేయి. ఖడ్గాలు మెరిశాయి. సంకుల సమరంలో ముష్టియుద్ధం చెలరేగింది.

యుద్ధం పూర్తి అయిపోయేసరికి సూర్యుడు నెత్తిమీద కొచ్చాడు. ఊస్త్-తెర్‌జీగ్ పెద్దవీధినిండా రకరకాల జనం మూగేరు. తిరుగు ప్రయాణంలో వున్న గెరిల్లాదళాన్ని సాగనంపడానికి ఆ పల్లెటూరిప్రజ చుట్టుపక్కల పేటల్లోని బీదబిక్కి అందరు పోగైయారు. క్రితంరాత్రి సరీగ్-సెప్‌లోలాగ తన తోటి సైనికులందరినీ వరుసలు తీర్చినిలబెట్టాడు కమాండరు. తన గుర్రాన్ని స్వారిచేస్తూ సైనికుల వరుసలలో మధ్యకెళ్లి తన చేతినియెత్తి:

"కామ్రేడ్సు! మీకు ఒప్పజెప్పిన పనిని మీరు ప్రతిభావంతంగా నెర

వేర్చారు. సైబీరియా విప్లవసైనిక సమితివారి మన్ననలను మీకు తెలియ జేయడానికి నాకు అనుమతినివ్వండి!'' అని కమాండర్ అన్నాడు. అందుకు ప్రత్యుత్తరంగా:

''మేము సోవియట్ ప్రభుత్వ సేవకులం!'' అని వాళ్లందరూ ఐక్య కంఠంతో కేకవేశారు.

యెప్పుడూ నవ్వుముఖంతో వున్న ఆ ముసలితాత తన రుమాలుని తలమీదనుంచి తీసేసి దగ్గరున్న గెరిల్లాకి ఇచ్చాడు. దానితో గాయపడిన ఒక గెరిల్లా సైనికుడికి కట్టుకట్టారు. దనీల్కాకి కూడా కట్లున్నాయి. అతనికి తలమీద దెబ్బలు తగిలేయి.

ఇవన్నీ చిన్న విషయాలే! ప్లోబ్నికొవ్ మమ్మల్ని తన దళంలో చేరని వ్వడం ముఖ్యమైన విషయం.

సైనికులు బారులు తీర్చినిలబడగా ఆ వరుసలకుముందు ఎర్ర జండాని యెగురవేశారు. గుర్రపు రౌతుల మధ్యనుంచి మంచుతో ప్రకాశిస్తూన్న మైదానంమీద ఎత్తుగా ఆ జండా రెపరెపలాడుతూంది. దళం బయలుదేరింది. దళం బయలుదేరిపోయిన చాలాసేపువరకూ ఊస్త్-తెర్జీగ్ ప్రజలు చేతులని వీస్తూ టోపీలని రుమాళ్లని యెగరేస్తూ వుండడం మాకు కనబడింది.

''శుభం! శుభం! మళ్లీ త్వరగా వచ్చేయండి!'' అంటూ వాళ్లు సంతోషంగా కేకలేశారు.

పాఠకులకు మనవి

ఈ పుస్తకాన్ని గురించిగాని దీని పేర్పు కూర్పు గురించిగాని మీ అభిప్రాయాలను మీ సలహాలనూ భావి ప్రచురణల సహాయార్థం మాకు పంప ప్రార్థన. మా చిరునామా:

Foreign Languages Publishing House. 21, Zubovsky Boulevard. Moscow, USSR.

САЛЧАК ТОКА

СЛОВО АРАТА